
వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక తెలుగు మాస పత్రిక

సంపుటి : 6 సంచిక : 5 హైదరాబాద్ 82 మే 2008 పేజీలు : 56 రూ. 10



- ఫోకస్: ప్రపంచీకరణ సందర్భంలో కార్మికోద్యమాల పాత్ర
- ఒ.బి.సి. రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు తీర్పు
- తెలంగాణ వెనుకబాటు - పూర్వాపరాలు
- మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రం
- వ్యవసాయరంగం పరిశోధన - తీరుతెన్నులు
- నేపాల్ ఎన్నికల పరిణామాలు

వీక్షణం 82

రాజకీయార్థిక, సామాజిక తెలుగు మాసపత్రిక

మే 2008
సంపుటి : 6
సంచిక : 5

సమతా పబ్లికేషన్స్, సెంటర్ ఫర్ డాక్యుమెంటేషన్, రిసర్చ్ అండ్ కమ్యూనికేషన్ ప్రచురణ

గౌరవ సంపాదకులు:
వి. హనుమంతరావు

సంపాదకులు:
ఎన్. వేణుగోపాల్

సహాయ సంపాదకులు
డి.వి.రామకృష్ణారావు

సర్క్యులేషన్ మేనేజర్
వై. రామచంద్రం
9949391028

కంపోజింగ్ & లే ఔట్
సి. రాజశేఖర్

ఆఫీస్ అసిస్టెంట్
ఎస్. వెంకటేష్

వీక్షణం చందా వివరాలు

సంవత్సర చందా	రు. 120
3 సంవత్సరాల చందా	రు. 350
5 సంవత్సరాల చందా	రు. 550
10 సంవత్సరాల చందా	రు. 1000

'వీక్షణం' పేరిట ఎం.ఓ.లు, డి.డి లు పంపాల్సిన చిరునామా

వీక్షణం
రాజకీయార్థిక, సామాజిక తెలుగుమాసపత్రిక
మైత్రి రెసిడెన్సీ, 3-6-394,
స్ట్రీట్ నెం. 3, హిమాయత్‌నగర్,
హైదరాబాద్ - 500 029.
ఫాక్స్, ఫోన్ : 040-66843495
ఇమెయిల్ : reachcdrc@yahoo.com

డిస్ట్రిబ్యూటర్స్
ఆనంద్ ఏజెన్సీస్, హైదరాబాద్.
ఫోన్ : 98484 28516
98482 49695

ప్రింటర్స్
చరితా ఇంప్రెషన్స్,
ఆజామాబాద్, హైదరాబాద్
ఫోన్ : 040 - 27678411

సంపాదకీయం

ధరలెందుకు పెరుగుతున్నాయి?

గత నాలుగైదు నెలలుగా మార్కెట్‌లో ఏ సరుకు కొంటున్నప్పుడైనా ప్రతిఒక్కరూ గుర్తిస్తున్న విషయాన్నే ఎట్టకేలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించాయి. ద్రవ్యోల్బణం మార్చ్ చివరి వారంలో గత నలభై నెలలలో ఎన్నడూ లేనంత పెద్ద ఎత్తున 7.4 శాతంగా ఉన్నదని ప్రభుత్వం ఎట్టకేలకు అంగీకరించింది. ప్రభుత్వం చెప్పిన అంకె టోకు ధరల సూచికి సంబంధించినదనీ, వినియోగదారుల ధరలు మరో మూడు రెట్లయినా ఎక్కువగా పెరిగాయనీ కూడ గుర్తుంచుకోవలసి ఉంది. ధరల పెరుగుదలను అరికట్టడానికనే పేరుమీద కొన్ని కంటితుడుపు చర్యలను కూడ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ప్రకటించాయి. ధరల పెరుగుదల ఇవాళే హఠాత్తుగా కనబడినట్టు అన్ని రాజకీయ పక్షాలూ దాన్ని ఒక ఎన్నికల నినాదంగా మార్చుకోజూస్తున్నాయి. ప్రపంచబ్యాంక్, అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ, ఐక్యరాజ్యసమితికి చెందిన ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్, ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ వంటి సంస్థలన్నీ ప్రపంచవ్యాపిత ధరల పెరుగుదల గురించి ప్రతిరోజూ మాట్లాడుతున్నాయి. గత ఆగస్టు నుంచి ఈ మార్చ్ మధ్య ఆరునెలల్లో ఆహార సరుకుల అంతర్జాతీయ ధరలు 73 శాతం పెరిగాయని ప్రపంచబ్యాంకు ప్రకటించింది. కేవలం గోధుమ ధరలు గత సంవత్సరంలో వంద శాతం పెరిగాయని, మొత్తం మీద ఆహారపదార్థాల ధరలో 30 నుంచి 50 శాతం పెరుగుదల ఉందని ఎఫ్.ఎ.ఒ. ప్రకటించింది. ధరల పెరుగుదల వల్ల ముఖ్యంగా ఆహార పదార్థాల ధరల పెరుగుదల వల్ల అనేక దేశాలలో ఆకలిదాడులు, అల్లర్లు, లూటీలు జరుగుతున్నాయి. హైతీలో ప్రధానమంత్రి దిగిపోవలసి వచ్చింది. జింబాబ్వేలో ప్రభుత్వం సంక్షోభంలో పడింది. ఇండొనేషియా, ఐవరీకోస్ట్, ఈజిప్ట్, మొజాంబిక్ వంటి దేశాలలో అల్లర్లు చెలరేగుతున్నాయి. ఈ రణగొణధ్వనిలో ధరల పెరుగుదలకు అసలు కారణలేమిటో మాత్రం మరుగునపడిపోతున్నాయి. ఇతర దేశాలలో ఏమి జరుగుతున్నదో కాసేపు పక్కనపెట్టి భారతదేశంలోనూ, ఆంధ్రప్రదేశ్‌లోనూ ధరల పెరుగుదలకు కారణాలు అర్థం చేసుకోవలసి ఉంది. ఈ ధరల పెరుగుదలకు వర్షాభావమో, ప్రకృతి వైపరీత్యాలో ఎంతమాత్రం కారణం కాదు. ఈ ధరల పెరుగుదల పూర్తిగా రాజకీయార్థిక విధానాల దుష్పరిణామమే. ప్రపంచీకరణ తర్వాత భారత వ్యవసాయరంగాన్ని బహుళజాతి విత్తన, వ్యవసాయ వ్యాపార, ఎరువుల, క్రిమిసంహారకాల సంస్థల దయాదాక్షిణ్యాలకు అప్పగించడం జరిగింది. వ్యవసాయ రంగంలో ప్రభుత్వ పెట్టుబడులు తగ్గించడం జరిగింది. వ్యవసాయభూములను వ్యవసాయేతర అవసరాలకూ, తిండిగింజల పంటభూములను వాణిజ్య పంటలకు మళ్లించడం జరిగింది. వ్యవసాయానికి రుణ, పరపతి సౌకర్యాలను తగ్గిచడం జరిగింది. సంపన్న, నయా సంపన్నవర్గాల ఆహార అలవాట్లలో వచ్చిన మార్పుల ఫలితంగా పాతపంటలను వదిలి కొత్త పంటలను ప్రోత్సహించడం, కొత్త ఆహారపదార్థాలను దిగుమతి చేసుకోవడం మొదలయింది. ఈ పరిణామాల వల్ల వేలాదిమంది రైతులు ఆత్మహత్యలు చేసుకోవడం మాత్రమే కాదు, మొత్తంగా వ్యవసాయాభివృద్ధే మందగించింది. ఒకప్పుడు ఆహారపదార్థాల, తిండిగింజల ఉత్పత్తిలో స్వయం పోషకత్వాన్ని సాధించిన దేశం క్రమక్రమంగా అవసరానికి తగినంత ఉత్పత్తి కూడ చేసుకోలేని స్థితికి దిగజారిపోవడంతో దిగుమతుల మీద ఆధారపడవలసి వచ్చింది. గోధుమలు, నూనెగింజలు కూడ దిగుమతి చేసుకోవలసిన దుస్థితి మొదలయింది. అలా ఆహారభద్రత కరువవుతున్న రోజులలో ప్రజాపంపిణీ విధానానికి తూట్లుపొడవడంతో పేద, మధ్యతరగతి వర్గాల బతుకు మరింత దారుణమైంది. ప్రపంచీకరణ ఫలితంగా ఖరీదయిన ఉత్పత్తి పద్ధతులతో ధరలు పెరిగిపోవటం మొదలుపెట్టాయి. ఈ ధరల పెరుగుదల వల్ల ఆహార పదార్థాల మీద కుటుంబాల ఖర్చు పెరిగి తక్కువ ఆహారపదార్థాలు కొనడం, ఆ తక్కువ ఆహార పదార్థాలను సర్దడంలో పోషకాహారలోపం, ఘర్షణలు పెరిగిపోతున్నాయి. పెరుగుతున్న ధరలు కేవలం ఆర్థిక పరిణామంగా కనబడేది ఒక విషవలయంలా సామాజిక, రాజకీయ, సాంస్కృతిక, ఆరోగ్య, మానవసంబంధాల కల్లోలానికి దారితీస్తోంది. అధిక ధరల వ్యతిరేక ఆందోళనలు ఈ విస్తృత వలయాన్ని పరిగణనలోకి తీసుకోవాలి. ◆


ఒ.బి.సి. రిజర్వేషన్లు - సుప్రీంకోర్టు వైఖరి

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్, ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ వంటి జాతీయ ఉన్నత విద్యా సంస్థలలో వెనుకబడిన కులాల విద్యార్థులకు 27 శాతం స్థానాలు కేటాయించాలని ఏడాది కిందట కేంద్ర మానవ వనరుల మంత్రిత్వశాఖ తీసుకున్న నిర్ణయం అగ్రవర్ణాల నుంచి, బడా పెట్టుబడిదారుల ప్రచార సాధనాల నుంచి పెద్ద ఎత్తున వ్యతిరేకతను ఎదుర్కొని సుప్రీంకోర్టు దాకా వెళ్లి చివరికి ఏప్రిల్ 10న ఒక ముగింపుకు వచ్చింది. ఆ ఉత్తర్వు న్యాయబద్ధమైనదేనని, ఉన్నత విద్యాసంస్థలలో వెనుకబడిన కులాల విద్యార్థులకు 27 శాతం రిజర్వేషన్ ఇవ్వవచ్చునని అంగీకరించినప్పటికీ సుప్రీంకోర్టు తీర్పు కొన్ని కనబడని దుష్పరిణామాలకు తెర తీస్తున్నది. మొట్టమొదట ప్రధాన న్యాయమూర్తి కె.జి. బాలకృష్ణన్ నాయకత్వంలోని ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం క్రీమీలేయర్ (ఉన్నతశ్రేణి) అనే ఒక అస్పష్ట విభజనకు అధికారముద్రవేసి ఆ వర్గానికి రిజర్వేషన్ వర్తించడానికి వీలులేదని సన్నాయినొక్కు నొక్కింది. కుటుంబ వార్షికాదాయం రెండున్నర లక్షల రూపాయల పైన ఉండడం, తల్లిదండ్రులు డాక్టర్లో, ఇంజనీర్లో, లాయర్లో, రచయితలో, సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులో, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలలో క్లాస్ 1, 2 అధికారులో కావడం క్రీమీలేయర్ అని ధర్మాసనం ఒక అర్థం లేని నిర్ధారణ చేసింది. పార్లమెంట్ సభ్యులు, శాసనసభ్యుల విషయంలో మాత్రం వారు తమ పిల్లలకు రిజర్వేషన్ కోరగూడదని సూచించింది. ఈ 27 శాతం రిజర్వేషన్‌ను క్రమక్రమంగా మూడు సంవత్సరాల వ్యవధిలో అమలుచేయాలని, రిజర్వేషన్ వర్తింపజేయాలంటే వెనుకబడిన కులాల విద్యార్థులకు ఇచ్చే మినహాయింపు 10 శాతం మార్కులు మాత్రమేనని, ఈ రిజర్వేషన్ల విధానాన్ని ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి సమీక్షించాలని కుడిచేత్తో ఇచ్చినవాటిని ఎడమచేతితో తీసేసుకుంది. వేల సంవత్సరాలుగా దేశ సంపద మీద, వనరుల మీద, ఇతరుల శ్రమఫలితం మీద నూటికి నూరు శాతం రిజర్వేషన్ అనుభవించిన అగ్రవర్ణాలకేమో ఎటువంటి క్రీమీలేయర్ పరిమితులు అక్కరలేదు. గత రెండుమూడు తరాలుగా రిజర్వేషన్ విధానం వల్ల కొద్దోగొప్పో అధికారం, ఆస్తి సమకూర్చుకున్న వర్గాలకు మాత్రం ఆంక్షలు వర్తిస్తాయి! రిజర్వేషన్ విధానం లోపభూయిష్టంగా ఉన్నమాట, ఇంకా నిజంగా రిజర్వేషన్ సౌకర్యాలు అందవలసిన కులాలకూ కుటుంబాలకూ అందని మాట నిజమే. కాని ఉన్న రిజర్వేషన్లలో నుంచి కొందరిని మినహాయించినంత మాత్రాన ఆ లోపాలు సరికాబోవు. అరవై సంవత్సరాలు రాజ్యాంగ బద్ధంగా రిజర్వేషన్లు అమలయినప్పటికీ దళితుల స్థితి ఎంత మాత్రం మెరుగుపడలేదని చెప్పడానికి ఈ ధర్మాసనానికి అధ్యక్షత వహించిన వ్యక్తే మొట్టమొదటి దళిత ప్రధాన న్యాయమూర్తి కావడమే ఉదాహరణ. మరి, ఇంతవరకూ రాజ్యాంగబద్ధం కూడా కాని ఒ.బి.సి. రిజర్వేషన్లు అంతలోనే కొందరికి ఇవ్వనక్కరలేని స్థితి వచ్చిందనడం ఆశ్చర్యకరం. కుల అసమానతల మీద, వివక్ష మీద ఆర్థిక, రాజకీయ, సాంఘిక, సాంస్కృతిక స్థాయిలలో విస్తృతమైన, దీర్ఘకాలికమైన పోరాటం జరపకుండా ఈ దేశం నుంచి కులం పోదు. ఆ పోరాటంతోపాటుగానే గతకాలపు తప్పులను సరిచేసే ఒకానొక చిన్న చర్యగా బేషరతు రిజర్వేషన్లు అమలు జరపకతప్పదు.

న్ని సంవత్సరాలుగా ప్రేమ పేరుతో యువతులను వేధించడం, తమను కాదన్నారని వారిపై హంతక దాడులు చేయడం, చంపడం తెలుగు సమాజంలో యువకులలో సాధారణమైపోయింది. ఈ ధోరణిని ప్రేమోన్మాదం అని పిలుస్తున్నారు గాని ఇది పచ్చి హంతకస్వభావం తప్ప ప్రేమ కాదు. ప్రేమ తోటి మనిషిని సమానంగా గుర్తించే, తోటి మనిషి ఇష్టాయిష్టాలను గౌరవించే ఆర్ద్ర, ఉదాత్త, మానవీయ సంస్కృతిని, విలువలను నేర్పుతుంది గాని ఇటువంటి అమానవీయ ఉన్మాదాన్ని కాదు. ఈ అమానవీయ సంస్కృతికి, హంతక స్వభావానికి మన రాజకీయార్థిక వ్యవస్థ పెంచిపోషిస్తున్న సాంస్కృతిక విలువల చట్రంలోనే పునాదులున్నాయి. స్త్రీకి స్వాతంత్ర్యం ఇవ్వగూడదనీ, స్త్రీ భావాలకు విలువ లేదనీ పురుషుడి ఇష్టారాజ్యంగా, బానిసగా ఆమె నడవలసిందేనని మనుధర్మం, అన్ని మత ధర్మాలూ బోధించిన చట్రంలోనే ఈ యువకులు తయారవుతున్నారు. ఈ భూస్వామ్య భావజాలానికి ఇప్పుడు సామ్రాజ్యవాద సంస్కృతి తోడయింది. 'అన్నీ నీ భోగానికే, నీ భోగం తప్ప ప్రపంచంలో మరేమీలేదు. ఏది అడ్డం వచ్చినా తొక్కేస్తూ ముందుకుపోవడమే, నీ కోరికలు తీర్చుకోవడమే ఏకైక లక్ష్యం. సరుకులు కొను, వాడు, విసిరేయ్. స్త్రీ కూడ సరుకే, అనుభవించు' అని సామ్రాజ్యవాద సంస్కృతి చెపుతుంది. అన్ని ప్రచార సాధనాలు, సినిమాలు, పత్రికలు, ప్రధానస్రవంతి సాహిత్యం ఈ భూస్వామ్య, సామ్రాజ్యవాద విలువలను ప్రబోధిస్తున్నప్పుడు ఈ ప్రభావంలో మునిగితేలుతున్న యవత ఇలా కాక మరొకలా ప్రవర్తిస్తారని ఊహించడం అసాధ్యం. ఈ యువకుల నేరాలకు వారిని శిక్షించవలసిందే. కాని వారిని తయారుచేస్తున్న వ్యవస్థను శిక్షించడం ఇంకా ఎక్కువ అవసరం.

◆

లోపలి పేజీల్లో...



ప్రపంచీకరణ సందర్భంలో కార్మికోద్యమాల పాత్ర

నూతన ఆర్థిక విధానాలు ప్రారంభమై పదహారు సంవత్సరాల తర్వాత ఇప్పుడు చూస్తే దేశవ్యాపితంగా గాని, రాష్ట్రంలో గాని కార్మికోద్యమం బలంగా ఉన్నదని చెప్పగల స్థితి మాత్రం లేదు. తమ మీద పెద్ద ఎత్తున సాగుతున్న దాడులను ఎదుర్కోగల స్థితి కూడా కార్మిక, ఉద్యోగవర్గాలకు లేకుండాపోయింది. కార్మిక, ఉద్యోగ వర్గాల మీద ప్రపంచీకరణ క్రమం ఏయే రూపాలలో దాడులు చేస్తూ వస్తున్నదో ఆ దాడులకు కనీస ప్రతిఘటన కూడ చూపలేని దుస్థితికి కార్మికవర్గం ఎలా దిగజారిపోయిందో అర్థం చేసుకుంటే ఈ స్థితినుంచి బయట పడడానికి ఏమయినా అవకాశాలున్నాయేమో ఆలోచించవచ్చు.

ఫోకస్ : ప్రపంచీకరణ సందర్భంలో కార్మికోద్యమాల పాత్ర

'వీక్షణం'లో అచ్చువుతున్న రచనలలో వ్యక్తమైన అభిప్రాయాలన్నిటితో సంపాదకులకు ఏకీభావం ఉండనవసరం లేదు. 'వీక్షణం'ను నిజమైన ప్రజాపక్ష రాజకీయార్థిక, సామాజిక విశ్లేషణా వేదికగా తీర్చిదిద్దడంలో అన్నిరకాల అభిప్రాయాలకు, భిన్నాభిప్రాయాల ఛాయలకు స్థానం కల్పించాలని సంపాదక వర్గం భావిస్తోంది.

రచయితలకు సూచన

ఏ పత్రికయినా తాను అచ్చువేసే రచనలు తనకే ప్రత్యేకంగా ఉండాలని కోరుకుంటుంది. 'వీక్షణం' కూడా అలానే భావిస్తోంది. ఇటీవల కొందరు రచయితలు తమ రచనలను ఒకేసారి అనేక పత్రికలకు పరిశీలన కోసం పంపుతున్నారు. 'వీక్షణం' పరిశీలనలో ఉన్న రచనలు, రాబోయే సంచికలలో అచ్చుకోసం ఎంపిక చేసి పెట్టుకున్న రచనలు ఇతర దినపత్రికలలోనో, వార పత్రికలలోనో వెలువడడం మా దృష్టికి వస్తోంది. ఇతర పత్రికలకు పంపిన రచనలను 'వీక్షణం'కు పంపించగూడదని రచయితలకు విజ్ఞప్తి చేస్తున్నాము.


– సంపాదకులు


చందాదారులకు విజ్ఞప్తి!


ఇటీవల కొంతమంది చందాదారులకు వీక్షణం సక్రమంగా అందడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయి. వీక్షణం ప్రతినెల 29వ తేదీన మరుసటి నెల సంచిక పోస్ట్ అవుతుంది. ఏ కారణం చేతనైనా మీకు వీక్షణం మొదటివారంలోపు అందనట్లయితే, వెంటనే ఆ విషయం మాకు తెలపగలరు.


మీ చిరునామా వివరంగా రాయండి. పిన్‌కోడ్ రాయడం మరిచిపోకండి. పత్రిక వచ్చిందా రాలేదా పోస్ట్‌మాన్‌తో నిర్ధారించుకోగలరు.


– సర్క్యులేషన్ మేనేజర్
9949391028











- **చరిత్ర, సంస్కృతి వ్యాసావళి** – వకుళాభరణం రామకృష్ణ – విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ – 119 పేజీలు, 1/8 డెమీ, రు. 50, ప్రతులకు : విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజ్ఞాన్ భవన్, అబిడ్స్, హైదరాబాద్ – 500 001
- **మా బోసులోకి మరో సింహం** – కొమ్రన్న – కాకతీయ యూనివర్సిటీ లిటరరీ అసోసియేషన్ ప్రచురణ – 142 పేజీలు, 1/8 డెమీ, రు. 25, ప్రతులకు : కేశరాజ్ కుమార్, అసోసియేట్ ప్రొఫెసర్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇంగ్లిష్, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్ – 506 009; విశాలాంధ్ర బుక్‌హౌస్, ప్రజాశక్తి బుక్‌హౌస్, దిశ పుస్తక కేంద్రం, నవోదయ బుక్‌హౌస్, సహచర బుక్‌మార్క్, సమాంతర పుస్తక షాపుల్లో
- **ఖైదీల సైరన్** – విరసం ప్రచురణ, 289 పేజీలు, 1/8 డెమీ, రు. 60, ప్రతులకు : దిశ పుస్తక కేంద్రం, నవోదయ బుక్‌హౌస్, సహచర బుక్‌మార్క్
- **చిట్టి చేతులు** – చుక్కా రామయ్య – స్పృహ సాహితీ ప్రచురణ, 196 పేజీలు, 1/8 డెమీ, రు. 100
- **చే(వ్రాలు** – సాహిత్య వ్యాసాలు – ఎ. రాజాహుస్సేన్ – స్పృహ సాహితీ ప్రచురణ, 143 పేజీలు, 1/8 డెమీ, రు. 60

  పై రెండు ప్రతులకు : జూలూరు గౌరీశంకర్, 1–8–702/33/20ఎ, పద్మాకాలనీ, నల్లకుంట, హైదరాబాద్ – 500 044


సి.డి.లు

- **గోరటి వెంకన్న పాటలు** – సహచర బుక్‌మార్క్ సమర్పణ, రచన : గోరటి వెంకన్న – గానం : విష్ణుకిషోర్, ప్రభాకర్ (పి.కె.ఎం.), చైతన్య, విమల (ఎ.సి.ఎఫ్.), గోరటి వెంకన్న, జె. కోటేశ్వరరావు (పి.కె.ఎం.), చెన్నయ్య, గోపాల్ (పి.కె.ఎం.), సుధ (ఎ.సి.ఎఫ్.), బేబి దిశ
- **తెలంగాణ ధూం ధాం** (మూడు భాగాలు) – సహచర బుక్‌మార్క్ సమర్పణ – గానం : గద్దర్, బాలకిషన్, గూడ అంజయ్య, గోరటి వెంకన్న, అందెశ్రీ, జయరాజ్, దేశపతి శ్రీనివాస్, సంధ్య, సంతోష్ తదితరులు
- **దళిత రత్నాలు** – రచన : దరువు ఎల్లన్న, భీమసేన, అంకని భాను, దమ్మని రామ్‌లక్ష్మణ్ – గానం : కుంట శ్రీనివాస్, దరువు ఎల్లన్న, లెనినా
- **అరుణోదయ ప్రతిఘటన స్వరాలు** – అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య సమర్పణ, రచన : సుబ్బారావు పాణిగ్రాహి, దశరథి, కె. గణపతి, కాశీపతి, వంగపండు ప్రసాద్, మిత్ర, గద్దర్, రుక్మిణీ, మీనన్, వై. కోటేశ్వరరావు, పటాన్‌చెరు రాములు, విమల (విరసం), పాముల రాంచందర్‌రావు, మోహన్‌రెడ్డి, శ్రీను, శ్రీధర్, సురేష్, దిక్సూచీ, శశి, బైరాగి, సంతోష్, నారాయణస్వామి – గానం : విమల, అంబిక, చైతన్య, జయ, సోమన్న, నిర్మల, వెంకన్న, మల్సూర్, పుష్ప
- **తెలంగాణ పాటలు** – అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య సమర్పణ – రచన : మిత్ర – గానం : విమల, వెంకట్, మల్సూర్, సంతోష్, వసంత, రామారావు, చైతన్య, పుష్ప, నిర్మల, కోరస్


  పై ఐదు సి.డి.లకు : సహచర బుక్ మార్క్, ఎ.పి.ఎచ్.బి. ఎచ్.ఐ.జి. (ఒ.జి.) బ్లాక్ నెం. 5, షాప్ నెం. 29, సుందరయ్య పార్క్ దగ్గర, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ – 500 044. సెల్ : 9848348173











పాఠకుల వీక్షణం

ఏప్రిల్ 2008 సంచికలో ఎ.వి.వి. ప్రసాద్ గారు రచించిన 'చైనా, సెర్బియాల దమనకాండ ఎంతకాలం?' వ్యాసం చదివాను. 'రచయితల అభిప్రాయాలతో సంపాదకులకు ఏకీభావం ఉండనక్కరలేదు' అని మీరు ప్రతి సంచికలోనూ వేస్తూనే ఉంటారు గాని, వాస్తవదూరమైన, పైపై విషయాలు చెప్పే వ్యాసాల విషయంలో 'వీక్షణం' మరింత శ్రద్ధ వహించాలని భావిస్తున్నాను. కొసావో, టిబెట్ సమస్యలు చాలా క్లిష్టమైనవి, అంతర్జాతీయ రాజకీయాల చదరంగంలో అమెరికన్ పాలకవర్గాలు పెట్టిన చిచ్చులు అవి. అక్కడ నిజంగా ప్రజా సమస్యలను, ఆకాంక్షలను గుర్తిస్తూనే అమెరికన్ కుట్రలను అర్థం చేసుకోకపోతే పొరపాటుపడతాం. ఆ రెండు ప్రాంతాలలోనూ ప్రస్తుత పరిణామాలను అమెరికా అనుకూల పత్రికలలో వచ్చే వార్తల ఆధారంగా అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తే చాల సమస్యలు తలెత్తుతాయి.

ఎక్కడయినా ప్రజలు ఒక న్యాయమైన స్వాతంత్ర్యాకాంక్షతో పోరాడుతున్నప్పుడు ఆ ప్రజలను తప్పనిసరిగా సమర్థించవలసిందే. కాని ప్రస్తుతం కొసావోలో స్వాతంత్ర్య ప్రకటన, టిబెట్‌లో నడుస్తున్న ఆందోళన అంత సులభంగా అర్థం చేసుకోగలిగినవి కావు. అటు సోవియట్ నూ ఇటు అమెరికానూ కాదని ఒక స్వతంత్ర నమూనాను రూపొందించడానికి ప్రయత్నించిన యుగొస్లావియాను నామరూపాలు లేకుండా చేయడానికి అమెరికా చేస్తున్న కుట్రలవల్ల ఆ దేశం ఇప్పటికే ఏడెనిమిది దేశాలుగా ముక్కలైపోయింది. నిజంగానే ఆయా జాతులు స్వాతంత్ర్యాన్ని కోరుకుంటే ఎవరికీ భిన్నాభిప్రాయం ఉండనక్కరలేదు. కాని ఆ జాతుల మధ్య విద్వేషాన్ని రగిల్చి, దారుణమైన హింసాకాండలను ప్రేరేపించిన సి.ఐ.ఎ. పాత్రను గురించి మాట్లాడకుండా ఉండడం 'వీక్షణం'కు తగదు.

ఇక టిబెట్ సమస్య మరింత చిక్కుముడి. అసలు టిబెట్‌లో నిజంగా ప్రజా ఆందోళన జరుగుతున్నదా? సి.ఐ.ఎ. ప్రోద్బలంతో జరిగిన కుట్ర తర్వాత, 1959లో భారత్‌కు పారిపోయి వచ్చిన దలైలామా అతని శిష్యులు, దలైలామా భూస్వామిక, మతపాలనను పునరుద్ధరించాలని కోరుకునే టిబెటన్లు ప్రపంచ వ్యాప్తంగా చేస్తున్న ఆందోళనలు తప్ప నిజంగా టిబెట్ స్వేచ్ఛ కోసం ఈ ఆందోళన జరుగుతున్నదా? అట్లని ప్రస్తుత చైనా ప్రభుత్వం ఏదో టిబెటన్లకు మేలు చేస్తున్న, టిబెటన్ల స్వాతంత్ర్యాకాంక్షలను కాపాడుతున్న ప్రభుత్వమని కూడా అనుకోనక్కరలేదు. చైనాకూ టిబెట్‌కూ మధ్య పద్నాలుగో శతాబ్దం నుంచీ ఉన్న చారిత్రక సంబంధాలు, టిబెట్ ను చైనాలో అంతర్భాగం చేసుకున్నప్పుడు 1950లలో చైనా ప్రభుత్వం చెప్పిన కారణాలు వంటి చాలా విషయాలు పరిగణనలోకి తీసుకోవలసి ఉంటుంది. మావో నాయకత్వంలోని చైనా ప్రభుత్వం కూడ టిబెటన్ల ప్రత్యేక జాతి అస్తిత్వాన్ని, సంస్కృతిని, స్వేచ్ఛాకాంక్షను తొక్కిపెట్టి టిబెట్‌ను ఆక్రమించుకున్నదని భావించేవారు ఉన్నారు. అప్పుడు చైనా ప్రభుత్వం చూపిన చారిత్రక కారణాలతో ఎవరికైనా ఏకీభావం ఉండవచ్చు, లేకపోవచ్చు. కాని ఎవరయినా అంగీకరించక తప్పని వాస్తవమేమంటే, టిబెట్‌లో తన కీలుబొమ్మలను నిలపడానికి 1950ల నుంచీ ఏటేటా మిలియన్ల డాలర్లు దలైలామాకూ, అతని అనుచరగణానికీ ఇస్తున్నామనీ సి.ఐ.ఎ. అధికారులే ఎన్నోసార్లు ప్రకటించారు. అందువల్ల చైనా ప్రభుత్వం తన పక్కలో బల్లెంగా ఒక మత ఛాందస రాజ్యాన్ని, ఒక అమెరికన్ కీలుబొమ్మ రాజ్యాన్ని ఉండనివ్వదలచుకోలేదు. మరీ ముఖ్యంగా కొరియాలోనూ, ఆగ్నేయాసియా దేశాలలోనూ అమెరికా 1950లలో ప్రారంభించిన కుట్రలను చూసిన తర్వాత టిబెట్‌ను దలైలామా చేతుల్లో, అంటే సి.ఐ.ఎ. చేతుల్లో ఉంచడానికి చైనా ఇష్టపడలేదు. అయినా, మావో నాయకత్వంలోని చైనా ప్రభుత్వం చిరకాలంగా వస్తున్న హాన్ జాతి ఆధిపత్య భావనను నిర్మూలించి, అన్ని జాతులకూ స్వయం నిర్ణయాధికారం ఇచ్చి అన్ని జాతుల అభివృద్ధికి అవకాశాలు కల్పించింది. అందువల్లనే టిబెట్ ఒక స్వతంత్ర ప్రతిపత్తి గల ప్రాంతంగా కొనసాగింది. ఇక మావో మరణాంతరం చైనాలో రాజ్యమేలుతున్న పక్కా పెట్టుబడిదారీ ప్రభుత్వమే గనుక, అది ఆర్థిక రంగంలో పెట్టుబడిదారీ విధానాలను అమలుచేస్తూ, రాజకీయ రంగంలో సోషలిజం మంత్రం జపం చేస్తూ నియంతృత్వాధికారాన్ని చలాయిస్తున్నది గనుక టిబెటన్లతో సహా అన్ని జాతులకూ ప్రస్తుత చైనా బందిఖానాగా మారిపోయింది. కనుక టిబెటన్ల స్వేచ్ఛాకాంక్షను గౌరవిస్తూనే, ప్రస్తుత టిబెట్ సమస్యలో ప్రధాన పాత్రధారులందరినీ – దలైలామానూ, అమెరికానూ, చైనానూ – అనుమానించవలసి ఉంది.

అందువల్ల ప్రసాద్‌గారు రాసినట్టు టిబెట్ సమస్య అంత సులభమైనది కాదు. అందులో ఆలోచించవలసిన విషయాలు :1. ప్రస్తుత టిబెటన్ల ఆందోళన నిజంగా ప్రజా ఆందోళనేనా? కేవలం దలైలామా అనుచరుల ఆందోళనా? 2. టిబెటన్లలో ఎంత చిన్న భాగమైన సరే ఇవాళ్టి ఆందోళనను నడుపుతు న్నప్పుడు దాని పట్ల దమననీతి అనుసరించే నైతిక హక్కు చైనా ప్రభుత్వానికి ఉందా? 3. నిజమైన ప్రజా సమస్యల పునాదిమీదనే అయినా కుట్రపూరితంగా సి.ఐ.ఎ., అమెరికా పాలకులు అల్లర్లను ఎగసనదోస్తే వాటిపట్ల ప్రగతిశీల శక్తులు ఎటువంటి వైఖరి తీసుకోవాలి? అమెరికన్ పాలకవర్గ విధానాలనూ, ముఖ్యంగా సి.ఐ.ఎ. వంటి దుష్టసంస్థ కుట్రలను పొగిడే వ్యాసాలు 'వీక్షణం'లో రావడం విచారకరం.

– బి. ఎల్లారెడ్డి

కరీంనగర్

బడ్జెట్ ఫోకస్‌గా ఏప్రిల్ 2008 సంచికలో వచ్చిన వ్యాసాలు అంకెలే కేంద్రంగా అనిపించాయి. కాస్త సామాన్య పాఠకులకు అర్థమయ్యే వివరణలు, విశ్లేషణలతో వస్తే బాగుండేది.

– పి. గణపతిరావు

శ్రీకాకుళం

తెలుగు దినపత్రికల వరుసలోకి మరో దినపత్రిక 'సాక్షి' పేరిట వచ్చి చేరింది. మార్చ్ 23న రాష్ట్ర గవర్నర్ ఎన్.డి. తివారి చేతుల మీదుగా ఆవిష్కృతమైంది. ప్రత్యేకత ఏమంటే ముఖ్యమంత్రి కుమారుడు వై.ఎస్. జగన్‌రెడ్డి ఛైర్మన్‌గా ఉన్న జగతి పబ్లికేషన్స్ తరఫున రావడమే. మరో ప్రత్యేకత శాసనసభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో రావడంతో సహజంగానే రకరకాల అంచనాలు, అనుమానాలు ప్రజలకుంటాయి. ఉన్న పత్రికలకు భిన్నంగా ఉంటుందా? వేచి చూడాల్సిందే.

హైదరాబాద్‌లో సి.పి.ఐ. 20వ జాతీయ మహాసభలు మార్చ్ 23 – 27 మధ్య జరిగాయి. ఈ సందర్భంగా మార్చ్ 27న నిజాం కాలేజ్ గ్రౌండ్స్‌లో జరిగిన బహిరంగ సభలో వరుసగా నాలుగవసారి జాతీయ ప్రధాన కార్యదర్శి బాధ్యతలు చేపట్టిన ఎ.బి. బర్ధన్ ధరల పెరుగుదలకు వ్యతిరేకంగా పోరాటానికి పిలుపునిచ్చారు. రుణాల మాఫీ కేవలం బ్యాంక్ రుణాలు పొందిన రైతులకే ప్రయోజనాన్ని చేకూరుస్తుందని, ప్రైవేట్ ఫైనాన్స్, వడ్డీ వ్యాపారుల నుంచి రుణాలు తీసుకున్న అత్యధిక శాతం రైతులకు ఈ రుణ మాఫీ వల్ల ప్రయోజనం లేదని అన్నారు. తెలంగాణపై తీర్మానాల్లో రాసుకున్నా బహిరంగ సభలో ఏమీ మాట్లాకపోవడం కొసమెరుపు.

మార్చ్ 31తో ముగిసిన 2007 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన కాగ్ నివేదికను మార్చ్ 28న శాసనసభలో ప్రవేశపెట్టారు. ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయల కల్పనా సంస్థ (ఎ.పి.ఐ.ఐ.సి.) చేపట్టిన భూ కేటాయింపులు నిబంధనల ప్రకారం లేవని కాగ్ తన నివేదికలో అభిప్రాయపడింది. ప్రైవేట్ కంపెనీల ప్రయోజనాలే లక్ష్యంగా ఈ సంస్థ వ్యవహరించినట్లు స్పష్టం చేసింది. వందలాది ఎకరాల భూములను ఎకరా రూపాయి లెక్కన లీజుకిచ్చి కార్పొరేషన్ తను సొంతంగా రూపొందించుకొన్న ధరల విధానాన్ని కూడా పాటించలేదని ఆక్షేపించింది. దీనివల్ల కార్పొరేషన్‌కు రు. 308.46 కోట్లు నష్టం వాటిల్లిందని తెలిపింది. తమకు నచ్చిన వారికి చౌక ధరకు భూమి కేటాయించేలా ప్రభుత్వమే ఎ.పి.ఐ.ఐ.సి. పై ఒత్తిడి తేవడం గమనార్హం.

మార్చ్ మూడవ వారం చివరలో కురిసిన అకాల వర్షాలకు పల్లపు ప్రాంత రైతులు తీవ్రంగా నష్టపోయారు. మెట్ట రైతులకు కాస్త మేలు జరిగింది. నలభై ఏడు వేల హెక్టార్లలో వివిధ పంటలకు రు. 300 కోట్లకు పైగా నష్టం వాటిల్లినట్లు అంచనా. గత నాలుగు దశాబ్దాల కాలంలో మార్చ్‌లో ఇలా అకాల వర్షం కురవడం ఇది నాలుగవ సారి (1973, 1990, 2003). మిరప, పొద్దుతిరుగుడు, మామిడి, వేరుశనగ, ఉల్లి తదితర వాణిజ్య పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. గుంటూరు జిల్లాలో ఒక మిర్చి పంటకే రు. 102 కోట్ల నష్టం వచ్చినట్లు అంచనా.

ఏప్రిల్ 9న మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో ముఖ్యమంత్రి డా. వై.ఎస్. రాజశేఖరరెడ్డి రెండు రూపాయలకే కిలో బియ్యం పథకాన్ని ప్రారంభించారు. ఎన్నికల దృష్ట్యా ప్రవేశపెట్టిన పథకంగా అనుకుంటున్నప్పటికీ సామాన్య ప్రజలకు కాస్త ఉపశమనమే. గ్రామీణులకు బియ్యం ఇవ్వడం కాక, వ్యవసాయాన్ని నిలబెట్టే ఆలోచన విధానకర్తలు చేస్తే దీర్ఘకాలిక ప్రయోజనం ఉంటుంది. ఒకపక్క బియ్యం ఇచ్చినా మరోపక్క నిత్యావసర వస్తువుల ధరలన్నీ మండిపోతున్న తరుణంలో సామాన్యుల బతుకు భారమే.

కానిస్టేబుల్, సబ్ ఇన్‌స్పెక్టర్ ఉద్యోగాల కోసం నిర్ణయించిన వయోపరిమితిని పెంచాలని కోరుతూ పన్నెండు మంది విద్యార్థులు ఏప్రిల్ 4న ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని ఆర్ట్స్ కాలేజీ వద్ద వయో పరిమితి పెంచకుంటే భవనం పైనుంచి దూకేస్తామని కలకలం సృష్టించారు. ఓపెన్ క్యాటగిరి వయోపరిమితిని ఇరవై ఐదు నుంచి ఇరవై ఎనిమిదేళ్లకు పెంచాలని డిమాండ్ చేశారు. మరోపక్క ఇలా పెంచితే దళిత బలహీన వర్గాలకు అన్యాయం జరుగుతుందని కొన్ని విద్యార్థి సంఘాలు నిరసన ప్రదర్శన చేపట్టాయి. ఈ ప్రయత్నం అలా ఉంటే ముఖ్యమంత్రి మాత్రం వయోపరమితి పెంచేది లేదని ప్రకటించారు. మెరుపు ప్రదర్శనలు, ఆత్మహత్యా రాజకీయాలు, బెదిరింపులు, లాబీయింగులు తాత్కాలిక ప్రయోజనాలను నేరవేర్చవచ్చేమోకాని, దీర్ఘకాలిక విలువల చైతన్యాన్ని మిగల్చలేవు.

రాష్ట్రంలో నాలుగు లోక్‌సభ స్థానాలకు, 18 శాసనసభ స్థానాలకు మే 29న ఉప ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎలక్షన్ కమిషన్ ప్రకటించింది. వీటిలో తెర్లాం, ఖైరతాబాద్ రెండు శాసనసభ స్థానాలకు అక్కడి ఎం.ఎల్.ఎ.ల మరణంతో ఖాళీలు ఏర్పడగా, మిగిలిన స్థానాలు టి.ఆర్.ఎస్. తెలంగాణ డిమాండ్‌తో రాజీనామాలు చేయడం వల్ల ఖాళీలు ఏర్పడ్డాయి. రానున్న శాసనసభ ఎన్నికల దృష్ట్యా ఈ ఉప ఎన్నికలు అన్ని పార్టీలకు కీలకం కానున్నాయి. ముఖ్యంగా తెలంగాణ ఆకాంక్ష పట్ల వివిధ పార్టీల వైఖరులకు పరీక్ష కాబోతున్నాయి.

రాజ్యాంగ నిర్మాత డా. బి.ఆర్. అంబేద్కర్ 118వ జయంతి ఉత్సవాల సందర్భంగా ఏప్రిల్ 14న రాష్ట్ర ఎస్.సి., ఎస్.టి. కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ పున్నయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్.సి., ఎస్.టి., చట్టాలు ఏవీ అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికీ అంటరానితనం కొనసాగుతుందన్నారు. ఇంకా పలువురు వక్తలు మాట్లాడుతూ ఇప్పటికీ బసివిని, జోగిని లాంటి వ్యవస్థలు కొనసాగుతున్నాయనీ, చనిపోతే స్మశానాలు కూడా లేవని విచారం వ్యక్తం చేశారు. ◆

సుదీర్ఘకాలంగా ఒ.బి.సి.లు చేస్తున్న పోరాటం ఇంతకాలానికి ఫలించినట్లయిందనే ఆనందం ఒకవైపు వుంటే మరోవైపు 'క్రీమీలేయర్' వల్ల ఆచరణలో ఈ రిజర్వేషన్లు ఎంతమేరకు తమకు చేరతాయనే సందేహం బలంగా వ్యక్తమవుతోంది అని అంటున్నారు జె. గౌతమ్

కోటాపై సుప్రీంకోర్టు తీర్పు - బి.సి.ల పోరాట విజయం

కేంద్ర ప్రభుత్వ ఉన్నత విద్యాసంస్థల్లో ఒ.బి.సిలకు రిజర్వేషన్లు ఇవ్వడాన్ని బలపరుస్తూ ఏప్రిల్ 10న సుప్రీంకోర్టు తీర్పుచెప్పడంతో రాజ్యాంగస్ఫూర్తికి, సామాజిక న్యాయస్ఫూర్తికి కొంతమేరకు న్యాయం జరగడమే కాకుండా ఒ.బి.సి.ల రిజర్వేషన్ పోరాట కృషి మరో మైలురాయిని దాటినట్టయింది. సుదీర్ఘకాలంగా ఒ.బి.సి.లు చేస్తున్న పోరాటం ఇంతకాలానికి ఫలించినట్లయిందనే ఆనందం ఒకవైపు వుంటే మరోవైపు క్రీమీలేయర్ ఆంక్షలు విధించడంతో ఈ రిజర్వేషన్లు ఆచరణలో ఎంతమేరకు తమకు చేరతాయనే సందేహం బలంగా వ్యక్తమవుతోంది. అందుకే క్రీమీలేయర్‌ను తొలగించాలని అనేకమంది బిసి మేధావులు, సామాజికన్యాయ ఉద్యమశక్తులు, పలు రాజకీయ పక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. క్రీమీలేయర్ ఆంక్షల కోణంలో నుంచి అర్థం చేసుకుంటే సుప్రీంకోర్టు తీర్పు మధ్యేవాదాన్ని అనుసరించిందని చెప్పక తప్పదు.

కాంగ్రెస్ నేతృత్వంలోని యు.పి.ఎ ప్రభుత్వం 93వ రాజ్యాంగ సవరణ చట్టం 2005 ద్వారా ఒ.బి.సి.లకు ఉన్నత విద్యాసంస్థల్లో 27 శాతం రిజర్వేషన్లు కల్పించాలని నిర్ణయించడంతో 2006 జనవరి 20 నుంచి ఈ చట్టం అమల్లోకి వచ్చింది. ఇదే సమయంలో సామాజిక న్యాయం సాధికారతపై ఏర్పాటైన పార్లమెంటరీ స్థాయి సంఘం వెనుకబడిన తరగతుల జనాభా గణన జరగలేదని నివేదిక ఇవ్వడం, 2001 జనాభా సేకరణ ప్రకారం కూడా ఒ.బి.సి.లపై ఎలాంటి సమాచారం సేకరించలేదని భారత రిజిస్ట్రార్ జనరల్ కూడా నివేదిక ఇవ్వడంతో 22 మే 2006న ఒ.బి.సి. కోటాకు వ్యతిరేకంగా అశోక్‌కుమార్ ఠాకూర్ అనే వ్యక్తి సుప్రీంకోర్టులో దావా వేశాడు. దీనికి సమాంతరంగా ఢిల్లీలోని ఎయిమ్స్‌లో ఒ.బి.సి. రిజర్వేషన్ వ్యతిరేక ఆందోళన ఊపందుకుంది. దీంతో ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ మే 27న ఉన్నత విద్యాసంస్థల్లో రిజర్వేషన్‌ల అమలును పరిశీలించేందుకు ఒక పర్యవేక్షక కమిటీని నియమించారు. ఈ కమిటీ రిజర్వేషన్ కోటాను అమలుచేస్తే విద్యా నైపుణ్యంపై రాజీపడినట్లు అవుతుందని, జనాభా పరమైన సమస్యలు ఏర్పడతాయని నివేదిక ఇచ్చినట్టు చెబుతున్నారు. ఇదిలావుంటే 29 మే 2006న కోటాపై సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు ఇచ్చింది. ఈ కేసులో పాలుపంచుకునేందుకు పౌరులందరికీ అవకాశం కల్పిస్తూ కోర్టు ఆహ్వానం పలికింది. ఈ ఆహ్వానంతో కోటాకు వ్యతిరేకంగా మరికొన్ని దావాలు కోర్టులో పడ్డాయి. ఈ స్థితిలో 29 మార్చి 2007న కోటా అమలును నిలిపివేస్తూ కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. ఒబిసి రిజర్వేషన్ల రాజ్యాంగబద్ధతపై విచారించేందుకు ప్రధాన న్యాయమూర్తి కె.జి.బాలకృష్ణన్‌తో పాటు జస్టిస్ పసాయత్, జస్టిస్ రవీంద్రన్, జస్టిస్ థక్కర్, జస్టిస్ భండారీలతో అయిదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఆగస్ట్ 7న ఏర్పాటయింది. కొన్ని నెలలు గడచిన తర్వాత 25 రోజుల పాటు విచారణ జరిపిన అనంతరం కోర్టు 11 నవంబర్ 2007న తీర్పును వాయిదా వేసింది. మళ్ళీ అయిదు నెలల తర్వాత 10 ఏప్రిల్ 2008న కేంద్ర ప్రభుత్వ ఉన్నత విద్యా సంస్థల్లో ఒ.బి.సి.లకు 27 శాతం రిజర్వేషన్లు ఇవ్వడం సమంజసమేనని అయితే సంపన్న శ్రేణిని మినహాయించాలని సుప్రీంకోర్టు తుది తీర్పు వెలువరించింది. ఈ అంశం సుమారు రెండేళ్ళ పైబడి కోర్టులు చుట్టూ తిరిగి ఎట్టకేలకు ఒ.బి.సి.లకు అనుకూలంగా తీర్పు వెలువడింది. అరవై ఏళ్ళ స్వాతంత్రం తర్వాత ఉన్నత విద్యాసంస్థల్లో ఒ.బి.సి.లకు రిజర్వేషన్లు మెదటిసారిగా అమలు కాబోతున్నాయి.

ఒ.బి.సి. రిజర్వేషన్ల అంశం ఎప్పుడు ముందుకొస్తున్నా దేశవ్యాప్తంగా అలజడులు, ఆందోళనలు చెలరేగి ప్రతిభ, సామర్థ్యం పడిపోతోందనీ, కులం పేరు మీద దేశాన్ని చీలుస్తున్నారనీ, యువతలో సమాన భావనకు భంగం కలిగిస్తున్నారనీ, ఇస్తే ఆర్థికంగా వెనుకబడిన అందరికీ రిజర్వేషన్లు ఇవ్వాలనీ, ఇంకెంత కాలం రిజర్వేషన్లనీ ఇలా రకరకాల వాదాలు ముందుకొస్తూ పౌరసమాజాన్ని అతలాకుతలం చేయడానికి అగ్రకులాధిపత్య శక్తులు, వారి ప్రచార సాధనాలు, తెరవెనుక వారి రాజకీయ పార్టీలూ పూనుకుంటూనేవున్నాయి. కుతర్కాలతో, కుయుక్తులతో సమస్యను జఠిలమూ, జాప్యమూ చేయడానికి కోర్టులను ఆశ్రయిస్తున్నాయి. ఉద్రిక్తతలను సృష్టిస్తూ ఒబిసిల అవకాశాలను తాత్కాలికంగా అడ్డుకుంటూ యథాతథంగా తమ ఆధిపత్య స్థానాలను కొనసాగించుకుంటున్నాయి. వీరి వాదాలూ, చర్యలన్నీ ఒ.బి.సిలకు రిజర్వేషన్లు నిరాకరించే లక్ష్యంతో సాగుతున్నవేనని వేరేచెప్పనక్కర్లేదు.

ఒబిసి రిజర్వేషన్ల చరిత్ర

దఫదఫాలుగా ఒ.బి.సి. రిజర్వేషన్ల అంశం వివాదంగా మారడానికి భారతదేశంలో పెద్దచరిత్రే ఉంది. 18వ శతాబ్దం మధ్యలో నాటి బ్రిటిష్ పాలన కొనసాగుతుండగానే విద్య, ఉద్యోగ రంగాల్లో బ్రాహ్మణాధిపత్యానికి వ్యతిరేకంగా శూద్రకులాలు ముఖ్యంగా ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో (ఆంధ్రప్రాంతాన్ని కలుపుకుని తమిళనాడు) బ్రాహ్మణ వ్యతిరేక ఉద్యమాలు నడిపాయి. ఈ పోరాటాల ఫలితంగా బ్రిటిష్

పాలకులు శూద్రులకు అవకాశాలు ఇవ్వాలని 1854లో రెవెన్యూ బోర్డు ద్వారా ఉత్తర్వులు జారీచేశారు. అయితే అన్నిశాఖల్లోనూ ఇది అమలు కావాలని మళ్ళీ శూద్రులు ఉద్యమించడం, వీరి నేతృత్వంలో జస్టిస్‌పార్టీ ఏర్పాటు చేసుకుని ఎన్నికల్లో సైతం బలమైనశక్తిగా అవతరించడంతో 1921లో మెదటి కమ్యూనల్ జి.ఒ. విడుదల అయింది. అన్నికులాలకు జనాభా దామాషా ప్రాతినిధ్యాన్ని ఇవ్వాలనే ఈ కమ్యూనల్ జి.ఒ.ను అన్నిశాఖల్లోనూ అమలు చేయడానికి మార్గం ఏర్పడింది. ఆ తర్వాత 1947లో మరొక జి.ఒ. వచ్చి 1951 వరకూ అమలయి తర్వాత కులాల ప్రాతిపదికమీద రిజర్వేషన్లు చెల్లవని మద్రాస్ హైకోర్టు తీర్పుచెప్పడం, హైకోర్టు తీర్పునే సుప్రీంకోర్టు ధృవీకరిస్తూ కేసును కొట్టివేయడం (చంపకందొరైరాజన్ కేసు)తో తమిళనాట పెరియార్ నేతృత్వంలో ఉద్రిక్తతతో కూడిన ఉద్యమం నడిచి జాతీయ స్థాయిని ప్రభావితం చేసింది. అప్పుడు మద్రాస్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న చక్రవర్తుల రాజగోపాలాచారి భారత ప్రభుత్వం కనుక వెనుకబడిన కులాల హక్కులను పరిరక్షించడానికి వెంటనే చర్యలు తీసుకోకపోతే దక్షిణ ప్రాంతం ద్రవిడ దేశంగా విడివడిపోతుందని నాటి ప్రధాని నెహ్రూకు చెప్పడంతో మొదటి రాజ్యాంగ సవరణకు దారితీసింది. డా. అంబేద్కర్ కూడా ఒ.బి.సి. రిజర్వేషన్లకు సానుకూలంగా ఉండటంతో 15 క్లాజుకు (4) చేర్చి సాంఘికంగా, విద్యాపరంగా వెనుకబడిన వర్గాలవారి అభ్యున్నతికి ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని నిర్దేశించడం జరిగింది. రాజ్యాంగంలోని 340 అధికరణ కూడా సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వర్గాలను గుర్తించడానికి అవకాశం కల్పించింది. ఈ విధంగా మొదటి రాజ్యాంగ సవరణ జరిగి ఒ.బి.సి.లకు రిజర్వేషన్‌ల అవకాశం పొందేందుకు మార్గం సుగమం చేసుకున్నా అధికారాన్ని హస్తగతం చేసుకున్న అగ్రకులాధిపత్య ప్రభుత్వాల కారణంగా ఆచరణకు నోచుకోలేదు.

తర్వాత కేంద్రప్రభుత్వం జాతీయ స్థాయిలో ఒబిసి స్థితిగతులను అధ్యయనం చేయడానికి కాకా కలేల్కర్ కమిషన్‌ను నియమించింది. ఈ కమిషన్ దేశవ్యాప్తంగా పర్యటించి మూడేళ్ళ తర్వాత నివేదికను ఇచ్చింది. మహిళలందర్నీ కూడా వెనుకబడిన వర్గాలుగానే గుర్తించాలని కూడా ఈ కమిషన్ పేర్కొంది. అయితే ఈ కమిషన్ బుట్టదాఖలయింది. తర్వాత దేశవ్యాప్తంగా భాషాసంయుక్త రాష్ట్రాలు ఏర్పడి వెనుకబడిన తరగతులకు రిజర్వేషన్లు అమలుచేయడానికి కొద్దిగా ప్రయత్నాలు జరిగాయి. ఇలా అమలు చేయడానికి ప్రయత్నించిన ప్రతి సందర్భం లోనూ హైకోర్టులు, సుప్రీంకోర్టు అడ్డం పడి రాజ్యాంగంలో వెనుకబడిన తరగతులు అన్నారు కనుక కులప్రాతిపదికన రిజర్వేషన్లు చెల్లవని తీర్పులు చెప్పాయి. అంతేకాదు రాజ్యాంగం ఎవరినీ కుల, మత, ప్రాంత, లింగ ప్రస్తావన లేకుండా అందర్నీ సమంగా పేర్కొన్నది కనుక కులపరమైన రిజర్వేషన్లు చెల్లవని కోర్టులు సాకులను వెతికాయి. ఈ సాకులను వ్యతిరేకిస్తూ అట్టడుగుకులాల డిమాండ్‌లను కులవివక్ష పరిధిలో చూడాలని వారికి కులప్రాతిపదికపైనే అవకాశాలు కల్పించాలని పెరియార్ స్పష్టంచేశాడు. ఇలా మొదలయిన కోర్టుల్లో ఒ.బి.సి.ల పోరాటం చివరకు 1963లో సుప్రీంకోర్టు ఈ దేశంలో కులమే వర్గం, వర్గమే కులం రెండూ వేరువేరు అనడానికి వీల్లేదని ఏకులంలోనైనా అధికశాతం సాంఘికంగా, విద్యాపరంగా వెనుకబడినట్లు నిర్ధారిస్తే అలాంటి కులాలను వెనుకబడిన కులాల్లో చేర్చవచ్చని తీర్పుచెప్పింది. ఈ తీర్పు తర్వాత వివిధ రాష్ట్రాల్లో ఒ.బి.సి.లను నిర్ధారించి రిజర్వేషన్లు అమలు చేయడం తిరిగి ప్రారంభమైంది. ఇలా నిర్ధారించిన కులాలపైకూడా కోర్టులకెక్కి వాటిని సుప్రీంకోర్టు వరకూ లాగించిన చరిత్ర అగ్రకులాలకు ఉంటే, అలాంటి అగ్రకులాలపక్షం వహించిన చరిత్ర ఈ దేశంలో కోర్టులకు ఉన్నది. ఉదాహరణకు ఆంధ్రరాష్ట్రంలో 1963లో 139 కులాలను బిసి కులాలుగా గుర్తిస్తూ జి.ఒ. తీసుకువస్తే దాన్ని హైకోర్టు కొట్టివేసింది. మళ్ళీ 1966లో 112 కులాలను బిసీ జాబితాలో చేర్చి జి.ఒ. ప్రకటిస్తే దీన్నికూడా హైకోర్టు, సుప్రీంకోర్టు కొట్టివేశాయి. చివరకు 1968లో ఏర్పడిన అనంతరామన్ కమిషన్ 93 కులాలను బిసిలుగా గుర్తిస్తూ 1970లో నివేదిక ఇచ్చింది. బిసిలను ఎబిసిడిలుగా వర్గీకరిస్తూ 30 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని కూడా ఈ కమిషన్ సిఫారసు చేస్తే దాన్నీ హైకోర్టు కొట్టివేస్తే చివరకు 1972లో హైకోర్టు తీర్పు సరికాదని సుప్రీంకోర్టు ప్రభుత్వ జీవోకు అనుకూలంగా తీర్పు చెప్పింది. దీంతో 1972 నుంచి రాష్ట్ర పరిధిలో బిసిలకు రిజర్వేషన్లు అదీ 25 శాతం అందుబాటులోకి వచ్చాయి.

జాతీయస్థాయిలో ఒ.బి.సి. రిజర్వేషన్ల అమలు

ఇక జాతీయస్థాయికి వస్తే 1978లో జనతాపార్టీ తన ఎన్నికల ప్రణాళికలో తాము అధికారంలోకి వస్తే కాకా కలేల్కర్ కమిషన్ నివేదికను అమలు చేస్తామని ప్రకటించింది. అధికారానికి వచ్చిన తర్వాత కమిషన్ అమలును కొందరు (ఇప్పటి బిజెపి నాయకులు) అడ్డుకోవడంతో నాటి ప్రధాని మురార్జీదేశాయ్ జనతాపార్టీలోని ఒ.బి.సి.లను శాంతింప జేసేందుకు బిందేశ్వరీ ప్రసాద్ (బి.పి) మండల్‌ను మరొక కమిషన్‌గా నియమించాడు. మండల్ కమిషన్ నివేదిక ఇచ్చేనాటికి జనతా ప్రభుత్వం పడిపోయి మళ్ళీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. దీంతో 1980 తర్వాత అందుబాటులోకి వచ్చిన మండల్ కమిషన్ అటకెక్కింది. మళ్ళీ పదేళ్ళ తర్వాత 1989లో జనతాదళ్ తాము అధికారంలోకి వస్తే మండల్ కమిషన్‌ను అమలు చేస్తామని హామీ ఇచ్చింది. మరికొన్ని పార్టీలు ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టాయి. అధికారం చేపట్టిన వి.పి.సింగ్ ఉద్యోగ రంగాల్లో 27 శాతం రిజర్వేషన్లు అమలుచేస్తూ నిర్ణయం తీసుకున్నాడు. నిజానికి హర్యానా నాయకుడు దేవీలాల్‌కు చెక్‌పెట్టేందుకే మండల్ అస్త్రాన్ని వి.పి.సింగ్ బయటకు తీసాడు. మండల్‌కు వ్యతిరేకంగా దేవీలాల్‌కూడా పెద్ద ఆందోళనే చేశాడు. రాజకీయ సమీకరణల్లో భాగంగా ఆరోజు వీ.పి.సింగ్‌కు వ్యతిరేకంగా దేవీలాల్ జరిపినసభలో బి.ఎస్.పి నేత కాన్షీరామ్ కూడా పాల్గొన్నాడు. ఏమైనప్పటికీ ఒ.బి.సి. రిజర్వేషన్ల అమలు నిర్ణయంతో దేశంలోని అగ్రకుల వ్యవస్థ మొత్తం గగ్గోలుపెట్టింది. ఒ.బి.సి. రిజర్వేషన్ వ్యతిరేక, రిజర్వేషన్ అనుకూల ఉద్యమాలతో భారతదేశం రెండుగా చీలిపోయింది. చివరకు వి.పి.సింగ్ ప్రధాని పదవిని కోల్పోయాడు.

మండల్ కమిషన్ అమలు నిర్ణయాన్ని కూడా సుప్రీంకోర్టులో సవాలుచేయగా 1992 లో (ఇంద్రసహానీకేసు) క్రీమీలేయర్‌ను మినహాయించి అమలు చేసుకోవచ్చని క్రీమీలేయర్‌లోకి వచ్చే వారి వివరాలను కోర్టు తొలిసారి ప్రస్తావించింది. నిజానికి క్రీమీలేయర్ ప్రస్తావన రాజ్యాంగ విరుద్ధమైనప్పటికీ నాటి ప్రధాని పి.వి.నరసింహారావు

సలహాతోనే ఈ ప్రస్తావన జరిగి ఉంటుందనే విశ్లేషణలు జరిగాయి. కోర్టు తీర్పు తర్వాత 1993లో కేంద్రప్రభుత్వం ఒ.బి.సి. రిజర్వేషన్ల అమలుకు జి.ఓ. ఇస్తే అది 1994 తర్వాత కేంద్ర ప్రభుత్వ ఉద్యోగసంస్థల్లో అమలవడం మొదలయింది. (ఎస్.సి., ఎస్.టి.లకు కూడా 1970ల తర్వాతే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్లు అమలయ్యాయి). సరిగ్గా ఈ కాలంలోనే ప్రైవేటీకరణ పరిణామాలు దేశంలో అమలవడంతో ఉన్న రిజర్వేషన్లు కాస్తా తరిగిపోతూ వచ్చాయి. మళ్ళీ పదేళ్ళు పైబడిన తర్వాత 2006 జనవరి 20న కాంగ్రెస్ నేతృత్వంలోని యు.పి.ఎ ప్రభుత్వం 93వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా కేంద్రప్రభుత్వ ఉన్నత విద్యాసంస్థల్లో ఒ.బి.సి.లకు రిజర్వేషన్లు ఇవ్వడానికి కేంద్రమానవ వనరుల అభివృద్ధిశాఖ మంత్రి అర్జున్‌సింగ్ చొరవతో ప్రయత్నం జరిగింది. దీనిపైనా అగ్రకుల విద్యార్థిలోకం ముఖ్యంగా ఢిల్లీలోని ఆలిండియా మెడికల్‌సైన్సెస్ (ఎ.ఐ.ఎం.ఎస్) విద్యార్థులు ఆందోళనలకు పూనుకోవడంతో మనువాద మీడియా రోజుల తరబడి ఆ వార్తల్ని వ్యూహాత్మకంగా ప్రచారంచేసి దేశమంతా ఆందోళనలకు పురికొల్పేవిధంగా పరిస్థితిని తయారుచేశారు.

'యూత్ ఫర్ ఈక్వాలిటీ' పేరిట మండల్ ఆందోళనలనాటి ప్రతిభావాదాన్నే ముందుకుతెచ్చారు. దేశాభివృద్ధికి రిజర్వేషన్లు ఆటంక మని రకరకాల వాదాలు చేశారు. మళ్ళీ కోర్టులను ఆశ్రయించారు. చివరకు మనువాద న్యాయమూర్తులు కూడా బిసిలంటే ఎవరు? అసలు బిసిలంటే ఎంతశాతం వున్నారో ఎలా చెప్పగలం? వెనుకబాటుతనానికి ప్రాతిపదిక ఎలా నిర్ధారించాలి? అనే ప్రశ్నలను కొత్తగా సంధించి గతంలో చర్చజరిగి నిర్ధారించిన మౌలిక అంశాలపైనే గందరగోళం సృష్టించడానికి తీవ్రంగా ప్రయత్నించారు. ఈ విధంగా సుప్రీంకోర్టులో కేసు తిరిగి తిరిగి రెండేళ్ళ జాప్యం తర్వాత 10 ఏప్రిల్ 2008న ఒ.బి.సి.లకు అనుకూలంగా తీర్పు వెలువడింది. పదిహేనేళ్ళ క్రితం నాటి క్రీమీలేయర్ ప్రస్తావననే కోర్టు మళ్ళీ ఈ సందర్భంగా ముందుకు తెచ్చింది.

ఇలా అరవై ఏళ్ళ తర్వాత ఒ.బి.సి.లకు కేంద్రప్రభుత్వ ఉన్నత విద్యాసంస్థల్లో తొలిగా అమల్లోకి రాబోతుంటే పైన పేర్కొన్న విషయాలు ఏమీ తెలియని లేదా తెలిసి తప్పు తోవపట్టించే అగ్రకుల మేధావులు, వారి ఆధీనంలోని మనువాద మీడియా రిజర్వేషన్లు ఇంకెంతకాలం? ఇన్నేళ్ళ రిజర్వేషన్ల వల్ల అభివృద్ధి చెందలేని వెనుకబడినకులాలు ఇంకెప్పుడు అభివృద్ధి చెందుతాయి? అనే అంశాలపై చర్చాగోష్ఠులను నిస్సిగ్గుగా జరిపేస్తున్నాయి. అశేష ప్రజలకు తప్పుడు సమాచారాన్ని ఇచ్చి ప్రజల్లో భావోద్వేగాలు రెచ్చగొట్టడానికి కుట్రచేస్తున్నాయి. పౌరసమాజాన్ని మభ్యపెట్టి అగ్రకుల పెట్టుబడిదారీ భావజాలాన్ని బలవంతంగా ఒక పథకం ప్రకారం ప్రజలపై రుద్దుతున్నాయి. ప్రభుత్వాలూ, పాలనాయంత్రాంగం, మీడియా, చివరకు కోర్టులు (అప్పుడప్పుడూ కొన్ని మినహాయింపులతో) ఒ.బి.సి.లకు వ్యతిరేకంగా అరవైఏళ్ళపాటు తీరని అన్యాయం చేశాయి.

క్రీమీలేయర్ పర్యవసానాలు

ఇక క్రీమీలేయర్ అంశంపై ఒ.బి.సి.ల నుంచి వెల్లువెత్తుతున్న అసంతృప్తులను, నిరసనలను కూడా తీవ్రంగా పరిశీలించాల్సివుంది. మండల్ రిజర్వేషన్ అమలుచేయాలనే క్రమంలో 1992లో సుప్రీంకోర్టు మొదటిసారి క్రీమీలేయర్ ప్రస్తావన చేసింది. ఈ ప్రస్తావన రాజ్యాంగం నిర్దేశించిన రిజర్వేషన్ల ప్రాతిపదికకు విరుద్ధమైనదని తెలిసికూడా కోర్టు ఈ మెలిక పెట్టింది. దీంతో 1993 సెప్టెంబర్ 9న కేంద్రప్రభుత్వం వెనుకబడిన తరగతులనుంచి సంపన్న శ్రేణిని మినహాయిస్తూ జి.ఒ. జారీచేసింది. ఆ జి.ఒ. లో పేర్కొన్న విధంగా రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, హైకోర్టు, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు, ప్రస్తుత, మాజీ ఎమ్మెల్యేలు, ఉన్నత రాజ్యాంగ పదవులు నిర్వహిస్తున్నవాళ్ళు, యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్, సభ్యులు, కేంద్ర, రాష్ట్రస్థాయిలో క్లాస్1, క్లాస్2 లాంటి ఉద్యోగులు, ఐక్యరాజ్యసమితి, ప్రపంచబ్యాంకుల్లాంటి అంతర్జాతీయ సంస్థల్లో ఐదేళ్ళు తక్కువ కాకుండా పనిచేసిన వారు, సైన్యంలో కల్నల్ పైస్థాయి అధికారులు అదేవిధంగా వైమానిక, నౌకాదళ ఉద్యోగులు, పారామిలటరీబలగాల్లో ఉన్నతోద్యోగులు, వీరందరితోపాటు వార్షికాదాయం 2.5 లక్షలు ఆపైన కలిగినవారిని క్రీమీలేయర్‌లోకి తీసుకువస్తూ పైన పేర్కొన్న వారి పిల్లలకు రిజర్వేషన్‌లు వర్తించవని నాటి జి.ఒ.లో ప్రభుత్వం పేర్కొంది. ప్రస్తుతం సుప్రీంకోర్టుకూడా నాటి కొలమానాలనే తీసుకోవాలని సూచించినట్టు కనిపిస్తున్నది. (కోర్టుతీర్పు పూర్తిపాఠం ఇంకా అందుబాటులో లేదనే విషయం గమనించగలరు)

నిజానికి ఈ క్రీమీలేయర్ ప్రస్తావనను నాటి ప్రధాని పి.వి.నరసింహారావు ముందు ప్రతిపాదించింది సి.పి.ఎం నాయకుడు నంబూద్రిపాదేనని గుర్తుచేసుకోవడం ఎంతో అవసరం. తమ సామాజిక రాజకీయ ఆధిపత్యానికి ముప్పువాటిల్లకుండా ఆర్థికవాదాన్ని రక్షణ కవచంగా చేసుకున్న ఈ దేశంలోని అగ్రకుల బ్రాహ్మణీయ కమ్యూనిస్టులు పన్నిన వ్యూహంలో నుంచి పుట్టుకొచ్చిందే క్రీమీలేయర్. ఇదే అవగాహనను ఇప్పటివరకూ సి.పి.ఎం కేంద్ర నాయకులు పదేపదే ప్రస్తావిస్తున్నారు. సీతారాం ఏచూరి అనేకసార్లు క్రీమీలేయర్ ఉండాలని మాట్లాడాడు. ఇప్పుడు మాటమార్చి క్రీమీలేయర్ విషయం తిరిగి ఆలోచించాలని కూడా మాట్లాడుతున్నాడు. ఈ విషయంలో సి.పి.ఐ క్రీమీలేయర్ ఉండొద్దని స్పష్టంగా మాట్లాడుతుంటే సి.పి.ఎం మాత్రం క్రీమీలేయర్ ఉండాలంటున్నది. ఇక బిజెపి సంగతి చెప్పనక్కర్లేదు. అసలు జనతాపార్టీలో ఉండగా ఈనాటి బిజెపి నాయకులే బిసిలకు అనుకూలమైన కాకా కలేల్కర్ కమిషన్‌ను అమలు చేయకుండా అడ్డుపడ్డారు. ఇప్పుడేమో మైనార్టీ సంస్థలకు కూడా ఈ రిజర్వేషన్లు వర్తింపచేస్తేనే తాము బలపరుస్తామని మరొక మెలికపెట్టేందుకు ఈ పార్టీ నాయకులు ప్రయత్నిస్తున్నారు.

ఉన్నత విద్యాసంస్థల్లో చదువుకునే వరకూ చేరడం గ్రామీణ ప్రాంతంలో మామూలు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్నవారికి సాధ్యంకాని విషయం (ముత్యాలరాజుల్లాంటి వారు ఐ.ఎ.ఎస్ టాపర్ కావడం అరుదైన విషయం దీన్ని సాధారణీకరించలేం) ఐ.ఐ.టి, ఐఐఎం, ఎయిమ్స్, ఐఎఎస్, ఐపిఎస్‌ల్లాంటి కోర్సులను సాధించడానికి అవసరమయ్యే తర్ఫీదు, ఆర్థికస్తోమత మామూలు ఒ.బి.సి.లకు అసాధ్యం. మరి ఈ కోర్సుల్లో ఎవరికి అవకాశం దక్కుతుందంటే ఇప్పటికే ఒకతరమో లేక రెండుతరాలో విద్యా, ఉద్యోగరంగాల్లో అవకాశాలు పొందిన వారి పిల్లలు విద్యాధిక కుటుంబం నేపథ్యంలో పెరగడంతోపాటు మరింత శిక్షణ తీసుకోగలగడం ద్వారా మాత్రమే ఉన్నత విద్యాసంస్థల్లో అవకాశాలు పొందే అవకాశం ఉంటుంది. అదికూడా రిజర్వేషన్లు

ఉంటేనే, లేదంటే నూటికి ఒకరో ఇద్దరో మాత్రమే ఈ స్థాయికి వస్తారు. వాస్తవం ఇదికాగా కొద్దిపాటి ఆర్థిక స్తోమత, ఉన్నతోద్యోగం కలిగిన ఒ.బి.సి.లను ఈ రిజర్వేషన్ల అవకాశాల నుండి తొలగిస్తే జరిగే వాస్తవం ఏమంటే సామాన్య ఒ.బి.సి.ల పిల్లలు ఆ స్థాయికి రాలేరు. అవకాశాలు పొందగలిగిన స్తోమత ఉన్నవారు అనర్హులుగా చేయడంతో ఒ.బి.సి.ల కోసం కేటాయించిన రిజర్వేషన్ సీట్లు ఖాళీగా మిగిలిపోతాయి. ఖాళీలు భర్తీ చేసేపేరిటి వాటిని మళ్ళీ అభివృద్ధి చెందిన అగ్రకులాలకే కట్టబెట్టడానికి అవకాశం వుంటుంది.

సుప్రీంకోర్టు న్యాయమూర్తులు అరిజిత్ పసాయత్, సి.కె.థక్కర్‌లు తమ తీర్పుల్లో ఒ.బి.సి.లతో సీట్లు భర్తీకాని పక్షంలో జనరల్ అభ్యర్థుల చేత భర్తీచేయాలని చెబుతూ ఒ.బి.సి.లకు విద్యాపరమైన వెనుకబాటు ఉంటుంది కనుక కనీస ప్రవేశార్హత నిబంధనల్ని వీరు పొందలేరుకనుక మిగిలిపోయే సీట్లను జనరల్ (అభివృద్ధి చెందిన అగ్రకులాలకు) అభ్యర్థులకు ఇచ్చేయాలని చెప్పారు. ఒ.బి.సి. రిజర్వేషన్లను ఆమోదించాల్సి వచ్చినప్పుడేమో సాంఘిక, విద్యాపరమైన వెనుకబాటు ప్రాతిపదిక సరికాదని తమకు అనుకూలంగా ఇదే న్యాయమూర్తులు వాదనలు చేస్తారు. జనరల్ అభ్యర్థులను నింపాలనే ఎత్తుగడకు మాత్రం అదే విద్యాపరమైన వెనుకబాటును తమకు అనుకూలంగా తెచ్చుకుంటారు.

ఈ దేశంలోని న్యాయమూర్తుల చాణక్య నీతిని, మనువాద కుతర్కాన్ని అంచనా వేయడానికి ఇదే బలమైన ప్రత్యక్ష ఉదాహరణ. ఆర్థికంగా లక్షాధికారులు, కోటీశ్వరులూ అయినప్పటికీ ఒ.బి.సి.లు సామాజికంగా, విద్యాపరంగా అభివృద్ధి చెందివుండరనే సత్యాన్ని తెలిసీ తప్పుదోవ పట్టించేందుకు కోర్టులద్వారా అగ్రకుల న్యాయమూర్తులు ఎల్లవేళలా ప్రయత్నిస్తున్నారనే దానికి కూడా ఇదే తార్కాణం. ఒ.బి.సి.ల్లో మరింత వెనుకబడినవారికి అవకాశాలు దక్కాలనే ఉద్దేశంతోనే ఈ క్రీమీలేయర్ అవసరమని పైకి ఎంత ఆదర్శంగా చెప్పినా దాని లోతుల్లో మాత్రం జరిగేది ఒ.బి.సి.లకు అన్యాయమే. ఇందుకు ఎస్.సి, ఎస్.టిలకు, బిసిలకు గత అరవై ఏళ్ళుగా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసిన రిజర్వేషన్ల చరిత్రే పెద్ద ఉదాహరణ.

కేంద్రసిబ్బంది, పింఛన్లశాఖ 2006-07 గణాంకాల ప్రకారం కలెక్టర్, ఆపైస్థాయి ఉద్యోగాల్లో ఒ.బి.సి.లు 4.7 శాతం, డిప్యూటీ కలెక్టర్‌స్థాయిలో 2.3 శాతం, మరింత దిగువశ్రేణి ఉద్యోగాల్లో 5.9 శాతం, ఇక కేటగిరి డిలో 6.9 శాతం ఉన్నట్లు తెలుస్తోంది. ఒ.బి.సి. అవకాశాల పరిస్థితిని అర్థం చేసుకోవడానికి ఈ గణాంకాలొక ఉదాహరణ.

మరో కోణంలో క్రీమీలేయర్‌లో దాగిన మర్మాన్ని విశ్లేషించు కోవాలి. ఒ.బి.సి.ల్లో రిజర్వేషన్ల అర్హత సాంఘిక, విద్యాపరమైన వెనుక బాటుతనంతో పాటు ఈ క్రీమీలేయర్ ద్వారా ఆర్థిక అంశం కూడా పరిగణనలోకి వస్తుంది. కనుక ఆర్థికంగా పేదలయిన అందరికీ రిజర్వేషన్లు అమలు చేయాలనే డిమాండ్‌కు దీన్నే సాధనంగా చేసుకోవటానికి ఆస్కారం ఏర్పడుతుంది. మామూలుగా చూస్తే క్రీమీలేయర్ వెనకాల ఇంత వ్యూహం వుంటుందా అని అనిపిస్తుంది. కానీ కేవలం కుతర్కాలతో దశాబ్దాలుగా విద్య, ఉద్యోగ రంగాల్లో అణచబడిన కులాల అభివృద్ధిని అణచివేస్తూ దోపిడీ చేస్తున్న అగ్రకులాధిపత్య శక్తులకు ఈ విషయంలో స్పష్టత లేదని భావించలేం. ఇప్పటికే రిజర్వేషన్లు ఇస్తే అందరికీ ఆర్థిక ప్రాతిపదికన ఇవ్వాలని ఆందోళనలు చేస్తున్నారు. తాజాగా ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి మాయావతి కూడా ఈ వాదనను బలపరుస్తూ రాజ్యాంగ సవరణ చేయాలని కేంద్రానికి లేఖల మీద లేఖలు రాస్తున్నది. రిజర్వేషన్లకు రాజ్యాంగం ఆర్థిక అంశాన్ని ప్రాతిపదిక చేసుకోలేదని తెలిసిన మాయావతి కూడా సర్వజనవాదంతో అధికారంలోకి వచ్చిన తర్వాత ఈవిధంగా మాట్లాడుతుంటే ఇక అగ్రకుల రాజకీయనేతలకు మార్గం మరింత సుగమం అయిపోయింది.

కులవ్యవస్థ కారణంగా చారిత్రకంగా సామాజికంగా, విద్యా విషయంగా వెనుకబడిన వారికి మాత్రమే రిజర్వేషన్లు కల్పించడంద్వారా ఈ కులాల ప్రాతినిధ్యం తగినంతగా అందివ్వాలని ఆశించిన రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకంగా అందరికీ రిజర్వేషన్లు అనే అంశాన్ని ప్రధానం చేయడానికి ఆర్థిక ప్రాతిపదికను తెరపైకి వ్యూహాత్మకంగా తీసుకొస్తు న్నారు. దీన్ని ఇంతకాలం సమర్థవంతంగా తిప్పికొట్టిన దళిత బహుజన మేధావులు మాయావతి ప్రకటనలతో తటపటాయించే దుస్థితి వచ్చింది. పేదరికాన్ని పోగొట్టడానికి ప్రభుత్వాలు అనేక చర్యలు చేపట్టవచ్చు కానీ రిజర్వేషన్లే వారి పేదరికాన్ని పోగొట్టడానికి సర్వస్వమని భావించడానికి వీలుగా పాలక ప్రభుత్వాలు ప్రజల్ని మభ్యపెడుతున్నాయి. అగ్రకులాల్లో ఉన్న కొద్దిశాతం పేదల్ని అభివృద్ధి చేయడానికి ప్రభుత్వాలు ఎన్ని సంక్షేమ పథకాల్నయినా ప్రవేశపెట్టవచ్చు కానీ అలాచేయకుండా రిజర్వేషన్ పరిధిలోకి వారిని తేవాలని చూడటంలోనే పెద్ద మోసం దాగివుంది. అణగారిన కులాల రిజర్వేషన్లను బలహీనపరిచే వ్యూహం వుంది.

సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు అనుగుణంగా దఫదఫాలుగా ఒ.బి.సి. రిజర్వేషన్లు అమలు చేయడానికి ప్రయత్నిస్తామని ప్రభుత్వం చెబుతున్నది. ఇదికూడా సరైన విధానం కాదు. అరవై ఏళ్ళుగా ఉన్నత విద్యాసంస్థల్లో రిజర్వేషన్లు పొందని ఒ.బి.సి.లకు 27 శాతం అన్ని ప్రభుత్వ విద్యాలయాల్లో పూర్తిశాతం అమలుకు వెంటనే చర్యలు తీసుకోవాలి. వందసీట్లు వున్న సంస్థల్లో 154 వరకూ సీట్లు పెంచుతామని ఎఫ్.సి అభ్యర్థులు ఆందోళన పడాల్సిన పనిలేదని కూడా మరోవైపు ప్రభుత్వం ప్రకటిస్తూ అగ్రకులాలను బుజ్జగించే పనికి పూనుకుంటున్నది. పెరిగినశాతంలోకూడా కోటా అమలుచేయాలని అది రాజ్యాంగబద్ధమని ఒ.బి.సి.లు, ఎస్.సి., ఎస్.టి.లు డిమాండ్ చేయాలి. అన్నిటికన్నా వెంటనే కేంద్ర కేబినెట్ క్రీమీలేయర్‌ను అమలుచేయకుండా వెనుక్కు తీసుకోవాలని ఉద్యమించాల్సి ఉంది.

చట్టసభల్లో- న్యాయస్థానాల్లో - ప్రైవేటు రంగంలో

పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో ప్రజలే అంతిమ నిర్ణేతలని రాజ్యాంగం ఎంతగా దార్శనికతను చెప్పినా సమాజంలో సగభాగానికి పైగా వున్న వెనుకబడిన కులాలకు తగిన రాజకీయ ప్రాతినిధ్యం లేకుండానే అరవై ఏళ్ళ స్వాతంత్ర పాలన సాగిపోయింది. ఎస్.సి., ఎస్.టి.లకు రాజకీయంగా రిజర్వేషన్లు రాజ్యాంగబద్ధం చేయడంతో వారి ప్రాతినిధ్యాన్ని ఎన్ని పార్టీలు పుట్టినా అనివార్యంగా అమలు చేయాల్సి వస్తోంది. పూనా ఒప్పందం ద్వారా ఎస్.సి., ఎస్.టి.లకు స్వేచ్ఛ, సాధికారత కలిగిన రిజర్వేషన్లు కాకుండా నామమాత్రపు రాజకీయ

రిజర్వేషన్లు దక్కాయనేది వేరేచర్చ. అయితే ఎస్.సి., ఎస్.టి.ల మాదిరి బి.సి.లకు చట్టసభల్లో రిజర్వేషన్లు లేకపోవడంతో వారి రాజకీయ ప్రాతినిధ్య అంశం పూర్తిగా అగ్రకులాధిపత్య రాజకీయపార్టీల దయాదాక్షిణ్యాలమీద ఆధారపడింది. ఫలితంగా చట్టసభల్లో ఒ.బి.సి.లకు న్యాయంగా దక్కాల్సిన సీట్లను వారికి ఇవ్వకుండా అగ్రకులశక్తులే యథేచ్ఛగా అనుభవిస్తున్నాయి. ఉదాహరణకు ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో 294 సీట్లకుగాను బి.సి.లకు జనాభా దామాషా ప్రకారం 150 సీట్లు దక్కాల్సివుంది. కానీ గత అరవైఏళ్లలో 40-50 సీట్లకంటే ఎక్కువ దక్కలేదు. దీంతో బి.సి.లు చట్టసభల్లో తమకు జనాభా దామాషా ప్రకారం రాజకీయ రిజర్వేషన్లు ఇచ్చేవిధంగా రాజ్యాంగ సవరణ చేయాలని డిమాండ్‌చేస్తున్నారు.

బి.సి.లకు జనాభా దామాషా రాజకీయ ప్రాతినిధ్యం లేకపోతే పార్లమెంటరీ ప్రజాస్వామ్యం అగ్రకుల నియంతృత్వ స్వామ్యంగానే మిగిలిపోతుంది. ఇదే విధంగా పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ బిల్లులో కూడా వాటాలో కోటా ఇవ్వాల్సిందేనని ఒ.బి.సి.లు చేస్తున్న ఆందోళనల్లో కూడా సామాజికన్యాయం వుంది. కోటా లేకుండా మహిళా బిల్లు కనుక ఆమోదం పొందితే మళ్ళీ అగ్రకులాల మహిళలే చట్టసభల్లో పాగావేసే వీలుందని వేరే చెప్పనక్కరలేదు. ఇక్కడొక విషయాన్ని చెప్పుకోవాలి. తమ కుల జనాభా దామాషా ప్రకారం ప్రాతినిధ్యాన్ని డిమాండ్ చేస్తున్న వారిని కులతత్వ వాదులుగా అగ్రకుల మీడియా, వారి మేధావులు ప్రచారం చేస్తూవున్నారు. అగ్రకులాధిపత్యాన్ని యథేచ్ఛగా అనుభవిస్తున్న వారిని మాత్రం ఆదర్శంగా చిత్రీకరిస్తున్నారు. మహిళా బిల్లును అడ్డుకుంటున్న వారిగా ములాయం, లాలూలను చిత్రీకరిస్తుండటం మనం చూస్తున్నదే. స్థానిక సంస్థల్లో బి.సి.లకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు రాజకీయ రిజర్వేషన్లు కొంతశాతం అమలుచేస్తున్నా వారికి తగిన రీతిలో విధులు, నిధులు లేకుండా చేసి వాటిని పథకం ప్రకారం బలహీన పరస్తున్నారు. ఇక న్యాయవ్యవస్థలో కూడా బి.సి.లకు తీరని అన్యాయం జరుగుతోంది. అరవై ఏళ్ళ చరిత్రలో ఒక్క సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి కూడా ఒ.బి.సి.లనుంచి కాలేదు. ఇటీవలనే మొట్టమొదటిసారి దళితుడయిన కె.జి.బాలకృష్ణన్ ఆ పదవిలోకి వచ్చాడు. ఈయన నేతృత్వంలోనే ఒ.బి.సి.ల రిజర్వేషన్లకు అనుకూలంగా తీర్పురావడం కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి వుంది. కనుకనే న్యాయస్థానాల్లో కూడా ఎస్.సి., ఎస్.టి., బి.సి.లకు రిజర్వేషన్లు అమలు చేయాలనే డిమాండ్ న్యాయవ్యవస్థలో సామాజికన్యాయం కోసం చేస్తున్నదే.

ఇవాళ ప్రభుత్వ రంగం మొత్తం పథకం ప్రకారం కుదించివేస్తూ ప్రైవేటుపరం చేస్తుండటంతో అట్టడుగుకులాల అభివృద్ధికి ఉన్న ఒకే ఒక ఆసరా అయిన రిజర్వేషన్లు ఆచరణలో అమలుకాకుండా పోతున్నాయి. కనుకనే ప్రవేటురంగంలోకూడా ఎస్.సి., ఎస్.టి., బి.సి. మైనార్టీలకు రిజర్వేషన్లు అమలు చేయాలనే డిమాండ్ ముందుకొచ్చింది. ప్రభుత్వ సహకారంతో సాగే ప్రైవేట్‌రంగంలో రిజర్వేషన్లు అమలు చేయకపోతే రాజ్యాంగపరంగా, చట్టపరంగా కోర్టుల్లో ఇంతగా కొట్లాడి సాధించుకున్న రిజర్వేషన్లు కాగితాలకే పరిమితమయిపోయాయి. వ్యక్తిగత ఆస్తి రాజ్యాంగబద్ధం చేశారు కనుక ప్రైవేట్‌రంగంలో రిజర్వేషన్లు అమలు చేయడం కూడా వ్యక్తిగతస్వేచ్ఛకు భంగం కలిగించినట్టేనని పారిశ్రామిక వేత్తలు వాదిస్తున్నారు. నిజానికి ప్రభుత్వ బ్యాంకులనుంచి రుణాలు తీసుకోని ప్రైవేట్ పరిశ్రమలు లేవు. ఉన్నా అవి చాలాతక్కువ. 2004 ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్‌పార్టీ ప్రైవేట్‌రంగంలో రిజర్వేషన్ల హామీని ప్రకటించినా దాన్ని అమలు చేయడానికి సాహసించలేకపోతోంది. దీనికి కారణం ప్రైవేట్‌రంగ యాజమాన్యం తాము రిజ్వేషన్లను అమలు చేసేది లేదని భీష్మించడమే. ఈ నేపథ్యంలోనే ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ ముంబాయిలో పారిశ్రామిక వేత్తల సమావేశం పెట్టి అట్టడుగు కులాల పట్ల దయ చూపాలని వేడుకున్నాడు.

కమ్యూనిస్టుల వైఖరి

రిజర్వేషన్ల ప్రస్తావన దేశంలో వస్తున్న ప్రతిసందర్భంలోనూ ఈ దేశసామాజిక వ్యవస్థపై తీవ్ర చర్చ జరుగుతూనే ఉంది. అయితే ఈ సామాజిక వ్యవస్థను విప్లవాత్మకంగా మార్చుకోవాలని సందేశాలు ఇస్తూ కిందా మీదాపడుతున్న కమ్యూనిస్టు వామపక్ష, విప్లవపక్ష శక్తులు మాత్రం అట్టడుగుకులాల ఆకాంక్షలకు అనుగుణంగా వాన్‌గార్డ్‌పాత్రను పోషించ లేకపోవడం నిజంగా చారిత్రక విషాదమే. చరిత్రను జరుగుతున్నప్పుడు కాక జరిగిపోయిన తర్వాత విశ్లేషించుకునే దుస్థితి, లేదంటే జరుగుతున్న ఉద్యమానికి ఆవలవుండి కేవలం బలపరచే వైఖరిని అవలంబించడమనే స్థితి రావడం నిమగ్నతలేని దానికి నిదర్శనమేకాని మరోటికాదు.

ఈ దేశ సామాజిక వ్యవస్థను అర్థం చేసుకోవడంలో దేశీయమైన సిద్ధాంతాన్ని, కార్యాచరణను రూపొందించుకోవడంలో ఇప్పటికీ ఈ దేశ కమ్యూనిస్టులు వెనకబడేవున్నారని ఇప్పటి రిజర్వేషన్ల సందర్భంకూడా మరోసారి రుజువుచేస్తున్నది. సామాజిక న్యాయంలో భాగంగా చూసినా, సోషలిస్టు న్యాయం క్రమంలో భాగంగా చూసినా అణగారిన కులాలు వారిభాషలో పేదల విముక్తికి పూర్తి సాధనాలు కాదనే విషయంలో రిజర్వేషన్లకు పరిమితి వుండవచ్చునేమో కానీ, రిజర్వేషన్ల సందర్భంగా జరుగుతున్న చర్చను పాలకవర్గాలు, వారి అనుకూల వ్యవస్థలు స్పందిస్తున్న తీరును సరిగా అర్థం చేసుకుంటే మాత్రం ఇక్కడి సామాజిక, ఆర్థిక, రాజకీయ వ్యవస్థను అర్థం చేసుకోవడంలో ఎటువంటి పరిమితి ఏర్పడదు. అట్టడుగు కులాలు రిజర్వేషన్ల కోసం, జనాభా దామాషా ప్రాతినిధ్యం కోసం చేస్తున్న పోరాటాలు ఈదేశ సామాజిక ప్రజాస్వామికీకరణలో భాగమేనని స్పష్టంగా అర్థమవుతున్నది. కనుక రిజర్వేషన్ల పోరాటాన్ని చులకనగా చూడటంలోని కమ్యూనిస్టుల సిద్ధాంత, ఆచరణ దారిద్ర్యాన్ని ఎంత తొందరగా వదిలించుకుంటే అంతమంచిది.

బి.సి. ఉద్యమకారుల కర్తవ్యం

గత అరవై ఏళ్ళుగా అగ్రకులాధిపత్య ప్రభుత్వాల అణచివేతకు, దోపిడీకి గురవుతున్న బిసిలు తమదైన చరిత్రను, సంస్కృతిని, సామాజికన్యాయ ఉద్యమ వారసత్వాన్ని అర్థం చేసుకుని అగ్రకులాధి పత్యానికి వ్యతిరేకంగా ఇతర పీడిత కులాలతో కలిసి స్వతంత్ర ప్రత్యామ్నాయ రాజకీయ ఉద్యమాన్ని నిర్మించుకోకపోతే దగాపడుతున్న చరిత్రే మళ్ళీమళ్ళీ పునరావృతమవుతుంది. మహాత్మాఫులే, పెరియార్, అంబేద్కర్‌ల సిద్ధాంత భూమికతో ఈ దేశంలోని బి.సి.లు ఎస్.సి., ఎస్.టి., మైనార్టీలతో, ఇతర పేదవర్గాలతో కలిసి ఆత్మగౌరవం, సామాజిక న్యాయం, రాజ్యాధికారం, కులనిర్మూలనకోసం ఉద్యమించడమే కర్తవ్యం కావాలి. ◆

రాజకీయ హామీలకు విశ్వసనీయత లేదనడం ఎంత సత్యమో, ఉత్తుత్తి చట్టబద్ధమైన కమిటీలతోనూ, పెద్ద మనుషుల ఒప్పందాలతోనూ అభివృద్ధి సాధ్యం కాదనడం అంతే సత్యం అని అంటున్నారు మాడభూషి శ్రీధర్

తెలంగాణ : అభివృద్ధి మంత్రం - కమిటీ తంత్రం

"తెలంగాణ ఆర్థికంగా సాంస్కృతికంగా వెనుకబడి ఉందన్న విషయం మాకు తెలియంది కాదు. విశాలాంధ్ర ప్రభుత్వం తెలంగాణకు న్యాయపరమయిన రక్షణలు కల్పించడంలో పాలనా రంగంలో ఇవ్వదగిన కోటా ఇవ్వడంలో వెనుకంజ వేయదు. ఉమ్మడి సంపదను సృష్టించి సహకార సమన్వయాలతో ఈ ప్రాంతాన్ని అభ్యుదయ ఆర్థిక ప్రగతి వేదికగా మార్చివేస్తాం."

ఈ మాట ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి ప్రసంగపాఠం వలె కన్పిస్తున్నది కదూ. కాని కాదు. అరశతాబ్దం కిందట అంటే 1950లో ఆంధ్ర కాంగ్రెస్ కమిటీ ఎగ్జిక్యూటివ్ చేసిన వాగ్దానం.

"తెలంగాణను అభివృద్ధి చేయడానికి కుట్టుబడి ఉన్నాం. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సెంటిమెంట్‌ను మా అభివృద్ధి కమిట్‌మెంట్ తో ఎదుర్కొంటాం. అన్ని విధాలా ఈ వెనుకబడిన ప్రాంతాన్ని అభివృద్ధి చేయడమే మాలక్ష్యం" ఇది 2008లో కాంగ్రెస్ ముఖ్యమంత్రి మాట.

కాంగ్రెస్ ప్రముఖులు చేసిన ఈ రెండు ప్రకటనల మధ్య ఎన్నో ఉద్యమాలు, ఎన్నెన్నో ప్రభుత్వాలు, ఎన్నో అన్యాయాలు ఎన్నో కమిషన్లు నడిచిపోయాయి. అరశతాబ్దం గడిచిపోయింది. తెలంగాణ అభివృద్ధి ఉత్త మాటలేననడానికి సాక్ష్యం ఈ రెండు ప్రకటనలే.

ఫజల్‌అలీ అధ్యక్షతన ఏర్పాటయిన రాష్ట్రాల పునర్విభజన కమిషన్ తెలంగాణను ఆంధ్రను కలిపి ఒక సమగ్ర రాష్ట్రం చేయరాదని, తెలంగాణ, ఆంధ్ర ప్రజల ప్రయోజనాల దృష్ట్యా ఆ రెంటినీ ఇప్పటికి విడిగానే ఉంచి, 1961 జనరల్ ఎన్నికల తరువాత ఇరు రాష్ట్రాల శాసనసభలు మూడింట రెండు వంతుల మెజారిటీతో విలీనాన్ని సమర్థిస్తూ తీర్మానిస్తే అప్పుడు ఒక రాష్ట్రంగా విలీనం కావచ్చునని 386వ పేరాగ్రాఫ్‌లో స్పష్టంగా పేర్కొన్నప్పటికీ ఢిల్లీ కాంగ్రెస్ సుల్తాన్‌లు విశాలాంధ్ర ఏర్పాటు చేశారు.

విద్యారంగంలో వెనుకబడిన తెలంగాణ ప్రజలు తమ ప్రాంతం ఆంధ్రతో కలిస్తే ఉద్యోగ అవకాశాలన్నీ వారే తీసుకుంటారనే ఆందోళనతో సమగ్ర రాష్ట్రాన్ని వ్యతిరేకిస్తున్నారని కూడా ఫజల్‌అలీ కమిషన్ గుర్తించింది. అప్పుడు ఆంధ్ర శాసనసభలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలంగాణకు ఆ భయాలు అవసరం లేదని, వారికి తగిన రక్షణలు, చట్టబద్ధమయిన మినహాయింపులు చేస్తామని హామీ ఇచ్చారు. స్థానికులకు రిజర్వేషన్లు, ఉద్యోగాల్లో వాటాలు ఉంటాయని కూడా వాగ్దానాలు చేసారు.

తెలంగాణ స్టాండింగ్ కమిటీ

ఈ రక్షణలను వివరించే పెద్దమనుషుల ఒప్పందం పైన సంతకాలు చేసారు కాంగ్రెస్ పెద్దలు. మంత్రులతో రాష్ట్ర శాసనసభలోని సభ్యులతో తెలంగాణ ప్రగతి కోసం ప్రాంతీయ స్టాండింగ్ కమిటీ ఏర్పాటు చేయాలని, ఇందులో ముఖ్యమంత్రి తప్ప ఇతర తెలంగాణ ప్రాంత మంత్రులు ఉండాలన్నది పెద్దమనుషుల ఒప్పందంలో ఒక ముఖ్యమయిన అంశం. తెలంగాణ ప్రాంత ప్రయోజనాలను ప్రభావితం చేసే చట్టాలు, సాధారణ పాలనా విధానాలు ఈ కమిటీకి పంపి, వారి అభిప్రాయాలను సూచనలు స్వీకరించి నిర్ణయాలు తీసుకోవాలని ఆ ఒప్పందంలో పేర్కొన్నారు. ఇది బహుశా అభివృద్ధికి సంబంధించి కాంగ్రెస్ ప్రభుత్వం వేసిన కమిటీ. శాసనసభ్యులతో మంత్రులతో ఏర్పాటయిన ప్రాంతీయ కమిటీ. ఒకవేళ ఈ సిఫార్సులను ప్రభుత్వం వ్యతిరేకిస్తే గవర్నర్‌కు పంపాలనీ, గవర్నర్ నిర్ణయమే తుదినిర్ణయం అవుతుందని రాసుకున్నారు. ఏయే అంశాలు ఈ కమిటీ పరిశీలించాలో కూడా జాబితా రాసారు. చట్టబద్ధమయిన కమిటీ అని దీన్ని పిలువకపోయినా శాసనసభ్యులతో మంత్రులతో ఏర్పాటయిన ఈ స్టాండింగ్ కమిటీకి శాసనసభాసంఘానికి ఉన్నంత స్వతంత్ర ప్రతిపత్తి, అధికారం ఉంది. కాని ఈ కమిటీకి పనిచేసే అవకాశం లేని వ్యూహాత్మక రాజకీయాలు నడిచాయి.

విశాలాంధ్ర ఏర్పడిన తొలినాళ్లలోనే స్థానిక ఉద్యోగుల రక్షణలను నీరుకార్చే నిబంధనలు చేర్చడంతో పెద్దమనుషుల ఒప్పందం ఉల్లంఘన ఆరంభమైంది. రక్షణలు కోటాలు అమలు చేయకతప్పని రాజకీయ ఒత్తిడి రావడంతో రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించి కొన్ని సంవత్సరాల పాటు లిటిగేషన్ పేరుతో అమలును అడ్డుకున్నాయి. రాష్ట్ర హైకోర్టులో స్థానిక ఉద్యోగులకు రక్షణ, న్యాయమైన కోటా నియమాలు రాజ్యాంగ విరుద్ధం అని ఒక తీర్పు ఇవ్వడం పెద్ద దెబ్బ. దీనిమీద అప్పీలు విన్న సుప్రీంకోర్టు ,హైకోర్టు తీర్పు అన్యాయమయిందని, స్థానికులకు రక్షణలు కల్పించడం రాజ్యాంగ బద్ధమే అని తీర్పు ఇవ్వడం ఊరట కలిగించింది. ఈ మధ్య కాలంలోనే తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసినా రాజకీయ వ్యూహాలకు బలైపోయింది. సుప్రీంకోర్టు తీర్పు ఉద్యమ డిమాండ్లకు ఊతం ఇవ్వడంతో దాన్ని ప్రతిఘటించడానికి మరో ఉద్యమం బయలుదేరింది.

ఆరు పాలనా సూత్రాల రాష్ట్రపతి ఉత్తర్వు

రెండు ఉద్యమాలకు సంధిగా కేంద్రంలో ఉన్న కాంగ్రెస్ అధిష్ఠాన దేవుళ్లు ఆరు సూత్రాల పథకం రూపొందించారు. ఇందులో ఉద్యోగుల రక్షణలతోపాటు, తెలంగాణ అభివృద్ధికి నిష్పత్తి ప్రకారం నిధుల కేటాయింపు వంటి అంశాలున్నాయి. తెలంగాణ ప్రాంతీయ మండలి ఏర్పాటు వంటి నియమాలు ఉన్నాయి. ఇది రాష్ట్రపతి ఉత్తర్వుల ద్వారా రూపొందింది. ఈ సూత్రాలకు అనుగుణంగా ఉద్యోగ నియామకాలు , బదిలీలు జరగాల్సి ఉంది. ఇవి రాష్ట్రపతి ఉత్తర్వులు కనుక జి.ఒ.ల ద్వారా రాష్ట్రం దీన్ని మార్చడానికి వీల్లేదు. వీటిని అమలు చేయకతప్పని పరిస్థితి ఉంది. అయినా ఆ రాష్ట్రపతి ఉత్తర్వులను కేవలం జీవోల ద్వారా ఆఫీస్ ఆర్డర్ల ద్వారా లక్షల సార్లు ఉల్లఘించి పూర్తిగా నీరు గార్చారు. ఆ ఉద్యోగ కోటా నియమాల చరిత్ర సాగి 610 జి.ఒ. దాకా వచ్చి అది కూడా అమలు చేయడానికి వీల్లేనంతగా సంక్లిష్టంగా మారిపోయింది.

తెలంగాణ ప్రాంతీయమండలిని నామకార్థం ఏర్పాటుచేసారు. అప్పట్లో టి. హయగ్రీవాచారి దీనికి అధ్యక్షుడుగా ఉండేవారు. దీనికి క్యాబినెట్ హోదాతో సమానమయిన హోదా ఉందని అన్నారు. ఒక కారు, ఫోన్, నివాసం, పి ఎ. అంతే. ఇచ్చిన నిధులు లేవు, చలాయించ గల అధికారాలు లేవు. ఈ మండలి చెపితే వినే బాధ్యత ఎవరిమీదా లేదు. ఆరుసూత్రాల పథకం అమలు పేరుతో ఏర్పాటయిన ఈ కమిటీ పదవీ కాలం ముగిసిన తరువాత మళ్లీ ఎవరినైనా నియమించాలన్న ధ్యాస కూడా ఎవరికీ లేదు. కాంగ్రెస్ ఈ ఆరు సూత్రాలను మరిచిపోయింది. అధిష్ఠానం కనుసన్నల్లో మెలిగి పదవులు సాధించే కృషిలో పడిపోయిన తెలంగాణ నాయకులు వాటి అమలు అడగకపోవడమే మంచిదనుకున్నారు. ప్రాంతీయ అభివృద్ధి మండలి లేదు. ఉన్నా వేయరు. వేసినా పనిచేయదు. పనిచేసినా వినేవారు లేరు. నిధులు, విధులులేని నిరర్థకమయిన మండలి అది.

ఇటువంటి కాంగ్రెస్ కుతంత్రాల మధ్య తెలంగాణ అభివృద్ధి అసాధ్యమని ధూం ధాం చేసే ఉద్యమాలు ఉద్భవిస్తే తప్ప, సొంత రాష్ట్రం ఉంటే తప్ప సొంత గొంతుక వినబడదని అర్థమయి ప్రత్యేక రాష్ట్రం డిమాండ్ తలెత్తగానే కాంగ్రెస్‌కు కొన్ని నినాదాలు, విధానాలు గుర్తుకు వస్తాయి. ఒకటి మరో ఎస్సార్సీ వేస్తాం. రెండోది తెలంగాణ అభివృద్ధికి ఒక సంఘం లేదా ఒక మండలి లేదా ఒక కమిషన్, (ఇప్పుడైతే ఒక చట్టబద్ధమైన సంస్థ) వేస్తాం అనడం.

రెండో ఎస్సార్సీ వేయడానికి అన్ని హంగులు సిద్ధం చేసుకున్నా, సీనియర్ తెలంగాణ నేతలతోసహా పలురంగాలనుంచి వ్యతిరేకత రావడంతో ఆ పని మానుకున్నారు. తరువాత తెలంగాణ ప్రాంతీయ అభివృద్ధి కమిటీ ఏర్పాటు చేసి ఉప్పునూతుల పురుషోత్తమరెడ్డిని స్వీకరించమన్నారు. నిధులు విధులు లేని ఈ ఆకారపుష్టి నైవేద్యనష్టి నాకెందుకని బాహాటంగానే ఆయన విమర్శించినా ఆయన్ను బతిమాలి కూచోబెట్టారు.

ఈ రెండు విధానాలతోపాటు కొన్ని మాటల వ్యూహాలు, తెరవెనుక వ్యవహారాలు నడుస్తున్నాయి. సగంకన్న ఒక ఓటు ఎక్కువ ఉంటే చాలు ప్రభుత్వాలు ఏర్పడడానికి, బిల్లులు పాస్ కావడానికి కాని, తెలంగాణకు మాత్రం అందరూ ఒప్పుకోవాలన్న అసాధ్యపు మాటల వ్యూహం ముందు పెడుతుంది. ప్రజా ఉద్యమాల్ని ఎదుర్కొనడానికి కాంగ్రెస్ వాడే పాచికలు మరికొన్ని ఉన్నాయి. అది నాయకులను కొనడం, పార్టీలను చీల్చడం, ఉద్యమాలను నాన్చడం. కాంగ్రెస్ ఢిల్లీ సుల్తాన్‌లు, సామంతుల తాబేదార్ల అండదండలతో శివసేన, జె.ఎం.ఎం., తెలుగుదేశం పార్టీతో సహా ఏపార్టీని చీల్చకుండా వదిలిపెట్టలేదు. వారి వ్యూహాలకు ఇద్దరు సభ్యులున్న పార్టీ అయినా చీలిపోవలసిందే. ఒక దశలో తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీని కూడా రెండు ముక్కలు చేసారు. తెలంగాణ ప్రజాసమితిని దాని అధ్యక్షుడు చెన్నారెడ్డి, కార్యవర్గ నాయకులతో సహా ఇందిరాగాంధీ కొని మూలన పడేసారు. ఇప్పుడు టి.ఆర్.ఎస్‌ను కూడా పదవులతో, సంకీర్ణపు అధికార ఆశలతో, నిధులతో, పథకాలతో మరెన్నో పరోక్ష హామీలతో ఒక్కొక్కరిని, ఒక్కొక్క జిల్లావారిని, ఒక్కొక్క కులంవారిని ఏదో ఒక ఆయుధంతో, నినాదంతో దెబ్బతీసి ప్రలోభపెట్టి తమవైపుకు మరల్చుకున్నారు. చీల్చడం, విభేదాలు సృష్టించడం, టివి మీడియా వచ్చిన తరువాత కెమెరా ముందు తిట్టించే వ్యూహాలు, కొట్టించే పథకాలు కూడా ఎక్కువైనాయి. ఇదంతా కాంగ్రెస్ అధిష్ఠానానికి వెన్నతోపెట్టిన విద్య. ఇక పంచనచేరిన తరువాత ఆ నేతల బతుకు దారుణం. కనీసం అప్పాయింట్‌మెంట్ కూడా ఇవ్వకుండా అవమానించడం వారి నైపుణ్యం. ఎంతోపెద్ద ఆందోళనకుదిగితే తప్ప అరగంట టైం కూడా ఇవ్వకపోవడమనే ఇందిర, రాజీవ్‌ల ఎత్తుగడను సోనియా కూడా నేర్చుకున్నారు. ఘోరతపస్సు చేసి వరాలు పొందితే ఆ తరువాత ఇంద్రపదవిని ఆశిస్తారనే భయంతో ఇంద్రుడు తపస్సును భంగపరిచే వాడని, రంభ, ఊర్వశులను రంగంలోకి దించి భ్రష్టు పట్టిస్తారని పురాణాల కథలు చదివాం. రాజకీయ పదవులకోసం ఇప్పుడూ ఇవే మంత్రాలు వేస్తున్నారని, తంత్రాలు నడుస్తున్నాయని వేరే చెప్పనవసరం లేదు.

చట్టబద్ధమైన అభివృద్ధి

అటానమీతో కూడిన ఒక మండలి అని చెప్పడం దానికి ఉద్యమ నాయకుడిని చైర్మన్ చేయడం తరువాత ఆయన్ను భ్రష్టుపట్టించి ఉద్యమాన్ని చంపడం మరొక సమాంతర రాజకీయం. దీనికి గూర్ఖాలాండ్ మండలి తాజా ఉదాహరణ అయితే, తెలంగాణ ప్రజాసమితి చెన్నారెడ్డి 1970ల నాటి ఉదాహరణ.

ఇప్పుడు సర్కారు ముందున్న తీవ్ర సమస్య తెలంగాణ. కాంగ్రెస్‌తో సహా ప్రతిపార్టీ అట్టుడికిపోతున్నది ఈ సమస్యతోనే. కాంగ్రెస్ వంటి అతి ప్రాచీన పార్టీ, ఇప్పుడే పెట్టిన పార్టీ, ఇంకా పెట్టని పార్టీ, ముందుందు పెట్టబోయే పార్టీ, ఇన్నాళ్లూ తెలంగాణను వ్యతిరేకించినపార్టీ మొదలైనవన్నీ జై తెలంగాణ అందామా లేక నో తెలంగాణ అందామా అని ఆలోచించక తప్పని పరిస్థితి వచ్చింది. సరిగ్గా ఈ దశలో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికోసం ఒక చట్టబద్ధమైన కమిషన్ వేస్తామని ప్రభుత్వం భారీ ఎత్తున ప్రకటించింది. ముందుగా దినపత్రికలలో మాస్టర్ హెడ్ అంటే పత్రిక పేరుకింద ఎనిమిది కాలాల వెడల్పున "చట్టబద్ధమైన సంస్థపై చర్చకు మేం సిద్ధం. విపక్షమిత్రులారా మీరు సిద్ధమేనా" అంటూ వెనుకబాటుతనాన్ని శాశ్వతంగా నిర్మూలించేందుకే ఈ చట్టబద్ధ సంస్థ ఏర్పాటుకు శ్రీకారం చుట్టామని, ఇది చారిత్రాత్మకమయిన ఘట్టం అనీ ప్రతి తెలుగువారి హృదయం ఆనందమయం కావాలని డాక్టర్ వై ఎస్

రాజశేఖరరెడ్డి పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ఒక రంగుల తొలిపేజీ ప్రకటన విడుదలచేసింది. అభివృద్ధికోసం చట్టబద్ధమైన సంస్థపై చర్చకు ఎవరితోనైనా సవాల్ అని ప్రకటించింది. ఎవరు ఆ సవాల్ స్వీకరించారో లేదో తెలియదుగాని ఆ ప్రకటన చేసేనాటికి దాని స్వరూపం ఏమిటో ప్రభుత్వానికి కూడా తెలియదు. చివరకు నిన్న మొన్న కాబినెట్ చర్చించేనాటికి (ఇప్పటికీ) కూడా తెలియదు. దాని వెనుకబడిన తనానికి కారణాలను అంచనా వేసే ఒక విచారణ కమిషన్ స్థాయికి మార్చారని క్యాబినెట్ చర్చల వార్తలు చెప్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి కమిషన్ అని పేరుపెట్టి ప్రముఖ ఆర్థిక శాస్త్రవేత్తను అధ్యక్షుడిగా నియమిస్తారనీ సామాజిక, తదితర రంగాలలో నిపుణులయిన ఇద్దరిని సభ్యులుగా నియమిస్తారనీ అంటున్నారు. అయితే ఇది కేవలం ఒక సలహా సంఘం మాత్రమే. ఈ కమిషన్ పదవీ కాలం మూడేళ్లని, ప్రతిఏటా నవంబర్‌లో ఈ కమిషన్ సిఫార్సులు చేస్తే బడ్జెట్ రూపొందించే ముందు వీటిని పరిశీలించి అందుకు తగిన కేటాయింపులు చేస్తారని ఇటీవల మంత్రివర్గం సమావేశంలో చెప్పారు. విభిన్న ప్రాంతాలలో ఆర్థిక, సామాజిక అసమానతలను గురించి వీరు పరిశీలిస్తారని, ఆ అసమానతలను తొలగించే విధంగా వారు చేసిన సిఫార్సుల మేరకు నిధులు కేటాయించి అభివృద్ధి సాధించాలన్నది లక్ష్యం. దీన్ని చట్టబద్ధ సంస్థగా కాంగ్రెస్ ప్రభుత్వం వర్ణించింది.

ఇది ఒక కమిషన్ మాత్రమే. విచారణా కమిషన్ కూడా కాదు. సంస్థ అసలే కాదు. దీని బాధ్యత అధ్యయనం చేయడం. ప్రత్యేకాధికారాలేమీ దీనికి లేవు. ఏ విధమైన అధికారాలు దీనికి ఇవ్వగలరో ఇంకా చెప్పకపోయినా ఒక సలహాసంఘానికి ఇవ్వగలిగే అధికారాలేవీ ప్రత్యేకంగా లేవు. నిపుణులు పరిశీలించి వెనుకబడిన తనాన్ని ఎప్పటికప్పుడు గుర్తించి, మూడేళ్లపాటు సలహాలు చెప్పే ఈ అధ్యయన సంస్థకు చట్టబద్ధత కల్పిస్తున్నామని ప్రకటనలో ఉంది కాని క్యాబినెట్‌లో ఆ అంశం చర్చకు రాలేదు. పోనీ వీరు ఇచ్చిన సలహాలు ప్రభుత్వం పాటించి తీరాలనే చట్టబద్ధ బాధ్యత మోపుతారా అంటే ఆ ఊసే లేదు. ఈ చట్టబద్ధసంస్థ అనబడే సంఘం ప్రభుత్వాన్ని కొన్ని వేల కోట్ల రూపాయల నిధులు ఇమ్మంటే ఇచ్చి తీరుతుందా? ఒక వేళ ఇవ్వకపోతే ఈ సంస్థ ఏవిధంగా ప్రభుత్వ మత్తేభ కుంభస్థలం మీద అంకుశం మోపగలదు? ఒక జి.ఒ. ద్వారానో లేక ఒక ఆఫీసు ఆర్డర్ ద్వారానో ఏర్పాటు చేయగలిగే ఈ ఉత్తుత్తి సలహా సంఘానికి చట్టబద్ధత ఏవిధంగా కల్పిస్తారు. దాని వల్ల ఏం ప్రయోజనం ఉంటుందనేవి సమాధానాలు లేని సవాళ్లు.

అపరిమితమైన మెజారిటీతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ – తెలంగాణ రాష్ట్ర సమితి ప్రభుత్వం మూడున్నరేళ్లు ముచ్చటగా సాగిపోయిన తరువాత, ముందస్తు ఎన్నికలు వస్తాయని అందరికన్న ఎక్కువ కాంగ్రెస్ వారే ఆశపడుతున్న రోజుల్లో, అందుకు అనుగుణమయిన వరాల బడ్జెట్‌లను నిర్మించుకుని గొప్ప గొప్ప వాణిజ్య ప్రకటనలకు, సినిమాల్లో ప్రకటన రీళ్లకు వందల కోట్లు గుమ్మరిస్తున్న ప్రభుత్వం, ఇన్నాళ్లూ తాను సాధించిందే అభివృద్ధి అని చెప్పుకున్న సర్కారు, తమను మళ్లీ ఎన్నికలలో గెలిపించేదే అభివృద్ధి మంత్రమని జపిస్తున్న నేతలు ఇప్పుడు రాష్ట్రంలో వెనుకబడిన ప్రాంతాలేవో గుర్తిస్తామని రాబోయే మూడేళ్లు (అధికారంలో తామే ఉంటామనే నమ్మకంతో) ఈ సంఘం ఇచ్చే సలహాలకు అనుగుణంగా నిధులు కేటాయిస్తామని చెప్పడం ఒక అసాధ్యమయిన విడ్డూరం.

అభివృద్ధి రాజకీయ దృఢ సంకల్పం ద్వారా, నిధుల కేటాయింపుల ద్వారా, నీతివంతమయిన నిర్ణయాల ద్వారా మాత్రమే సాధ్యం కాని లోపల కుతంత్రాలు పైకి హామీలు వాగ్దానాలుచేయడం వల్ల, కమిషన్ల వల్ల సాధ్యం కాదని దశాబ్దాల చరిత్ర చెప్తున్నది.

కమిట్‌మెంట్ లేనప్పుడే కమిటీలు వేస్తారట. విడిగా ఏ పనీ చేయలేనివారు, కలిసినపుడు ఆ పనిచేయడం మనవల్ల కాదని తీర్మానించే వారు కమిటీ సభ్యులుగా ఉంటారట. మన ప్రభుత్వం కూడా అంతే. ఏం చేయాలో తోచకపోతే ఒక కమిటీ వేస్తారు. సమస్యలు తీవ్రమై ఎదురొస్తే ఇంకో కమిటీ వేస్తారు. రాజకీయ హామీలకు విశ్వసనీయత లేదనడం ఎంత సత్యమో, ఇటువంటి ఉత్తుత్తి చట్టబద్ధమైన కమిటీలతోనూ, పెద్ద మనుషుల ఒప్పందాలతోనూ, ఆ పెద్దమనుషులను కొనే వ్యూహాలతోనూ అభివృద్ధి సాధ్యం కాదనడం కూడా అంతే సత్యం. తెలంగాణ అంతటా ఈ వ్యూహాల చరిత్ర చర్విత చర్వణం అవుతున్న దశలో అభివృద్ధి మంత్రానికి కమిషన్ తంత్రానికి తెరవెనుక కుతంత్రానికి ఓట్ల చింతకాయలు రాల్తాయో లేదో వారికీ తెలుసు. ◆

ఆంధ్రా, ఒరిస్సా రాష్ట్రాల మధ్య వైరుధ్యాల ఫలితంగా సంయుక్తంగా నిర్వహిస్తున్న జలవిద్యుత్ కేంద్రం ఆధునికీకరణ, సరిహద్దు వంతెన, ఉద్యోగుల - నిర్వాసితుల సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయని అంటున్నారు **ఎం. నాగరత్నం**

మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రం - ఒక పరిశీలన

ఏటా రు. 80 కోట్ల ఆదాయం, రు. 15 కోట్ల వ్యయం, రు. 65 కోట్ల లాభం – ఇది స్థూలంగా ఆంధ్రా, ఒరిస్సా రాష్ట్రాల సంయుక్త నిర్వహణలోని మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రం లాభనష్టాల పట్టిక. ఒక మాటలో చెప్పాలంటే ఇదొక బంగారు బాతు. దీని విశిష్ఠత ప్రస్తావించాలంటే, స్వా(హా)తంత్ర్యానంతరం నిర్మించిన తొలి జలవిద్యుత్ కేంద్రం. విదేశీ యంత్రాలను వినియోగించి తక్కువ వ్యయంతో విద్యుదుత్పత్తి జరుగుతోంది. అంతటి ప్రాధాన్యం ఉన్నా ఆంధ్రా, ఒరిస్సా రాష్ట్ర ప్రభుత్వాలు, దీనిపై పూర్తి నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నాయి.

ఆంధ్రా, ఒరిస్సా రాష్ట్రాలు సంయుక్తంగా 1955లో కేవలం రు. 16 కోట్ల వ్యయంతో రోజుకు 120 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంగా మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రాన్ని ఒరిస్సా రాష్ట్రంలో (మాచ్‌ఖండ్ వద్ద) నిర్మించారు. ఆదాయ, వ్యయాల్లో, ఉద్యోగుల నియామకాల్లో ఆంధ్రా, ఒరిస్సా 70:30 నిష్పత్తిలో పంచుకోవాలి. నీరు పుష్కలంగా లభించడంతో ఉత్పత్తి వ్యయం తక్కువ అవుతోంది. ఒక యూనిట్ విద్యుత్ ఉత్పత్తికి కేవలం పదిపైసలే ఖర్చవుతోంది. దాన్ని యూనిట్ రు. 6 వరకు విక్రయిస్తున్నారు. ఏడాదికి సుమారుగా రు. 80 కోట్ల ఆదాయాన్ని అర్జించి పెడుతున్న దీని బాగోగులు కార్మికుల, ఉద్యోగుల కడగండ్లు తీర్చటంలో ఇరు రాష్ట్రాల ప్రభుత్వాలు శీతకన్ను వేస్తున్నాయి. పాలకులు పెట్టుకున్న నిబంధనల ప్రకారం ప్రతి ఇరవై ఐదు ఏళ్లకు జలవిద్యుత్ కేంద్రాలను విధిగా ఆధునికీకరించాలి. మాచ్‌ఖండ్ విషయంలో అది మచ్చుకైనా కానరాదు. దీన్ని నిర్మించి యాభై రెండేండ్లు గడుస్తున్నా నేటికీ ఆధునికీకరణ ఊసేలేదు. సాధారణంగా వచ్చే మరమత్తులను సరిచేయడం తప్ప అభివృద్ధికి ఎలాంటి చర్యలు చేపట్టలేదు. పాత యంత్రాలు కావడంతో తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. వీటిని మెరుగు పర్చకపోవటం మూలంగా రోజుకు 120 మెగావాట్లకు మించి విద్యుత్ ఉత్పత్తి చేయలేక పోతోంది. ఆధునికీకరణ చేపడ్తే రెట్టింపు విద్యుత్ ఉత్పత్తి చేసే వీలుంటుందని ఉద్యోగులు, కార్మికులు అంటున్నారు. కానీ ఇరు రాష్ట్రాల పాలకులు అందుకు సుముఖంగా లేరనీ ఇప్పటి వరకు కలిగి ఉన్న కార్యాచరణే తెలియజేస్తోంది.

కార్మికులను, ఉద్యోగులను పట్టించుకోని యాజమాన్యం

ఏడాదికి సుమారు రు. 65 కోట్ల లాభం ఆర్జించి పెడుతున్న కార్మికుల, ఉద్యోగుల కడగండ్లను పరిష్కరించటంలో యాజమాన్యం పూర్తిగా విఫలమైంది. కనీస మౌలిక వసతుల కల్పనలో, ఉద్యోగులకు వివిధ రకాల అలవెన్స్, బోనస్ వంటి సదుపాయాల కల్పనలో కూడా యాజమాన్యం మొండిగా వ్యవహరిస్తోంది. యాభై ఏళ్లుగా పూర్తిగా తుప్పు పట్టిన యంత్రాల్లో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని దినమొక గండంగా పనిచేస్తున్న దుస్థితి వారిది. మరొక పక్క ఇరు రాష్ట్రాల సరిహద్దులో జీవనం సాగిస్తున్న ఆదివాసీ ప్రజానీకం ఈ ప్రాజెక్టు నిర్మాణం కారణంగా వేలాది మంది నిర్వాసితులు అయ్యారు. ఇతర ప్రాంతాలకు బతుకు కోసం వలసపోయారు. మరికొంతమంది ఇప్పటికీ నిర్వాసితులుగానే జీవనం గడుపుతున్నారు. అప్పట్లో వీరికి నష్టపరిహారంగా ఒక్కొక్క కుటుంబానికి కేవలం రు. 140 మాత్రమే ముట్టజెప్పారనీ సహదేవ్ కిల్లో అనే నిర్వాసితుడు చెప్పారు. వేలాది ఆదివాసులను జలసమాధి చేసి కోట్ల లాభాలు గడిస్తున్న పాలకులు, ఆ ప్రజల కనీస మౌలిక వసతుల కోసం నయాపైసా ఖర్చు పెట్టడం లేదు. పైగా ఆ ప్రజలే ఎన్నుకున్న ప్రజాస్వామిక ప్రభుత్వాలుగా ఫోజు పెడుతున్నాయి.

'వించ్'కు విశ్రాంతి కరువు

మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రానికి ఆయువు పట్టులాంటి వించ్ పట్ల కూడా యాజమాన్యం తీవ్రమైన నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తోంది. విద్యుత్ శక్తితో ఇనుపతాడు (రోప్) ఆధారంగా పని చేసే వించ్ లేకుంటే జల విద్యుత్ కేంద్రానికి వెళ్లడం అసాధ్యం. 2,500 అడుగుల లోయలో ఉన్న జలవిద్యుత్ కేంద్రానికి ఏ చిన్న వస్తువు చేరవేయాలన్నా, అధికారులు, కార్మికులు, సందర్శకుల రాకపోకలు సాగించాలన్నా ఈ వించే ప్రధాన ఆధారం. కేంద్రాన్ని నిర్మించినపుడు అవసరమైన యంత్రాలు, పరికరాలు వించ్ తోనే రవాణా చేశారు. అటువంటి అత్యంత ప్రాధాన్యం ఉన్న వాటి పట్ల కూడా గతం నుంచి యాజమాన్యం నిర్లక్ష్యంగానే వ్యవహరిస్తోంది. వించ్ నడిచే పట్టాలు గత యాభై ఏళ్లుగా మార్చలేదు. కనీసం శుభ్రం కూడా చేయించలేదు. దీంతో అవి ప్రస్తుతం పూర్తిగా తుప్పుపట్టి పోగా, వాటి (పట్టాలు) కింద సిమెంటు పునాదులు బీటలు వారాయి. దీంతో ఏక్షణాన పునాదులు ఊడిపోయి ప్రమాదం సంభవిస్తుందోననే ఆందోళన కార్మికులు, ఉద్యోగుల్లో వ్యక్తవమవుతోంది. ఇక్కడ ఉన్న వించ్ సదుపాయం దేశంలో మరే జలవిద్యుత్ కేంద్రానికి లేదు. దేశంలో వివిధ రాష్ట్రాల నుంచి మాచ్‌ఖండ్ ప్రాజెక్టును

చూడ్డాని కంటే వించ్‌లో ప్రయాణించి ఆ అనుభూతిని పొందాలనుకునే వారే ఎక్కువ.

మరికొన్ని వివరాలు	
పేరు	: వించ్
నిర్మాణం	: 1955లో మాచ్‌ఖండ్ నిర్మాణ దశలో
అప్పట్లో చేసిన వ్యయం	: రు. 2.45 లక్షలు మాత్రమే
చేసే పని	: 2, 100 అడుగుల లోయలోకి రాకపోకలు సాగిస్తుంది
సామర్థ్యం	: 20 టన్నుల బరువు.

సరిహద్దు వంతెనకు గ్రహణం

ఆంధ్రా, ఒరిస్సా రాష్ట్రాలు కలిసే జోలాపుట్టు ప్రాంతంలో నిర్మించ తలపెట్టిన సరిహద్దు వంతెన వ్యవహారంలో ఆదిలోనే అవాంతరాలు ఏర్పడ్డాయి. దీంతో ఇరు రాష్ట్రాల ప్రజలకు ఉపయోగపడే జోలాపుట్ వంతెన నిర్మాణంలో ఇప్పట్లో పురోగతి కన్పించడంలేదు. మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రం నిర్మించినప్పుడే ముంచంగి పుట్ మండలం జోలాపుట్ వద్ద ఇరు రాష్ట్రాల మధ్య రాకపోకలు సాగించేందుకు చిన్నపాటి వంతెనను నిర్మించారు. దానిపై భారీ వాహనాలు నడిచే వీలులేక, ఆ మార్గం గుండా ఆర్.టి.సి. అంతర్రాష్ట్ర సర్వీసులను వేయలేదు. వాస్తవంగా సమస్యను ప్రజల కోణంలో పాలకులు గనుక ఆలోచిస్తే వంతెన నిర్మించడం ఆచరణయోగ్యం కానిది కాదు. కానీ ఇరు రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న పాలకుల మధ్య వైరుధ్యాల ఫలితమే వంతెన నిర్మాణానికి నోచుకోవడం లేదు. రాష్ట్రంలో భారీ వర్షాలు ఎప్పుడు కురిసినా ఆ వంతెన దెబ్బతినటం పరిపాటిగా మారిపోయింది. అదే విధంగా గత ఏడాది తుపాన్లకు సరిహద్దు వంతెన భారీగా దెబ్బతింది. దీంతో ఇరు రాష్ట్రాల మధ్య ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందనీ ఇరు రాష్ట్రాల సరిహద్దు పంచాయితీ సర్పంచ్‌లు పితంబరం, మంగ్ల చెప్పారు. నేటికీ ఇదే పరిస్థితి కొనసాగుతోంది. ఈ సమస్యను పరిష్కారించాలనే ఆలోచనతో జెన్‌కో అధికారులు రు. 2.50 కోట్ల వ్యయంతో సరిహద్దు ప్రాంతంలో భారీ వంతెనను నిర్మించాలని యోచించారు. అందుకు అవసరమైన ప్రతిపాదనలు రూపొందించి ఇరు రాష్ట్రాల విద్యుత్ శాఖలకు సంబంధించిన మంత్రులు, ఉన్నతాధికార్లకు నివేదించారు. దీనిపై ఒరిస్సా సానుకూలంగా స్పందించినప్పటికీ, ఆంధ్ర మాత్రం దానికి కొర్రీ వేసింది. సరిహద్దు వంతెనకు నిధులు కేటాయించ లేమని తేల్చి చెప్పేయడంతో దాని నిర్మాణానికి అడ్డుకట్ట పడింది.

ఈ నేపథ్యంలో నుంచి చూస్తే మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రం ప్రైవేటీకరణ దిశగా అడుగులు వేయడానికి అవసరమైన భౌతిక పరిస్థితి ఆసన్నమైంది. అలాగే ఇరు రాష్ట్రాల ప్రభుత్వాలు ప్రైవేటీకరణకు పెద్దపీట వేయడం బట్టిచూస్తే కూడా ఇదే అర్థమవుతుంది. రెండవ అంశం ఇరు రాష్ట్రాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న జలవిద్యుత్ కేంద్రం, సరిహద్దు వంతెన, కార్మికుల, ఉద్యోగుల, నిర్వాసితుల వంటి సమస్యల విషయంలో ప్రభుత్వాల మధ్య వైరుధ్యాల ఫలితంగానే అవి అపరిష్కృతంగా ఉంటున్నాయి. ఈ పరిస్థితిని మార్చడానికి పెద్దఎత్తున పోరాటాలు చేయాల్సి ఉంది. ◆

మన రాజ్యాంగ లక్ష్యం సామ్యవాద సాధన అనీ, కాబట్టి అధ్యయనం, పరిశోధన అన్నీ సామాన్య మానవుడి కేంద్రంగా జరగాలని అంటున్నారు **వి. సుబ్రహ్మణ్యం**

ప్రపంచీకరణ - ఉన్నతవిద్య

విద్య అనేది ఆర్థిక, సాంఘిక అసమానతలను తొలగించే సాధనం కావాలి. ఈ దేశ ఉత్పత్తికి దోహదకారిగా ఉండాలి. ఉత్తమ పౌరసమాజ నిర్మాణానికి ప్రాతిపదిక కావాలి. వ్యక్తి జీవితంలో విద్య అనేది ఆర్థికంగా నిలబడడానికి ఆధారం కావాలి.

నేడు మన దేశంలో ఉన్నత విద్యాఫలాలు ఎంతమందికి దక్కుతున్నాయో పరిశీలిద్దాం.

2000 సంవత్సరానికి గాను యునెస్కో తయారుచేసిన ప్రపంచ విద్యా నివేదిక ప్రకారం భారతదేశంలో 17-23 సంవత్సరాల మధ్య వయస్సులలో కేవలం 6.9 శాతం మంది మాత్రమే ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారు. అదే అమెరికాలో వీరి శాతం 80.9 గా ఉంటే, బ్రిటన్‌లో 52.3 శాతం, ఆస్ట్రేలియాలో 79.8 శాతం, న్యూజిల్యాండ్‌లో 62 శాతంగా ఉంది. మానవ అభివృద్ధి నివేదిక ప్రకారం మన దేశం 127వ స్థానంలో ఉంది. ప్రభుత్వం మన దేశ స్థూల జాతీయోత్పత్తిలో (జి.ఎన్.పి.) విద్యపై 3.2 నుంచి 4.4 శాతం మాత్రమే ఖర్చు పెడుతోంది.

అంతర్జాతీయ మార్కెట్‌గా ఉన్నత విద్య

ప్రపంచ వాణిజ్య సంస్థ ప్రభావానికి వ్యవసాయ, వాణిజ్య రంగాలు ఎలా ప్రభావితం అయ్యాయో మనందరికీ తెలిసిందే. ఇప్పుడు విద్యపై దాని ప్రభావం ఎలా ఉందో గుర్తించడం మనందరి కర్తవ్యం.

ప్రపంచ విపణిలో విద్య ఒక సరుకుగా ఎలా ఉందో, దాని విలువను ఏ విధంగా లెక్కగట్టారో పరిశీలిద్దాం. విద్యారంగంలో ప్రపంచం మొత్తం మీద 47 లక్షల కోట్ల రూపాయల వ్యాపారం చేసుకోవడానికి అవకాశముందని బహుళజాతి సంస్థల అంచనా. గ్యాట్ ఒప్పందం ద్వారా డబ్ల్యూ.టి.ఒ. సర్వీసుల రంగంలో (విద్య, వైద్యం, మ్యూజియం, నీటి వనరులు, టూరిజం, రియల్ ఎస్టేట్, ఇన్స్యూరెన్స్, రవాణా, మీడియా) అంతర్జాతీయ వ్యాపారానికి ద్వారాలు తెరిచింది.

అమెరికా ఎగుమతి చేస్తున్న సర్వీసులలో ఐదవ ప్రధానరంగం ఉన్నత విద్య. ఒక్క 1996లో అమెరికా ఎగుమతి చేసిన విద్య, శిక్షణ సంబంధిత మొత్తం సర్వీసుల విలువ 820 కోట్ల డాలర్లు. అదే సంవత్సరం విద్య, వాణిజ్యాలలో అమెరికా ఏడు వందల కోట్ల డాలర్లును ఆర్జించింది. ఈ విధంగా ఉన్నత విద్యా మార్కెట్ ద్వారా అమెరికా అధిక లాభాలను ఆర్జిస్తూ ఉంది. అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియాలు కలిసి ఆసియా, పసిఫిక్ దేశాలలో ఏటా 2700 కోట్ల డాలర్ల ఉన్నత విద్యను ఎగుమతి చేసి సంపాదిస్తున్నాయని గ్లోబల్ అలయన్స్ ఫర్ ట్రాన్స్‌నేషనల్ ఎడ్యుకేషన్ (జి.ఎ.టి.ఇ.) అనే సంస్థ అంచనా వేసింది. ఆసియా, పసిఫిక్ దేశాలలో 3700 కోట్ల డాలర్ల ఉన్నత విద్యా మార్కెట్ ఉందని అంచనా. ఈ మార్కెట్ కోసం ప్రపంచ ప్రసిద్ధి చెందిన ఫోనిక్స్, గేట్ వంటి కంపెనీలు పోటీపడుతున్నాయి.

విద్యా మార్కెట్ కోసం స్వదేశీ కంపెనీల ఆరాటం

విద్యా విధానానికి సంబంధించి 2003లో మన ప్రధానికి అంబానీ, బిర్లాలు ఒక నివేదికను సమర్పించారు. అందులో వారు రెండు ప్రతిపాదనలు చేశారు.

1. సమాచార సమాజం పేరిట ప్రభుత్వ విద్యను నిరుత్సాహపరచడం.
2. ప్రభుత్వ విద్యలో ప్రమాణాలు తగ్గిపోవటం వల్ల స్వయం పోషక సంస్థలకు, అంతర్జాతీయ సంస్థలకు తలుపులు తెరవమని చెప్పడం.

తమ నివేదికలో నాణ్యతగల ఉన్నత విద్యను అందించేందుకు కావలసిన వనరులను సమీకరించేవిగా ఈ స్వయం పోషక సంస్థలు పని చేస్తాయన్నారు. కాని వాస్తవం అదికాదు. అధికలాభాలను ఆర్జించడం ఈ స్వయం పోషక విద్యా సంస్థల లక్ష్యంగా ఉంటుంది.

పెట్టుబడిదారులకు అనుగుణంగా ఉన్నత విద్యా విధానాలు

ఉన్నత విద్య సంక్షోభంలో ఉంది కాబట్టి విశ్వవిద్యాలయాలను పరిశ్రమలకు అనుసంధానం చేస్తే ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని, తద్వారా నిరుద్యోగ సమస్యను పరిష్కరించవచ్చనే వాదన ఒకటుంది. దీనివల్ల కలిగే ప్రమాదమేమిటంటే విదేశీ కంపెనీలు తమ పరిశోధనలకు ప్రయోగశాలలుగా మన విశ్వవిద్యాలయాలను వాడుకొనే ప్రమాద ముంది. ఎందుకంటే అక్కడ లక్ష డాలర్లు పెడితే గానీ పూర్తికాని పరిశోధన ఇక్కడ వెయ్యి డాలర్లకే అవుతుంది. ఆ విధంగా మన మేధస్సును, మన వనరులను ఉపయోగించుకొని పరిశోధనల్లో సాధించిన ఫలితాలపై అవి పేటెంట్ పొందినా ఆశ్చర్యపోనక్కర్లేదు.

ఉదాహరణకు విత్తనాల పరిశోధనారంగాన్నే తీసుకుందాం. బహుళజాతి విత్తన కంపెనీలు ఒక పథకం ప్రకారం తమ విత్తనాలకు ఇక్కడ లేని గిరాకీని సృష్టించుకుంటాయి. అవి తమ దృష్టిని మొట్టమొదట వ్యవసాయ విశ్వవిద్యాలయాలపైనే పెట్టాయి. తమ విత్తనాలకు

అనుకూలంగా వ్యాసాలు రాయిస్తాయి. ఉపన్యాసాలిప్పిస్తాయి. ఈ విధంగా ప్రచారం చేసే 'మేధావులకు' కమిషన్లు భారీగానే ముట్ట జెపుతాయి. అంతిమంగా తమ ఉత్పత్తులను ఇక్కడ మార్కెట్‌లో అమ్ముకొని లాభాలు పోగేసుకుంటాయి. ఔషధ రంగంతో పాటు ఇప్పుడు విద్యారంగానికి కూడా ఈ జాడ్యం పాకింది.

అమెరికా అవసరాలను, అవకాశాలను దృష్టిలో పెట్టుకొని ఇక్కడ 'చదువు'ను రూపొందించడం జరుగుతూ ఉంది. దీనికి ఉదాహరణగా నేడు మన డిగ్రీ, పి.జి. కళాశాలలో ఎన్.ఎ.ఎ.సి. అసెస్‌మెంట్ అండ్ అక్రెడిటేషన్ పేరుతో జరుపుతున్న తతంగాన్నే చెప్పుకోవచ్చు.

అమెరికా ఆర్థిక పరిస్థితులకు, అక్కడి జీవన ప్రమాణాలకు – మన దేశ ఆర్థిక వ్యవస్థకు, ఇక్కడి జీవన ప్రమాణాలకు ఎంతో తేడా ఉంది. అమెరికా చదువంతా పెట్టుబడిదారీ వ్యవస్థతో ముడిపడిన బహుళజాతి పరిశ్రమల్లో బందీ అయి ఉంది. మన సమాజం అలాంటిది కాదు. ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతున్న సమాజం. కాబట్టి ఇక్కడి సమాజ అవసరాలు, ప్రజల ప్రయోజనాలు వేరు. మన రాజ్యాంగ లక్ష్యం సామ్యవాద సాధన. కాబట్టి అధ్యయనం, పరిశోధన అన్నీ సామాన్య మానవుడి కేంద్రంగా జరగాలి.

విశ్వవిద్యాలయాలను పరిశ్రమలతో అనుసంధానం చేస్తే అప్పుడు 'డబ్బు' కీలక పాత్ర వహిస్తుంది. యూనివర్శిటీల్లో ఏ కోర్సువల్ల డబ్బు వచ్చే అవకాశం ఉందో ఆ కోర్సులపైనే పారిశ్రామిక వేత్తలు పెట్టుబడి పెట్టే అవకాశం ఉంది. అప్పుడు యూనివర్శిటీలలో విద్యాపరమైన యోగ్యత కలిగిన వారి కన్నా పరిశ్రమాధిపతుల కనుసన్నలలో మెలిగే వారే కీలక పాత్ర వహిస్తారు. ఫలితంగా సమాజ అవసరాలు, పేదరికం తొలగింపు వంటి సామాజిక అంశాలపై అధ్యయనం, పరిశోధనలు జరగవు. విద్యలో నాణ్యత, పారదర్శకత లోపిస్తుంది. విలువలు పడిపోతాయి.

ఉన్నత విద్యా విధానాలలో అనుకరణ అనేది భావ దారిద్ర్యానికి నిదర్శనం. ఈ రోజు మనం అమెరికాను చూసి 'అభివృద్ధి'ని, 'పెరుగుదల'ను నిర్వచించుకోవడం వలన ప్రమాదకరమైన ధోరణులు చోటు చేసుకొంటాయని పర్యావరణ శాస్త్రవేత్తలు ఆందోళన చెందుతున్నారు. వారి అధ్యయనాల ప్రకారం ప్రపంచంలో 30 శాతం వస్తు వినియోగాన్ని జనాభాలో 4.5 శాతంగా ఉన్న అమెరికనులే అనుభవిస్తున్నారు. దీనిని ఆదర్శంగా తీసుకొని భారతదేశం, చైనా ప్రజలు అనుసరిస్తే వినియోగదారీ సంస్కృతి విలయతాండవం చేస్తుందంటున్నారు. ఈ సంస్కృతి వాతావరణ కాలుష్యాన్ని వేగవంతం చేస్తుంది. అనేక ఊహించరాని ప్రమాదాలకు దారి తీస్తుందంటున్నారు.

నేటికీ భారతీయులతో పోలిస్తే అమెరికన్లు సంవత్సరానికి ఇరవై రెట్లు ఎక్కువ కార్బన్‌డయాక్సైడ్‌ను వాతావరణంలోకి విడుదల చేస్తున్నారు. దీనినే వాతావరణ శాస్త్రవేత్తలు 'కార్బొనిఫెరస్ క్యాపిటలిజం' అంటున్నారు. ఈ పరిణామం మొదటి, రెండవ ప్రపంచ యుద్ధాలకంటే ఎక్కువ నష్టాన్ని సృష్టిస్తుందని సునామీ నేపథ్యంలో హెచ్చరిస్తున్నారు.

ఈ సందర్భంగా మన మాజీ యు.జి.సి. చైర్మన్ ప్రొఫెసర్ యశ్‌పాల్ నేటి ఉన్నత విద్యావిధానాన్ని గురించి చేసిన వ్యాఖ్యానాలు స్మరించుకోవడం ఎంతో సముచితంగా ఉంటుంది.

'మన విద్య, పరిశోధనా సంస్థల్ని ప్రారంభించుకొన్నప్పుడు మనకో లక్ష్యం ఉండేది. విద్యావేత్త శాస్త్రవేత్త, సామాజికోద్యమకారుడు కావాలన్న నిర్వచనం ఉండేది. అంతరిక్ష పరిశోధకుడైనా సరే తన పరిశోధనలో ఎంత తలమునకలైనా సరే అతనికో సామాజిక బాధ్యత ఉందని మన పాతకాలం వారు నమ్మేవారు. శాస్త్రం ప్రజల్ని ప్రభావితుల్ని చెయ్యాలి. అది 'లోకప్రియం' కావాలి. లోకప్రియం కావాలంటే అది సమాజపరం కావాలి. మనకు సమాజం పట్ల (దాని అవసరాల పట్ల) ఓ అవగాహన ఉండాలి. సరిగ్గా ఇప్పుడదే కరువైంది. అందువల్ల గహనాతిగహన, జటిలాతిజటిల ప్రకృతి రహస్యాల్ని ఛేదిస్తున్నాం గానీ చాలా సులభమైన దానిని మాత్రం మరచిపోతున్నాం.

ప్రతిపాదనలు

1. ఉన్నత విద్య వ్యాపారీకరణను తక్షణమే ఆపివేయాలి. ప్రభుత్వ రంగంలోనే ఉన్నత విద్య కొనసాగాలి.
2. సామాన్యుల అవసరాలు, గ్రామీణాభివృద్ధి, పరిసరాల పరిరక్షణయే పరిశోధనల పరమార్థంగా ఉండాలి. దేశ స్వావలంబనకు తోడ్పడాలి.
3. సామాజిక అవసరాలైన మంచినీరు, విద్యుత్ వంటి వాటిని చౌకగా ప్రజలకు అందించడమెలా అన్నదానిపై పరిశోధనలు సాగించాలి.
4. ఉన్నత విద్య పేదల కన్నీళ్ళు తుడిచేదిగా ఉండాలే గాని శ్రీమంతుల జేబులు నింపేదిగా ఉండకూడదు.
5. విద్యావిధాన నిర్ణయాల రూపకల్పనలో అధ్యాపకులకు, సంఘ సేవకులకు, తల్లిదండ్రులకు సముచితస్థానం కల్పించాలి.

జవహర్‌లాల్ నెహ్రూ ఉన్నత విద్యాలయాలు ఏ విలువల కోసం కృషిచేయాలో తెలుపుతూ 'మానవత్వం, సహనం, కారణం, సాహసవంతమైన ఆలోచనలు, ఆచరణ దిశగా సత్యాన్వేషణలకు విశ్వవిద్యాలయాలకి నిర్వచనం. మానవజాతి ఉన్నత లక్ష్యాల వైపు పయనించే మార్గంగా నిలుస్తాయి'. ◆

అసహజ మరణాలు నమోదు చేద్దాం!

ఆగస్ట్ 2006 నుంచి వీక్షణంలో అసహజ మరణాల సూచి ప్రారంభించాం. మన చుట్టూ అసహజంగా చనిపోతున్న రైతులు, చేనేత కార్మికులు, వరకట్న మరణాలు, రకరకాల ప్రమాదాలలో చనిపోతున్నవారు, వైద్యం అందక, ప్రకృతి వైపరీత్యాలతో మరణిస్తున్నవారు, హత్యలు ఇలా, అనేక సామాజిక రంగాలనుంచి మరణిస్తున్నవారి సంఖ్యనైనా నమోదు చేయడమే ఈ శీర్షిక ఉద్దేశ్యం. ఏయే సామాజిక, రాజకీయార్థిక కారణాలతో చనిపోతున్నారో పరిశోధన చేయాల్సి ఉంది. మేము చేస్తున్న ఈ ప్రయత్నంలో మీరూ పాలుపంచుకోవచ్చు. మీ జిల్లాలో అసహజంగా చనిపోతున్న వారి వివరాలను మాకు పంపండి. దీనికి పారితోషికంగా వీక్షణం ప్రతిని పంపిస్తాం. ఆసక్తి గలవారు వివరాలకై సంప్రదించండి. ఫోన్ నెం. 99891 89250, 99493 91028

– సంపాదకులు

మన శాస్త్రజ్ఞులు కాగితాలపై తమ ప్రతిభాపాటవాలను చూపే బదులు రైతుల క్షేత్రాల్లో వాటి విలువను నిరూపిస్తే రైతుల సంక్షేమానికి బాటలు వేసినవారవుతారని అంటున్నారు **డా. ముద్దసాని శ్రీకాంత్‌రెడ్డి**

గతి తప్పిన వ్యవసాయ పరిశోధనా ప్రగతి

ఏ దేశ సర్వతోముఖ ప్రగతికైనా ఆ దేశ వనరులు, వాటిని సద్వినియోగం చేసుకొనే అభిలాష, అకుంఠిత ప్రతిభా పాఠవాలు గల మేధావివర్గం, నిరంతరం శ్రమించే కార్మిక, కర్షక ప్రజానీకం అత్యవసరం. మన దేశానికి ప్రకృతి వనరుల, మానవ వనరుల కొరతేలేదు. ప్రపంచంలోని ఎన్నో దేశాలలో లేని అత్యంత విలువైన ఖనిజ వనరులను మనం కలిగి ఉన్నా ఇంకా మూడవ వంతు జనాభా కనీస జీవన సదుపాయాలకు కూడా నోచుకోకపోవడం అత్యంత దురదృష్టకరం. దారిద్రరేఖకు దిగువన గల అత్యధిక జనాభా (75 శాతం) మన గ్రామీణ ప్రాంతాల్లోనే నివాసముండడం మన గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ ప్రాధాన్యతలను సూచిస్తున్నాయి.

మనదేశంలో 160 మిలియన్ హెక్టార్ల వ్యవసాయయోగ్యమైన భూమి, వైవిధ్యభరితమైన ప్రకృతి వనరులతో ఎన్నో రకాలయిన పంటలు పండించడానికి అనువైన వాతావరణ పరిస్థితులతో ప్రపంచంలోనే రెండవస్థానం కలిగిఉన్నాం. (176 మిలియన్ హెక్టార్ల భూమి కలిగి అమెరికా మొదటి స్థానంలో ఉంది). అదేవిధంగా ప్రపంచంలోనే అత్యధిక నీటి వసతి గలిగిన భూమి(55 మి. హెక్టార్లు) మన సంపద. (రెండవ స్థానంలో చైనా 54.5 మి. హెక్టార్ల నీటి వసతి గలిగి ఉంది).

పట్టిక 1 : కొన్ని ముఖ్యమైన పంటల సరాసరి దిగుబడి (కిలోలు/హెక్టారుకు)

పంట	భారత్	మాయన్మార్ (బర్మా)	చైనా	ప్రపంచ సరాసరి
వరి	3034	3532	6266	3916
గోధుమ	2688	-	3885	2760
వేరుశెనగ	794	1321	2986	1381

ఆధారం : ఎఫ్.ఎ.ఒ. స్టాటిస్టిక్స్

పట్టిక 1ని పరిశీలించినట్లయితే మన పొరుగు దేశమైన చైనా, మాయన్మార్‌ల కంటే మనం పంటల ఉత్పాదకతలో ఎంతో వెనుకబడి ఉన్నామని చెప్పక తప్పదు. మనతో అన్ని విధాలైన సామ్యం కలిగిన మన పొరుగు దేశం ప్రస్తుత ప్రపంచ వ్యవసాయ ఆర్థిక విధానాలకు అనుగుణంగా పురోగమిస్తుంటే మనం ఇంకా పురాతన వ్యవసాయ పద్ధతులతో, 1960వ దశకంలోనే ఉన్నాం. ప్రపంచంలోనే అత్యధిక వ్యవసాయ శాస్త్రజ్ఞులు కలిగిన మనం పాకిస్తాన్, శ్రీలంక, బంగ్లాదేశ్‌ల కంటే కూడా కొన్ని ముఖ్య పంటల ఉత్పాదకతలో వెనుకంజలో ఉన్నామని చెప్పవచ్చు. మన దేశ రైతులు ఇంకా 20-30 సంవత్సరాల క్రితం అభివృద్ధి చేసిన వరి వంగడాలయిన హంస, సోనా మసూరీ రకాలనే సాగుచేయడం గమనించవచ్చు.

పట్టిక 2 : వరి పంట ఉత్పాదకత (ఆసియా)

దేశం	వరి ఉత్పాదకత శాతం
పాకిస్తాన్	334
మయన్మార్ (బర్మా)	260
శ్రీలంక	245
చైనా	226
బంగ్లాదేశ్	176
భారత్	144

ఆధారం : వరల్డ్ రైస్ స్టాటిస్టిక్స్ (ఐ.ఆర్.ఆర్.ఐ.)

మన పొరుగుదేశమైన చైనా కేవలం 28 మిలియన్ హెక్టార్లలో 186 మిలియన్ టన్నులు వరి పండిస్తే మనం 42 మిలియన్ హెక్టార్ల విస్తీర్ణంలో 126 మిలియన్ టన్నులకే పరిమితమవడం దురదృష్టకరం, అదేవిధంగా 1980వ దశకంలో పండ్లు కూరగాయల ఉత్పత్తిలో మనం చైనాతో సమానంగా పండించినా 1990వ దశకం వచ్చేసరికి చైనా మనదేశ ఉత్పత్తికి రెండింతలు, 2003వ సంవత్సరాంతానికల్లా మన కన్నా మూడింతలు ఉత్పత్తి సాధించింది., మన పండ్ల కూరగాయల విదేశీ వాణిజ్యం ఒక బిలియన్ డాలర్లయితే చైనా ప్రస్తుతం 5 బిలియన్ డాలర్ల వ్యాపారం చేస్తోంది. ప్రపంచంలోనే 50 శాతం ఆపిల్ పండ్ల ఉత్పాదన చైనా ఒక్కటే చేస్తుండడం గమనార్హం.

11వ పంచవర్ష ప్రణాళికాంతానికల్లా (2012) మనం ప్రస్తుత 208 మిలియన్ టన్నుల ఆహార ధాన్యాల ఉత్పత్తి 337 మి. టన్నులకు పెంచవలసిన అవసరంఉంది. అదేవిధంగా పప్పుధాన్యాల ఉత్పత్తి 14 మి.టన్నుల నుండి 30 మి. టన్నులకు, నూనె గింజల ఉత్పత్తి 16 మి. టన్నుల నుండి 58 మి.టన్నులకు పెంచితే గాని నిరంతరం పెరిగె జనాభా అవసరాలను తీర్చలేం. లేకుంటే విలువైన మన విదేశీ మారక ద్రవ్యం కేవలం తిండిగింజలకై వెచ్చించాల్సి ఉంటుంది. 2003-04 లోనే మనం 1.7 మి. టన్నుల పప్పుధాన్యాలు, 4.3 మి. టన్నుల నూనె గింజల్ని దిగుమతి చేసుకున్న విషయం మరవరాదు.

వ్యవసాయ పరిశోధనా ప్రగతి

దేశంలోని 40 వ్యవసాయ విశ్వవిద్యాలయాల్లో 500లకు మించిన కృషి విజ్ఞాన కేంద్రాల్లో 30,000లకు పైగా వ్యవసాయ శాస్త్రజ్ఞులతో మనం ప్రపంచంలోనే మొదటి స్థానంలో ఉన్నా మన పరిశోధనా ఫలితాలు లేవీ వ్యవసాయదారుల ప్రగతికి తోడ్పాటు అందించలేని వ్యవస్థగా కునారిల్లుతోంది. మన వ్యవసాయ శాస్త్రజ్ఞులు ఇంకా పురాతన పద్ధతులు, పాత వంగడాలతోనే కాలక్షేపం చేస్తున్నారనడంలో ఏమాత్రం అతిశయోక్తి లేదు. మన దేశ ప్రధాన ఆర్థిక సలహా మండలి డా. సి. రంగరాజన్ ఆధ్వర్యంలో వెలువరించిన "ది ఎకనామిక్ ఔట్‌లుక్ ఫర్ 2007-08" అనే ఆర్థిక విశ్లేషణ రిపోర్టు పై విషయాలను తేటతెల్లంచేసింది.

పట్టిక 3 : మన వ్యవసాయ విద్య పరిశోధనా పెట్టుబడులు	
సంవత్సరం	పెట్టుబడి (కోట్లలో)
1997-98	3301
1998-99	4245
1999-2000	4558
2000-2001	5165
2001-2002	6846

మూలం : అగ్రికల్చరల్ రిసర్చ్ డెటా బుక్ 2006

మన దేశ వ్యవసాయ విద్యపై, పరిశోధనపై 1997-98 నుండి 2001-2002 వరకు పెట్టిన పెట్టుబడి 100 శాతం పెరగగా, 1997 తరువాత ఐ.సి.ఎ.ఆర్. వెలువరించిన వంగడాల శాతం 50 శాతం కంటే తగ్గిపోవడం విచారించదగ్గవిషయం. పై పరిశోధనా సంస్థలు వెలువరించిన వంగడాలు 50 శాతం రైతు క్షేత్రాలలో మనుగడ సాగించలేక పోగా మన గౌరవనీయ శాస్త్రజ్ఞులు తమ తమ పరిశోధనా ఫలితాలను కేవలం వివిధ సెమినార్లు, వర్క్‌షాప్స్‌లో పరిశోధనా పత్రాలుగా సమర్పించడంలోనే కాలం సరిపుచ్చుతున్నారు.

దేశంలోనే అగ్రగామి అని చెప్పుకొంటున్న పంజాబ్ వ్యవసాయ విశ్వవిద్యాలయ బడ్జెట్‌ను గమనించినట్లయితే 90శాతం కేవలం ఉద్యోగుల వేతనాలకు 7శాతం ఇతర ఖర్చులకు పోగా 3శాతం మాత్రమే పరిశోధనకై వినియోగించబడడం మనందరికి ఆశ్చర్యం కలిగించక మానదు. మన వ్యవసాయ విశ్వవిద్యాలయాలలో పరిశోధనకన్నా రాజకీయ ప్రాబల్యానికే ప్రాచుర్యం లభించడం సర్వత్రా కానవస్తోంది. మన వ్యవసాయ విశ్వవిద్యాలయాల పరిశోధన, రైతు వ్యవసాయ సాంకేతిక అవసరాల మధ్య అంతరం పంటల ఉత్పాదకతపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఉదాహరణకు మనం గత రెండు సంవత్సరాలుగా విలువైన విదేశీ మారక ద్రవ్యంతో దిగుమతి చేసుకుంటున్న గోధుమ పంట ఉత్పాదకతను గమనించినట్లయితే 1990వ దశకంలో 2281 కిలోలు/హెక్టార్‌గా ఉన్న ఉత్పాదకత, 2004-05 సంవత్సరానికి కేవలం 2718 కిలోలు/హెక్టార్‌గా మాత్రమే అయింది. పప్పుధాన్యాల ఉత్పత్తి 1990-91లో 14.26 మిలియన్ టన్నులు ఉండగా 2004-05 సంవత్సరానికి 13.38 మిలియన్ టన్నులకు పడిపోయింది. ప్రపంచంలోనే పప్పుధాన్యాల విస్తీర్ణంలో అగ్రస్థానం కలిగిన మనం ప్రస్తుతం 1.7 మిలియన్ టన్నులు విదేశాల నుండి దిగుమతి చేసుకోవలసిన అగత్యం ఏర్పడింది.

మన శాస్త్రజ్ఞ మిత్రులు కాగితాలపై తమ ప్రతిభాపాటవాలను చూపే బదులు రైతు క్షేత్రాల్లో వాటి విలువను నిరూపిస్తే రైతు సంక్షేమానికి బాటలు వేసిన వారవుతారు.

ప్రభుత్వ వ్యవసాయ విధానాలు

వ్యవసాయ పరిశోధన పైన వివరించిన దుస్థితికి ఒక కారణమైతే లోపభూయిష్ట ప్రభుత్వ విధానాలు మరో ముఖ్య కారకంగా చెప్పుకోవచ్చు. 11వ పంచవర్ష ప్రణాళికలో నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలంటే మన పంటల ఉత్పాదకతను గణనీయంగా పెంచుకోవడంతోపాటు, మన దేశ వాతావరణ పరిస్థితులలో అధిక ఉత్పాదకత సాధించలేని పంటలను దిగుమతి చేసుకోవడం ద్వారా అట్టి వ్యవసాయ భూమిని ఉత్పాదకతగల పంటలవైపు మళ్ళించి అధిక దిగుబడి సాధించగలం. ఉదాహరణకు సోయా చిక్కుడు ఉత్పాదకత మనదేశంలో పదిక్వింటాళ్ళు/హెక్టారుకు కాగా అర్జెంటీనా హెక్టారుకు 30 క్వింటాళ్ళు సాధిస్తోంది. కాని మన సోయాసాగు విస్తీర్ణం 8 మిలియన్ హెక్టార్లకు మించి ఉంది.

అదే విధంగా మనకు పశుపాలన, చేపల ఉత్పత్తికి గణనీయమైన అవకాశాలు ఉన్నాయి. మన రైతులు వ్యవసాయం పైనే కాకుండా దాని అనుబంధ పరిశ్రమలపైన కూడా తగిన శ్రద్ధ చూపవలసిన అవసరం ఉంది. మన వ్యవసాయం, ఉద్యానవన ఉత్పత్తి 68 శాతం ఉంటే పశు సంబంధమైన ఉత్పత్తులు 28.5 శాతం మాత్రమే ఉన్నాయి. బయోటెక్నాలజీ ఆధారంగా పశు,వృక్ష సంబంధిత ఉత్పత్తుల సమనిష్పత్తిని పాటించవలసిన అవసరం ఉంది. రసాయినిక ఎరువుల వాడకాన్ని నియంత్రించుతూ సేంద్రియ పద్ధతులకు మన రైతులను ప్రోత్సహించ వలసిన విధానం అనివార్యం అని మన పాలకులు గ్రహించాలి.

అవగాహనలేమితో కొంత మంది శాస్త్రజ్ఞులు, విధానకర్తలు చెబుతున్న చిన్న కమతాలు సాగు తగినంత వ్యవసాయ యాంత్రీకరణ లేమి మన ఉత్పాదకతను మరుగుపరచడం లేదు. మనకంటే అధిక ఉత్పాదకత సాధిస్తున్న చైనా సగటు కమత వైశాల్యం కేవలం 0.4 హెక్టార్లు (ఇండియా 1.4 హెక్టార్లు) కాగా, మనం 1000 హెక్టార్ల సాగుకు 16 ట్రాక్టర్లు ఉపయోగిస్తుండగా చైనా 7 ట్రాక్టర్లు మాత్రమే వినియోగించడం గమనించదగ్గ ఉదాహరణ. ఇవే కాకుండా సానుకూల వ్యవసాయ విధాన రూపకల్పన మనదేశ వ్యవసాయ దృశ్యాన్నే మార్చి వేస్తుందనడంలో అతిశయోక్తి లేదు. మనకంటే ఆరు సంవత్సరాల తరువాత ప్రపంచ వాణిజ్య సంస్థ సభ్యత్వం అందిపుచ్చుకొన్న చైనా తన వ్యవసాయ ఉత్పత్తుల్ని ప్రపంచ వ్యాప్తంగా ఎగుమతి చేస్తూ అన్ని విధాలా సఫలీకృతమవడానికి మూలకారణం తన వ్యవసాయ ఆర్థిక విధానాలను ప్రపంచ ప్రజల ఆహార అవసరాలకు అనుగుణంగా రూపుదిద్దుకోవడమే.

గత 20 సంవత్సరాలుగా మన పరిశోధనా ఫలితాలు రైతు అవసరాలను తీర్చడంలో విఫలం కావడం వల్ల మన ఆహారధాన్యాల ఉత్పత్తి 208 మిలియన్ టున్నులను మించి ఎదగలేక పోయిందన్న వాస్తవం కాదనలేని సత్యం. ఇకనైనా మన గౌరవ శాస్త్రజ్ఞులు, విధాన నిర్దేశకులు, పాలక ప్రభుత్వ అధినేతలు జడత్వం వదిలి వ్యవసాయ పురోభివృద్ధిపై దృష్టిసారించి సంక్షుభిత వ్యవసాయ రంగాన్ని, గ్రామీణ ప్రజల సగటు జీవన ప్రమాణాలను మెరుగు పరచే దిశలో సత్వర చర్యలు చేపడతారని ఆశిద్దాం. ◆

వివిధ శాఖల వారిగా రాష్ట్రంలో మొత్తం ఎంత ఖర్చు చేశారో వివరంగా ప్రభుత్వం వద్ద లెక్కలు లేకపోవడం వల్ల సరైన యాజమాన్యం లోపిస్తోందని అంటున్నారు వి. హనుమంతరావు

ఇదేమి పరిపాలన రాజశేఖరా?

పంచాయతీరాజ్ సంస్థల ఆదాయ వ్యయాలేమిటినే ఒక వివరణాత్మక సమగ్ర చిత్రం ప్రభుత్వం వద్ద లేనేలేదు. 22 జిల్లా పరిషత్‌లు 1119 మండల పరిషత్‌లు, 21,943 గ్రామాల పంచాయతీలు మొత్తం 23,084 సంస్థలు రాష్ట్రంలో ఉన్నాయి. వీటిలో ప్రతీ సంస్థ తన ఆదాయ వ్యయాల గురించిన ఎకౌంట్సు తయారు చేసుకొంటాయి. మొత్తం అన్ని సంస్థల ఆదాయం ఎంతో, ఎంత ఖర్చు చేశారో గణాంకాలున్నాయి. కాని పరిపాలన, విద్య, వైద్యం, రహదారులకు, అలాగే వివిధ శాఖల వారిగా రాష్ట్రంలో మొత్తం ఎంత ఖర్చు చేశారో వివరంగా ప్రభుత్వం వద్ద లేకపోవటం వల్ల, సరైన యాజమాన్యం లోపిస్తోంది. ఒక సమగ్ర చిత్రం ప్రభుత్వం వద్ద లేకపోతే, ఆ పని ఎలా చేయగలుగుతుంది?

ఉన్న సమాచారం ప్రకారం జిల్లా పరిషత్‌లు, మండల పరిషత్‌లు 2004-05లో అంతకుముందు సంవత్సరంలోనన్నా (చంద్రబాబు పాలనలో) తక్కువ ఖర్చు చేయటం జరిగింది. అయితే గ్రామ పంచాయతీలు రు. 800 కోట్లు ఎక్కువ ఖర్చు చేయగలిగాయి. జిల్లా పరిషత్‌లలో ఆదాయం కన్నా వ్యయం ఎక్కువ కాగా మండల పరిషత్‌లు, పంచాయతీల్లో ఆదాయం కన్న ఖర్చు తక్కువైంది. అయితే ఇది సమగ్ర చిత్రం కాదు. స్టేట్ ఆడిటర్ వద్దనున్న సమాచారం ఆధారంగా ఈ గణాంకాలు తయారు చేయబడ్డాయి. ఈ సంస్థలు ఎకౌంట్లను ఎలా తయారుచెయ్యాలో కాగ్ ఒక పద్ధతిని సూచించింది. కాని మండల పరిషత్‌లు, పంచాయతీలు అమలు పరచటం లేదు. రాష్ట్ర ఆడిట్ డైరెక్టర్ ఈ ఎకౌంట్స్‌ను ఆడిట్ చేసి ప్రభుత్వానికి పంపుతుంది కాని ప్రభుత్వం నిద్రపోతోంది. పద్నాలుగు సంవత్సరాల తర్వాత 1989-90 నుంచి 1995-96 వరకు జిల్లా పరిషత్, మండల పరిషత్‌ల పనితీరు గురించి ఆడిటర్ వెలిబుచ్చిన అభ్యంతరాలను దృష్టిలో పెట్టుకొని నివేదికలను శాసనసభ సభ్యులకు ఇటీవల జరిగిన బడ్జెట్ సమావేశంలో అందచేసింది. ఇలా ఆలస్యంగా అందచేసినందుకు కారణాలను ముఖ్యమంత్రి నివేదించినా, ఆ నివేదిక చదివితే ప్రభుత్వ యంత్రాంగం అసమర్థతనే తెలియజేస్తోంది. కాగ్ నివేదికలకు ప్రభుత్వ జవాబును ఐదు సంవత్సరాల తరువాత అందజేస్తున్న ప్రభుత్వం పంచాయతీ రాజ్ గురించిన సమాచారాన్ని పద్నాలుగు సంవత్సరాల తర్వాత అంద చేయటం - ఇదేమి పరిపాలన అని పెదవి విరవడం సామాన్యుల వంతవుతోంది.

రాష్ట్ర ప్రభుత్వ ప్రణాళికలను రాష్ట్ర స్థాయిలో రచన చేస్తోంది. ఇది సరికాదని, ప్రతి గ్రామం నుంచి ఆయా గ్రామాల అవసరాలను దృష్టిలో ఉంచుకొని, నివేదికలను తయారు చేయాలని, వాటి ఆధారంగా రాష్ట్ర ప్రణాళిక తయారు చేయాలని, ఆదేశాలున్నా అందుకుగాను జిల్లా ప్రణాళిక సంఘాలు ఏర్పాటు చేయాల్సి ఉన్నా వాటిని ఏర్పాటు చేయనేలేదు (2005-06).

పౌర సౌకర్యాల కోసం, అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు పరచని పథకాలను చేపట్టడం కోసం పదకొండవ ఫైనాన్స్ కమిషన్ 2000-05 కు రు. 8000 కోట్లు కేటాయించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేయాల్సిన కేటాయింపులను నిర్ధారించింది. కాని కేంద్రం రాష్ట్రానికి రు. 870 కోట్లు మాత్రమే విడుదల చేయగా స్థానిక సంస్థలకు రు. 785 కోట్లు మాత్రమే విడుదల చేసారు. దీనిని బట్టి గ్రామీణ ప్రజల మీద ప్రభుత్వం చూపించే ప్రేమ ఏపాటిదో అర్థమవుతుంది. పోనీ, విడుదల చేసిన సొమ్మునయినా ఏయే కార్యక్రమాలకు కేటాయించారో ఆ పనుల కోసం ఖర్చు చేసారా అంటే అదీ లేదు. గ్రామ పంచాయతీ భవనాలు, మార్కెట్లు, కాగితాలు, కలాలు కొనడానికి మళ్లించారు. రెండు కోట్ల రూపాయలు ఖర్చు పెట్టిన వాటికి రసీదుల్లేవు. ప్రతిపక్ష ఉపనాయకులు దేవేందర్ గౌడ్ ప్రాతినిధ్యం వహించే రంగారెడ్డి జిల్లాలో ఆ జిల్లా పరిషత్ కు రు. 111 కోట్లు గ్రాంటు విడుదల చేస్తే అందులో పదికోట్లు ఖర్చు పెట్టకుండా ఫిక్సేడ్ డిపాజిట్లలో పెట్టుబడి పెట్టిన ఫలితంగా, ప్రజలకు అందాల్సిన సౌకర్యాలు అందకుండా పోయాయి. అలాగే గ్రామ పంచాయతుల్లో కంప్యూటర్ వ్యవస్థ ఏర్పాటుకు రు. 13 కోట్లు విడుదల చేయగా, అందులో సగం సొమ్ము ఖర్చు చేయకుండా, ఫిక్సేడ్ డిపాజిట్లలో దాచి పెట్టారు. ఇదీ గ్రాంట్లు ఇస్తే, ఖర్చు చేసిన తీరు. మరి గ్రామాలు ఎలా బాగుపడతాయి?

పరిపాలన బాగుపడాలంటే నిధులు కూడా ఒక ముఖ్య అంశం. ఆ దిశగా రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్లు ఏర్పాటు చేశారు. కేంద్రం రాష్ట్రాలకు నిధుల బదలాయింపుకై ఫైనాన్స్ కమిషన్లు ఏర్పాటు చేసినట్లు, రాష్ట్రాలు స్థానిక సంస్థలకు నిధుల బదలాయింపుకై రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్లు ఏర్పాటయ్యాయి. కేంద్రాన్ని తమ వంతు నిధులు తమకు అందకుండా ప్రవర్తిస్తోందని తప్పుపడుతున్న రాష్ట్రాలు స్థానిక సంస్థలకు నిధులంద జేయడంలో కేంద్రం బుద్ధులే అందిపుచ్చుకున్నాయి. కేంద్రం ఫైనాన్స్ కమిషన్ల నిర్ణయాలను తు.చ. తప్పకుండా ప్రతీ సూచనను అమలుపరిస్తే, రాష్ట్రాలు మాత్రం రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ల ఏర్పాటు, వాటిపనితీరు,

నిర్ణయాలు, అమలు విషయంలో ఎలా సాచివేత వైఖరి అవలంబిస్తుందో చూస్తే, ప్రభుత్వానికి గ్రామీణాభివృద్ధిపై ఎంత చిత్తశుద్ధి ఉందో తెలిసిపోతుంది.

మొదటి ఫైనాన్స్ కమిషన్ 1994లో ఏర్పాటైతే, అది పనిచేయడం ప్రారంభించడానికి నాలుగేళ్లు పట్టింది. రెండవ కమిషన్ 1998లో, మూడవ కమిషన్ జనవరి 2003లో ఏర్పాటయ్యాయి. రెండవ కమిషన్ నివేదిక శాసనసభలో 2002లో అందజేశారు. మూడవ కమిషన్ జనవరి 2003లో ఏర్పాటైంది. ఆరవ సంవత్సరం నడుస్తున్నా, దాని నివేదిక ఇంకా వెలుగు చూడలేదు. మొదటి కమిషన్ సిఫార్సుల్లో మూడింత ఒక వంతు సిఫార్సులను ప్రభుత్వం చెత్తబుట్టలో పారేసింది లేదా అరకొరా అంగీకరించింది. ఇతర సిఫార్సులను అంగీకరించినా, అమలుకు నోచుకోలేదు. రెండవ ఫైనాన్స్ కమిషన్ చేసిన 18 సిఫార్సుల గురించి ఆలోచించడాన్ని వాయిదా వేస్తే, మరో 12 సిఫార్సులను మరింతగా పరిశీలించడాన్ని పెండింగ్‌లో పెట్టింది. పంచాయతీలకు బదలాయించాల్సిన 29 అధికారాలను ఇప్పటికీ పూర్తిగా అమలు చేయకుండా వాయిదాలు ఎలా వేస్తూ వచ్చిందో అందరికీ తెలిసిన విషయమే.

రాష్ట్ర కమిషన్లు అందచేసిన సిఫార్సులు ఎలా అమలు జరుగుతున్నాయోనని నెల్లూరు జిల్లా పరిషత్, చత్తిరాజేరు మండలాలకు వెళ్లి పరిశీలిస్తే ఆ రెండు సంస్థలకు విడుదల చేసిన మొత్తంలో రు. 43 లక్షలు ఖర్చు చేయానూలేదు; తిరిగి ప్రభుత్వానికి వాపస్ ఇయ్యనూలేదు. యథారాజా తథా ప్రజా అన్నారు. కేంద్రం ఇచ్చే నిధులను రాష్ట్రం సరిగ్గా ఇలాగే చేస్తోంది. పంచాయతీరాజ్ సంస్థలు ఎక్కడ తమ చేతుల్లో నుంచి జారి పోతాయో, ఎక్కడ తమ పెత్తనానికి ఫుల్‌స్టాప్ పెడతాయోనని, వాటికిచ్చే నిధుల విడుదల తమ అధీనంలో ఉంచుకొంది రాష్ట్ర ప్రభుత్వం. ఆ నిధుల విడుదల కోసం ఆ సంస్థల అధికార, అనధికార ప్రతినిధులు, రాష్ట్ర అధికారుల, మంత్రుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ రావటం జరిగేది. కేంద్ర ఫైనాన్స్ కమిషన్ పుణ్యమా అంటూ ఆ అవస్థ చాలవరకు తగ్గింది. కమిషన్ ఈ నిధులను నేరుగా అందచేయాలని, కేటాయింపులు నిర్దేశించింది. రాష్ట్ర ప్రభుత్వం ఏయే నిధులు ఈ సంస్థలకు నేరుగా అందచేయాలో, వాటిని బడ్జెట్‌లో చూపించాలి. కాని ఆ నిధులన్నీ నేరుగా ఈ సంస్థలకు విడుదల చేయటం లేదు. ప్రధాని గ్రామ స్వరాజ్ యోజన, రూరల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ఫండ్ లాంటి నాలుగు పథకాల కింద నేరుగా పంచాయతీరాజ్ సంస్థలకు విడుదల చేయకుండా ఆయా సంస్థల ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పేర (వీరు హైదరాబాద్‌లో కూర్చొనే పంచాయతీరాజ్ ఇంజనీర్-ఇన్-చీఫ్‌కు లోబడి పనిచేస్తారు) విడుదల చేయటం జరుగుతుంది. ఈ కార్యక్రమాల నిధులు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ అధీనంలో ఉంటాయి. పరిపాలనా వికేంద్రీకరణ ఇలాగేనా ఏలికలు సెలవియ్యాలి.

ఈ వివరాలు, ఈ లోటుపాట్లు అన్ని నేనేమీ పరిశోధించి తెలుసుకొన్నవి కావు. ఇవన్నీ కాగ్ నివేదికలో ఉన్న విషయాలే. ఇచ్చిన అడ్వాన్సులు వసూలు చెయకపోవటం, ఉత్పత్తికి తోడ్పడని ఖర్చు, చేసిన కేటాయింపులు ఖర్చు చేయకుండా బ్యాంకుల్లో జమచేయటం వల్ల ప్రజలకు ఏర్పడిన సౌకర్యాల కొరత, ఒక పథకానికి డబ్బు కేటాయిస్తే మరో పథకానికి నిధులను మళ్ళించటం, వేసిన పన్నులు వసూలు చేయకపోవటం వల్ల రు. 1968 లక్షల నిధుల ఫలితాలు ప్రజలకు దక్కకుండా పోయాయి. పంచాయతీరాజ్ సంస్థలకు అధికారాలు, నిధులు, సిబ్బందిని చట్టప్రకారం బదలాయించకపోవటం రాష్ట్ర ప్రభుత్వం కావాలని చేసిన తప్పయితే, మిగతావన్ని రాష్ట్ర జిల్లా స్థాయి అధికారుల ఖాతాలో వెయ్యాల్సి ఉంది. చంద్రబాబు పాలనలోనూ ఇదే తంతు, ఇప్పుడు మీ పాలనలో కూడా అంతే. ఈ సంస్థల గోడును ఎవరికి వినిపించాలి.

పైన చేసిన విశ్లేషణ అంతా కాగ్ నివేదిక ఆధారంగా చేసినదని చెప్పుకొన్నాం. ఇప్పుడు రాష్ట్ర ఆడిట్ శాఖ జిల్లా పరిషత్‌లు, మండల పరిషత్‌ల పనితీరు గురించి ఆ శాఖ చెప్పిందే చూద్దాం. 1989-90 నుంచి 1995-96 వరకు (1990-91 మినహాయించి) ఆదాయ వ్యయాలను పరిశీలిస్తే ఆదాయం రు. 9443 కోట్లయితే వ్యయం రు. 9038 కోట్లుంది. ఖర్చయితే చేశాయి గాని ఎలా చేశాయి, ఎకౌంట్లు సరిగా ఉన్నాయా, జవాబుదారీతనం ఉందా అని విశ్లేషించగా రు. 2484 కోట్లు ఖర్చుకు ఆడిట్ శాఖ రకరకాల అభ్యంతరాలు తెలియజేసింది. అంటే మొత్తం ఖర్చులో 27 శాతం ఖర్చుకు పారదర్శకత లేదన్నమాట. రు. 12 కోట్ల ఖర్చుకు రశీదులే లేవు. ఈ సంస్థలన్నీ ప్రతి నెల తమ జమా ఖర్చులను ట్రెజరీ లెక్కలతో సరిచూసుకోవాలని ఆదేశం ఇచ్చినా అమలుకాలేదు. పైన ఉదహరించిన సంవత్సరాలన్నిటి గురించి విశ్లేషించటం స్థలాభావం వల్ల సాధ్యం కాదు కాని 1995-96 ఎకౌంట్ల గురించి ఈ శాఖ ఏం చెప్పిందో చూసేఇది పరిపాలనేనా అని అనిపిస్తుంది.

- రు. 3,191 లక్షల మేరకు ప్రభుత్వం ఇచ్చిన గ్రాంట్లను ఖర్చు చేయనూలేదు; తిరిగి రాష్ట్ర ప్రభుత్వానికి జమచేయనూలేదు.
- ఆడిట్ శాఖ కొన్ని పద్దుల గురించి కొన్ని అభ్యంతరాలు తెలియచేస్తే దానికి ఈ సంస్థలు జవాబివ్వాలి. రు. 40,168 లక్షలకు అలాంటి అభ్యంతరాలు ఎత్తి చూపితే, వాటికి ఈ సంస్థలు జవాబులే ఇవ్వలేదు.
- ఈ సంస్థలకు రు. 471.46 లక్షల బాకీలున్నాయి. అవి వసూలు చేయలేదు.
- రు. 14.85 లక్షలు మిస్ అప్రాప్రియేషన్ అయింది. ఆ మొత్తాన్ని దిగమింగినవారి నుంచి వసూలూలేదు, వారిపై చర్యలూ తీసుకోలేదు.
- రు. 285 లక్షలు బాధ్యతారహితంగా, అసాధారణంగా ఖర్చు చేయటం జరిగింది.
- ప్రభుత్వం లేక పై అధికారుల అనుమతి లేకుండా పోస్టులు సృష్టించటం వల్ల రు. 56.65 లక్షల ఖర్చును ఆడిట్ అనుమతించలేదు.
- వేతనాల చెల్లింపుల్లో రు. 126 లక్షలు అదనంగా చెల్లింపు జరిగింది. ఈ మొత్తాన్ని అందుకొన్నవారు తిరిగి వసూలు చేయాలి కాని చేయలేదు.
- లీవ్ ట్రావెల్ కన్సెషన్ బిల్లులు చాలా సందర్భాల్లో ప్రయాణం టికెట్లు జతపరచకుండా, కొంతమంది అర్హతలేని వారికి ఈ కన్సెషన్ అమలు పరచటం వల్ల జరిగిన ఖర్చు రు. 51 లక్షలు. ఈ మొత్తం వసూలు విషయంలో తగిన చర్యలు తీసుకోవాలి.

ప్రజాస్వామిక పద్ధతిలో కంపెనీలు నిర్వహించాలనీ, కంపెనీ లాభాలు కార్మికులకు, ప్రజలకు దక్కాలని, నిబద్ధతో పనిచేయగల సంఘాలే కార్మికోద్యమానికి దిశా నిర్దేశన చేయగలవని అంటున్నారు ఎం. కోదండరామ్

సంస్కరణల యుగంలో సింగరేణి కార్మికోద్యమం

సంస్కరణల యుగంలో కార్మికోద్యమం ఎదుర్కొంటున్న సమస్యలను, సవాళ్లను అర్థం చేసుకోవడానికి సింగరేణి మంచి కేస్‌స్టడీ కాగలదు. ఎందుకంటే సింగరేణి దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద పబ్లిక్ రంగ సంస్థ. ఈ సంస్థలో సుదీర్ఘమైన కార్మికోద్యమం ఉన్నది. భిన్న దృక్పథాలతో పనిచేసే కార్మిక సంఘాలున్నాయి. సమాజంలో వచ్చిన మార్పులకు సింగరేణి కార్మికులు స్పందించినంతగా మరొక కంపెనీ కార్మికులు స్పందించలేదు. కనుక సరళీకరణ యుగంలో వచ్చిన మార్పులను ఎదుర్కోవడంలో వచ్చిన సమస్యలను తెలుసుకోవడానికి సింగరేణి కార్మికోద్యమ అధ్యయనం తోడ్పడగలదు.

పెట్టుబడిదారుకు పెట్టుబడి ఎంత కీలకమో కార్మికులకు సంఘం అంతే ముఖ్యం. సంఘం లేకుండా సంఘటితం కాకుండా కార్మికులు హక్కులను సాధించుకోలేరు, సాధించినవాటిని నిలబెట్టుకోలేరు. సంఘం ఉంటే తప్ప కార్మికుడు మనిషితీరుగ బతుకలేరు. అందుకే కార్మికులు ఉద్యోగం పోయినా, ప్రాణాలు పోయినా సంఘాన్ని వదులుకోరు. ఎందుకంటే సంఘంపోతే బానిస వలె బతుకవలసి వస్తది.

భారతదేశంలో కార్మికోద్యమం బ్రిటిష్ కాలంలోనే పుట్టింది. అప్పటికి, ఇప్పటికీ చాలా చోట్ల కార్మికులంతా రైతు, రైతుకూలీ కుటుంబాల నుండి వచ్చినవారే కాబట్టి రైతాంగ ఉద్యమం నుండి స్ఫూర్తిని పొంది కార్మికులు సంఘటితమయ్యారు. పైగా గ్రామాలలో దొరలకు, ఇతర అణగారినవర్గాలకు మధ్య ఎటువంటి సంబంధాలు ఉండేవో, ఫ్యాక్టరీలలోను, గనులలోను యజమానులకు, అధికారులకు, కార్మికులకు మధ్య అటువంటి సంబంధాలే ఉండేవి. కనుక రైతాంగ ఉద్యమం అనుసరించిన పద్ధతులను, లేవనెత్తిన డిమాండ్లను కార్మికోద్యమం కూడా స్వీకరించింది.

సింగరేణిలో కూడా ఇదే జరిగింది. గ్రామాలలో దొరల, భూస్వాముల పీడనను తట్టుకోలేక చాలామంది ఎస్.సి.లు సింగరేణిలో చేరినారు. సింగరేణిలో పనిచేయడమంటే మృత్యువును కోరుకోవడమే. అయినా సింగరేణిలో పనికి ఒప్పుకున్నారంటే గ్రామాల్లో ఎంత పీడన ఉండేదో అర్థం చేసుకోవచ్చు. తక్కువ జీతాలు రక్షణలేని బతుకు, భద్రత లేని ఉద్యోగం, ముక్తసరిగా ఇదీ సింగరేణి కార్మికుని జీవితం. ఈ పరిస్థితి నుంచి బయటపడటానికే సింగరేణి కార్మికులు తెలంగాణ సాయుధ పోరాటంతో స్ఫూర్తి పొంది సంఘటితమయ్యారు. సంఘాన్ని నిలబెట్టుకోవడానికే ఎంతో పోరాటం చేశారు. ఎందరో ప్రాణాలను బలిదానం చేసిన ఫలితంగా యూనియన్ నిలబడింది. ఆ యూనియన్ పోరాటాల ఫలితంగానే చివరకు కార్మికులకు ఉద్యోగభద్రత వచ్చింది. జీతాలు కూడా పెరిగినాయి.

- రు. 3,225 లక్షల ఖర్చుకు నిదర్శనాలు చూపలేదు.
- రు. 316 లక్షలు చెల్లింపులకు, ముట్టినట్లు రసీదులు లేవు.
- రు. 187 లక్షల విలువగల పనులను టెండర్లు పిలవకుండా చేపట్టారు.
- రు. 2733 లక్షల విలువగల పనులను పూర్తిచేశారు. కాని వాటికి సంబంధించిన ఎస్టిమేట్లు ఆడిట్ శాఖకు చూపలేక పోయాయి.
- రు. 27 లక్షల మేరకు ఇచ్చిన రుణాలను వంతుల వారీగా చెల్లించలేదు. మరో రు. 116 లక్షల ఓవర్‌డ్యూ వంతులు ప్రకారం చెల్లించలేదు. రు. 734 లక్షల మేరకు ఉద్యోగులకిచ్చిన రుణాలు మూడేళ్ళ నుంచి వసూలు చేయలేదు.
- నిర్దేశించిన పనులకు, ఆ పనులకు కావల్సిన మెటీరియల్స్ కోసం రు. 2.83 కోట్లు చెల్లించారు కాని అందుకు సంబంధించిన ఎటువంటి ఎస్టిమేట్లు, డాక్యుమెంట్లు చూపలేకపోయాయి.
- రు. 2.40 కోట్లకు సంబంధించిన ఇతర అభ్యంతరాలు, నష్టాలు, ఎక్కువ చెల్లింపులు వగైరాలను ఆడిట్ శాఖ ఎత్తి చూపింది.

ఒక్క 1995-96లోనే ఇన్నిలొసుగులు, వసూళ్ళలో వైఫల్యం, అధికారికపత్రాలు చూపకపోవటాన్ని ఆడిట్‌శాఖ చూపించందంటే, మొత్తం ఆ రెండు సంవత్సరాల్లో ఎంత సొమ్ము అధికారుల, ఉద్యోగుల, కాంట్రాక్టర్ల జేబుల్లోకి పోయాయో ఊహించుకొంటేనే శరీరం గగుర్పొడుస్తుంది.

ఈ విషయంలో ఉభయ పార్టీలు ఒకరిమీద మరొకరు అస్త్రాలు సంధించుకోనక్కర్లేదు. వారిద్దరి పాలనలోనూ ధోరణీ ఇదే. ఇన్ని కోట్ల రూపాయలు దుర్వినియోగం జరుగుతుంటే పంచాయతీరాజ్ శాఖ, ఆ శాఖ మంత్రి నిద్రపోతున్నారా? ఆయా జిల్లాల్లో జిల్లా పరిషత్, మండల పరిషత్ సమావేశంలో, శాసనసభలో జరుగుతున్నట్లుగా, ఏవో చిన్న చిన్న విషయాల గురించి సభ్యులు కేకలు వేసుకొంటూంటారు. సరే, అలా దెబ్బలాడుకోవటం వారి అజెండాలో అంతర్భాగం. ప్రజా సంఘాలు, ఇతర పార్టీలు దుమ్ము దులపటం జరగాలి. ◆

దేశమంతటా స్వాతంత్ర్యానంతరం కార్మికుల సంక్షేమం కోసం చట్టాలు వచ్చినాయి. ఈ చట్టాలు వచ్చిన తరువాత ఒక లాభం జరిగింది. న్యాయాన్ని కోరుతూ ప్రభుత్వం పైన ఒత్తిడి పెట్టడానికి ప్రాతిపదిక ఏర్పడింది. ఈ చట్టాల ఆధారంగా న్యాయాన్ని కోరడానికి ఆస్కారం కలిగింది. అయితే ఈ చట్టాల పరిధిలో పని చేయాలనుకోవడం వల్ల నష్టం కూడా జరిగింది. చట్టాల ఆధారంగా లెవనెత్తడానికి అవకాశం లేని విషయాలను విస్మరించారు. చట్ట పరిధిలోనే నడుచుకోవడం వలన ఆర్థిక సమస్యలను పరిష్కరించగలిగినా, దొరల ఆధిపత్యాన్ని పోలిన ఆధిపత్యం ఫ్యాక్టరీలలో, గనులలో ఉన్నా దాన్ని ఎదిరించ లేకపోయారు. అంతేకాక చట్ట పరిధిలోకి రాని, రాలేని కాంట్రాక్ట్, టెంపరరీ కార్మికుల సమస్యలను పూర్తిగా విస్మరించారు. ఈ కారణం చేతనే చాలామంది కార్మికుల సమస్యలు అపరిష్కృతంగా మిగిలిపోయాయి.

చట్టాలు వెలుపల అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారానికి, చట్టాల వెలుపల ఉండిపోయిన కార్మికులకు న్యాయాన్ని అందించడానికి 1970లలో దేశవ్యాప్తంగా మూడు భిన్నమైన దృక్పథాలతో మిలిటెంట్ ఉద్యమాలు వచ్చినాయి. మొదటిది దత్తాసామంత్ బొంబాయి మిల్లు కార్మికుల కోసం చేసిన ఆందోళన. రెండవది శంకర్ గుహ నియోగి నిర్మించిన ఉద్యమం. ఇక మూడవది నక్సల్బరీ ఉద్యమ స్ఫూర్తితో వచ్చిన కార్మికోద్యమం. దత్తా సామంత్ నిబద్ధతో కూడిన పోరాటం చేయలేదు. అంతవరకు చట్టబద్ధంగా సాగిన యూనియన్లలో మిలిటెన్సీని ప్రవేశపెట్టడం మినహా కార్మికులను చైతన్యపరడానికి కృషి చేయలేదు. శంకర్ గుహ నియోగికాని మార్క్సిస్ట్ – లెనినిస్ట్ పార్టీలు కాని నడిపిన ఆందోళన స్వభావం వేరు. ఈ రెండు రకాల కార్మికోద్యమాలు కూడా ఆర్థిక పోరాటాలకు పరిమితం కాలేదు. ఫ్యాక్టరీలలో, గనులలో ప్రజాస్వామిక వాతావరణాన్ని పెంపొందించే ప్రయత్నం చేసినాయి. ఫ్యాక్టరీలలో, గనులలో నెలకొన్న ఫ్యూడల్ ఆధిపత్యాన్ని ఎదిరించాయి. ఈ ఉద్యమాలకు మరొక లక్షణం కూడా ఉన్నది. అదేమిటంటే కార్మికులకు మద్దతుగా ఇతర వర్గాలను కూడా కదిలించాయి. ఈ విషయంలో మార్క్సిస్ట్ – లెనినిస్ట్ పార్టీల ప్రభావంతో ఏర్పడిన సంఘాలకన్నా శంకర్ గుహ నియోగి మరింత స్పష్టమైన వైఖరిని అవలంబించారు. ఆయన కార్మికులతో పాటు ఆదివాసులను కూడా సంఘటిత పరిచాడు. రెండు ఉద్యమాలను సమన్వయపరిచాడు.

ఈ పరిణామాల ప్రభావం మన రాష్ట్రంలోనూ చూడవచ్చు. ముఖ్యంగా సింగరేణి కార్మికోద్యమంలో కొత్త పరిణామాలు తలెత్తినాయి. 1960లలో సింగరేణిలో జీతాలు పెరిగాయి. ఎప్పటికప్పుడు పెరుగుతున్న ధరలకనుగుణంగా, మారుతున్న పరిస్థితులకనుగుణంగా జీతాలను సవరించడానికి వేజ్‌బోర్డ్ ఏర్పాటైంది. సరిగ్గా అదే సమయంలో పెట్రోల్ ధరలు పెరగడంతో బొగ్గు వాడకం పెరిగింది. పెరుగుతున్న డిమాండ్‌ను పూర్తి చేయడానికి సింగరేణి కూడా బొగ్గు ఉత్పత్తిని పెంచాలని నిర్ణయించింది. అందుకుగాను అదనంగా కార్మికులను ఎంపిక చేసుకున్నది. ఆనాటి అధికారులు పరుగు పందెంలో గెలిచిన వారికి ఉద్యోగాలిచ్చినారు. మంచి జీతాలు ఉండటం వలన గ్రామాల నుండి రైతులు, రైతుకూలీలు పరుగు పందెంలో పాల్గొని ఉద్యోగాలను పొందారు.

జీతాలు పెరిగినాయి, పని భద్రత కొంచెం మెరుగైంది. కానీ, కార్మికుల పట్ల మేనేజ్‌మెంటు దృక్పథం మాత్రం మారలేదు. దొర పాలేరును చూసినట్టే కార్మికులను మేనేజర్లు చూసేవారు. ఈ సంబంధాన్ని మార్చి, పని పరిస్థితులను ప్రజాస్వామికీకరించడానికి అప్పటికే ఉన్న సి.పి.ఐ., కాంగ్రెస్ యూనియన్లు ప్రయత్నించలేదు. ఈ సమస్య పరిష్కారానికి అప్పటికే పెల్లుబికిన నక్సల్బరీ ఉద్యమ స్ఫూర్తితో సికాస, ఐ.ఎఫ్.టి.యు. వంటి కొత్త కార్మిక సంఘాలు ఏర్పడినాయి. ఆందోళనా పథంలో సాగి ఈ సంఘాలు కార్మికుల ఆత్మగౌరవాన్ని పరిరక్షించే ప్రయత్నం చేసినాయి. అయితే ఈ సంఘాలు నిర్బంధం కారణంగా లీగల్‌గా పనిచేసే అవకాశాన్ని ఉపయోగించుకోలేదు. అసలు గనులలో యాజమాన్యం ఆధిపత్యాన్ని కూలదోయడానికి లీగల్ అవకాశాలను ఉపయోగించే ప్రయత్నం కూడా చేయలేదు. అయినా పని స్థలాల్లో మేనేజ్‌మెంట్ పెత్తందారీ వైఖరిని ప్రశ్నించే క్రమంలో గనులలో మంచి నాయకత్వం ఎదిగింది. అయితే వీరే లీగల్ కార్యకలాపాలకు అప్పటికే ఇతర యూనియన్లతో సంబంధాలను ఏర్పరుచుకున్నారు. వాటిలోనూ పనిచేశారు. అందువలన సాంప్రదాయక యూనియన్లలో కొత్త నాయకత్వం ఎదిగివచ్చింది.

ఆర్థిక సంస్కరణలు వచ్చిన తరువాత గనులలోని ఉత్పత్తి సంబంధాలలో మార్పు చేర్పులు వచ్చినాయి. కార్మికోద్యమంలోను మార్పుల అవసరం ఏర్పడింది. కార్మికుల హక్కులను కుదించకుండా పెట్టుబడిని ఆకర్షించలేమని ప్రభుత్వం నిర్ణయానికి వచ్చింది. అందువలన కార్మికుల హక్కులను రద్దు చేసింది. ఈ మార్పువలన లీగల్‌గానైనా పనిచేయడం, ఉద్యమాలు, ఆందోళనలు నిర్వహించడం కష్టమైంది. సింగరేణిలోను ఈ మార్పులు వచ్చినాయి. 1990లలో సింగరేణిని బి.ఐ.ఎఫ్.ఆర్.కు నివేదించారు. బి.ఐ.ఎఫ్.ఆర్.కు (బోర్డ్ ఫర్ ఇండస్ట్రియల్ అండ్ ఫైనాన్షియల్ రికన్‌స్ట్రక్షన్) దివాళా తీసిన పరిశ్రమ కేసును నివేదిస్తారు. బి.ఐ.ఎఫ్.ఆర్.కు పోయిన ఏ కంపెనీ కూడా బతుకలేదు. బి.ఐ.ఎఫ్.ఆర్. కంపెనీని మూతవేసి ఆ కంపెనీ ఆస్తులను అప్పులు ఇచ్చిన సంస్థలకు పంచుతది. మొదటిసారి బి.ఐ.ఎఫ్.ఆర్.కు సింగరేణి కేసును నివేదిస్తారు. ఉత్పత్తిని, ఉత్పాదకతను పెంచిన అప్పులు తీర్చవలసిందిగా బి.ఐ.ఎఫ్.ఆర్. నివేదించింది. ఇక రెండవసారి 1996లో చంద్రబాబు హయాంలో మరొకసారి బి.ఐ.ఎఫ్.ఆర్.కు సింగరేణి కేసును నివేదించారు.

రెండవసారి బి.ఐ.ఎఫ్.ఆర్.కు నివేదించబడిన తరువాత పని పరిస్థితులు వేగంగా మారినాయి. అందుకు గాను బి.ఐ.ఎఫ్.ఆర్. కేసును సింగరేణి మేనేజ్‌మెంట్ ఉపయోగించుకున్నది. సింగరేణి ఉత్పత్తిని, ఉత్పాదకతను పెంచకపోతే కంపెనీ మూతబడుతుందని ప్రచారం చేసింది. ఉత్పతిని పెంచడానికి కలిసి రాకపోతే కంపెనీని రక్షించలేమని మేనేజ్‌మెంట్ కార్మికులను హెచ్చరించింది. బతుకుదెరువు పోతుందన్న భయానికి కార్మికులు నిస్సహాయులైపోయారు. ఈ పరిస్థితిని ఆసరాగా తీసుకొని మేనేజ్‌మెంట్ స్టాండింగ్ ఆర్డర్స్‌ను మార్చివేసింది. అనుమతి లేనిదే సమ్మె చేయవద్దన్నది. మేనేజ్‌మెంట్‌ను ఎదిరించడం నేరమన్నది. అయినా ఎదురుతిరిగి ప్రశ్నించిన వారిని కక్షపూరిత ధోరణితో బదిలీలు చేసింది.

గత రెండు దశాబ్దాలలో కార్మికుల సమ్మె వలన నష్టపోయిన పనిదినాల సంఖ్య తగ్గిందని, యజమాన్యాల లాకౌట్‌ల కారణంగా నష్టపోయిన పనిదినాల సంఖ్య పెరిగిందని అంటున్నారు బి. రామారావు

ప్రపంచీకరణ సందర్భంలో కార్మికోద్యమాల పాత్ర

ప్రపంచీకరణ అన్న నినాదాన్ని లేవదీసింది ప్రపంచంలోని సంపన్న దేశాలు, వాటి కనుసన్నల్లో నిర్వహింపబడుతున్న ప్రపంచబ్యాంక్ సంస్థలు అన్న సంగతిని మనం ముందుగా గమనంలో ఉంచుకోవాలి. అలాగే 1950, 60 దశకాలలో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అభివృద్ధి చెందుతున్న, బీద దేశాలలో ముఖ్యంగా ఆసియా, ఆఫ్రికా, దక్షిణ అమెరికా ఖండాలలో అంతర్జాతీయ గుత్త వ్యాపారసంస్థలు ఆర్థికంగా, రాజకీయంగా అతిగా జోక్యంచేసుకుని తమకు అనుకూలమైన ప్రభుత్వాల ఏర్పాటుకు జరిపిన ప్రయత్నాలు ఆయా దేశాలలో తీవ్ర వ్యతిరేకతను కలుగజేసిన నేపథ్యంలో 'వ్యాపార సుంకాలపై సర్వజనీన ఒప్పందం' (గాట్) పేరుతో అంతర్జాతీయ వ్యాపార చర్చలు ప్రారంభమైయ్యాయి.

ఈ చర్చల ద్వారా ప్రపంచ దేశాల మార్కెట్లపై తాము అదుపు లేని ఆధిపత్యాన్ని సాధించాలని తద్వారా రాజకీయ లబ్దిని కూడా పొందాలని ప్రపంచ సంపన్న దేశాలు, ముఖ్యంగా అప్పటి జి7 దేశాలు, ఆ దేశాల అంతర్జాతీయ గుత్త సంస్థలు ఆదేశించాయి. వారు ఆశించిన విధంగా గాట్ ఒప్పందం చర్చలు ఫలితాలు లేకుండానే ప్రపంచ వ్యాపార సంస్థగా రూపాంతరం చెందింది. ఈపరిణామ క్రమంలోనే అంతర్జాతీయ గుత్త సంస్థలు పేరుకుపోతున్న తమ లాభాలను ప్రపంచబ్యాంకు ద్వారా వివిధ దేశాలలోని ప్రైవేట్ కార్పొరేట్ సంస్థలకు కొన్ని సందర్భాలలో ఆ దేశాల ప్రభుత్వాలకు అప్పుల రూపంలో అందించే పథకాలు రూపొందింపబడ్డాయి. ఇలా ఇచ్చిన అప్పులు తిరిగి రాబట్టుకునేందుకు వీలుగా ఆయా దేశాల ప్రభుత్వాలు తమ ఆర్థిక, రాజకీయ, సామాజిక విధానాలలో మార్పులు తీసుకురావాలన్న నిబంధనలు

మరొకవైపు ఎన్నికలను నిర్వహించింది. అందులో గెలిచిన వారికి తప్ప వేరెవ్వరికీ కార్మికులకు ప్రాతినిధ్యం వహించే అధికారం లేదన్నది. దానివలన పనిస్థలాల్లో నిరసనతెలిపే అధికారం కార్మికులు కోల్పోయారు. ఎన్నికలు జరిపి మేనేజ్‌మెంట్ ప్రజాస్వామ్యాన్ని పెంచినట్టుగా కబడినా ఎన్నికల ఫలితంగా గనులలో కార్మికులు స్వేచ్ఛను కోల్పోయారు.

ఇట్లా కార్మికుల హక్కులను కాలరాచి, అప్రజాస్వామిక వాతావరణంలో చేజిక్కిన అధికారాన్ని వాడుకొని యాజమాన్యం ప్రైవేటీకరణకు పాల్పడింది. ఉపరితలంలో మట్టిని తొలిగించే పనిని, అంబులెన్సు సర్వీసులను, స్కూళ్లను, వాహన సౌకర్యాలను ప్రైవేటీకరించారు. అందువలన కార్మికులు కంపెనీకి తెచ్చిన లాభం కాంట్రాక్టర్ల జేబుల్లోకి ప్రవహించడం ప్రారంభమైంది.

మరొకవైపు పనిభారం పెరిగి, జీతాలు పెరుగక, కనీస వసుతులు లేక కార్మికుల జీవితం దుర్భరమైంది. ఈ స్థితిగతులకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేసే అవకాశం లేకుండా పోయింది. ప్రజాస్వామికంగా నిరసన తెలిపే అవకాశం లేక కార్మికులు అవమానభారంతో కుంగిపోయారు. తమ దుర్గతికి బాధపడుతున్నారు.

ఈ పరిస్థితుల వల్ల కార్మిక సంఘాలలోకి కొత్త నాయకత్వం రాలేదు. గని స్థాయిలో, పని స్థలాలో పటిష్టమైన నిర్మాణం లేకుండా పోయింది. ఫలితంగా గుర్తింపు సంఘాలు కూడా ఏమీ చేయలేక పోతున్నాయి. గనుల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఇచ్చిన పిలుపుకు మంచి స్పందన వచ్చినా గుర్తింపు సంఘాలు ఆ నిరసనకు వ్యవస్థితమైన రూపం ఇవ్వలేకపోయాయి.

ఈ నేపథ్యంలో తెలంగాణ ఉద్యమం వచ్చింది. తెలంగాణ ఉద్యమం సింగరేణి ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా తెలంగాణ వ్యాపితంగా ప్రచారం చేసింది. కార్మికులకు మద్దతును కూడగట్టింది. సింగరేణి ప్రైవేటీకరణ వలన సింగరేణి లాభాలు ప్రజలకు గాని, కార్మికులకు గాని దక్కడం లేదని, సింగరేణి లాభం కాంట్రాక్టర్ల పాలవుతున్నదని తెలంగాణ ఉద్యమం ప్రజలను చైతన్య పరిచింది. అయితే ఇటు తెలంగాణ ప్రజలను, అటు కార్మికులను కదిలించి బలమైన ఉద్యమాన్ని నడపడంలో తెలంగాణ రాష్ట్ర సమితిగాని, ఇతర తెలంగాణ సంఘాలు గాని విఫలమయ్యాయి. కార్మికులకు ఒక కొత్త మార్గనిర్దేశన చేయడంలో కార్మిక సంఘాలు విఫలమయ్యాయి.

పరిణామాలు ఒక విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. కేవలం జీత భత్యాలనే కాదు ఆత్మగౌరవంతో బతికే పరిస్థితులను కూడా కార్మికులు కోరుతున్నారు. కానీ కాంట్రాక్టర్ల ప్రయోజనాల కోసం యాజమాన్యం కార్మికుల, హక్కులను అణచివేస్తున్నది. ఈ పరిస్థితులలో కంపెనీని కాపాడుకోవాలి. కార్మికుల కష్టార్జితం ప్రజలకు దక్కేటట్టు చూస్తే తప్ప కార్మికుల హక్కులు నిలబడవు. ఆ మార్గంలో కృషి చేయడానికి భూమిక ఏర్పడింది. కాకపోతే నిబద్ధతో కృషి చేసే సంస్థల ఆవశ్యకత ఉన్నది. కనుక ప్రజలను, కార్మికులను సంఘటిత పరిచి ప్రజాస్వామిక పద్ధతిలో కంపెనీని నిర్వహించాలని, కంపెనీ లాభాలు కార్మికులకు, ప్రజలకు దక్కాలన్న డిమాండ్‌తో, నిబద్ధతో పనిచేయగల సంఘాలే కార్మికోద్యమాన్ని దిశా నిర్దేశన చేయగలవు. ◆

రూపొందించబడ్డాయి. వీటికి 'ఆర్థిక పునర్‌నిర్మాణం' అన్న పేరు తగిలించారు. దీనితో బాటుగా తమ ఆర్థిక సహాయం పొందే సంస్థలు, ప్రభుత్వాలు చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలు తమ చెప్పుచేతులలో ఉండేలా అనేక షరతులు రూపొందించారు. ఈ విషగుళికలను ఆకర్షణీయంగా మింగించడానికి ప్రపంచం ముందుకు తీసుకువచ్చిన ముద్దు పేరు 'ప్రపంచీకరణ'.

ప్రపంచీకరణ ద్వారా దేశాల ఎల్లలు (సరిహద్దులు) చెరిగిపోయి ఏ దేశంలోని ఉత్పత్తినైనా ప్రపంచంలోని ఏ మూలనైనా అందుబాటులోకి వచ్చే విధంగా 'మార్కెట్ యంత్రాంగం' దారులు తెరుస్తుందని మురిపించారు. అభివృద్ధి చెందిన దేశాల ఉత్పత్తుల నాణ్యత, ఆయా దేశాల శాస్త్రీయ, సాంకేతిక రంగాల అభివృద్ధి కారణంగా ఉన్నతంగా ఉంటుందని వీరు పోటీని ఎదుర్కొనేందుకు స్థానిక ఉత్పత్తుల నాణ్యత కూడా పెరుగుతుందని నిర్వచించారు. స్వేచ్ఛా మార్కెట్‌లో పోటీ తట్టుకు నిలబడాలంటే నాణ్యత, సరసమైన ధర అవసరమవుతాయని తద్వారా వినియోగదారునికే లాభం కలుగుతుందని బాకాలతో ప్రచారం చేశారు. 'వ్యాపారం' ప్రభుత్వాల బాధ్యత కాదనీ వాణిజ్యం నిర్వహించవలసిన అవసరం ప్రభుత్వాలకు లేదనీ అందువలన ప్రపంచ వ్యాపితంగా అన్ని వాణిజ్య కార్యకలాపాలు, ఉత్పాదన, సరఫరా, ఆర్థిక, సేవా, రవాణా రంగాలన్నీ ప్రైవేట్ సంస్థల ఆధ్వర్యంలో కొనసాగితేనే ఉత్తమ ఫలితాలు అందుతాయన్న సిద్ధాంతాలను ఎడతెరపి లేకుండా ప్రచారంలోకి తీసుకువచ్చారు.

వాస్తవానికి ప్రపంచీకరణ పేరుతో తెరపైకి తీసుకురాబడిన విధానాలన్నీ పెట్టుబడిదారీ వ్యవస్థ సిద్ధాంతాలు మాత్రమే.

ప్రపంచీకరణ నినాదంతో వివిధ దేశాల ఆర్థిక పునర్నిర్మాణ కార్యక్రమాల అమలును ప్రపంచ బ్యాంకు మొదట కొన్ని లాటిన్ (దక్షిణ) అమెరికా దేశాలలోను, ఆసియా దేశాలలోను 1980 దశకంలో అమలు లోకి తీసుకువచ్చింది. 1990 దశకంలో భారత్‌తో సహా అభివృద్ధి చెందుతున్న యితర దేశాలలోను ఆఫ్రికాలోని వివిధ దేశాలలోకి ఈ ఒరవడి ప్రవేశపెట్టబడింది. 21వ శతాబ్దం ప్రారంభం నుండి ఈ పథకాల విస్తరణ కుంటు పడుతూ వచ్చింది. ప్రస్తుతం ఈ పథకం రూపు దిద్దిన సంపన్న దేశాలన్నీ ఆర్థిక అభివృద్ధి తరిగి తిరోగమనంలోకి నెట్టబడు తున్నాయి. ప్రపంచబ్యాంక్ ద్రవ్య నిధులు తరుగుతుండడంతో బంగారు నిల్వలు మార్కెట్లో అమ్మవలసిన పరిస్థితులు ఏర్పడ్డాయి.

అయితే ప్రపంచ వ్యాపితంగా ఈ మూడు దశాబ్దాల కాలంలో ప్రపంచీకరణ విధానం కారణంగా ఉత్పాదక, సేవా, ఆర్థిక రంగాలలో వచ్చిన పరిణామాలు ఈ రంగంలో పనిచేస్తున్న కార్మికులు, ఉద్యోగుల పై దీని ప్రభావం, కార్మికోద్యమం కొత్త పరిణామాలను ఎదుర్కొన్న తీరు మనం పరిశీలించాలి.

ప్రపంచీకరణ వాతావరణాన్ని స్వేచ్ఛా మార్కెట్ల నిర్మాణాన్ని ఆసరాగా చేసుకుని బహుళజాతి సంస్థలు తమ కార్యకలాపాలను, ఉత్పత్తి కేంద్రాలను, వ్యాపార లావాదేవీలను అభివృద్ధి చెందుతున్న దేశాలకు మార్చటం మొదలుపెట్టాయి. కార్మికులు, ఉద్యోగులకు అభివృద్ధి చెందిన దేశాలలో మాదిరి హెచ్చు వేతనాలు చెల్లించవలసిన అవసరం లేకపోవటం, ఈ దేశాల ప్రభుత్వాలు తమ కొత్త కార్యకలాపాలకు అందించే రాయితీల కారణంగా వ్యవస్థాపక ఖర్చులు తమ సంపన్న దేశాల స్థాయికన్నా చాలా తక్కువ ఉండటం దీనికి కారణం. 1990 దశకం నుండి విస్తృతంగా అభివృద్ధి చెందిన 'ఇన్ఫర్మేషన్ టెక్నాలజి' కూడా ఈ విస్తరణకు తోడ్పడింది. ఈ క్రమంలో దేశీయ సంస్థలు, బహుళజాతి కంపెనీలు సంయుక్తంగా ఉత్పాదక, పారిశ్రామిక, సేవా, ఆర్థిక సంస్థలను నిర్వహించటం ప్రారంభమైంది. ఫలితం సంపన్న దేశాలలోని సంస్థల విస్తరణ ఆగింది. ఆ దేశాలలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు తగ్గాయి. బడుగు దేశాలలో పెరిగాయి. కానీ ఈ అవకాశాలు దీర్ఘకాల భద్రతతో కూడినవి కాకపోవటం విశేషం. దినవారీ క్యాజువల్ గానో, కాంట్రాక్టు ఉద్యోగాలు గానో మాత్రమే ఉపాధి అవకాశాలు ఏర్పడుతున్నాయి. చాలావరకు ఉపాధి అవకాశాలు 'ఔట్ సోర్సింగ్' విధానంతో ఏర్పడుతున్నాయి. అంటే ఉత్పాదక సంస్థ యాజమాన్యానికి ఆ సంస్థలు పనిచేసే ఆ సంస్థల కొరకు ఉత్పత్తి చేసే ఉద్యోగులు, కార్మికులకు సంబంధాలు ఉండవు. మధ్యలో దళారీలు, దళారీ సంస్థలు రూపొందుతున్నాయి. ఈ పరిస్థితికి ప్రధానంగా బడుగు దేశాలలో విస్తారంగా నిరుద్యోగం నెలకొని ఉండటమే ప్రధానకారణం. కొత్త ప్రదేశాలలో ఆయా దేశాలలో అమలులో ఉన్న తక్కువ స్థాయి వేతనాలు, భృతి చెల్లించడం ద్వారా మానవ వనరులపై ఖర్చు తగ్గి కార్పొరేట్, బహుళజాతి సంస్థలు విపరీత లాభాలు పొందగలుతున్నాయి.

మన దేశంలో 1980 దశకం చివరలో ఈ ప్రపంచీకరణ గాలులు వీచటం మొదలైంది. 90వ దశకంలో పి.వి నరసింహారావు ప్రధాన మంత్రిగా, ప్రస్తుత ప్రధాని మన్మోహన్‌సింగ్ ఆర్థికశాఖ మంత్రిగా ప్రపంచబ్యాంకు ఆర్థిక సంస్కరణలు, ప్రపంచీకరణ విధానాలు మన దేశంలో అమలులోకి తీసుకురావటం ప్రారంభించారు. తర్వాత కాలంలో వచ్చిన యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం, తదనంతరం ఏర్పడిన ఎన్.డి.ఎ. ప్రభుత్వాలు ప్రస్తుత ప్రభుత్వం కూడా ఈ విధానాలను కొనసాగిస్తు న్నాయి. ఈ కాలంలో కొన్ని పరిణామాలు గమనిద్దాం.

అనేక ప్రభుత్వ రంగ సంస్థలు మూతబడ్డాయి. కమ్యూనికేషన్ రంగంలో ప్రైవేట్‌రంగ విస్తారణ విపరీతంగా జరిగింది. ప్రభుత్వ రంగం బి.ఎస్.ఎన్.ఎల్.కు కుదించబడింది. అలాగే ప్రసారమాధ్యమా లలో ప్రభుత్వ సంస్థల ప్రాధాన్యత ప్రైవేట్ సంస్థలు వెళ్ళనిచోట్ల మాత్రమే కొనసాగుతోంది. గతంలో మన దేశంలో చమురు, గ్యాస్ నిక్షేపాలు లేనే లేవని చెప్పారు. కానీ ఈ క్షేత్రాలు ప్రైవేట్ సంస్థలకు కేటాయించిన అనంతరం నిక్షేపాలు గణనీయంగా బయటపడుతున్నాయి. గతంలో దేశీయ ఉత్పత్తులు మన మార్కెట్లలో విక్రయానికి వీలుగా దాదాపు 1400 వినిమయ సరుకులపై దిగుమతి ఆంక్షలు ఉండేవి. ఇప్పుడు దాదాపు 1200 సరుకులపై ఆంక్షలు ఎత్తివేయబడ్డాయి. అందువల్ల స్వదేశీ ఉత్పత్తి సంస్థలు మూతబడ్డాయి. విదేశీ బహుళజాతి సంస్థల సరుకులు మార్కెట్లో చలామణీ పెరిగింది. నిరుద్యోగం, దారిద్ర్యం పెరిగింది. ఆదాయ వ్యయాల మధ్య అంతరాలు పెరిగాయి. సంపన్న వర్గాలు, కోటీశ్వరులను కుబేరులను సృష్టిస్తుంటే ఇదే కాలంలో రోజుకు రూపాయి ఆదాయంతో బతికే బడుగు వర్గాలు కోటాను కోట్లు పెరుగుతున్నారు. సంపన్న వర్గాలు, పై స్థాయి మధ్య తరగతి వర్గాలకు నగరవాసులకు అవసరమైన వస్తువుల ఉత్పత్తి మార్కెట్లు పెరిగాయి.

బడుగు వర్గాలకు అవసరమైన నిత్యావసర వస్తువుల కొరత, విద్య, వైద్య సేవల అందుబాటు దుర్లభంగా మారుతున్నాయి.

మన రాష్ట్రంలో 1996లో చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ప్రపంచబ్యాంక్‌తో నేరుగా ఆంధ్రప్రదేశ్ ఆర్థిక పునర్నిర్మాణ కార్యక్రమానికై ఒప్పందం కుదుర్చుకొని, కొత్త ఒరవడి సృష్టించారు.

రాష్ట్ర ప్రభుత్వ హయాంలోని 53 ప్రభుత్వరంగ సంస్థల మూసివేతకు అంగీకరించారు. ప్రాథమిక విద్య వరకు రాష్ట్ర ప్రభుత్వ బాధ్యతగాను ఆ పై విద్యా సంస్థల నిర్వహణను ప్రైవేట్ సంస్థలు కొనసాగించాలని నిర్ణయించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, రోగ నిరోధక కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం ముమ్మరంగా నిర్వహించేలాగా, ఇతర వైద్యసౌకర్యాలను ప్రైవేట్ రంగానికి కేటాయించారు. ప్రజా పంపిణీ వ్యవస్థను కుదించటం తెల్లరేషన్ కార్డులను తగ్గించే కార్యక్రమంగా చేపట్టారు. ప్రభుత్వోద్యోగుల సంఖ్యను తగ్గించటానికి అంగీకరించారు. విద్యుత్ ఉత్పాదన, పంపిణీలను, రోడ్డు రవాణా ను ప్రైవేట్ పరం చేయడానికి ప్రణాళికలు రూపొందించి కార్యక్రమాలు ప్రారంభించారు.

దేశ వ్యాపితంగా, రాష్ట్ర స్థాయిలో మధ్యతరగతి ప్రజలకు నష్టదాయకంగా, ఉద్యోగ, కార్మిక వర్గాల గ్రామీణ ప్రాంత బడుగు రైతుల, రైతు కూలీల ప్రయోజనాలకు వ్యతిరేకంగా, సంపన్న వర్గాలకు, దేశీయ, బహుళజాతి కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా 1990 దశకం నుండి ప్రభుత్వ స్థాయి నుండి, ప్రైవేట్ రంగం పారిశ్రామికాధి పతుల నుండి దాడులు పెరిగినా జాతీయస్థాయిలో, రాష్ట్ర స్థాయిలో సంఘటితంగా కార్మిక ఉద్యమం ప్రతిఘటనకు ఐక్యంగా ముందుకు కదలకపోవటం ఒక దురదృష్టకర అంశం. 21వ శతాబ్దం ఆరంభం నుండి జాతీయ స్థాయిలో ఒక మేరకు ఉద్యోగ, కార్మిక సంఘాలు ప్రజాతంత్ర శక్తులతో కలిసి సంయుక్త వేదికగా ఏర్పడినా జాతీయ స్థాయి నిరసన ఆందోళనలు, కొన్ని సమ్మెలు జరిగినా, అవసరమైన మేరకు ఐక్య ప్రతిఘటన ఇప్పటికీ జరగడంలేదని చెప్పాలి.

ఇప్పటికి పరిశ్రమ స్థాయిలో, కొన్ని ప్రతిఘటనలు, కొన్ని సందర్భాలలో పూర్తి ఐక్యతతోనూ, మరి కొన్ని సందర్భాలలో పాక్షికంగాను జరిగాయి. పూర్తి ఐక్యత ప్రదర్శించిన సందర్భాలలో ఉద్యోగ, కార్మిక వర్గాలపై దాడి ఒక మేరకు ఆగింది. కాని పాక్షికంగా జరిగిన సందర్భాల లో మాత్రం పూర్తిగా నష్టం భరించవలసి వచ్చింది. ఈనాడు కమ్యునికేషన్ రంగంలో, ఇన్సూరెన్స్ రంగంలో, విమానయాన రంగంలో, విద్యుత్ రంగంలో కార్మిక, ఉద్యోగ వర్గాలు సంఘటిత ఐక్యతను సాధించని కారణంగా విదేశీ చొరబాటు ఈ రంగాలలో పెరుగుతూ వస్తోంది. బ్యాంకింగ్ రంగంలో నెలకొన్న ఐక్యత కారణంగా గత శతాబ్దకాలంగా ప్రభుత్వ విదేశీ సంస్థలు ప్రజా బ్యాంకింగ్ వ్యవస్థను బలహీనపరిచేందుకు చేసిన ప్రయత్నాలను తిప్పికొట్టగలిగారు.

దేశ ఉత్పాదకత పెరుగుదలకు, జాతీయ సంపద పెంపుదలకు మూడు వర్గాలు చేతులు కలపవలసిన అవసరం ఉంది. ప్రభుత్వం, సంపన్నవర్గాలు, ఉద్యోగ-కార్మిక వర్గాలు. ఇందులో ప్రభుత్వం విధి నిర్ణయాలు చేస్తోంది. ఆ నిర్ణయాలు చేసేటపుడు తమకు కావలసిన రాయితీల గురించి సంపన్నవర్గాలు (దేశీయ, విదేశీ) ప్రభుత్వాన్ని సంఘటితంగా డిమాండ్ చేస్తున్నాయి, సాధించుకుంటున్నాయి. కానీ కార్మిక ఉద్యోగ వర్గాలు మాత్రం దేశ స్థాయిలో, రాష్ట్ర, క్షేత్ర స్థాయిలో తమవాటా అవసరాల గురించి ఉత్పాదకతలో వాటాదారులుగా, దేశ జనాభాలో భాగస్వాములుగా సంఘటితంగా, ఐక్యకంఠంతో తమ డిమాండ్లను ప్రభుత్వం, సంపన్నవర్గాల ముందు ఉంచలేకపోతున్నాయి. పోరాటాన్ని జాతీయ స్థాయిలో నిర్వహించలేకపోతున్నాయి. ఇది మన దేశంలో కార్మిక, ఉద్యోగ వర్గాల ప్రధాన లోపం, బలహీనత.

మనదేశంలో, రాష్ట్రంలో కార్మిక సంఘాలు క్షేత్రస్థాయిలో తమ అస్తిత్వాన్ని కాపాడుకునేందుకు, తమ క్షేత్రస్థాయి సభ్యత్వాలను నిలుపు కునేందుకు మాత్రమే ఆందోళనలు, పోరాటాలు జరుపుతున్నాయి. తమ పరిశ్రమ స్థాయి ఫెడరేషన్‌లు ఉన్నా, జాతీయ స్థాయి కేంద్రాలు ఉన్నా దురదృష్టవశాత్తూ వివిధ రాజకీయ పార్టీల ప్రభావాలతో అవి పనిచేస్తున్న కారణంగా సంఘటిత ఐక్యతను సాధించటం అసాధ్యమవుతోంది. అలాగే పాలక పార్టీల ఉపాంగాలుగా ఉన్న కార్మిక సంస్థలు, పాలకపార్టీ వ్యతిరేక ఉద్యమాలలో పాల్గొనటానికి సంసిద్ధంగా లేకపోవటం ఉద్యోగ కార్మిక ఉద్యమానికి ఒక శాపంగా ఉంది. బ్రిటిష్ పాలన చివరి భాగం నుండి, స్వాతంత్ర్యం అనంతరం సాధించుకున్న కార్మిక సంఘ హక్కులు, ఎనిమిది గంటల పని, సంక్షేమ పథకాలు, విద్యా, వైద్య సౌకర్యాలు, ఉద్యోగ భద్రత వంటి అంశాలను అమలు జరిపించే ప్రభుత్వ యంత్రాంగం రెండు దశాబ్దాలుగా బలహీనమయిపోయింది. చట్టపరమైన త్రైపాక్షిక సంఘాలు, కమిటీలు పనిచేయటంలేదు. అమలు జరిపే యంత్రాంగం కనుమరుగవుతోంది. ఈ రెండు దశాబ్దాలలో కార్మికుల, ఉద్యోగుల సమ్మెల కారణంగా నష్టపోయిన పనిదినాల సంఖ్య తగ్గిపోయింది. యాజమానుల లాకౌట్‌ల కారణంగా నష్టపోయిన పనిదినాల సంఖ్య పెరిగింది.

'ప్రపంచ కార్మికులారా ఏకం కండి! పోరాడితే పోయేదేమీ లేదు బానిస సంకెళ్ళు తప్ప' అన్న నినాదం కార్మిక వర్గానిది, పెట్టుబడిదారులదీ ప్రభుత్వాలదీ కాదు.

ఇప్పటికైనా ఉద్యోగ, కార్మిక ఉద్యమాలు జాతీయ స్థాయిలో ఆలోచించాలి. ఒక సంస్థలో కనీస వేతనం నెలకు రు. 1500, మరొక రంగంలో రు. 3000, ఇంకొక చోట రు. 6000, మరొక చోట రు. 20,000లుగా అసమానతలను నిరోధించే దిశగా ఈ ఉద్యమాలు ఐక్యం కావాలి. ఎనిమిది గంటల పని దినాన్ని అవకాశం ఉంటే ఏడు లేక ఆరు గంటలకు దించేందుకు వారానికి 48 బదులు, 42 గంటలకు తగ్గించేలా కృషి చేయాలి. ఉత్పత్తి పెంచటం అంటే 48 గంటలను వారానికి 60 గంటలు చేయటం కాదు. షిఫ్టును రెండు లేక మూడు షిఫ్టులకు పెంచాలి. దీనితో నిరుద్యోగం కూడా తగ్గాలి. కార్మిక, ఉద్యోగ కుటుంబాల విద్య, వైద్య సౌకర్యాలు యాజమాన్యం బాధ్యతగా నూతన విధానం రూపొందాలి. కార్మికుడు తన ఉద్యోగ విరమణ లోగా స్వంత వసతి సౌకర్యం కలుగజేసుకునే పథకాలను ప్రభుత్వాలు రూపొందించాలి. ఉద్యోగ విరమణ అనంతరం సామాజిక బాధ్యతగా, వృద్ధాప్య వైద్య సౌకర్యాలపై ఇప్పటికైనా పాలకవర్గాలు బాధ్యత వహించాలి. దేశం అభివృద్ధి అంటే సంపన్నవర్గాల అభివృద్ధి మాత్రమే కాదు, మొత్తం జనాభా అభివృద్ధి. ఈ దిశగా ఉద్యోగ, కార్మిక వర్గాల అభివృద్ధికి కృషిచేసేలా జాతీయ స్థాయిలో, రాష్ట్ర స్థాయిలో, పరిశ్రమ స్థాయిలో కృషి, ఆందోళన జరిపే దిశగా కార్మిక ఉద్యమ స్వరూపం, ఆలోచన ప్రణాళికలలో మార్పు అవసరం. ◆

కార్మికులపై ప్రపంచీకరణ క్రమం ఏయే రూపాలలో దాడులు చేస్తోందో, ఆ దాడులకు కార్మికవర్గం కనీస ప్రతిఘటన కూడ ఎందుకు ప్రదర్శించ లేకపోతుందో అర్థం చేసుకుంటే సమస్య పరిష్కారానికి మార్గాలు వెదకవచ్చని అంటున్నారు ఎన్. వేణుగోపాల్

ప్రపంచీకరణ సందర్భంలో కార్మికోద్యమం

దేశంలో సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ, నూతన ఆర్థిక విధానాలు ప్రారంభమయిన తొలిరోజుల్లో ఈ విధానాల వల్ల కార్మికోద్యమం ఎటువంటి మార్పులకు, సమస్యలకు, సంక్షోభానికి గురి అవుతుందోననే ఆందోళన కొంత ఉండింది. ప్రపంచీకరణ వల్ల కార్మికవర్గం మొత్తంగానూ, కార్మికోద్యమం ప్రత్యేకంగానూ ఎదుర్కోనున్న సవాళ్ళ గురించి అటు దేశవ్యాపిత సంఘటిత కార్మిక సంఘాలు, ఇటు కిందిస్థాయి, అసంఘటిత కార్మిక ఉద్యమ సంస్థలు, కొందరు ఆలోచనాపరులు కూడ చాలా తీవ్రంగా ఆలోచించారు. ప్రపంచీకరణ – మూడవ ప్రపంచ దేశాల కార్మికోద్యమాలు అనే అంశం మీద చాలా చర్చ జరిగి, వ్యాసాలు పుస్తకాలు వెలువడ్డాయి. కాని క్రమక్రమంగా ఆ చర్చ వెనుకపట్టు పట్టినట్టుంది. ప్రపంచీకరణ క్రమం కార్మికోద్యమాన్ని లోపలినుంచీ బయటినుంచీ కూడ తొలిచివేయడం మొదలయింది. పని పరిస్థితులలో మార్పులు, పెరుగుతున్న నిరుద్యోగ సైన్యం, దివాళాకోరు నాయకత్వం, కార్మిక, ఉద్యోగ వర్గాలలో మధ్యతరగతి భావజాలం, వినియోగదారీ సంస్కృతి పెరిగి కార్మికులలో శిష్టవర్గం (లేబర్ అరిస్టోక్రసీ) తలెత్తడం వంటి పరిణామాలతో కార్మికోద్యమం బలహీనపడడం మొదలయింది. నూతన ఆర్థిక విధానాలు ప్రారంభమై పదహారు సంవత్సరాల తర్వాత ఇప్పుడు చూస్తే దేశవ్యాపితంగా గాని, రాష్ట్రంలో గాని కార్మికోద్యమం బలంగా ఉన్నదని చెప్పగల స్థితి మాత్రం లేదు. తమ కొత్త కోర్కెలమీదనో, పని పరిస్థుతులు మెరుగుపరచమనో, జీతభత్యాలు పెంచమనో ఆందోళనలు చేయడం అలా ఉంచి, తమ మీద పెద్ద ఎత్తున సాగుతున్న దాడులను ఎదుర్కోగల చేవ కూడా కార్మిక, ఉద్యోగవర్గాలకు లేకుండాపోయింది.

కార్మిక, ఉద్యోగ వర్గాలమీద ప్రపంచీకరణ క్రమం ఏయే రూపాలలో దాడులు చేస్తూ వస్తున్నదో ఆ దాడులకు కనీస ప్రతిఘటన కూడ చూపలేని దుస్థితికి కార్మికవర్గం ఎలా దిగజారిపోయిందో అర్థం చేసుకుంటే ఈ స్థితినుంచి బయటపడడానికి ఏమయినా అవకాశాలున్నాయేమో ఆలోచించవచ్చు.

ప్రపంచీకరణ క్రమంలో ప్రైవేటీకరణ చాల ప్రధానమైన భాగం. ప్రభుత్వ రంగ ప్రాధాన్యాన్ని తగ్గించడం, ప్రభుత్వరంగ సంస్థలను మూసివేయడం, వాటినుంచి ప్రభుత్వ పెట్టుబడులను ఉపసంహరించడం వాటిని ప్రైవేట్ వ్యాపారవేత్తలకు, బహుళజాతి సంస్థల దళారీలకు అప్పగించడం, కొత్త సంస్థలన్నిటినీ ప్రైవేట్ రంగంలోనే ప్రోత్సహించడం వంటి పరిణామాలన్నీ నూతన ఆర్థిక విధానాలలో విపరీతంగా జరిగిపోయాయి.

ఈ ప్రైవేట్‌రంగ పారిశ్రామిక, వ్యాపార విజృంభణవల్ల ఆర్థిక రంగంలో వచ్చిన మార్పులను గురించి ఇక్కడ అప్రస్తుతం గాని, కార్మికుల పని పరిస్థితుల విషయంలో, జీతభత్యాల విషయంలో, హక్కుల విషయంలో, సంఘటిత కార్మికోద్యమం విషయంలో ఈ ప్రైవేటీకరణ చాల లోతయిన మార్పులు తీసుకువచ్చింది. అప్పటివరకూ ప్రభుత్వం రంగంలో అరకొరగానయినా ఉండిన ఉద్యోగభద్రతకు, సామూహిక బేరసారాల అవకాశాలకు, సంఘటిత నిర్మాణాలకు ప్రైవేట్‌రంగంలో అవకాశం లేకుండాపోయింది. ప్రైవేట్ సంస్థలు పెరిగినకొద్దీ కార్మికోద్యమ శక్తి సన్నగిల్లుతూ వచ్చింది. ప్రైవేటీకరణ ప్రమాదాన్ని ముందుగానే గుర్తించి దాని గురించి విస్తృత ప్రచారం చేయడంలో, ఎదుర్కోవడంలో, కార్మికులందరినీ సమీకరించడంలో సంఘటిత కార్మిక సంఘాలు తగినంత చొరవను ప్రదర్శించలేకపోయాయి. దానితో క్రమంగా ప్రైవేటీకరణ మొత్తం కార్మికవర్గాన్నే ముంచెత్తింది.

ఒకవైపు కార్మికవర్గాన్ని ప్రపంచీకరణ ప్రమాదం ఇలా ముంచెత్తు తుండగా దేశంలోని కార్మికోద్యమం రాజకీయాల ప్రాతిపదికపైన, పరిశ్రమల ప్రాతిపదికపైన, పరిశ్రమలోని కార్మికుల, ఉద్యోగుల హోదాల ప్రాతిపదికపైన, కుల, మత, ప్రాంత, భాషా ప్రాతిపదికలపైన చీలికలు పేలికలుగా మారిపోయింది. ఆయా కార్మికులకు ఉండే నిర్దిష్ట సమస్యల వల్ల కొన్ని సందర్భాలలో విభిన్న నిర్మాణాలు కూడ అవసరం కావచ్చు గాని సందర్భం వచ్చినప్పుడు ఉమ్మడి శత్రువుకు వ్యతిరేకంగా ఆయా భిన్న నిర్మాణాల మధ్య ఐక్యత అనివార్య అవసరమవుతోంది. భారత కార్మికోద్యమంలో అటువంటి ఐక్యత ప్రదర్శితమైన సందర్భాలు చాలా తక్కువ. ఒక సంఘం సమ్మెకు పిలుపు ఇస్తే, అందుకు ఎంత న్యాయమైన కారణాలున్నప్పటికీ ఇతర సంఘాలు తప్పనిసరిగా ఆ సమ్మెను భగ్నం చేయడానికి ప్రయత్నించడం మామూలయిపోయింది. యాజమాన్యాలు, ప్రభుత్వం ఇతర సంఘాలను లొంగదీసుకొని, కార్మికోద్యమాన్ని విచ్ఛిన్నం చేసి తమ పబ్బం గడుపుకోవడం మామూలయిపోయింది.

ఈ సమస్య ప్రపంచీకరణ తర్వాత మరింత పెరిగిపోయింది. ప్రపంచీకరణ తర్వాత యాజమాన్యాలు, ప్రభుత్వాలు కొత్త భాష నేర్చుకున్నాయి. కొత్త వనరులు సంపాదించాయి. యాజమాన్యాల దగ్గర, ప్రభుత్వాల దగ్గర అందుబాటులోకి వచ్చిన కొత్త వనరుల వల్ల సంఘాల నాయకత్వాలను, క్రియాశీల కార్యకర్తలను కొనివేసే, మచ్చిక చేసుకునే

అవకాశాలు పెరిగిపోయాయి. కాంగ్రెస్ అనుబంధ సంస్థ అయిన ఐ.ఎన్.టి.యు.సి. బహిరంగంగా ప్రపంచీకరణ విధానాలను సమర్థిస్తుండగా, ఇతర రాజకీయ పక్షాలన్నీ కూడ ప్రపంచీకరణ విధానాలను అమలు చేస్తున్నవే గనుక వాటి అనుబంధ కార్మిక సంఘాలు ద్వంద్వ వైఖరులను ప్రకటిస్తున్నాయి.

ప్రైవేటీకరణతో పాటు వచ్చిపడిన మరొక పెద్ద ప్రమాదం ఉత్పత్తి పద్ధతులలో వచ్చిన మార్పులు. పనిని చిన్న చిన్న ముక్కలుగా విడగొట్టడం, అనేకమంది కాంట్రాక్టర్లకు, సబ్‌కాంట్రాక్టర్లకు అప్పగించడం, అసలు ఉత్పత్తి సంస్థలకు కార్మికులకు ఎటువంటి సంబంధం లేకపోవడం, కార్మికులు ఒకేచోట సంఘటితంగా ఉండలేని పరిస్థితులు కల్పించి చిన్న చిన్న సంస్థలలో, ఇళ్లలో పని అప్పగించడం, దాన్ని స్త్రీలు, చిన్న పిల్లలు చేయడం వల్ల సంఘటిత నిర్మాణం లోకి రాలేకపోవడం వంటి పరిస్థితులు తలెత్తాయి. ఇటువంటి కాంట్రాక్టు, కాజువల్, గృహ ఉత్పత్తి పద్ధతిని కార్మిక సంఘాలు మొదటినుంచీ వ్యతిరేకించి ఉండవలసింది. ఈ పద్ధతులకు వ్యతిరేకంగా కార్మికవర్గాన్ని మొత్తంగా జాగృతం చేయవలసి ఉండింది. ఈ రకమైన ధోరణులు పెరిగిపోతూ ఉన్నప్పుడు కాంట్రాక్టు, కాజువల్, గృహ శ్రామికులను కూడ సంఘటిత నిర్మాణాలలోకి తీసుకువచ్చే ప్రయత్నం చేసి ఉండవలసింది. వామపక్ష ట్రేడ్ యూనియన్లతో సహా జాతీయ కార్మిక సంఘాలన్నీ ఈ పనిలో విఫలమయ్యాయి. ఒకవైపు ఇలా ఇబ్బడిముబ్బడిగా పెరుగుతున్న అసంఘటిత కార్మిక రంగం, సంఘటిత కార్మిక రంగంలో, ముఖ్యంగా నాయకత్వంలో పెరుగుతున్న నిర్లిప్తత కలిసి మొత్తంగా కార్మికోద్యమ బలహీనతకు దారి తీశాయి. ఇంతకాలమూ అసంఘటిత రంగంగా గుర్తించబడిన ఈ రంగాల శ్రామికులను పటిష్ఠమైన నిర్మాణాలలో సంఘటిత పరచినప్పుడు మాత్రమే వారి పని పరిస్థితులను మెరుగు పరచడానికి వీలవుతుంది. ఆ విధంగా మాత్రమే కార్మికోద్యమంలో అంతకంతకూ ఎక్కువమంది భాగస్వాములు కావడానికి, కార్మికోద్యమం బలపడడానికి వీలు కలుగుతుంది.

అసంఘటిత కార్మికరంగం పెరుగుదలలో ముఖ్యమైన అంశం గత రెండు దశాబ్దాలలో గ్రామాల నుంచి పట్టణాలకు విపరీతంగా పెరుగుతున్న వలసలు, పెరుగుతున్న పట్టణీకరణ. ఈ విధంగా లక్షలాది మంది శ్రామికులు పట్టణాలలో ప్రవేశించి నిరుద్యోగ సైన్యంలో చేరుతున్నారు గనుక, ఉన్న తక్కువ ఉద్యోగాలకు పోటీ పెరుగుతోంది. ఉత్పత్తి పద్ధతులు, వ్యాపారాలు ఇంకా ఇంకా ఎక్కువ అసంఘటితంగా మారడానికి అవసరమైన చౌక శ్రామికుల సరఫరా నిరంతరాయంగా జరుగుతోంది. దానితో కనీస వేతనాలు తగ్గిపోతున్నాయి. వేతనాలు తగ్గనిచోట్ల కూడ పట్టణీకరణ వల్ల, ధరల పెరుగుదల వల్ల, పట్టణాల జీవన ప్రమాణాల వల్ల నిజవేతనాలు కూడ తగ్గిపోతున్నాయి. వేతనాలను పెంచుకోవడానికి, నిజవేతనాలు తగ్గకుండా చూడడానికి పోరాడవలసిన కార్మిక సంఘాలు ఆ బాధ్యతనే విస్మరిస్తున్నాయి.

ప్రపంచీకరణ తర్వాత కార్మికోద్యమానికి వచ్చిన మరొక ప్రమాదం ఆర్థికవ్యవస్థలో పాత పారిశ్రామిక, ఉత్పత్తి రంగ సంస్థల ప్రాధాన్యం తగ్గిపోయి, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, బ్యాంకింగ్, ఇన్సూరెన్స్, రియల్ ఎస్టేట్, హోటళ్లు వంటి వ్యాపార, సేవారంగసంస్థల ప్రాబల్యం పెరగడం. ఈ రంగాల ప్రత్యేకమైన పనిపద్ధతుల వల్ల అక్కడ ఒకేచోట చాలమంది ఉద్యోగులు, కార్మికులు ఉండే పరిస్థితి ఉన్నప్పటికీ వారందరికి ఒకే రకమైన ప్రయోజనాలు, పని పరిస్థితులు, కోర్కెలు, జీవనప్రమాణాలు ఉండే అవకాశంలేదు. కార్మిక, ఉద్యోగ సంఘాల ఏర్పాటుకు అవకాశం లేదు. అందువల్ల సామూహిక బేరసారాలకు అవకాశం తగ్గిపోయింది. ఒకప్పుడు కార్మికోద్యమం బలంగా ఉండిన ప్రభుత్వాధీనంలోని బ్యాంకింగ్, ఇన్సూరెన్స్ రంగాలలోకి ప్రైవేట్ సంస్థలు విపరీతంగా ప్రవేశించడం వల్ల, ప్రభుత్వ రంగ సంస్థలలో కొత్త నియామకాలు లేకపోవడం వల్ల ఆ రెండు రంగాల కార్మికోద్యమాలు కూడ బలహీనపడ్డాయి.

కార్మికోద్యమం బలహీనపడినందువల్ల గత పదిహేను సంవత్స రాలుగా ప్రభుత్వం కార్మిక, ఉద్యోగ ప్రయోజనాలను దెబ్బతీసేలా పెన్షన్ నిబంధనలను మారుస్తూ వచ్చినప్పటికీ కార్మికోద్యమం పెద్ద ఎత్తున ప్రతిఘటించలేకపోయింది. అనేక కార్మిక సంక్షేమ చట్టాలను ప్రభుత్వాలు మారుస్తూ, కార్మిక వ్యతిరేక నిబంధనలను ప్రవేశపెడుతూ వచ్చినప్పటికీ కార్మికోద్యమం పెద్ద ఎత్తున ప్రతిఘటించలేకపోయింది. దేశ వ్యాప్తంగా ప్రత్యేక ఆర్థిక మండలాలను ఏర్పాటు చేస్తూ, వాటిని విదేశీ భూభాగాలుగా ప్రకటిస్తూ, అక్కడ అన్ని కార్మిక సంక్షేమ చట్టాలను రద్దు చేస్తూ వస్తే కూడ ప్రతిఘటించే శక్తి కార్మికోద్యమానికి లేకపోయింది. నిజానికి జాతీయ కార్మిక సంఘాలన్నిటికీ రాజకీయ పక్షాలతో సంబంధం ఉన్నది గనుక అన్ని రాజకీయ పక్షాలూ ప్రత్యేక ఆర్థిక మండలాలను సమర్థించేవే గనుక ఏ ఒక్క కార్మిక సంఘమూ ప్రత్యేక ఆర్థిక మండలాల రూపంలో కార్మికోద్యమం మీద జరుగుతున్న దాడిని అడ్డుకోలేకపోయాయి.

ఈ దృశ్యానికి అవతలి కోణం కూడ ఉంది. నిజానికి ప్రపంచీ కరణ వల్ల నిజంగా ప్రయోజనం పొందుతున్నవారు పదిశాతానికి మించరు. మిగిలిన తొంబై శాతం ప్రజలు ఏదో ఒకరకంగా ప్రపంచీకరణ వల్ల నష్టపోతున్నవారే. దేశంలోని శ్రామిక జనాభాకు కూడ ఇది వర్తిస్తుంది. అందువల్ల ప్రపంచీకరణ వ్యతిరేక పోరాటాన్ని నిజాయితీగా నడపదలచుకున్న నాయకత్వం ఉంటే, సరయిన పంథాలో కార్మికులను సమీకరించగలిగితే చాల బలమైన కార్మికోద్యమం నిర్మించడానికి మరెప్పటికన్నా ఎక్కువ అనుకూలమైన పరిస్థితులు ఇప్పుడే ఉన్నాయి. కావలసిందల్లా కార్మికోద్యమ నిర్మాణాలు ఇంతకాలం చేసిన పొరపాట్లను సరిగా సమీక్షించుకుని, విశాల శ్రామిక ప్రజాబాహుళ్యాన్ని సంఘటితం చేయగలిగిన సరైన విధివిధానాలను రూపొందించుకోవడం. ◆

చరిత్రలో జడ్జీలు కూడా సమ్మెలు చేసిన సందర్భాలున్నాయనీ, ఎవరికీ ఆటంకం కలిగించని సమ్మెలుంటాయా అనీ, అలాంటి సమ్మెలకు యాజమాన్యాలు, ప్రభుత్వాలు స్పందిస్తాయా అని ప్రశ్నిస్తున్నారు ఎస్. వీరయ్య

ప్రపంచీకరణ నేపథ్యంలో కార్మికోద్యమాల పాత్ర

ప్రపంచీకరణ నేపథ్యంలో, అవరోధాలనధిగమించి, కార్మికోద్యమం పురోగమిస్తోంది. మానవ జీవితంలోని అన్ని పార్శ్వాలను తీవ్రంగా ప్రభావితం చేస్తున్న ప్రపంచీకరణ విధానాలు, సిద్ధాంతాలు అత్యంత కీలకమైన కార్మికోద్యమాన్ని వదలవు కదా. వర్గ పోరాటాన్ని బలహీనపరచకుండా, ట్రేడ్ యూనియన్లను బలహీనపర్చేందుకు ప్రపంచీకరణ ముసుగులో సాగుతున్న ఆధునిక దోపిడీ కొనసాగించటం సాధ్యం కాదు. అందుకే కార్మికోద్యమాన్ని కూడా ధ్వంసం చేసేందుకు, బలహీనపరచేందుకు, పక్కదారులు పట్టించేందుకు కూడా ఈ కాలంలో అనేక ప్రయత్నాలు జరిగాయి. అయినా వర్గపోరాటాల మహాప్రస్థానంలో ఆటంకాలు సృష్టించగలరేమోగానీ, శాశ్వతంగా అడ్డుకోలేరు కదా. భారతదేశంలో అదే జరుగుతోంది. భారత కార్మికోద్యమం ప్రపంచీకరణ విధానాలను ఓడించడంలో ఇంకా జయప్రదం కాలేదు, కానీ కార్మికోద్యమం ఓడిపోలేదు. సరళీకృత విధానాల అమలు వేగాన్ని తగ్గించగల్గింది. విజయాలను స్ఫూర్తిగా తీసుకుని అపజయాల నుండి నేర్చుకొంటూ, కార్మికోద్యమం మరింత ముందుకుసాగాల్సి ఉంది.

సరళీకృత ఆర్థిక విధానాల పేరుతో భారత ప్రభుత్వం 1990 తర్వాత ప్రైవేటీకరణ బాటపట్టింది. ఐ.ఎం.ఎఫ్., ప్రపంచబ్యాంకుల కనుసన్నలలో నడుచుకుంటోంది. సంఘటిత రంగం మీద దాడి, వేతనాలు, సౌకర్యాల మీద కార్మిక చట్టాల మీద, హక్కుల మీద దాడి ప్రారంభించింది. ఢిల్లీలో ఎవరు అధికారంలో ఉన్నారనే దానితో నిమిత్తం లేకుండా ఈ విధానాలు అమలు చేసారు. ఇవి సహజంగానే ట్రేడ్ యూనియన్ ఉద్యమం మీద తీవ్రప్రభావం చూపాయి.

ప్రైవేటీకరణ, మూసివేతలకోసం 'పోటీ' సిద్ధాంతం తెచ్చారు. ప్రభుత్వరంగంలో గుత్తాధిపత్యం ఉంటుందనీ, పోటీకి అవకాశం ఉండదనీ అన్నారు. పోటీ ఉంటే నాణ్యమైన సరుకులు, సేవలు చవకగా అందుతాయన్నారు. ఇప్పుడా సిద్ధాంతం తుంగలోతొక్కారు. హైదరాబాద్ లో ప్రైవేట్ యాజమాన్యం ఆధ్వర్యంలో అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మించిన ప్రభుత్వం దశాబ్దాలుగా సేవలందిస్తున్న బేగంపేట విమానాశ్రయంతో పోటీకి జడిసి, దానిని మూసివేయించింది. దేశంలో సెల్‌ఫోన్ సేవలకు ప్రైవేట్ సంస్థలకు మాత్రమే చాలాకాలం అవకాశం ఇచ్చింది. బి.ఎస్.ఎన్.ఎల్. ను తొక్కిపెట్టింది. ఇప్పటికీ బి.ఎస్.ఎన్.ఎల్. లోని కొందరు అవినీతి అధికారుల సహకారంతోనే ప్రైవేట్ సంస్థలు నిలదొక్కుకోగల్గుతున్నాయి. ప్రభుత్వరంగ సంస్థల అమ్మకానికి మూసివేతలను, నష్టాలను సాకుగా చాలాకాలం ప్రచారం చేసారు. ఇప్పుడు బ్రహ్మాండమైన లాభాలతో నడుస్తున్న సంస్థలలోనే వాటాలు అమ్మకానికి పెడుతున్నారు. అదేమిటంటే, నష్టాలపాలైన సంస్థల నెవరుకొంటారని, లాభాలొచ్చే సంస్థలనైతేనే కొంటారని చెబుతున్నారు. ప్రభుత్వరంగ సంస్థలకు బడ్జెట్ కేటాయింపులు చేయలేమని, అవి ప్రభుత్వానికి భారమైయ్యాని చెప్పారు. ఇప్పుడు అభివృద్ధి పేరుతో ప్రైవేట్ రంగ సంస్థలకు కోటానుకోట్ల డబ్బు రాయితీల పేరుతో కట్టబెడు తున్నారు. ప్రభుత్వం ఉత్పత్తులు, వ్యాపారాలు చేయదని, కేవలం అందుకు సౌకర్యాలు కలిపిస్తుందని చెప్పి (ఫెసిలిటేటర్ పాత్ర), ప్రైవేట్ రంగానికి బ్రహ్మరథం పడుతున్నారు. ప్రభుత్వరంగంపై చేసిన దుష్ప్రచారం, సిద్ధాంతాలన్ని ప్రైవేట్ పెట్టుబడిదారులను ప్రోత్సహించడానికేనని స్పష్టమైంది.

కార్మికవర్గం మీద అన్నిరకాల దాడులు ప్రారంభించారు. సంఘటితరంగాన్ని ధ్వంసం చేస్తున్నారు. రాష్ట్ర విద్యుత్‌రంగంలో శాశ్వత ఉద్యోగుల సంఖ్య డెబ్బై వేల నుండి ముప్పై వేలకు పడిపోయింది. బి.ఎచ్.ఇ.ఎల్. లో పన్నెండు వేల నుండి మూడు వేలకు దిగింది. సింగరేణి, ఆర్.టి.సి., మునిసిపల్ తదితర రంగాలలో కూడా పెద్ద ఎత్తున శాశ్వత ఉద్యోగాల సంఖ్య తగ్గిస్తూ విచ్చలవిడిగా కాంట్రాక్టు కార్మికులను వినియోగిస్తున్నారు. బి.ఎస్.ఎన్.ఎల్. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో కూడా ఇదే పరిస్థితి. రాష్ట్ర ప్రభుత్వోద్యోగులలో కాంట్రాక్టు ఉద్యోగుల సంఖ్య దాదాపు సగానికి చేరింది. రైల్వేలు, ఆసుపత్రులు, విద్యా సంస్థలు అన్న తేడా లేకుండా కాంట్రాక్టీకరణ, ఔట్ సోర్సింగ్ పెద్ద ఎత్తున పెరిగింది. ఎచ్.బి.ఎల్. వంటి అనేక భారీ పరిశ్రమలలో శాశ్వత ఉద్యోగులుగా ఉండి బలవంతంగా వి.ఆర్.ఎస్. తీసుకొని, మళ్లీ అదే సంస్థలో కాంట్రాక్టు కార్మికులుగా బతుకుతున్నవారు కోకొల్లలు. ఒకే సంస్థలేదా శాఖలో ఒకే రకమైన పని చేస్తూ కొందరు పర్మనెంట్ కార్మికులుగాను, కొందరు కాంట్రాక్టు కార్మికులుగాను ఉన్నారు. పోరాటాలకిదో పరీక్ష. డిమాండ్స్ రూపొందించేటపుడు, పోరాట రూపాన్ని ఎంచుకునేటపుడు పోరాటం నిర్వహించే క్రమంలోను, ఒప్పందం సందర్భంలోను అనేక వైరుధ్యాలనధిగమించటం కార్మికోద్యమానికి సవాలుగా మారింది.

చిన్న పరిశ్రమల రక్షణ కోసం అనేక వృత్తుల పట్ల ఉన్న రిజర్వేషన్లు ఎత్తేయటం, విదేశీ పెట్టుబడులకు, సరుకులకు, సేవలకు తలుపులు తెరవటంతో అనేక పరిశ్రమలు మూతపడ్డాయి. పారిశ్రామిక వాడలే ఎడారులుగా మారాయి. ఒకప్పుడు కార్మికులతో కళకళలాడిన అనేక

సంస్థలిప్పుడు గోడలు పగుళ్ళు వారి, పిచ్చి మొక్కలు పెరిగి ఉన్నాయి. హైదరాబాద్ చుట్టూ అనేక పారిశ్రామిక వాడల్లో ఈ దృశ్యాలు దర్శనమిస్తాయి. వీటికి బదులు, ఇతర ప్రాంతాలలో కొత్త పరిశ్రమలు వస్తున్నాయి. కానీ వాటికి పెట్టుబడి ఎక్కువ, కార్మికుల సంఖ్య తక్కువ. యూనియన్లను అనుమతించటం లేదు. ఎక్స్‌పోర్ట్ ప్రాసెస్సింగ్ జోన్స్, స్పెషల్ ఎకనామిక్ జోన్స్ పేరుతో వస్తున్న బహుళజాతి సంస్థలలో మరింత దారుణమైన పరిస్థితులున్నాయి. బాత్‌రూమ్‌కు వెళ్లిన కార్మికుల మీద కూడా నిఘా వేసి ఉంచుతూ, 18వ శతాబ్దపు కార్మికుల స్థితిగతులను గుర్తుకు తెస్తున్నాయి.

కార్మిక చట్టాలను కూడా యాజమానులకనుగుణంగా సవరిస్తున్నారు. ప్రపంచీకరణ విధానాలతో నిమిత్తం లేకుండానే ఈ కార్మిక చట్టాలు, కార్మికుల ప్రయోజనాలు పరిరక్షించింది పరిమితం. అసంఘటిత రంగంలో అత్యధికులకు ఏ కార్మిక చట్టం వర్తించదు. ఈ చట్టాలను కూడా భరించగల స్థితిలో పెట్టుబడిదార్లు లేరు. విచ్చలవిడి కాంట్రాక్టీకరణ కోసం కాంట్రాక్టు లేబరు (రెగ్యులేషన్, అబాలిషన్) చట్టాన్ని సవరించారు. కోర్ ఏరియాతో సహా అన్ని చోట్ల, శాశ్వత స్వభావం గల పనులలో సైతం కాంట్రాక్టు కార్మికుల నియమకాన్ని చట్టబద్ధం చేసారు. యూనియన్లకు బయటి నాయకత్వానికి పరిమితులు విధిస్తూ ట్రేడ్ యూనియన్ చట్టాన్ని సవరించారు. ప్రమాదాలు సంభవించినప్పుడు, తీసుకోవాల్సిన చర్యలు సరళీకరిస్తూ ఫ్యాక్టరీల చట్టం రూల్స్‌కు సవరణలు చేసారు. దుకాణాల చట్టం నుండి కనీసవేతనాల చట్టం నుండి అనేక సంస్థలకు, రంగాలకు మినహాయింపునిస్తూ ఆదేశాలు జారీచేసారు. ఫలితంగా పెద్ద పెద్ద షాపింగ్ మాల్స్‌లో వేలాది కార్మికులు కనీస వేతనాలు, పని గంటలు లేక బానిస చాకిరీ చేస్తున్నారు. ఫిక్స్‌డ్ టర్మ్ ఎంప్లాయ్‌మెంట్ పేరుతో స్టాండింగ్ ఆర్డర్స్ చట్టాన్ని కూడా సవరణ చేసేందుకు ప్రయత్నించిన కేంద్రం వామపక్షాల జోక్యంతో ప్రస్తుతానికి ఆగింది.

ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వ రంగ సంస్థలలో ఉద్యోగుల సంఖ్య కుదిస్తున్నారు. పనిభారం పెంచుతున్నారు. సంవత్సరాల తరబడి తాత్కాలిక ఉద్యోగులుగా, ఎన్.ఎం.ఆర్.లుగా, పార్ట్‌టైం ఉద్యోగులుగా పనిచేస్తున్న వారిని రెగ్యులరైజ్ చేయకుండా ఖాళీపోస్టులు భర్తీ చేయకుండా 1997లోనే మన రాష్ట్ర ప్రభుత్వం ఆక్ట్ ఆఫ్ 97 చేసింది. కార్మిక చట్టాల అమలును తనిఖీ చేసే అధికారులకు పరిమితి విధిస్తూ జి.ఒ. నెం. 40 విడుదల చేసారు. ఇలాంటివే అనేక రాష్ట్ర ప్రభుత్వాలు చేసాయి. తాము అన్ని చట్టాలు అమలు జరుపుతున్నామని స్వయంగా యాజమన్యామే రాసిస్తే (సెల్ఫ్ సర్టిఫికేషన్) చాలట. ప్రతి రెండు సంవత్సరాలకొకసారి లేదా వినిమయధరల సూచీ యాభై పాయింట్లకు పైన పెరిగినప్పుడు కనీస వేతనాలు పెంచాలన్న చట్టాన్ని సవరించారు. ఐదేండ్లకొకసారి వేతన సవరణ చేస్తే చాలునట. ఆచరణలో ఎనిమిది నుండి తొమ్మిది సంవత్సరాలు దాటుతున్నది. అనేక పోరాటాల ఫలితంగా సాధించుకున్న కరువు భత్యానికి కూడా పరిమితులు విధించారు. కనీస వేతనం కన్నా ఎక్కువ వేతనం పొందే వారికి డి.ఎ. అమలు జరపాల్సిన అవసరం లేదని కార్మిక శాఖే కొత్త భాష్యం చెబుతోంది. వేతన సరవణ అంటే వేతనం పెంపుదలే కావాలని లేదని కూడా కొత్త నిర్వచనం చెబుతున్నారు. ఎగుమతి ప్రాసెస్సింగ్ జోన్స్‌లో కార్మికశాఖ వేలుపెట్టరాదని చట్టం చేసారు. ఆ ప్రాంతాలను జైలు ఆవరణలుగా మార్చేసారు. కనీస కార్మిక చట్టాలు అమలు కావటం లేదు.

యూనియన్‌తో వేతన ఒప్పందం చేసుకోవటం, సమిష్టి బేరసారాల హక్కుస్థానంలో వ్యక్తిగత ఒప్పందాలు రుద్దేందుకు ప్రయత్నిస్తున్నారు. కనీస వేతనాలు ప్రకటిస్తున్న ప్రభుత్వమే అంతకన్నా తక్కువకే టెండర్లు అంగీకరిస్తున్నది. లేబర్ సొసైటీలను ప్రోత్సహించిన ప్రభుత్వం కాంట్రాక్టులు గ్యారంటీ చేయకుండా, ఆ సొసైటీలను కూడా టెండర్లు వేసి పోటీ పడాలంటున్నది. డ్వాక్రా మహిళలకు పని కల్పిస్తున్నామన్న పేరుతో వారికి కనీస వేతనాల చట్టం వర్తించదని అతి తక్కువ వేతనంతో వారి శ్రమ దోపిడీకి అధికార ముద్ర వేస్తున్నది. 2007-08 ఎకనామిక్ సర్వే రిపోర్ట్ మరింత అన్యాయంగా కార్మికులచేత రోజుకు పన్నెండు గంటల పని చేయించాలని సిఫారసు చేసింది. కాంట్రాక్టీకరణ వల్లగానీ, ఖర్చుతగ్గించటం పేరుతోగానీ కార్మికుల భద్రతను నిర్లక్ష్యం చేస్తున్నారు. హైదరాబాద్ నగరంలోనే ఐ.డి.ఎల్.లో జరిగిన పేలుళ్ల గానీ, సింగరేణిలో పెరుగుతున్న ప్రమాదాలుగాని ఇందుకు తార్కాణాలు.

పెన్షన్ ఇస్తామన్న పేరుతో కార్మికుల పి.ఎఫ్. సగ భాగం ప్రభుత్వం కొట్టేసింది. పెన్షన్ మాత్రం కాగితాలకే పరిమితమైంది. ప్రభుత్వోద్యోగులకు ఉన్న పెన్షన్ సౌకర్యం మీద దాడి ప్రారంభించింది. ప్రభుత్వం 2004 అక్టోబర్ నుండి చేరిన ఉద్యోగులకు పెన్షన్ సౌకర్యం ఇప్పటికే తొలగించి వేసింది. సంఘటిత రంగంలో కూడా నిజవేతనాలు పడిపోయాయని, ప్రభుత్వ నివేదికలే తేల్చాయి.

పెరుగుతున్న అసంఘటిత రంగంలో అత్యధికులు దళితులు, గిరిజనులు, వెనుకబడిన తరగతులు, మహిళలు, మైనారిటీలున్నారు. సామాజిక అణచివేతకు గురవుతున్న తరగతులకు చెందిన వారే కార్మిక చట్టాలు వర్తించని, అమలు కాని అసంఘటిత రంగంలో అధికంగా ఉండటంతో ఆర్థికంగా, సామాజికంగా దోపిడీకి గురవుతున్నారు. నిజవేతనాలు పడిపోవడంతో కుటుంబ అవసరాలు తీరడానికి మహిళలు కూడా ఉపాధి కోసం వెతకటం పెరుగుతున్నది. కోర్టు తీర్పు పేరుతో రాత్రులు కూడా మహిళలతో పనిచేయించడానికి ప్రభుత్వం కూడా అనుమతినిస్తోంది. వారి భద్రత, ఇతర సౌకర్యాలను పట్టించుకోవడం లేదు. స్త్రీని వ్యాపార వస్తువుగా చూడటం, పాశ్చాత్య సంస్కృతి వెర్రితలలు వేయడం జరుగుతోంది. వాటిని అరికట్టడానికి చట్టం చేయాలని సుప్రీంకోర్టు 1997లోనే చెప్పినా, నేటికీ అలాంటి ప్రయత్నాలే లేవు. పైగా సమాచార సాంకేతిక రంగంలో వాటి అనుబంధ సేవల్లో లైంగిక వేధింపులు సహజమేనని, పట్టించుకోవద్దని నచ్చజెప్పే ప్రయత్నం చేస్తున్నారు. ఐ.టి. సేవలు విస్తరించడానికి అవసరమన్న పేరుతో పబ్బులను ప్రోత్సహిస్తున్నారు. హోంబేస్డ్ వర్కర్స్ అత్యధికులు మహిళలే.

వీరు కంపెనీలో పని చేస్తే విద్యుత్తు, మంచినీరు, సానిటేషన్ తదితర ఖర్చులన్ని యాజమాన్యం బాధ్యత అవుతుంది. కానీ ఇంటిలో చేయటంతో ఇవిగూడా వీరిమీద అదనపు భారంగా పడుతున్నాయి. పైగా వీరికి కార్మికులుగా కనీస గుర్తింపు కూడా లేదు. వాలంటీర్లనే ముద్దుపేరుతో గ్రామీణ ప్రాంతాల్లో వేలాది మందిని కేవలం నాలుగు వందల నుంచి ఐదు వందల వేతనంతో చాకిరీ చేయిస్తున్నారు. వేలాది మంది మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు వేతనమే లేదు. విద్యార్థుల

మధ్యాహ్న భోజనానికి కేటాయించిన నామ మాత్రపు డబ్బుల్లోనే మిగుల్చుకోవాలి. ఇలా అనేక కొత్త సమస్యలతో మహిళలు సతమత మవుతున్నారు.

ప్రభుత్వశాఖలను, ప్రభుత్వరంగ సంస్థలలోను ఉద్యోగుల కుదింపు వల్ల రిక్రూట్‌మెంట్స్ నిషేధించటం వల్ల దళితులు, గిరిజనులకు రిజర్వేషన్ సౌకర్యం ఉండికూడా ఉపయోగం లేకుండా పోయింది. ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగాలేదు. విద్య, వైద్య రంగాలలో కార్పొరేటీకరణతో ఈ తరగతుల పేదల జీవితాలు అతలాకుతలం అవుతున్నాయి.

పట్టణీకరణతో ఈ పేదలు మురికివాడల్లో దుర్భరజీవితాలను భవిస్తున్నారు. ఇండ్ల స్థలాలు, గృహవసతి లేదు. అసాంఘిక శక్తుల బారిన పడుతున్నారు. మురికి కాల్వలు, మంచినీరు, రోడ్లు, మరుగుదొడ్ల సౌకర్యాలు లేవు. పట్టణాభివృద్ధి పేరుతో వీరిని పట్టణాలనుండి తరిమివేసే ప్రయత్నాలు చేస్తున్నారు.

'అభివృద్ధి'కి కూడా వర్గ స్వభావం ఉంటుందన్న నిజం గతంలో ఎప్పటికన్నా కూడా ఇప్పుడు స్పష్టంగా అర్థమవుతున్నది. అభివృద్ధికీ, వేతనాలకూ, సౌకర్యాలకూ పోటీ పెట్టి చూపిస్తున్నారు. కార్మికుల సంక్షేమం, వేతనాలు, హక్కులకన్నా అభివృద్ధి ముఖ్యమంటున్నారు. అంటే అభివృద్ధి ఎవరికోసమో స్పష్టమవుతూనే ఉంది. అనుభవం కూడా దీనినే రుజువు చేసింది. ఒకవైపు 77 శాతం అసంఘటిత కార్మికులు రోజుకు ఇరవై రూపాయలు కూడా ఖర్చు చేయగలస్థితిలో లేరని అర్జున్‌సేన్ గుప్తా కమిటీ తేల్చింది. మరోవైపు ప్రపంచ ధనికుల జాబితాలో చేరిన భారతీయుల సంఖ్య పెరిగిందని ఫోర్బ్స్ నివేదిక బయటపెట్టింది. పేదలు పేదలుగానే మిగిలిపోయారనీ, ఈ విధానాల ఫలితంగా దేశంలో సుమారు ఐదుకోట్ల మంది నవ ధనికులు తయారయ్యారనీ సాక్షాత్తు కేంద్ర మంత్రి మణిశంకర్ అయ్యర్ పారిశ్రామిక వేత్తల సమావేశంలో చెప్పారు.

మెజారిటీ ప్రజలకు ప్రాతినిధ్యం వహించేదే ప్రజాస్వామ్యమని సాధారణంగా ప్రజలు నమ్ముతున్నారు. కానీ పరిశ్రమలు ఆటంకం లేకుండా నడవడానికి, వ్యాపారాలు సజావుగా సాగడానికి మెజారిటీ ప్రజల హక్కులు తిరస్కరించటమే ప్రజాస్వామ్యంగా పాలకులు చిత్రీకరిస్తున్నారు. ప్రజల హక్కులు కాలరాస్తూ, ఇదంతా ప్రజా ప్రయోజనాల కోసమేనంటున్నారు. ప్రజాస్వామ్యానికి కొత్త భాష్యం చెబుతున్నారు.

ప్రపంచీకరణ విధానాలు సమాజంలోని వివిధ రంగాలను ప్రభావితం చేసినట్టే న్యాయవ్యవస్థను కూడా ప్రభావితం చేస్తున్నాయి. ప్రపంచీకరణ కాలంలో వెలువడుతున్న అనేక తీర్పులు, వ్యాఖ్యలు, ఆచరణలు యాజమాన్యాలకు, పాలకులకే తోడ్పతున్నాయి. తమిళనాడులో జయలలిత ప్రభుత్వం ఒక్క కలంపోటుతో లక్షకు పైగా ఉద్యోగులను తొలగించడాన్ని సుప్రీంకోర్టు సమర్థించటమే కాకుండా, సమ్మెహక్కు లేదని వ్యాఖ్యానించింది. ఇది పెట్టుబడిదారీ వర్గానికి, పాలకులకు కార్మికవర్గ పోరాటాలను అణిచి వేసేందుకు లైసెన్స్ ఇచ్చినట్లయింది. చివరకు ధర్నాలు, ప్రదర్శనలు కూడా ప్రజలకు ఆటంకం అన్న పేరుతో నిరోధిస్తున్నారు. ప్రజాసమస్యల పరిష్కారం కోసం ప్రదర్శనలు చేయటం ప్రజాస్వామ్య హక్కులనీ దానిని కోర్టులు నిషేధించజాలవనీ స్వయంగా ప్రదర్శనకు నాయకత్వం వహించిన పశ్చిమ బెంగాల్ సి.పి.ఎం. కార్యదర్శి బిమన్‌బసును కోర్టు చుట్టూ తిప్పుతున్నారు. కంపెనీ గేటు ముందు కూడా ధర్నా నిరోధిస్తూ ఇంజక్షన్ ఆర్డర్లిస్తున్నాయి. మెదక్ జిల్లా ఎం.ఆర్.ఎఫ్. వద్ద ధర్నా చేయాలని కార్మికులు నిర్ణయిస్తే కోర్టు నిరోధించింది. ఎం.ఆర్.ఎఫ్. గేటు నుండి ఐదు కిలోమీటర్ల దూరంలో ధర్నా చేసుకోమంది. అక్కడ మరో కంపెనీ ఉంటుంది. ఎం.ఆర్.ఎఫ్. కార్మికులు ఎం.ఆర్.ఎఫ్. దగ్గర కాకుండా మరో కంపెనీ దగ్గర ధర్నా చేయాలా? చట్టబద్ధమైన సమ్మెలలో ప్రజ ప్రయోజనాలనే పేరుతో కోర్టుల అనుచిత జోక్యం పెరిగింది. విద్యుత్ ఉద్యోగుల సమ్మెలోగానీ, ఆర్.టి.సి. కార్మికుల సమ్మెలోగానీ, జూనియర్ డాక్టర్స్ సమ్మెలోగానీ జోక్యం చేసుకున్న తీరు కార్మికులకు, పేద ప్రజలకు వ్యతిరేకంగా తోడ్పడింది. ప్రజలంటే ఎవరన్న ప్రశ్న ముందుకు వస్తోంది. సమ్మె చేసేవారు, సమ్మె జయప్రదమైతే లాభం పొందేవారు ప్రజలలో భాగం కాదా? ఎవరికీ ఆటంకం కలిగించని సమ్మెలంటూ ఉంటాయా? అలాంటి సమ్మెలకు యాజమాన్యాలూ, ప్రభుత్వాలు స్పందిస్తాయా? ప్రపంచంలో జడ్జీలు కూడా సమ్మె చేసిన ఘటనలున్నాయి కదా! రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో రిక్రూట్‌మెంట్, అనేక సంవత్సరాలుగా పని చేస్తున్న వారిని రెగ్యులరైజ్ చేయడాన్ని నిషేధిస్తే సుప్రీంకోర్టు దానిని కూడా సమర్థించింది. ఫలితంగా ఆక్ట్ 2 ఆఫ్ 97 వచ్చింది. సమాన పనికి సమాన వేతనాన్ని నిరాకరిస్తూ తీర్పులు వస్తున్నాయి. మహిళల చేత రాత్రివేళల్లో పని చేయించడాన్ని సుప్రీంకోర్టు సమర్థించింది. యాజమాన్యం కార్మికులను అన్యాయంగా డిస్మిస్ చేసిందని రుజువైనప్పటికీ, డిస్మిస్ అయిన కాలానికి వేతనా లివ్వాల్సిన అవసరం లేదని తీర్పు నివ్వటంతో యాజమాన్యాలకు హద్దు లేకుండా పోయింది. ఇష్టం లేని వారందరిని డిస్మిస్ చేయవచ్చు. కోర్టు తీర్పు వచ్చిన నాడు మళ్లీ తీసుకోవచ్చు. కార్మికుల జీవితాలతో చెలగాట మాడేందుకే ఇది తోడ్పడుతున్నది. పర్మనెంట్ కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులు ఒకే పని చేస్తున్నా వారిద్దరు సమాన హక్కులు పొందలేరని కోర్టు కొత్త భాష్యం చెప్పింది. కాంట్రాక్ట్ లేబర్ చట్టం ప్రకారం ఒక కంపెనీలో కాంట్రాక్ట్ విధానం రద్దు చేస్తే, ఆ కార్మికులనే రెగ్యులరైజ్ చేయనవసరం లేదని, అది యాజమాన్యం ఇష్టాయిష్టాలకు కోర్టు వదిలేసింది. ఇక కాంట్రాక్ట్ కార్మికులు ఈ చట్టాన్ని ఉపయోగించుకుని కాంట్రాక్ట్ విధానం రద్దు చేయాలని కోరగలరా? బయటి నాయకులు యూనియన్ నాయకులుగా ఉంటే వారితో చర్చించాలా లేదా అన్నది కూడా యాజమన్యానికే వదిలేసింది కోర్టు. ఇలాంటి తీర్పులన్నీ యాజమాన్యాలకు బలం చేకూర్చాయి. అయినా కార్మిక వర్గ పోరాటాలు ఆగలేదు.

దేశంలో కాంగ్రెస్, బి.జె.పి., టి.డి.పి., డి.ఎం.కె., అన్నాడిఎంకె, సమాజ్‌వాద్ పార్టీ, బి.ఎస్.పి. లాంటి పార్టీలేవి అధికారంలోకి వచ్చినా మౌలికంగా ఇవే విధానాలు అమలు చేస్తున్నాయి. ఎన్నికల సందర్భంలో అధికారంలో ఉన్న వారిని, ప్రతిపక్షంలో ఉన్నవారు ఓట్లకోసం విమర్శించటమే తప్ప, తాము గద్దెనెక్కగానే వారు అదేబాట పడుతున్నారు. సమ్మె హక్కులేదని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించినప్పుడు వీరందరూ దానిని సమర్థించిన వారే. కేవలం జ్యోతిబసు, బర్దన్ లాంటి వామపక్షాల నాయకులే బహిరంగంగా కోర్టు వ్యాఖ్యలను ఖండించారు. బృందాకరత్ నాయకత్వంలో సి.పి.ఎం. కార్యకర్తలు సుప్రీం కోర్టు వద్ద ధర్నా

నిర్వహించారు. వామపక్షాల స్ఫూర్తితోనే సమ్మె హక్కుకోసం దేశవ్యాపిత సమ్మె జరిగింది. బి.జె.పి. నాయకత్వం మతాన్ని రాజకీయ ప్రయోజనాలకు వాడుకుంటోంది. నిజమైన సమస్యల నుండి ప్రజల దృష్టి మళ్లించి పేదల ఐక్యతను విచ్ఛిన్నం చేసేందుకు ప్రయత్నిస్తోంది. తాను అధికారంలోకి వచ్చిన సందర్భాలలో, అధికారాన్ని కూడా ఇందుకే వాడుకుంటున్నది. వాజ్‌పేయ్ ప్రధానిగా ఉన్నంతకాలం ఎజెండాలోకి వచ్చిన చర్చనీయంశాలుగానీ, గుజరాత్ పరిణామాలుగానీ అనేక పాఠాలు నేర్పుతున్నాయి.

ట్రేడ్ యూనియన్ ఉద్యమం మీద కూడా ప్రపంచీకరణ ప్రభావం తీవ్రంగా ఉంది. ప్రపంచీకరణ విధానాలు అభివృద్ధికి తోడ్పడతాయని కొన్ని యూనియన్ల నాయకులు బహిరంగంగానే ఆహ్వానించారు. తొలిరోజుల్లో ఎర్రజెండా సంఘాలు కూడా కొన్ని ఈ విధానాలు ప్రమాదకరమేనని అంగీకరిస్తూనే ఎదిరించలేమన్న సాకుతో రాజీపడుతున్నాయి. టెలికాం శాఖను కార్పొరేటీకరించాలని ప్రభుత్వం నిర్ణయించినపుడు ఒక యూనియన్ ప్రతిఘటించింది. కానీ ఆనాడు గుర్తింపు యూనియన్ నాయకత్వం మాత్రం వేతనం పెంచితే చాలుననీ, కార్పొరేటీకరణకు ఆమోదమేనని సంతకం చేసిన ఫలితంగా నేడది బి.ఎస్.ఎన్.ఎల్. గా మారింది. ఫలితంగా విదేశీ పెట్టుబడులను ఆహ్వానించగలుగుతున్నది. ప్రభుత్వం ఆర్.టి.సి., సింగరేణి పరిరక్షణ కోసం జరిగిన సమ్మెల సందర్భంగా కొందరు నాయకులను లోబరుచుకుని రహస్య ఒప్పందాల మీద సంతకాలు తీసుకోగలిగింది. విద్యుత్ రంగంలో ఐక్య కార్యాచరణ కమిటీకి గండికొట్టి ఒక ప్రధాన సంఘం నాయకత్వాన్ని లోబరుచుకుని ఒప్పందం చేయగలిగింది. మెడికల్, హెల్త్ రంగంలో రెండు ప్రధాన సంఘాల నాయకులను పైరవి కార్లుగా మార్చి, ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా పోరాడకుండా నిరోధించగల్గింది. కొన్ని సంఘాలలో ప్రజాస్వామ్య పని విధానం ధ్వంసం చేసి, నాయకులను లోబరుచుకుని అవినీతిపరులుగా తయారుచేసి, సంఘాలను బలహీనం కూడా చేయగలుగుతున్నారు పాలకులు.

పాలకులెన్ని విధాలుగా దాడులు చేసినా ట్రేడ్ యూనియన్ ఉద్యమంలో అంతర్గతంగా ఎన్ని పెడధోరణులు వ్యక్తమైనా పోరాటాలు మాత్రం ఆగలేదు. తొలిదశలో కార్మికవర్గంలో, ముఖ్యంగా మధ్యతరగతి వర్గంలో సంస్కరణల పట్ల కొంత భ్రమలు వ్యక్తమైనా క్రమంగా అవి మంచుతెరల్లా కరిగిపోయాయి. ప్రపంచబ్యాంక్ విధానాల ప్రమాదాన్ని ట్రేడ్‌యూనియన్ ఉద్యమంలోని ఒక భాగమైనా, నిరంతరం కార్మికవర్గం దృష్టికి తేవటం, విస్తృతంగా కాంపెయిన్ చేయటం కార్మికవర్గం కూడా ఈ విధానాల దుష్ప్రభావాలను అనుభవంలో అర్థం చేసుకోవటంతో క్రమంగా పోరాటాలు పెరిగాయి. దాదాపు సమ్మెలు, ప్రతిఘటనలు జరగని రంగం లేదంటే ఆశ్చర్యపడనవసరం లేదు. ప్రభుత్వరంగ సంస్థలు, సహకార రంగ సంస్థలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ శాఖలు, ప్రైవేట్ రంగం, సంఘటితరంగం, అసంఘటిత రంగం అన్న తేడాలు లేవు. విడివిడిగాను, ఐక్యంగాను పోరాటాలు పెరిగాయి. పాలకులు కూడా ఈ పోరాటాలను గమనించి, పథకం ప్రకారం పావులు కదిపారు. కార్మికోద్యమం బలహీనంగా ఉన్న పరిశ్రమలలో మాత్రమే పాలకులు తొలి వేటు వేయగలిగారు.

తొలినుండీ పోరాటాలకు దూరంగా ఉండే పాలకుల తైనాతీలు లేదా ఎర్రజెండా పట్టుకున్నా ఏ ఒక్క దేశవ్యాపిత సమ్మెలో భాగస్వాములు కావడానికి సిద్ధపడని వారు నాయకత్వంలో ఉన్న ఐ.డి.పి.ఎల్.నే ప్రభుత్వం ముందుగా మూసివేయగలిగింది. ఒక యూనియన్ సమ్మె చేస్తుంటే మరో యూనియన్ గోడలుదూకి లోనికి వెళ్ళి డ్యూటీ చేయండని కార్మికులను ప్రోత్సహించిన ఎచ్.ఎం.టి. నే ప్రభుత్వం బలహీనపర్చింది. చరిత్రలో ఏనాడు సమ్మెలో పాల్గొనని ఆల్విన్, ఆర్.ఎఫ్.సి. లనే రాష్ట్ర ప్రభుత్వం ముందుగా మూసివేయగలిగింది, ప్రైవేటీకరించగలిగింది. అన్ని యూనియన్లు ఐక్యంగా పోరు బాటలో ఉన్నంత కాలం బాల్కో మీద కేంద్రంగానీ, విద్యుత్తు బోర్డు మీద రాష్ట్రంగానీ ఏమీ చేయలేక పోయాయి. కొందరు నాయకులను లోబర్చుకున్న తర్వాతనే పోరాటాన్ని నీరుగార్చి దెబ్బతీయగలిగాయి. ఈ అనుభవాలతో మరింత ఐక్యంగా పోరాడుతున్న నాల్కో కార్మికులు, నైవేలీ లిగ్నైట్ కార్మికులు తమ సంస్థలను నేటికీ కాపాడుకోలుగుతున్నారు. రెండు సంవత్సరాల క్రితం, వి.ఆర్.ఎస్. కు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా సమ్మె చేసిన బ్యాంకు ఉద్యోగులు చివరి నిమిషంలో కొందరు నాయకులు పోరాడాలన్న విశ్వాసం కల్పించకుండా వెనక్కి తగ్గిన తర్వాత మాత్రమే పెద్ద సంఖ్యలో వి.ఆర్.ఎస్.కు అప్లై చేసుకున్నారు. పోరాట మార్గంలో నడిపేందుకు నాయకత్వం సిద్ధంగా ఉన్న సందర్భాలలో కార్మికులు పోరాటాలకే సిద్ధపడుతున్నారు. గత పదిహేడు సంవత్సరాల కాలంలో ఈ విధానాలకు వ్యతిరేకంగా పదమూడు దేశవ్యాప్త సమ్మెలు జరిగాయి. ఇన్ని సమ్మెలు మరో దేశంలో జరగలేదు. సుప్రీంకోర్టు సమ్మె హక్కు లేదంటే సమ్మె హక్కు కోసం దేశమంతా సమ్మె చేసారు. ఈ సమ్మెలన్నీ వామపక్షాల చొరవతోనే సాధ్యమైనాయన్న విషయం గమనార్హం. ఈ సమ్మెలన్నీ వామపక్ష ప్రభుత్వాలున్న బెంగాల్, కేరళ, త్రిపురలలోనే నూటికి నూరు శాతం జయప్రదం కావటం కూడా గమనించవల్సిన విషయం. అందుకే ఈ ప్రభుత్వాలను కూల దోయటమే లక్ష్యంగా పాలకులు, సామ్రాజ్యవాద శక్తులు అన్ని ప్రయత్నాలు చేస్తున్నాయి. పెట్టుబడిదారీ వ్యవస్థలో దోపిడీకి వ్యతిరేకంగా ఈ దోపిడీ అనేక రెట్లు పెరిగిన నేపథ్యంలో పోరాటాల వెల్లువ కూడా తప్పదు.

ప్రపంచంలో కొంతకాలం ఏకధృవ ప్రపంచం ఏర్పడినా, దేశంలో మతోన్మాదులు కొంతకాలం పై చేయి సాధించినా, పాలకులు నిర్బంధం ప్రయోగించినా, పోరాటాలను నీరుగార్చే నాయకత్వం బలంగా ఉన్నప్పటికీ వర్గపోరాటం తప్పదు. ఐక్య ఉద్యమాన్ని ఎవరూ ఆపలేరు. ఈ కాలంలో జరిగిన దేశవ్యాప్త సమ్మెలు, బంద్‌లు, అసంఘటిత రంగ కార్మికుల సమ్మెలు, రంగాలవారీ పోరాటాలన్ని దీనినే రుజువు చేసాయి. విశాఖ ఎక్స్‌పోర్ట్ ప్రాసెస్సింగ్ జోన్ కార్మికుల పోరాటం, ఆర్.టి.సి., సింగరేణి సమరశీల పోరాటాలు, ఆశ్వికదళాలనెదిరించి నిలిచిన అంగన్‌వాడీలు, వీధుల్లో ముఖ్యమంత్రిని నిలదీసిన గ్రామసేవకులు, ఈ పోరాటాలన్నీ దీనినే నిర్ధారించాయి. ఏ రంగం అనుభవం చూసినా నేర్పుతున్నదొక్కటే పాఠం, కేవలం ఆర్థిక సమస్యల పరిష్కారం కోసమే కాకుండా ప్రపంచీకరణ విధానాలకు వ్యతిరేకంగా నడిచే పోరాటమే కార్మికవర్గానికి విశ్వాసాన్నిస్తున్నది. సమైక్య, సమరశీల, విస్తృత, దీర్ఘకాల పోరాటాలే ఫలితం సాధించగలుగుతాయని ఈ కాలపు పోరాటాల అనుభవం నేర్పుతున్న పాఠం. ◆

ప్రభుత్వాల పాత్ర, జోక్యం, నియంత్రణలను తొలగించడమే ప్రైవేటీకరణ, సరళీకరణ, ప్రపంచీకరణల పరమార్థం అని అంటున్నారు పి.జె. చంద్రశేఖర్

ప్రపంచీకరణ - ట్రేడ్ యూనియన్ ఉద్యమం

పాలకవర్గాలు 1991 నుండి ప్రపంచీకరణ విధానాన్ని అప్రజాస్వామికంగా అమలు చేస్తున్నాయి. గ్లోబలైజేషన్‌కు పూర్వ రంగ ప్రాతిపదికలయిన డంకెల్ ప్రతిపాదనలు - గాట్ ఒప్పందం - ప్రపంచీకరణగా స్థిరీకరించబడింది. పార్లమెంట్‌లో గానీ, ఫెడరల్ వ్యవస్థ ప్రాతిపదికన ఆయా రాష్ట్ర అసెంబ్లీలలో గానీ, అత్యంత ప్రభావశీలత గల గ్లోబలైజేషన్‌పై ఎలాంటి చర్చ జరగలేదు. దేశంలోనే అత్యంత పెద్ద ప్రజాబాహుళ్యానికి ప్రాతినిధ్యం వహించే ట్రేడ్ యూనియన్లను కనీసం సంప్రదించటం కూడా అవసరమని పాలకవర్గాలు గుర్తించలేదు. దీనికంతటికీ కారణాలు సుస్పష్టమే. ఆనాటి ఆర్థిక లోటును బూచిగా చూపి సామ్రాజ్యవాద శక్తులపై, వాషింగ్‌టన్ కన్‌సేన్సస్, మార్కెట్ ఎకానమీ పేరుతో మన దేశంపై రుద్దడానికి దళారీ బూర్జువా పాలకవర్గాలు చంకలు గుద్దుకుంటూ ఆమోదించాయి. 1990 ఎ.ఐ.టి.యు.సి. జాతీయ మహాసభలో నాటి మద్రాసు (చెన్నై)లో దివంగత కామ్రేడ్ ఇంద్రజీత్ గుప్తా ప్రపంచ పెట్టుబడి సంఘటితంగా సరిహద్దులను చెరిపివేస్తూ, స్థానిక ప్రభుత్వాలను నయాన, భయాన లొంగదీసుకుని సాంకేతిక, సమాచార విజ్ఞానాన్ని గుప్పెట్లో పెట్టుకుని, తిరుగులేని లాభాపేక్షతను నయా ఉదార ఆర్థిక విధానాలను రుద్దు తోందని స్పష్టపరిచారు. ఆ క్రమంలో మార్క్స్, ఏంగెల్స్‌లు ఇచ్చిన 'ప్రపంచ కార్మికులారా! ఏకంకండి' అనే పిలుపును మనసా, వాచా, కర్మణా భారతదేశ పరిస్థితుల కనుగుణంగా విశాల ఐక్యత తక్షణా వశ్యకతగా గుర్తించాలనీ, అందులో భాగంగా ఒక కంపెనీలో ఒకే యూనియన్, ఒక పరిశ్రమలో ఒకే ఫెడరేషన్, మొత్తం జాతీయ స్థాయిలో ఒకే కేంద్ర కార్మిక సంఘం కొరకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామిక సూత్రాలు, సామ్రాజ్యవాద వ్యతిరేకత, సంఘీభావ పోరాటాలు అలాంటి కార్మిక సంఘానికి ప్రాథమిక ఆచరణ సూత్రాలుగా ఉండాలని పిలుపు ఇచ్చింది. భారతదేశ కార్మికోద్యమానికి మాతృకగా ఎ.ఐ.టి.యు.సి. ఆ చొరవను తీసుకుని చిత్తశుద్ధితో కృషిని కొనసాగిస్తోంది.

"కాదేది వ్యాపారానికనర్హం, లాభార్జనకు ఏదీ అడ్డుకారాదు"

ఇదీ స్థూలంగా గ్లోబలైజేషన్ సూత్రం. ప్రభుత్వాల పాత్ర, జోక్యం, నియంత్రణలను తొలగించడమే ప్రైవేటీకరణ, సరళీకరణ, ప్రపంచీకరణల పరమార్థం. ప్రజాసంక్షేమ నిబద్ధత, విలువలు కోల్పోయిన రాజకీయాలూ, సంపద సృష్టిలో శ్రమపాత్రను గుర్తించకుండా, శ్రమలో పాత్రలేని దోపిడి వర్గాల విశృంఖల లాలస, నైతిక విలువలు కోల్పోయిన వాణిజ్యం మొదలైన రుగ్మతలకు జన్మస్థానం. సంక్షేమ రాజ్యంలో విలువలు, సామాజిక న్యాయం, సమగ్రాభివృద్ధి, స్వయం సమృద్ధి, అలీన విదేశాంగ విధానం మొదలైన ప్రాథమిక రాజ్యాంగ భావనలూ, తాత్పర్యాన్ని తలక్రిందులుగా నిర్వచిస్తూ, వర్ణిస్తూ ఉప్పెనలా ముంచుకొస్తున్న ప్రమాదం గ్లోబలైజేషన్ - రాజ్యాంగ యంత్ర ప్రధాన భాగాలు, రాజకీయాలు, పరిపాలన, న్యాయవ్యవస్థలు గ్లోబలైజేషన్ భావజాలంలో బందీలయినాయి.

హరిత విప్లవం ద్వారా ఆహార ధాన్యాలు ఉత్పత్తిలో మిగులు సాధించగలిగినా, అన్నదాతల ఆత్మహత్యలు అవిఘ్నంగా కొనసాగు తున్నాయి. ఆహార భద్రత ప్రశ్నార్థకంగా మిగిలింది. పోషకాహారలేమి సగం జనాభాను వెంటాడుతోంది. వ్యవసాయాధారిత భారతదేశంలోని వ్యవసాయ విధానం గ్లోబలైజేషన్ చెరలో బందీ అయిన కారణంగా ప్రభుత్వ పథకాలన్ని స్వామినాథన్ కమిషన్ సిఫారసుల మూలాల్లో కాకుండా రుణ మాఫీలాంటి కంటి తుడుపు చర్యలకు పరిమిత మౌతున్నాయి.

నలభై కోట్ల మంది అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర సంక్షేమ చట్టం కోసం మొత్తం ట్రేడ్ యూనియన్ ఉద్యమం ఐక్యంగా గత ఇరవై సంవత్సరాల నుండి పోరాడుతున్నా, గత ఎన్.డి.ఎ., నేటి యు.పి.ఎ. పాలక వర్గాలు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నాయి. 2007 అక్టోబర్‌లో పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన అసంఘటిత రంగ కార్మిక సంక్షేమ బిల్లు సర్వత్రా విమర్శల పాలయింది. పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ అన్ని వర్గాల సూచనలను పరిశీలించి సవరణలను ప్రతిపాదించినా పార్లమెంట్‌లో చర్చకు నోచుకోలేదు. ఇదంతా పాలకుల వర్గ నైజాన్ని స్పష్టపరుస్తోంది. ట్రేడ్ యూనియన్లు ముఖ్యంగా ఎ.ఐ.టి.యు.సి., సి.ఐ.టి.యు. తదితర వామపక్ష జాతీయ కార్మిక సంఘాలు, స్వతంత్ర ఉద్యోగ కార్మిక సమాఖ్యలు, చైతన్యంతో సంఘటిత, అసంఘటిత రంగ కార్మికుల సమస్యలతో పాటుగా సాధారణ ప్రజలు, రైతులు, బీదల డిమాండ్లను కూడా కలుపుకుని (ధరలు, భూసంస్కరణలు, ఉపాధికల్పన, పి.డి.ఎస్. పునరుద్ధరణ మొదలైనవి) దఫదఫాలుగా జాతీయ స్థాయిలో సమ్మె, పోరాటాలను నిర్వహించాయి.

ఇలాంటి పరిస్థితులను ఎలా అర్థం చేసుకోవాలి? ఈ దుస్థితి నుండి బయట పడేందుకు కార్మిక సంఘాలు ఏం చేయాలి? ఈ ప్రశ్నలకు

వివిధ కేంద్ర కార్మిక సంఘాలకు ముఖ్యంగా సంస్కరణలను సమర్థించే రాజకీయ పార్టీల అనుబంధ కార్మిక సంఘాలు, ఐ.ఎన్.టి.యు.సి., బి.ఎం.ఎస్., టి.ఎన్.టి.యు.సి., మొదలైన సంఘాలకు సూత్రబద్ధమైన కార్యాచరణ చిత్తశుద్ధిగల ప్రణాళికలు లేవు. ప్రపంచీకరణ, అందులో భాగంగానే వస్తున్న ప్రత్యేక ఆర్థిక మండలాల (ఎస్.ఇ.జెడ్.) అభివృద్ధికి సాధనాలుగా, అవకాశాలుగా భావిస్తున్నాయి. అప్పుడప్పుడూ స్థానిక ఐక్యపోరాటాలను సమర్థించినా వారి చిత్తం చెవులు దాటి ముందుకు రావడంలేదు.

మూసివేతలు, లే ఆఫ్‌లకు సంబంధించిన పారిశ్రామిక వివాదాల చట్టం నిబంధనలను నిరర్థకం చేయాలని అప్పటి, ఇప్పటి ప్రభుత్వాలు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాయి. వామపక్ష పార్టీల మద్దతు కోల్పోతామనే వెనుకడుగు వేస్తున్నాయి. కానీ వారి ఆలోచనలను మాత్రం మార్చుకోవడం లేదు. ఎనిమిది గంటల పనిదినం, సమాన పనికి సమాన వేతనం మొదలైన చారిత్రక హక్కులు కాలం చెల్లినట్లుగా పాలకవర్గాలు భావిస్తున్నాయి. ఉద్యోగానికి మహిళల వివాహం అవరోధం అనే సూత్రం యాజమాన్య వర్గాలలో బలంగా కొనసాగుతోంది. శాశ్వత పని – శాశ్వత ఉపాధి – సూత్రాలు సమాధి చేయబడి, కాంట్రాక్టు కొలువు – కన్‌సాలిడేటెడ్ వేతనం వైపుగా ఉద్యోగ నియామక విధానం వడివడిగా పరుగులుదీస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే ఇట్టి దారుణాలకు ముందుండి నేతృత్వం వహిస్తున్నాయి. ప్రైవేట్ రంగం పరిస్థితి సరేసరి. క్రమంగా సంఘటితరంగ కార్మిక వర్గం తమ సమిష్టి బేరసారాల హక్కును కోల్పోతున్నాయి. తాత్కాలిక, కాంట్రాక్టు కార్మికులను యూనియన్ల వద్దకు రానీయరు. గుడ్‌గాం హోండా మోటార్స్, బాటా కంపెనీ, తదితరుల పోరాటాల అనుభవం మొత్తం విషయంలో ఒక చిన్న భాగం మాత్రమే. కార్మిక వివాద పరిష్కారంలో పోలీసులు యాజమాన్యాల పక్షం, లేబరు డిపార్ట్‌మెంట్‌ల ప్రేక్షకపాత్ర, చివరికి న్యాయస్థానాలు కూడా కార్మిక వ్యతిరేక తీర్పులకు పూనుకొంటున్నాయి. ఆర్.టి.సి. సమ్మె, జూనియర్ డాక్టర్ల పోరాటం, అద్దె బస్సుల ఏర్పాటు, సమ్మె హక్కు, బంద్ హక్కు మొదలైన విషయంలో గత తీర్పులను నిరాకరించి ప్రపంచీకరణ నేపథ్యంలో తీర్పులు వెల్లువెత్తుతున్నాయి.

సామాజిక ప్రకృతివనరులు ఆయా ప్రాంతాల, దేశాల ప్రయోజనాలకు భిన్నంగా బహుళజాతి కంపెనీలకు ధారాదత్తం చేయబడుతున్నాయి. నీరు, నిప్పు, ఉప్పు, పప్పు, విద్య, వైద్యం, వెలుతురు ఒకటేమిటి సమస్తం విదేశి, స్వదేశి గుత్త పెట్టుబడిదారి వర్గ హస్తగతం అయిపోతున్న క్రమం కొనసాగుతోంది. ప్రభుత్వరంగాన్ని వీలయిన చోట 'పిచ్చికుక్క'గా నామకరణం చేసి హతమారుస్తూ, వీలుగాని దగ్గర పబ్లిక్, ప్రైవేట్ పార్ట్‌నర్స్ పేరుతో ఫలహారంగా అమ్మివేయడం (పెట్టుబడుల ఉపసంహరణ) అభివృద్ధి నామ జపంలో భాగమయింది.

మనం ఏం కొనాలో, ఏం తినాలో, ఎలా మాట్లాడాలో, ఎలా ఆలోచించాలో అన్ని నియంత్రించే ఇడియట్ బాక్స్‌లు (టి.వి.లు), నైతిక విలువలను నిరంతరం బుగ్గిపాలు చేస్తున్నాయి. సంపదను దోచుకుంటూ, సంస్కారాన్ని ధ్వంసం చేస్తూ, ప్రజల్ని బానిసత్వం దిశగా నెట్టివేస్తున్న దుస్థితి నుండి విముక్తి కొరకు జరిపే ప్రజాస్వామిక తిరుగుబాటుకు బాటలు వేయడం అనే కర్తవ్యంలో ట్రేడ్ యూనియన్ ఉద్యమం తనకు చరిత్ర ఇచ్చిన బాధ్యతను నిర్వహించగలదని, ఎగుడు, దిగుడుగా వంకర టింకరగా సాగుతున్న కార్మికవర్గ పోరాటం అంతిమ విజయం సాధించడంలో ఐక్యంగా పురోగమించగలదని ఆశిద్దాం.

సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ సంస్కరణలు, అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ, ప్రపంచ బ్యాంక్, ప్రపంచ వాణిజ్య సంస్థ, బహుళజాతి సంస్థలు, ఔట్‌సోర్సింగ్, కమిషన్ నివేదికలు మొదలైన ముద్దు ముద్దు పేర్లతో జాతిజనుల జీవనంపై పోలీసుదెబ్బలు కొడుతున్న క్రమాన్ని ట్రేడ్ యూనియన్ ఉద్యమం తమ యూనిట్ల స్థాయికి చైతన్య వంతంగా తీసుకుపోవలసిన సమయం ఆసన్నమయింది. ఇప్పటికే బ్యాంకుల్లో 49 శాతం వాటాలు ఉపసంహరించబడ్డాయి. గ్రామీణ శాఖలు తగ్గిపోయాయి. 2007–08 ఆర్థిక సర్వేలో విదేశీ బ్యాంకులను వంద శాతం పెట్టుబడులతో వ్యవసాయరంగంలో అనుమతించాలని దిశానిర్దేశనం చేసింది. 150 బొగ్గు బావులను ప్రైవేటీకరించారు. రవాణా రంగాన్ని ముక్కచెక్కలు చేసి, డిపోలను మూసి, లాభాలు వచ్చే రూట్లలో ప్రైవేట్ వారిని అనుమతించి ప్రతిష్ఠాత్మకమైన ఆర్.టి.సి.ని భక్షిస్తున్నారు. రక్షణ రంగం, బీమా, పోస్టల్, ఒకటేమిటి అన్ని రంగాల్లో ప్రమాదకరంగా ప్రైవేటీకరణ, ఔట్‌సోర్సింగ్ నిర్విఘ్నంగా కొనసాగేలా విధాన రూపకల్పనలు జరిగిపోతున్నాయి. బి.ఎస్.ఎన్.ఎల్. సెల్‌ఫోన్ రంగంలో నాల్గవ స్థానానికి నెట్టివేయబడింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వోద్యోగులలో సి,డి కేటగిరీల్లో ముప్పై శాతం ఉద్యోగులు కుదించబడ్డారు. ప్రభుత్వ ఉద్యోగుల వేతనాలపై దుష్ప్రచారం జరిగిపోతోంది. 1990లో జాతీయ సంపదలో వేతనాలు పదహారు శాతం నుండి 2006 వచ్చేసరికి పది శాతానికి పడిపోయింది. జి.డి.పి.లో 1.5 నుండి 1.1 స్థాయికి దిగజారిన విషయం కూడా దాచివేయబడుతోంది. ఉద్యోగులంటే దోపిడీ దొరలన్న భావం పకడ్బందీగా ప్రచారం జరిగిపోతోంది. పెన్షన్ నిధులను షేర్ మార్కెట్లో పెట్టుబడులుగా మార్చాలని, చివరి సంవత్సరం జీతంలో యాభై శాతం శేష జీవితంలో పింఛన్‌గా వచ్చే అత్యంత ప్రాథమిక సూత్రాన్ని తుంగలో తొక్కుతూ, మార్కెట్ ఆధారిత పింఛన్ విధానం, కంట్రీబ్యూటరీ స్కీములను బలవంతంగా ముందుకు తెచ్చారు.

ఇ.పి.ఎఫ్.పై. పై లభించే వడ్డీని 12 శాతం నుండి 8.5 శాతానికి కుదించివేసి, ఇంకా తగ్గించేందుకు నానా అవస్థలు పడుతున్నారు. వివిధ మంత్రిత్వశాఖలను విభజించి కార్మికుల ఐక్యతను బలహీనపరచడం ఔట్ సోర్సింగ్‌కు పనులు అప్పగించడం లాంటివి అమలు చేస్తున్నారు. విద్యావాలంటీర్లు, గ్రామీణ ఆరోగ్య కార్యకర్తలు, అంగన్‌వాడి కార్యకర్తలు మొదలైన పేర్లతో వారు కార్మికులుగా ఐ.డి. చట్ట పరిధిలోకి రాకుండాను, ఉద్యోగులుగా, సి.సి.ఎస్. రూల్స్‌కు అతీతంగా గౌరవ వేతనం పేరుతో లక్షలాది మందిని పిండుకు తినడం జరుగుతోంది. తరతరాలుగా పారిశుద్ధ్యపు పనిలో బలవంతంగా మగ్గిపోయి, అణగారిన దళిత, గిరిజన వర్గాలకు సైతం పింఛన్ సౌకర్యం నిరాకరించబడుతోంది.

సమస్యలకు కారణభూతమైన విధానాలపై ఎక్కుపెట్టి పోరాటాలను జాతీయస్థాయిలో నిర్వహించే దిశగా ట్రేడ్ యూనియన్ ఉద్యమం ముందుకు సాగుతోంది. ఈ క్రమంలోనే కార్మికవర్గ అంతర్జాతీయ సాంఘీభావ ఉద్యమాలు ఆవిష్కృతమవుతాయి. ◆

ఈ ప్రభుత్వాలు లాభాలను ప్రైవేటీకరించి, నష్టాలను జాతీయం చేశాయని అంటున్నారు

బి.ఎస్. రాంబాబు

ప్రపంచీకరణ - బ్యాంకింగ్ పరిశ్రమ

ప్రపంచీకరణ, సరళీకరణ, ప్రైవేటీకరణ విధానాలు ప్రపంచ వ్యాప్తంగా అనేక పరిశ్రమలను పెనుమార్పులకు గురిచేసాయి. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న భారతదేశం లాంటి దేశాలు వీటికి మినహాయింపు కాదు. మరీ చక్కగా విశదీకరించాలంటే ఈ విధానాలు భారతదేశంలో సేవా రంగాన్ని అనేక ఒడిదుడుకులకు గురిచేయటమే కాక సేవాదృక్పథం దాదాపు కనుమరుగై లాభాపేక్ష ఒకటే ప్రస్తుతం రాజ్యమేలుతోంది. అన్ని సేవలు లాభార్జన ధ్యేయంగా చేస్తున్నవే తప్ప సమాజ అభివృద్ధి కోసం ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలు రోజు రోజుకు కనుమరుగవుతున్నాయి. ప్రభుత్వరంగ సంస్థలు కూడ ప్రతి సేవను ఎంతవరకు గిట్టుబాటు అవుతుందనే దృష్టితో చూస్తున్నాయి తప్ప ప్రజల ఆర్థిక స్థితిగతుల్ని పరిగణనలోనికి తీసుకున్న సందర్భాలు చాలా తక్కువనే చెప్పాలి.

ఈ నేపథ్యంలో ప్రజల ఆర్థికస్థితిని, దేశ ఆర్థికస్థితిని ప్రత్యక్షంగా ప్రభావితం చేసే బ్యాంకింగ్ పరిశ్రమను క్షుణ్ణంగా పరిశీలిద్దాం.

1857 నుండి భారతదేశంలో బ్యాంకింగ్ లావాదేవీలు జరుగుతున్నట్లుగా చరిత్ర చెపుతోంది. ఆర్థికంగా పటిష్ఠంగా ఉన్న కొంతమంది వారి వారి ఆర్థిక ప్రయోజనాలకోసం సొంతంగా బ్యాంకులను ఏర్పరచుకున్నారు. టాటాలకోసం సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా. గోయంకాల కోసం యూకోబ్యాంక్, చెట్టియార్‌లకోసం ఇండియన్ బ్యాంక్, బిర్లాల కోసం యునైటెడ్ బ్యాంక్ ఆవిధంగా వారి కమ్యూనిటీల అవసరాల కోసం బ్యాంకింగ్ లావాదేవీలు జరుపుకున్నారు. సమాజ అభివృద్ధిని ఏమాత్రం కాంక్షించలేదు. వ్యవసాయ అభివృద్ధిని ఖాతరు చేయలేదు. చిన్న, సన్నకారు రైతుల రుణ అవసరాలు వారి అజెండాలో ఏమాత్రం భాగంకాదు. ఈ నేపథ్యంలో 1969లో పద్నాలుగు బ్యాంకుల జాతీయకరణ, తిరిగి 1980లో మరో ఆరు బ్యాంకుల జాతీయకరణ జరిగాయి. సమాజాన్ని అభివృద్ధి చేయాలనే లక్ష్యంగా బ్యాంకుల జాతీయకరణ జరిగింది. వ్యవసాయరంగానికి ఊతమివ్వాలన్న ఆశయంతో జాతీయకరణ జరిగింది. బ్యాంకు బ్రాంచీల సంఖ్య గణనీయంగా పెరిగింది. సిబ్బంది సంఖ్య వేల నుండి లక్షలకు చేరుకుంది. వ్యవసాయ రుణాలు లక్షల కోట్లలో ఇవ్వబడ్డాయి. ప్రాధాన్యతారంగ అభివృద్ధి శరవేగంగా జరిగింది. కాని.....

1991 నుండి పి.వి. నరసింహరావు ప్రభుత్వం నూతన ఆర్థిక విధానాల వలన ప్రభుత్వరంగ బ్యాంకుల వ్యవహారశైలిలో ఊహించని మార్పులు సంభవించాయి. సర్వీస్ మోటో అనే ప్రభుత్వ విధానం ప్రాఫిట్ మోటోగా మారింది. ప్రాధాన్యత కాని రంగం రుణాలు విరివిగా ఇవ్వబడుతున్నాయి. స్టాక్‌మార్కెట్‌కు, పేకాట క్లబ్బులకు, బార్ అండ్ రెస్టారెంట్లకు ఇష్టమొచ్చినట్లుగా రుణాలు ఇవ్వబడుతున్నాయి. లాభమొక్కటే ఆశయంగా ఏర్పడ్డ కొన్ని ప్రైవేట్ బ్యాంకులకు ధీటుగా కార్యక్రమాలు ఉండాలి అన్న వాదనతో ప్రపంచీకరణ నేపథ్యంలో జాతీయకరణ ఆశయాలకు తిలోదకాలు ఇస్తున్నాయి.

కంప్యూటరీకరణ - బ్యాంకులు

కొత్తగా ఏర్పడ్డ ప్రైవేట్ బ్యాంకులు సాంకేతిక పరిజ్ఞానాన్ని సొంతం చేసుకొని, నిపుణులను సిబ్బందిగా నియమించుకొని యంత్రాల ద్వారా ఖరీదైన అపరిమిత సేవలను అందిస్తూ యువతరాన్ని ఆకట్టుకుంది అనడంలోలో ఏమాత్రం అతిశయోక్తి లేదు. ఆర్థికంగా నిలదొక్కుకున్న అనేకవర్గాలు ఆ ప్రైవేట్ బ్యాంకుల పట్ల అమితంగా ఆకర్షితులయ్యారు. ప్రైవేటీకరణ ప్రధాన విధానమయిన పాలకవర్గాలు ఈ ప్రైవేట్ బ్యాంకులకు వెన్నుదన్నుగా నిలబడ్డాయి. ప్రైవేట్ బ్యాంకులు సమాజాభివృద్ధిని నిర్లక్ష్యం చేసినా ఈ ప్రభుత్వాలు మిన్నకుండిపోయాయి. వ్యవసాయరంగం వైపు ఈ ప్రైవేట్ బ్యాంకుల దృష్టి మళ్లకపోయినా ఉపేక్షించాయి. 60 శాతం మంది ప్రజలు నివసిస్తున్న గ్రామాలలో ఈ ప్రైవేట్ బ్యాంకులు శాఖలు ఏర్పరచకపోయినా ఏ ప్రభుత్వం వీరిని ప్రశ్నించలేదు. ఒక్క ముక్కలో చెప్పాలంటే ఈ ప్రభుత్వాలు లాభాలను ప్రైవేటికరించి నష్టాలను జాతీయం చేశాయి. ప్రభుత్వరంగ బ్యాంకులలో కంప్యూటరీకరణలో జరుగుతున్న జాప్యాన్ని సిబ్బందిపైకి, ఉద్యోగ సంఘాల పైకి నెట్టివేసి మెరుగైన సేవలు ప్రైవేట్ బ్యాంకులలోనే లభిస్తున్నాయన్న భావనకు ఊతమిచ్చాయి. సిబ్బంది నియామకాల్ని రద్దుచేసి పాతరం సిబ్బందితోనే కంప్యూటర్లను ఆపరేట్ చేయిస్తూ ప్రభుత్వరంగ బ్యాంకులు సాంకేతికరంగంలో వెనుకబడ్డాయన్న ప్రచారానికి బలాన్ని చేకూర్చాయి.

బ్యాంకులు, బ్యాంకింగ్ అవసరాలు ఎవరికోసం?

112 సంవత్సరాల కాలం ఈ దేశంలో బ్యాంకులు ప్రవేట్‌రంగం చేతిలోఉండి వారి కమ్యూనిటీ అవసరాలే ధ్యేయంగా బ్యాంకింగ్ కార్యకలాపాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో బ్యాంకులు జాతీయం చేయబడ్డాయి. జాతీయకరణ ఫలాలు బ్యాంక్ బ్రాంచీలు ఎక్కువవ్వటం

ద్వారా, వ్యవసాయ రుణాలు అతిసులభంగా లభించడం ద్వారా అనేక విధానాల ద్వారా ప్రజలకు అందించబడ్డాయి. అంటే మొన్నటి సర్వీస్ మోటో నినాదం నుండి నిన్నటి 6000 వేల కోట్ల వ్యవసాయ రుణమాఫీ పథకం వరకు ఈ దేశ ప్రజలు అనేక విధాలుగా ప్రభుత్వరంగ బ్యాంకుల వలన ప్రత్యక్షంగా, పరోక్షంగా లాభపడ్డారు. మరి ఈనాడు తిరిగి ప్రభుత్వరంగ బ్యాంకులను ప్రైవేట్‌పరం చేయాలని ప్రయత్నాలు చేయటం ద్వారా ఈ ప్రభుత్వాలు ఎవరి శ్రేయస్సుకోసం పాటు పడుతున్నాయి. ప్రతి చిన్న విషయానికి గ్లోబలైజేషన్‌తో ముడిపెట్టి ప్రభుత్వరంగ బ్యాంకుల పరిపుష్టిని దెబ్బతీయాలనే తాపత్రయం దాదాపు అన్ని ప్రభుత్వాల విధానాలలోను ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. ప్రభుత్వరంగ బ్యాంకులను తిరిగి ప్రైవేటీకరించడంద్వారా లాభపడే వర్గాలు ఎవరు? నష్టపోయే వర్గాలు ఎవరు? అభివృద్ధి చెందిన దేశాలలో ఆర్థిక అసమానతలు అంతగా లేని నేపథ్యంలో బ్యాంకులు ప్రైవేట్ రంగంలోనే ఉండటం వారికి అనివార్యత కావచ్చు. కాని వ్యవసాయ ఆధారిత, గ్రామీణ నేపథ్యం అధికంగా ఉన్న ఈ దేశంలో బ్యాంకులు ప్రభుత్వ అజమాయిషి ఏమీ లేకపోవడం నిజంగా ప్రజలకు నష్టం కలిగించదా? విలీనాల పేరుతో ప్రభుత్వరంగ బ్యాంకులన్నింటిని మూడు నాలుగు బ్యాంకులుగా ఏకంచేసి, ఈ బ్యాంకులలో విదేశీ పెట్టుబడులను ఆహ్వానించి అంతర్జాతీయ విపణిలో బ్యాంకింగ్ కార్యకలాపాలు నెరిపించాలన్న ప్రభుత్వ ఆలోచనల వెనుక ఉన్న నిక్షిప్త, నిగూఢ ఆశయాల పరమార్థం ఆర్థికంగా బలంగా ఉన్న కొంతమంది పెట్టుబడిదారులను సంతృప్తి పరచడానికే! ఇప్పటికే అతలాకుతలమయిన వ్యవసాయరంగాన్ని మరింత సంక్షోభంలోకినెట్టే పనికిమాలిన దుశ్చర్య మాత్రమే!

ఈ సరళీకృత ఆర్థిక విధానాల పరమావధి దారిద్ర రేఖ దిగువున ఉన్న 40 కోట్లమంది భారతీయులను ఉద్దరించడానికి ఉద్దేశించబడాలి కాని ఆర్థిక పరిపుష్టి కలిగిన కొంతమంది వ్యక్తులకు మరింత దోహద పడేలా ఉండరాదు.

ప్రపంచీకరణ విధానాల వలన అనేక దేశాలు ఆర్థికంగా రుణ దిగ్బంధం కావించబడ్డాయి కనుచూపుమేరలో రుణ విమోచనం కాలేక పెట్టుబడిదారీ దేశాలకు దాసోహమయ్యే పరిస్థితి దాపురించింది. అభివృద్ధి చెందిన దేశాలతో ఏవిధంగానూ పోటీపడలేక అనేక పరిశ్రమలు మూతపడిన పరిస్థితి అనేక దేశాలలో అనునిత్యం కనిపించే అతి సాధారణ విషయం. ప్రపంచబ్యాంక్, అంతర్జాతీయ ద్రవ్యసంస్థల ఆధిపత్యంలో కనుసన్నలలో అనేకదేశాల ఆర్థికస్థితి కొట్టుమిట్టాడుతోంది.

మనదేశంలో కూడ ప్రపంచబ్యాంక్ ఆదేశాలకు అనుగుణంగానే ఈ ప్రభుత్వాలు ప్రభుత్వరంగ బ్యాంకులను ప్రైవేటీకరించే ప్రయత్నం చేస్తున్నాయి. ప్రభుత్వరంగ బ్యాంకులను బలహీనపరచాలనే తలంపు అడుగడుగునా వ్యక్తపరుస్తూనే ఉంది. ప్రభుత్వరంగ బ్యాంకులు సాధించిన ప్రగతిని, సాధిస్తున్న పురోగతిని అభినందిచడానికి కూడ ప్రభుత్వాధినేతల వద్ద మాటలు కరువయ్యాయి. జూలై 19న జాతీయకరణ దినోత్సవంగా ఘనంగా జరుపుకోవాలన్న ఇంగిత జ్ఞానం అటు పాలకులకు గాని ఇటు ప్రభుత్వరంగ బ్యాంకుల యాజమాన్యానికి గాని లేదంటే పరిస్థితిని మనం ఆకళింపు చేసుకోవచ్చు.

ఏది ఏమైన ఈ ప్రపంచీకరణ ప్రక్రియను మనం ఆపలేకపోవచ్చు. సరళీకృత విధానాలు మరింత వేగవంతంగా అమలయ్యే అవకాశాలు హెచ్చుగా ఉండవచ్చు. ప్రైవేటీకరణ మంత్రాన్ని పఠిస్తూ దానిద్వారానే పురోగతి సాధ్యమనే వాదనతోనే ప్రభుత్వాల మనుగడ కొనసాగవచ్చు.

కాని ప్రగతిశీల ప్రజాస్వామ్య వాదులందరూ ఏకమయి సమాజంలోని అసమానతలను తొలగించడానికి నిరంతరం కృషి జరపాలి. ఆర్థికంగా చేయూతనిస్తున్న ప్రభుత్వరంగ బ్యాంకులను మరింత బలోపేతం చేయాలి. నిర్లక్ష్యానికి గురవుతున్న వ్యవసాయరంగానికి బ్యాంకుల ద్వారా మరింత రుణ సదుపాయాన్ని కలుగజేసేటట్లు కృషి చేయాలి. అప్పుడే దేశాభివృద్ధి సమతౌల్యంగా ఉంటుంది. ప్రజల కొనుగోలు శక్తిపెరిగి దేశ ఆర్థికాభివృద్ధి వేగవంతమవుతుంది. ◆

అభివృద్ధి చెందుతున్న ఏ ఆర్థిక వ్యవస్థలోనైనా సంఘటితరంగం అసంఘటితరంగాన్ని అప్రధాన స్థానానికి నెడుతుందని, కాని మనదేశంలో అలా జరగడం లేదని అంటున్నారు బి. ప్రదీప్

ప్రపంచీకరణలో కార్మికులు - కొన్ని అంశాలు

రానున్న 122వ 'మేడే' సందర్భంగా ఇటీవలె ఓ టి.వి. ఛానెల్ ఒక చర్చను నిర్వహించింది. ఈ చర్చలో ట్రేడ్ యూనియన్ల ప్రతినిధులు, కొందరు యజమానులు, కన్సల్టెంట్లు, అదనపు లేబర్ కమిషనర్ తదితరులు పాల్గొన్నారు. నేటి పరిస్థితులు 'మేడే' పుట్టిన కాలంలో పరిస్థితులతో పోలిలేవని, యజమానులు, కార్మికులు ఒక కుటుంబంలా సామరస్యంగా ఉంటున్నారని, సమ్మెలు పెద్దగా లేవనే విషయం చర్చకి వచ్చాయి. సారాంశంలో పెట్టుబడికీ, శ్రమకీ అప్పట్లో ఉన్న వైరుధ్యం నేడు సమిసి పోయిందనే భావనని యజమానులు వ్యక్తపరిచారు. మేడేని కార్మికులు - యజమానులు అందరూ కలిసి ఒక పండగగా జరుపుకుంటున్నారనీ, జరుపుకోవాలనీ అన్నారు కన్సల్టెంట్లు.

నేటి పరిస్థితులు, కార్మికుల స్థితిగతులు, మేడే ప్రాముఖ్యతల గురించి ఈ సందర్భంగా మాట్లాడుకుందాం.

నేటి దేశ పరిస్థితులు మనం తరచూ చెప్పుకొంటున్న 'ప్రపంచీకరణ'కి అతీతంగా ఉన్నవి కావు. ప్రపంచీకరణ అంటే పెట్టుబడి ప్రపంచీకరణ అనేది విదితమే. ప్రపంచానికి పెట్టుబడి ప్రపంచీకరణ కొత్తదేమీ కాదు. ఎందుకంటే పెట్టుబడి పుట్టక నుండే దేశ సరిహద్దులతో నిమిత్తం లేకుండా అది వ్యాపిస్తూ పోయింది. మార్కెట్ల లాభాల వేటలో ఈ క్రమం కొనసాగుతూ వచ్చింది. నేటి ప్రపంచీకరణలో కొన్ని కొత్త అంశాలు లేకపోలేదు. ప్రపంచంలో నేడు పెట్టుబడి తాకిడికి గురికాని ప్రాంతమంటూ లేదు. దీనర్థం ప్రపంచంలోని వెనుకబడిన దేశాలలోని ఆర్థిక వ్యవస్థలన్నీ పెట్టుబడిదారీ వ్యవస్థలుగా మార్చబడ్డాయి అని కాదు. ప్రపంచ మార్కెట్లోకి లాగబడి సామ్రాజ్యవాద గుప్పిట్లో ఈడ్చబడ్డాయనేదే దీనర్థం. నేటి ప్రపంచీకరణలో పెట్టుబడి చలనం ఐ.టి. మాధ్యమం ద్వారా వేగవంతం అయింది. గతంలో ప్రపంచంలో ఉన్న శ్రమ విభజన వివిధ రూపాలలో తీవ్రమైంది. సబ్ - కాంట్రాక్టింగ్, ఔట్‌సోర్సింగ్ రూపాలు తీవ్రమయ్యాయి.

ఈ నేపథ్యంలో మన దేశ పరిస్థితులు ఎలా ఉన్నాయో క్లుప్తంగా ప్రస్తావించుకుందాం. సామ్రాజ్యవాదంతో మన దేశ ఆర్థిక వ్యవస్థ పెనువేసుకుని ఉంది. ఇదేదో గత 15-20 సంవత్సరాల కాలంలో మొదలైనటువంటిది కాదు. 1947లో వలసపాలన అంతమైనప్పటికి నయా వలస పద్ధతుల్లో సామ్రాజ్యవాదం తన పట్టుని కొనసాగించేలా పాలకులు విధానాలని రూపొందించారు. 1980 దశకంలో ఐ.ఎం.ఎఫ్. షరతులకి తలొగ్గి ఆర్థికవ్యవస్థలో సామ్రాజ్యవాద పట్టుని మరింత బలోపేతం చేసే విధానాలని పాలకులు అనుసరించారు. ఈ కాలంలో సామ్రాజ్యవాదానికి వాహకాలైన ప్రపంచబ్యాంక్ - ఐ.ఎం.ఎఫ్.ల ఆధ్వర్యంలో వ్యవస్థాగత సర్దుబాటు కార్యక్రమం మొదలైంది. మన రాష్ట్రంలో ప్రైవేటీకరణ ప్రక్రియ ఈ కాలంలోనే ప్రారంభమైంది. 1989లోనే వ్యాన్‌లు తయారు చేసే ఆల్విన్ శాఖని మహేంద్రలకి అప్పచెప్పారు. 1991లో అప్పటి పి.వి సర్కార్ నూతన ఆర్థిక, పారిశ్రామిక, వ్యాపార విధానాలని తీసుకువచ్చింది. ఇవి. ఐ.ఎం.ఎఫ్., ప్రపంచబ్యాంక్ నిర్దేశిత విధానాలే అనేది అందరికి అర్థమైంది. నేడు కొనసాగుతున్న విధానాలు ఇవే. వీటి పర్యావసానంగా కార్మికుల స్థితిగతులు ఎలా ఉన్నాయో పరిశీలిద్దాం.

దేశ శ్రామిక జనాభాలో కేవలం. 8.8 శాతం మాత్రమే సంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులు. అత్యధిక భాగం అసంఘటిత రంగంలో ఉన్న వారే. సరళీకరణ, ప్రైవేటీకరణ విధానాల అమలు నేపథ్యంలో సంఘటిత రంగంలోని కార్మికుల సంఖ్యా తగ్గుతూ వస్తోంది. పారిశ్రామిక, సర్వీస్ రంగాల్లో ఈ ప్రక్రియను చూడగలుగుతాం. ప్రస్తుతం సంఘటిత రంగ కార్మికుల సంఖ్య 7.6 శాతానికి పడిపోయింది. అభివృద్ధి చెందుతున్న ఏ ఆర్థిక వ్యవస్థలోనైనా సంఘటితరంగం అసంఘటిత రంగాన్ని అప్రధాన స్థానానికి నెట్టుతుంది. కానీ మన దేశంలో అలా జరగడం లేదు. ఇప్పటికీ మన దేశంలో ఉపాధి ఉన్న వారిలో 60 శాతం స్వయం ఉపాధి సంపాదించుకున్న వారే. సంఘటితరంగంలో రెగ్యులర్ కార్మికుల సంఖ్య తగ్గిపోతున్న స్థితి ఒకవైపు అయితే కాంట్రాక్ట్ పద్ధతిలో కార్మికులని నియమించుకోవటం రోజూ పెరుగుతోంది. మన రాష్ట్రంలో ప్రభుత్వరంగ సంస్థ అయిన సింగరేణిలో ఒకప్పుడు లక్షా పదహారు వేల మంది కార్మికులు పనిచేసేవారు. కాంట్రాక్ట్ కార్మికులు పెద్దగా లేరు. కాని ఈ రోజు పర్మినెంటు కార్మికులు సంఖ్య డెబ్బైవేలకి పడిపోయింది. పదివేలు పై చిలుకు కాంట్రాక్ట్ కార్మికులు పనిచేస్తున్నారు. హైదరాబాద్ చుట్టూ పారిశ్రామిక ప్రాంతాలలోని అనేక ఫ్యాక్టరీల్లో పర్మినెంట్ కార్మికులకంటే ఎక్కువ సంఖ్యలో కాంట్రాక్ట్ కార్మికులున్నారు. ఢిల్లీ నగరానికి దగ్గరలో ఉన్న నోయిడా పారిశ్రామిక ప్రాంతంలో అనేక బహుళజాతి కంపెనీల్లో పనిచేస్తున్న అత్యధిక కార్మికులు కాంట్రాక్ట్, క్యాజువల్ కార్మికులే. ఈ 20-25 సంవత్సరాల కాలంలో సరళీకరణ, ప్రైవేటీకరణ విధానాల మూలంగా పర్మినెంట్ ఉద్యోగాలు కరువై వాటి స్థానంలో నాన్ - పర్మినెంట్ ఉద్యోగాల ప్రధాన ధోరణిగా ఉన్నది. ఈ ప్రక్రియ యాదృచ్ఛికంగా జరుగుతున్నది కాదు. ఎక్కువ లాభాలు సంపాదించుకోటానికి ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించాలి. ఉత్పత్తి వ్యయంలో లేబరు బిల్లుని తగ్గించటం ఒక మార్గం. ఇది కాంట్రాక్టీకరణ, క్యాజులీకరణ ద్వారా జరుగుతున్నది. దీని మూలంగా అభద్రతా భావం

పాలకులు ఒకవైపు బొగ్గుగనుల్లో ప్రైవేట్ భాగస్వామ్యాన్ని అనుమతిస్తూనే మరోవైపు ప్రభుత్వరంగ సంస్థలను బలహీనపరిచే విధంగా ఖాయిలా పరిశ్రమల చట్టాన్ని అమలులోకి తీసుకువచ్చారని అంటున్నారు పిట్టల రవీందర్

అంతర్గత వలసదోపిడీ కేంద్రంగా సింగరేణి

సింగరేణి బొగ్గుగనుల సంస్థ 2007-08 ఆర్థిక సంవత్సరానికి గాను తాను నిర్దేశించుకున్న ఉత్పత్తి లక్ష్యాలను మరోమారు అధిగమించింది. సింగరేణి తాను నిర్ణయించుకున్న బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను అధిగమించడం, లాభాలను ఆర్జించడం వరుసగా ఇది ఆరవసారి కావడం గమనార్హం. సుమారు 120 సంవత్సరాల సుదీర్ఘ చరిత్రను కలిగి ఉన్న సింగరేణి కేవలం పదిహేను సంవత్సరాల కాల వ్యవధిలోనే తన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను రెండింతలు చేరుకోవడం గమనించదగిన విషయం. బాహ్య ప్రపంచం దృష్టిలో ఒకనాడు సమ్మెలకు పర్యాయపదంగా భావించిన సింగరేణిలో గడచిన ఆర్థిక సంవత్సరంలో ఒక్క సమ్మెకూడ లేకుండా, నిరంతరాయంగా ఉత్పత్తి కార్యకలాపాలు కొనసాగడం మరో పరిణామం. అయితే సింగరేణి బొగ్గుగని కార్మికుల సమస్యలన్నింటినీ కంపెనీ యాజమాన్యం తనంతటతానుగానే తీర్చి వేసిందని చెప్పడానికి ఎలాంటి అధారాలు లేవు. సమ్మె ఊసు ఎత్తలేనంత తీక్షణంగా కార్మికవర్గం అణచివేతకు గురవుతోంది. గని కార్మికుల సమస్యల పరిష్కారం కోసం యాజమాన్యం పైనా, ప్రభుత్వంపైనా ఒత్తిడి తేవడానికి కనీసం ఒక్కరోజు కూడా సమ్మెను ఆయుధంగా ఉపయోగించు కోలేనంత దుస్థితికి నెట్టేయబడ్డారు. సింగరేణిలోని గుర్తింపు కార్మిక సంఘాలు తమ ఉనికిని ప్రశ్నార్థకం చేసుకున్న వాస్తవాలు కూడా ఈ సమ్మె రహిత ఉత్పత్తి లక్ష్యాల సాధన వెనక దాగి ఉన్నాయని గ్రహించవచ్చు. సింగరేణి లో సంస్కరణల పేరిట ప్రపంచబ్యాంక్ అభివృద్ధి నమూనాను ఆచరించడం ప్రారంభించిన 1997లోనే ఈ పరిణామాలకు అంకురార్పణ జరిగింది. సంస్కరణల పేరిట సింగరేణిలో అమలు జరుగుతున్న నూతన పారిశ్రామిక విధానాలకు సంబంధించి గడచిన పది సంవత్సరాల అనుభవంలో మార్పులు చోటు చేసుకున్నాయి.

అందులో ముఖ్యంగా, ఎంతో పోరాట పటిమను ప్రదర్శించే సింగరేణి బొగ్గుగని కార్మికవర్గ చైతన్యాన్ని బలహీనపరిచి, అప్పటివరకూ సింగరేణి కార్మికులు ప్రదర్శించిన ఐక్యతను చావుదెబ్బతీసి, ఒక పరిశ్రమ - ఒకే కార్మిక సంఘం పేరుతో కార్మిక సంఘాల మధ్యన నిరంతరం పెరుగుతోంది. సంఘటితం చేసే ప్రయత్నాల్లో అదనపు ఇబ్బందులు ట్రేడ్ యూనియన్‌లు ఎదుర్కొంటున్నాయి.

నేటి పరిస్థితుల్లో కార్మికులు ఎదుర్కొంటున్న రెండవ సమస్య వేతనాలకి సంబంధించినది. 'కనీస వేతనాలు' అసంఖ్యాక కార్మికులకి దొరకటం లేదు. ఒకవైపు ప్రభుత్వాలు అడపాదడపా జారిచేస్తున్న కనీస వేతనాల జి.ఒలు అమలుకు నోచుకోవటం లేదు. మరోవైపు ప్రభుత్వాలు నిర్ణయిస్తున్న కనీస వేతనాలు కార్మికుడు, తన కుటుంబం బతకటానికి సరిపోయే విధంగా లేవు. 'అవసరాలకి అనుగుణమైన వేతనాలు' అనే సూత్రాన్ని ప్రభుత్వాలు ఎప్పుడో పక్కనపెట్టాయి. నగరంలో అనేక పారిశ్రామిక ప్రాంతాల్లో రోజుకి 40 రూపాయలపై ఆధారపడి బతుకుతున్న కార్మికులు వేల సంఖ్యలో ఉంటారు. ఇక సంఘటిత రంగంలో కార్మికులు వేజ్-ఫ్రీజ్, డి.ఎ. సీలింగ్ లాంటి సమస్యలు ఎదుర్కొంటున్నారు. మొత్తంగా కార్మికుల వేతనాల విషయంలో నిజ వేతనాలు పెరగటం లేదు. వేజ్-డిప్రెషన్ ప్రధానంగా కొనసాగుతున్నది. మల్టి-టైర్ వేతన పద్ధతి ఉనికిలోకి వచ్చింది.

మరో ముఖ్యమైన సమస్య పనిభారం, పని గంటలకి సంబంధించిన సమస్య. సరళీకరణ, ప్రైవేటీకరణ విధానాల మూలంగా తక్కువ మంది కార్మికులతో ఎక్కువ పని చేయించుకునే పద్ధతిని చూస్తాం. అంటే ఒక కార్ఖానాలో వంద కార్మికులు ఉత్పత్తిలో ఉండే స్థానంలో యాభైమంది కార్మికులతో అంతే ఉత్పత్తి చేయించటం వారిపై పనిభారాన్ని పెంచటం ఫలితమే. ఇదేగాక మల్టి-స్కిల్డ్ సిస్టమ్ అనే పద్ధతి ఈ కాలంలో ప్రవేశపెట్టబడింది. దీనర్థం కార్మికుడు యాజమాన్యం ఏపని చెబితే ఆపని చేయాలి. దీని మూలంగా కార్మికుడిపై పనిభారం పెరుగుతున్నది.

ఎనిమిది గంటల పని దినం అమలులేని పరిస్థితి నేటికీ కొనసాగుతోంది. పది నుండి పన్నెండు గంటలు పనిచేస్తున్న పారిశ్రామిక కార్మికులు నేటికి ఉన్నారు. సర్వీస్ రంగంలో కూడా ఈ పరిస్థితి నెలకొని ఉన్నది. చివరికి పాలకులు చాలా గొప్పగా చెప్పుకుంటున్న ఐ.టి. రంగం సైతం దీనికి మినహాయింపు కాదు.

122వ మేడే సందర్భంగా పై పరిస్థితులని గమనంలో ఉంచుకుంటే ఒక విషయం స్పష్టమౌతోంది. ప్రపంచీకరణ, సరళీకరణ, ప్రైవేటీకరణ విధానాలు పెట్టుబడి దాడిని తీవ్రం చేశాయి. శ్రమ దోపిడీ పెరిగింది. కార్మికుల హక్కులపై దాడి తీవ్రమైనది. పెట్టుబడికి పూర్తి స్వేచ్ఛ కల్పించాలని ప్రపంచబ్యాంక్ ఇస్తున్న ఆదేశాల్ని పాలకులు అమలు పరిచే ప్రయత్నం సాగుతోంది. 122 సంవత్సరాలక్రితం చికాగో నగరం లో జరిగిన మహత్తర పోరాటం కేవలం ఎనిమిది గంటల పనిదినం అమలుకోసమే జరిగినటువంటిది కాదు. పెట్టుబడి దోపిడీకి వ్యతిరేకంగా సాగినపోరాటం. దాని ప్రాధాన్యత నేటికి ఉన్నదనే విషయాన్ని గుర్తించు కుందాం. సోషలిజమే 'ప్రతి మానవడి సంక్షేమాన్ని సాధించగలదు' అని ఉరితీయబడ్డ ఆల్బర్ట్ పార్సన్స్ మాటల్ని జ్ఞాపకం చేసుకుందాం. ◆

చిచ్చురేపారు. మరోవైపు భారీ యాంత్రీకరణ, ప్రైవేటీకరణలను ప్రవేశపెట్టి, తెలంగాణలోని నాలుగు జిల్లాలలో (ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం) మాత్రమే లభ్యమయ్యే నేలబొగ్గును వలసపాలకులు తమకున్న రాజకీయ ఆధిపత్య సాధనంతో ఇతర ప్రాంతాలకు వేగవంతంగా తరలించుకుపోవటం లాంటి పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఇందుకు అనుగుణంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గడిచిన పది సంవత్సరకాలంలో సింగరేణిలో మూడు దశల సంస్కరణలను అమలులోకి తీసుకువచ్చాయి. బహుళజాతి కంపెనీలు నిర్వహిస్తున్న విదేశీ బొగ్గును దిగుమతి చేసుకోవటానికి వీలుగా దేశీయ బొగ్గు పరిశ్రమను బలహీనం చేయడానికి సంస్కరణల పేరిట ప్రపంచబ్యాంకు కనుసన్నల్లో కొత్త విధానాలకు మొదటి దశలో రూపకల్పన జరిగింది. ఒకవైపు బొగ్గుగనుల్లో ప్రైవేట్ భాగస్వామ్యాన్ని అనుమతిస్తూనే మరోవైపున ప్రభుత్వ రంగ సంస్థలను బలహీనపరిచే విధంగా ఖాయిలా పరిశ్రమల చట్టాన్ని అమలులోకి తీసుకువచ్చారు. ప్రభుత్వ రంగ సంస్థలు నష్టాలబారిన పడటానికి దారితీసిన ప్రభుత్వ విధానాలుగానీ, రాజకీయ ఆధిపత్యం గానీ, అధికారుల అవినీతి లాంటి మౌలిక అంశాల జోలికిపోకుండా, వాటిని పరిష్కరించే చర్యలు తీసుకోకుండా నష్టాల సాకుచూపి ఆయా ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించడానికి ఖాయిలా పరిశ్రమల చట్టం ప్రభుత్వానికి వీలు కల్పించింది.

ఇదే క్రమంలో సింగరేణి బొగ్గుగనుల సంస్థను నష్టాల సాకుచూపి బి.ఐ.ఎఫ్.ఆర్. పరిశీలనకు కోల్ ఇండియాలో విలీనం చేసే కుట్రను ప్రభుత్వం పెద్ద యెత్తున ప్రచారంలోకి తీసుకువచ్చింది. సింగరేణి మనుగడ కొనసాగాలంటే సంస్కరణలు (నూతన పారిశ్రామిక విధానాలు) అమలు మినహా మరో మార్గంలేదని ప్రచారం నిర్వహించింది. లేనిపక్షంలో నష్టాల కారణంగా సింగరేణి సంస్థను పూర్తిగా మూసి వేయాల్సి వస్తుందని బెదిరించింది. నష్టాలకు అసలు కారణమైన అవినీతిని గురించి కార్మికవర్గం దృష్టిని మళ్లించేందుకు అన్నిరకాల అవకాశాలను సింగరేణి యాజమాన్యం ఉపయోగించింది.

ఇక్కడి భౌగోళిక పరిస్థితులకు అనుకూలించని టెక్నాలజిని విదేశీ బహుళజాతి సంస్థల నుండి దిగుమతి చేసుకున్నది. కోట్లాది రూపాయల కుంభకోణాలకు అవకాశం కల్పించింది. మరోవైపున కార్మికులు కష్టపడి పనిచేయకపోవడం, చీటికిమాటికీ సమ్మెలు చేయడం, వేతన సవరణల కోసం ఒత్తిడి తీసుకురావడం లాంటి కారణాల ఫలితంగానే సింగరేణి నష్టాల ఊబిలో కూరుకుపోయినట్లు తీవ్రస్థాయిలో ప్రచారం నిర్వహించారు. యాజమాన్యం నిర్వహిస్తున్న తలకిందుల ప్రచారాన్ని తిప్పికొట్టడంలో కార్మిక సంఘాలు పూర్తిగా విఫలమయ్యాయి. సింగరేణి గని కార్మిక వర్గాన్ని చైతన్యపరిచి, కార్మికవర్గ పోరాటాల ద్వారా అనేక సమస్యలకు పరిష్కారం సాధించిన విప్లవ కార్మిక సంఘాలపై ప్రభుత్వాలు సాయుధ అణచివేతను అమలు జరిపాయి. కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను సైతం నిలుపుకోలేని దయనీయస్థితికి సింగరేణిలోని గుర్తింపు కార్మిక సంఘాలు కుదించుకుపోయాయి.

ఇట్లా సింగరేణి గని కార్మికవర్గాన్ని తీవ్రమైన భయాందోళనకు గురిచేసిన యాజమాన్యం క్రమక్రమంగా ప్రపంచబ్యాంక్ రూపొందించిన సంస్కరణలను అమలుచేయడం మొదలుపెట్టింది.

ప్రపంచంలోనే మొట్టమొదటిసారిగా ఓపెన్‌కాస్ట్ బొగ్గుగనిలో పై మట్టి (ఓవర్‌బర్డెన్) తొలగించే పనిని ప్రైవేట్ సంస్థలకు అప్పగించే పని సింగరేణి (కరీంనగర్ జిల్లా రామగుండం ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్ట్‌లో) లో ప్రారంభమైంది. ఆ తర్వాత అండర్ గ్రౌండ్ గనుల్లోనూ అన్ని దశల్లో, అన్ని పనుల్లోకి ప్రైవేట్ కంపెనీలను ప్రవేశపెట్టింది. ఈ క్రమంలో సింగరేణి గనుల్లో భారీ యంత్రాలను ప్రవేశపెట్టి బొగ్గు ఉత్పత్తి ప్రక్రియలో కూడా బహుళజాతి సంస్థల రంగప్రవేశానికి దారిని సుగమం చేసింది. ఫలితంగా సింగరేణి నిర్వహిస్తున్న బొగ్గు ఉత్పత్తి కార్యకలాపాలలో సుమారు 70 శాతం పనులు ప్రైవేట్ కంట్రాక్టర్లే నిర్వహించే స్థాయికి చేరుకున్నది. బొగ్గుగనుల్లో నిర్వహించే బొగ్గు ఉత్పత్తి ప్రక్రియలో పూర్తిపనులను ప్రైవేట్ కాంట్రాక్టర్లే నిర్వహించే స్థాయికి సింగరేణిలో ప్రైవేటీకరణ చేరుకున్నది. ఖమ్మం జిల్లా ఇల్లందులోని కోయగూడెం ఓపెన్‌కాస్ట్ గనిలో మొత్తం ఉత్పత్తిని ప్రైవేట్ సర్వీస్ మైనర్ ద్వారా నిర్వహించేందుకు కంపెనీ ప్రయత్నించింది. దీనికి వ్యతిరేకంగా కార్మికోద్యమ చరిత్రలోనే మొట్టమొదటిసారిగా 2002లో గని కార్మికులు వ్యక్తిగత డిమాండ్లు లేకుండా 'సింగరేణి యాజమాన్యం' అనే నినాదంతో సమ్మె చేయాల్సివచ్చింది. అయితే ఈ సమ్మె నాయకత్వం లోపం వల్ల విఫలం కావడంతో సింగరేణి యాజమాన్యం రెట్టించిన ఉత్సాహంతో సంస్కరణలను వేగవంతంగా అమలు జరపడం ప్రారంభించింది. సంస్కరణలు అమలు జరుపడంలో సింగరేణి సంస్థ దేశంలోని మొత్తం ప్రభుత్వ సంస్థలకే తలమానికంగా నిలిచిందని, సంస్థ నష్టాల చీకటిలో నుండి లాభాల వెలుగులోకి నడిచి ఆదర్శ సంస్థగా నిలిచిందని పెద్ద యెత్తున ప్రచారం నిర్వహించింది.

ఈ పరిణామాల ఊపులో గని కార్మికులపై మరింత తీవ్రమైన నిర్బంధాన్ని సింగరేణి యాజమాన్యం అమలు జరిపింది. వివిధ రకాల కారణాలను చూపి 'రిట్రెంచ్‌మెంట్' చేయడం మొదలుపెట్టింది. కార్మికులకు వైద్య సౌకర్యం కలుగజేయవలసిన కంపెనీ ఆసుపత్రులు మెడికల్ అన్‌ఫిట్ చేసే కేంద్రాలుగా మారిపోయాయి. స్వచ్ఛంద పదవీ విరమణ పేరుతో కార్మికులను గని అధికారులు వివిధ రకాలుగా బెదిరించి, వి.ఆర్.ఎస్. ఫారాలపై సంతకాలు చేయించుకున్నారు. అట్లా వినని వారిని అన్‌ఫిట్ చేస్తామని, ఇతర ప్రాంతాలకు బదిలీ చేస్తామని బెదిరించి లొంగదీసుకున్నారు. ప్రమాదాల్లో మృతి చెందిన కార్మికుల స్థానంలో కంపెనీలో ఉద్యోగం పొందిన మహిళా కార్మికులను సైతం ఇవే పద్ధతుల్లో ఇంటిదారి పట్టించారు. ఇష్టపడని మహిళా కార్మికులను టాయిలెట్లు శుభ్రం చేసే పనులకు పురమాయించి ఉద్యోగం మీద అసహ్యం కలిగే పరిస్థితులు కల్పించారు. ఆబ్సెంట్ పేరుమీద చార్జిషీట్లు, డిస్మిస్‌లకు సింగరేణిలో కొదవలేకుండా పోయింది. ఈ పరిణామాలన్నీ రాష్ట్రంలో చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా పని చేసిన తొమ్మిది సంవత్సరాల కాలంలోనే రెండు దశల్లో అమలు జరిగాయి. తాము అధికారంలోకి వస్తే చంద్రబాబునాయుడు ప్రపంచబ్యాంక్‌తో చేసుకున్న ఒప్పందాలన్నిటినీ సమీక్షిస్తామని 2004 ఎన్నికల్లో హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన డా. వై.ఎస్. రాజశేఖరరెడ్డి అవే విధానాలను మరింత పకడ్బందీగా, వేగవంతంగా అమలు చేస్తున్నారు. ప్రస్తుత పంచవర్ష ప్రణాళికాంతానికి (2013 నాటికి) సింగరేణిలో మూడవ దశ సంస్కరణలు అమలు జరిపి పూర్తిస్థాయిలో ప్రైవేటీకరణ నిర్వహిస్తామని వై.ఎస్. ప్రకటించారు. అయితే వై.ఎస్. ప్రకటించిన మూడవ దశ సంస్కరణల్లో ఇతర అంశాలతోపాటుగా మరో కీలకమైన అంశం కూడా ముడిపడి ఉన్నది.

తెలంగాణ ప్రజలు ప్రత్యేక రాష్ట్రం కోసం మలి దశ ఉద్యమం నిర్వహిస్తున్న తరుణంలోనే తెలంగాణకు చెందిన సహజ సంపదలన్నింటినీ వలస ప్రాంతాలకు తరలించుకుపోవాలనే ఆలోచన కూడా మూడవ దశ సంస్కరణల్లో అంతర్లీనంగా కనపిస్తున్నది. సింగరేణి ప్రస్తుతం నిర్వహిస్తున్న 13 ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్‌ల్లో పై మట్టిని తొలగించే పనిని ఆంధ్రా, రాయలసీమ ప్రాంతాలకు చెందిన పదకొండు మంది బడా కాంట్రాక్టర్లు సిండికేట్‌గా ఏర్పడి నిర్వహిస్తున్నారు. సింగరేణిలో ప్రస్తుతం పనిచేస్తున్న 75వేల మంది కార్మికులకు వేతనాల రూపంలో చెల్లిస్తున్న వార్షిక వేతనాలకంటే ఈ పదకొండు మంది కోస్తాంధ్ర కాంట్రాక్టర్లకు కంపెనీ చెల్లిస్తున్న లాభాలు మించిపోయాయి. మరోవైపు సింగరేణిలో ఉత్పత్తి చేస్తున్న బొగ్గులో తెలంగాణ ప్రాంతంలో కేవలం 23 శాతం మాత్రమే వినియోగిస్తూ, మిగిలిన 77 శాతం బొగ్గును ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. అందుకే ఇవ్వాళ్ళ తెలంగాణ ప్రాంతంలో నిర్మిస్తున్న థర్మల్ విద్యుత్ కేంద్రాలకు బొగ్గు లభించడంలేదు. ప్రపంచంలోనే అతి పెద్ద ఎరువుల కర్మాగారంగా నిర్మించిన రామగుండం ఎరువుల కర్మాగారం (ఎఫ్.సి.ఐ.) బొగ్గు కొరతతో మూసివేశారు. మరోవైపున కడప జిల్లాలోని రాయలసీమ థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని సింగరేణి బొగ్గు వినియోగంతో మరో నాలుగు దశల్లో విస్తరించేందుకు రాజశేఖరరెడ్డి ప్రభుత్వం ప్రణాళికను సిద్ధం చేసింది. కానీ నిజాం కాలంలో నిర్మించిన రామగుండం 'బి' థర్మల్ విద్యుత్ కేంద్రం మాత్రం విస్తరణకు నోచుకోకుండా కేవలం 62.5 మెగావాట్ల కనిష్ఠ ఉత్పత్తి సామర్థ్యంతో కునారిల్లుతుంది. ఈ తలకిందుల పరిణామాలకు సాక్షులుగా ఉన్న పార్లమెంట్ సభ్యుడు జి. వెంకటస్వామి, ఆర్.టి.సి. చైర్మెన్ ఎం. సత్యనారాయణరావు, మంత్రి టి. జీవన్‌రెడ్డి లాంటి తెలంగాణ ప్రాంత రాజకీయ నాయకులు వలసపాలకుల పక్షం వహిస్తూ, రాజశేఖరరెడ్డి కొనసాగిస్తున్న తెలంగాణ వనరుల దోపిడీని అభివృద్ధిగా అభివర్ణిస్తూ, ఆత్మవంచనకు పాల్పడుతున్నారు.

ప్రజాహితం కోసం ఏర్పాటు చేసిన సింగరేణి పబ్లిక్ రంగ సంస్థ, మార్కెట్ మాయాజాలంలో కూరుకుపోయి ఒక పూర్తిస్థాయి బహుళజాతి వ్యాపార సంస్థగా అవతారమెత్తింది. ఔట్‌సోర్సింగ్, ప్రైవేటీకరణలను అమలు జరిపి సింగరేణిని అసంఘటిత కార్మిక క్షేత్రంగా మార్చివేసారు. ఉద్యోగ నియామకాలను పూర్తిగా నిలిపివేసి, స్వచ్ఛంద పదవీ విరమణ, గోల్డెన్ షేక్‌హ్యాండ్, తదితర పేర్లతో గడిచిన పది సంవత్సరాల కాలంలో సుమారు నలభై రెండు వేలమంది కార్మికులను ఇంటిదారి పట్టించారు. అండర్ గ్రౌండ్ గనులను మూసివేసి, భారీ ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్‌లకు శ్రీకారం చుట్టారు. ఫలితంగా సింగరేణిలో మానవశ్రమశక్తి వినియోగం పూర్తిగా తగ్గిపోయింది.

సింగరేణిలో 1990-91 ఆర్థిక సంవత్సరంలో మానవ శ్రమ ద్వారా 97.48 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి జరిగితే గడచిన ఆర్థిక సంవత్సరంలో కేవలం 13 లక్షల టన్నులకు పడిపోయింది. ఇదే కాలంలో ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్ట్‌ల నుండి బొగ్గు ఉత్పత్తి 66 లక్షల టన్నుల నుండి 275 లక్షల టన్నులకు పెరిగిపోయింది. ఇదే విధంగా అండర్ గ్రౌండ్ బొగ్గుగనుల్లో యంత్రాల ద్వారా బొగ్గు ఉత్పత్తి కూడా 13.73 లక్షల టన్నుల నుండి 65 లక్షల టన్నులకు పెరిగిపోయింది. ఈ మార్పుల ఫలితంగా సింగరేణిలో కార్మికుల సంఖ్య గణనీయంగా తగ్గుతూ వచ్చింది. 1990-91 ఆర్థిక సంవత్సంలో 1,16,918 కార్మికులు సింగరేణిలో పనిచేస్తే 2007-08 చివరినాటికి 75,648 మంది కార్మికులకు కుదించబడింది. అయితే ఇదేకాలంలో సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి మాత్రం 177 లక్షల టన్నుల నుండి 406 లక్షల టన్నులకు పెరిగింది. బొగ్గు ఉత్పత్తి ప్రక్రియలో ఈ ప్రాంత ప్రజల ప్రమేయం పూర్తిగా తగ్గిపోతున్నట్లు ఈ గణాంకాలు నిరూపిస్తున్నాయి. ఫలితంగా సింగరేణిలో బొగ్గుగనుల్లో ఈ ప్రాంతవాసులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పూర్తిగా అడుగంటిపోతున్నాయి. గని కార్మికుల సంస్కృతిలో ఒక భాగమైన తట్టా, చెమ్మాసులు పూర్తిగా లేకుండా పోయాయి. అనేక తరాలుగా వాటిని ఉపయోగించి, జాతికి వెలుగులు పంచిన చేతులకు పనిలేకుండా పోతున్నది. కార్మికుల ఉద్యోగాలు ఊడపీకి పల్లెల్లోకి సాగనంపుతున్న సింగరేణి యాజమాన్యం వారి స్థానంలో ఎస్.డి.ఎల్., కంటిన్యూయస్ మైనర్, సర్ఫేస్ మైనర్ లాంటి ఆధునిక యంత్రాలను గనుల్లోకి దించుతున్నది. వరంగల్ జిల్లా భూపాలపల్లి ప్రాంతంలోని కాకతీయ ఖని వనింక్లైన్ గనిని (కెటికె - 1) కోల్‌ఫిల్లర్లు (బొగ్గు నింపే కార్మికులు) లేని పూర్తిస్థాయి ఆధునిక బొగ్గుగనిగా మార్చివేయడమే సింగరేణి అభివృద్ధికి సూచికగా కంపెనీ అధికారులు ప్రకటించుకునే యాంత్రీకరణ పరిణామం చెందింది.

అండర్ గ్రౌండ్ కోల్ గ్యాసిఫికేషన్ (యు.సి.జి.), కోల్ మైన్ మిథేన్ (సి.ఎం.ఎం.), కోల్‌బెడ్ మిథేన్ (సి.బి.ఎం.) లాంటి అత్యాధునిక విధానాలను అమలు జరిపేందుకు సింగరేణి యాజమాన్యం ప్రస్తుతం సిద్ధపడింది. ఇందుకు అనుగుణంగా ఒ.ఎన్.జి.సి. (ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్) సంస్థతో సింగరేణి ఒప్పందాలను కుదుర్చుకున్నది. పై మూడు విధానాలు అమలులోకి వస్తే ఇక బొగ్గును ఒక ఘనపదార్థకంగా చూసే అవకాశాన్ని కోల్పోవలసి ఉంటుంది. భూమి ఉపరితలం నుండి గొట్టపు బావుల మాదిరిగా డ్రిల్లింగ్ యంత్రాల ద్వారా భూమిపొరల్లో ఉన్న నేలబొగ్గును మండించి, తద్వారా వెలువడే 'గ్యాస్'ను పైపులైన్ల ద్వారా ఇతర ప్రాంతాలకు తరలిస్తారు. మరోవైపున అండర్‌గ్రౌండ్ బొగ్గుగనుల్లోనూ అత్యాధునిక 'రోబోటిక్ కోల్ మైనింగ్' విధానాలను సైతం పరిశీలిస్తున్నారు. ఈ విధానంలో మనుషులెవ్వరూ గనిలోకి దిగకుండానే భూ ఉపరితలం నుండి ఎల్.సి.డి. స్క్రీన్‌పై చూస్తూ భూగర్భంలోని 'రోబో' యంత్రాలతో పని చేయించి, బొగ్గును ఉత్పత్తి చేస్తారు. ఈ విధానాలన్నీ రానున్న కాలంలో సింగరేణిలో మానవశ్రమను పూర్తిగా తగ్గించేందుకు ఉద్దేశించినట్లు తేటతెల్లమవుతోంది.

ఈ మార్పుల ఫలితంగా సింగరేణిలో కార్మికుల సంఖ్య గణనీయంగా తగ్గుతూ వచ్చింది. కంపెనీలో కార్మికుల నియామకాలు పూర్తిగా స్తంభించిపోయాయి. డిపెండెంట్ ఎంప్లాయ్‌మెంట్ పద్ధతిని రద్దు చేయడంతో సింగరేణి తమ భవిష్యత్తును ముడిపెట్టుకున్న ఈ తరం యువకుల నిరాశ, నిస్పృహల్లో మునిగిపోయారు. అత్యంత వేగవంతంగా, చాపకింద నీరులాగా అనుభవంలోకి వచ్చిన ఈ పరిణామాలు కోల్‌బెల్ట్‌లో లక్షలాది గని కార్మికుల కుటుంబాలను తీవ్రమైన సంక్షోభంలోకి నెట్టివేస్తాయి. మొత్తంగా ఈ మార్పులన్నీ కుటుంబ హింసకు, అసహజ మరణాలకు, బలవన్మరణాల పెరుగుదల సంక్షోభంలోకి పల్లె ప్రాంతాల నుండి పొట్ట చేతపట్టుకుని ఆత్మాభిమానంతో కూడిన బతుకుదెరువుకోసం వచ్చిన లక్షలాది కుటుంబాల పరిస్థితి ఇవ్వాళ్ల ఈ పరిస్థితులను చక్కదిద్దే బాధ్యత నుండి తప్పుకోవడమే ఇక్కడి విషాదం. ◆

పరిశీలకులు మావోయిస్టులు పభుత్వంలో ఒక భాగం మాత్రమే అవుతారనుకుంటే, వారే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే దిశగా నేపాల్ ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయని, అందువల్ల రాబోయే కాలంలో మరిన్ని మార్పులు జరగవచ్చని అంటున్నారు **ఎ.వి.వి. ప్రసాద్**

నేపాల్ దిశను మార్చిన మావోయిస్టులు

నేపాల్ రాజకీయ యవనికపై ఇప్పుడు ఒక కొత్త దృశ్యం ఆవిష్కృతమవుతోంది. అది – మావోయిస్టులు చట్ట నిర్దేశకులు కావడం. దశాబ్దం పైగా సాయుధ పోరాట మార్గాన సాగిన మావోయిస్టులు నేపాల్ కొత్త రాజ్యాంగ రచనలో భాగస్వాములు కాబోతున్నారు. ఇది నిజంగానే – కచ్చితంగా చెప్పాలంటే ప్రపంచంలోనే అపురూప దృశ్యం.

చల్లటి మంచుకొండల నడుమ ప్రశాంతంగా, స్తబ్దుగా కనిపించే నేపాల్‌లో – ఈ అసాధారణ దృశ్యం హఠాత్తుగా ఆవిష్కృతమైంది కాదు. రాజు జ్ఞానేంద్ర అధికార మదంతో నియంతృత్వ వైఖరి అవలంబిచకపోతే, ఇంత త్వరగా నేపాల్‌లో ఈ మార్పు సంభవించి ఉండేది కాదేమో అనిపిస్తుంది. రాచరికంపై మావోయిస్టులు చేసిన తిరుగుబాటుకు – పరోక్షంగా బాటలు వేసిన చారిత్రక కారణం – జ్ఞానేంద్రదే.

కొత్త రాజ్యాంగ రచనకు ఉపక్రమించడానికి ముందుగా, అందుకు అవసరమైన ప్రజా ప్రాతినిధ్యాన్ని రాజ్యాంగ పరిషత్తులో నింపడానికి ఏప్రిల్ 10న ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో మావోయిస్టులు సాధారణ మెజారిటీని సాధించినట్లే. పరిషత్తులోని 240 స్థానాలకు నేరుగా జరిగిన ఎన్నికల్లో 120 స్థానాలను మావోయిస్టులు సాధించడం నిజంగానే అనూహ్య పరిణామం. ఎన్నికలు జరిగితే 'కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ నేపాల్ – మావోయిస్టులకు పెద్ద సంఖ్యలోనే సీట్లు లభించవచ్చని రాజకీయ పరిశీలకులు ముందుగానే అంచనాలు వేసినా, ఇంతటి ఆధిక్యత లభించగలదని మాత్రం ఎవరూ అనుకోలేదు. నేపాలీ కాంగ్రెస్‌కు మొదటి నుంచి ప్రజలల్లో మంచి ఆదరణే ఉంది. ఆ పార్టీ నేత, ప్రధానమంత్రి గిరిజా ప్రసాద్ కోయిరాలకు కూడా 'ఆదర్శనేత'గా ప్రజలలో ముద్ర ఉంది. రాజ్యాంగ పరిషత్తు ఎన్నికల్లో నేపాలీ కాంగ్రెస్‌కు అధిక స్థానాలు, దానికి చేరువలోకి మావోయిస్టులు రాగలరని అంతర్జాతీయ పరిశీలకులు సైతం అంచనాలు వేశారు. అయితే అందరి అంచనాలను తలకిందులు చేస్తూ కొత్త పరిషత్తులో మావోయిస్టులే అగ్రభాగాన నిలవడం ఒక విశేషమైతే, 37 సీట్లతో నేపాలీ కాంగ్రెస్ మావోయిస్టులకు ఎంతో దూరంలో వెనుకన నిలబడవలసి రావడం మరో విశేషం. సిపిఎన్ – యుఎంఎల్ 33 సీట్లతో మూడవ స్థానంలో నిలువగా, మదేశీ పీపుల్స్ ఫోరమ్ 28 స్థానాల్లో గెలుపొందింది. తెరాయ్ మదేశ్ డెమొక్రటిక్ పార్టీ తొమ్మిది స్థానాల్లోను, సద్భావన పార్టీ నాలుగు స్థానాల్లోను, ఇతరులు మరో ఏడు చోట్ల విజయం సాధించారు.

నిజానికి ఈ 'పరిణామ ప్రక్రియ' నేపాల్‌లో రెండు సంవత్సరాల క్రితమే ఆరంభమైంది. మూడు కోట్ల జనాభా గల దేశంలో దాదాపు రెండున్నర శతాబ్దాలుగా కొనసాగిన రాచరికానికి చరమగీతం పాడేందుకు మావోయిస్టులు రెండు సంవత్సరాల క్రితం 'రాజకీయ కార్యాచరణ' ప్రారంభించడంతో 'రాజరికానికి' అంతిమ ఘడియలు ఆరంభమయ్యాయి.

రాజధాని ఖాట్మండులోని ప్రధాని గిరిజా ప్రసాద్ కోయిరాలా నివాసంలో 7 జనవరి, 2007న ఏడు పార్టీల కూటమి (ఎస్‌పిఎ), మావోయిస్టు నేతల మధ్య జరిగిన చర్చలు మొత్తం దేశ భవిష్యత్తునే మార్చివేశాయని చెప్పవచ్చు. ఆ సమావేశంలో తీసుకున్న కొన్ని కీలక నిర్ణయాలవల్ల ఆతర్వాత మావోయిస్టులు పార్లమెంట్‌లోకి ప్రవేశించడానికి మార్గం ఏర్పడింది. ఆ చర్చలే వారు మంత్రులు కావడానికి కూడా బాటలు వేశాయి. పార్లమెంట్‌లోకి ప్రవేశించడానికి ముందుగా ఆయుధాలను త్యజించడానికి, దళాలను రద్దు చేయడానికి మావోయిస్టులు ఆ సమావేశంలో అంగీకరించడం నిజంగా గొప్ప చారిత్రక పరిణామమే. ఐక్యరాజ్యసమితి పర్యవేక్షకుల సమక్షంలో ఆయుధాలు అప్పగించే ప్రక్రియ ఆ తర్వాత క్రమంగా సాగిపోయింది. తాత్కాలిక రాజ్యాంగం, తాత్కాలిక పార్లమెంట్ కూడా తర్వాత ఏర్పాటయ్యాయి. ఆ రెండూ 2007 జనవరి 16 నుంచి అమలులోకి రావడంతో నేపాల్ రాజకీయ దృశ్యమే పూర్తిగా మారిపోయింది. ఆ రోజున తాత్కాలిక పార్లమెంట్‌లోకి ఏడు పార్టీల కూటమి సభ్యులతో పాటు 73 మంది మావోయిస్టులు, వారి మద్దతు కలిగిన పది మంది స్వతంత్ర ప్రతినిధులు కూడా ప్రవేశించారు. మావోయిస్టులు పార్లమెంట్ లోకి ప్రతినిధులుగా ప్రవేశించడం అదే ప్రథమం. నేపాల్ పార్లమెంట్‌లోనే కాదు, ప్రపంచంలోనే అది చాలా అపూర్వ సంఘటన. ప్రజాస్వామ్య పద్ధతిలో 'బ్యాలెట్' ద్వారా ఎన్నికవ్వకుండా పార్లమెంట్ సభ్యులుగా చట్టసభలోకి మావోయిస్టులు ప్రవేశించడం, అప్పట్లో అందరిని ఎంతో ఆశ్చర్యపరచిన ఉదంతం. అందుకు పరోక్షంగా బాటలువేసిన ప్రధాని గిరిజా ప్రసాద్ కోయిరాలా, మావోయిస్టుల అధినేత ప్రచండను అందరూ ఎంతగానో అభినందించారు. ప్రజాస్వామ్య దేశాల చరిత్రలోనే అది అద్భుతమైన దృశ్యం. కొత్త రాజ్యాంగాన్ని రచించే రాజ్యాంగ పరిషత్తుకు ఎన్నికలు నిర్వహించాలని కూడా అదే సమయంలో నిర్ణయించారు. ఎన్నికల్లో పాల్గొనడానికి మావోయిస్టులూ అంగీకరించారు. వారు

ప్రజాస్వామ్య ప్రక్రియలోకి రావడాన్ని ఇతర రాజకీయ పార్టీలన్నీ కూడా స్వాగతించాయి. 2007 జూన్‌లోనే రాజ్యాంగ పరిషత్తు ఎన్నికలు జరపాలని తొలుత నిర్ణయించినా, తర్వాత 'అనుకూల' వాతావారణం ఏర్పడకపోవడంతో వాయిదా పడుతూ వచ్చి చివరికి ఏప్రిల్ 10న జరిగాయి.

అప్పట్లో ప్రచండ (పుష్పకమల్ దహల్ – అసలు పేరు) గాని, 'నంబర్–2' గా ఉన్న బాబురామ్ భట్టరాయ్‌గాని పార్లమెంట్‌లోకి ప్రవేశించకపోయినా, మొన్నటి ఎన్నికల్లో ఘనవిజయం సాధించివారు కూడా ఇప్పుడు 'ప్రజా ప్రతినిధులు' అయ్యారు. నేపాల్ సైన్యం నుంచి 'రాయల్' పదాన్ని తొలగించి ఏడాది దాటింది. తర్వాత వరుసగా 'రాచరికం' గుర్తులు మిగలకుండా ఒక్కొక్కటిగా మార్పులు చేస్తూ వచ్చారు. ప్రజలను ఇంత వరకు 'రాజు అధీనులు'గా మాత్రమే భావించారు. ఇప్పుడు వారిని 'పౌరులు'గా పిలిచే అవకాశం కలిగింది. తాత్కాలిక రాజ్యాంగ ముసాయిదాలోనే 'రాజు' అనే పదం రాకుండా జాగ్రత్తపడ్డారు. ఈ ఎన్నికల్లో పరిస్థితులు పూర్తిగా మారిపోవడంతో 'రాజు'కు గాని, ఆ పేరుతో చెలామణి అయిన జ్ఞానేంద్రకు గాని ఇప్పుడు నేపాల్‌లో 'చోటు'లేని పరిస్థితి ఏర్పడడం నిజంగానే గొప్ప చారిత్రక పరిణామం. మావోయిస్టులు కూడా గత సంవత్సరం పార్లమెంట్‌లోకి ప్రవేశించిన ఘట్టం తరువాత నుంచి సమాంతర ప్రభుత్వాలను, ప్రజా కోర్టులను రద్దుచేసి ప్రజాస్వామ్య పథంలో నడవడం ప్రారంభించారు.

అయితే ఇంతవరకు జరిగింది వేరు, ఇకముందు జరగవలసింది వేరు. ప్రభుత్వంలో మావోయిస్టులు ఒక భాగం అవుతారనే అంతా భావించారు గాని, ఎన్నికల ఫలితాలు ప్రభుత్వాన్నే మావోయిస్టులకు అప్పగించడంతో, భవిష్యత్ రాజకీయ దృశ్యం ఇంకా ఎన్నో మార్పులు, ఊహించని పరిస్థితులను ఆవిష్కరించే సూచనలు కనిపిస్తున్నాయి.

ముఖ్యంగా, నేపాల్ దక్షిణ ప్రాంతంలో, అంటే తెరై ప్రాంతంలో 'జనతాంత్రిక్ తెరై ముక్తి మోర్చా'కు బలం విశేషంగా ఉంది. వారు మావోయిస్టులు ప్రభుత్వాన్ని నడపడాన్ని గట్టిగా వ్యతిరేకిస్తున్నారు. తెరై ముక్తి మోర్చా నాయకుడైన జై కృష్ణ గోయిట్ – ఎన్నికల ఫలితాల అనంతరం చేసిన ప్రకటనలు చూస్తే వారు ముందు ముందు అనేక సమస్యలు సృష్టించగలరనే అనుమానం కలుగుతుంది. మదేశీలు తమ ప్రాంతానికి ప్రత్యేక ప్రతిపత్తి కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. దానిని ప్రచండ మొదటి నుంచి వ్యతిరేకిస్తున్నారు. 'స్వతంత్ర మహదేశ్' సాధించే వరకు పోరాటం ఆపబోమని' మదేశీ పీపుల్స్ రైట్స్ ఫోరమ్ ఇప్పటికే ప్రకటించింది. తాజా ఎన్నికల్లో ఈ పార్టీకి కూడా గణనీయంగానే స్థానాలు (28) లభించాయి. అదే విధంగా మదేశీ డెమొక్రటిక్ పార్టీకి కూడా తొమ్మిది స్థానాల వరకు లభించాయి. 'స్వతంత్ర మహదేశ్'ను నేపాలీ కాంగ్రెస్ కూడా మొదటి నుంచి వ్యతిరేకిస్తూనే ఉంది. అయితే గతంలో ఎం.పి.ఆర్.ఎఫ్ (మదేశీ పీపుల్స్ రైట్స్ ఫోరం)కు పార్లమెంట్‌లో తగిన ప్రాతినిధ్యం లేకపోవడం వల్ల వీధి పోరాటాలకే వారి ఆందోళన పరిమితమైంది. కాని ఇప్పుడు వారు గణనీయమైన సంఖ్యతో పార్లమెంట్‌లోకి ప్రవేశిస్తుండడంతో, ప్రజా ప్రతినిధుల సభలో కూడా వారి 'వాయిస్' గట్టిగా వినిపించే అవకాశం ఉంది. మావోయిస్టులు సున్నితమైన 'మదేశీ' సమస్య విషయంలో ఏ విధంగా వ్యవహరిస్తారన్నది ప్రశ్నార్థకం. ఇంతవరకు వారు పార్లమెంట్‌లో ప్రజా ప్రతినిధులుగా లేరు గనుక మదేశీ ఆందోళనకారులతో ప్రత్యక్ష యుద్ధాలకు తలపడేవారు. మావోయిస్టులు, మదేశీ కార్యకర్తల మధ్య ఎన్నోసార్లు సాయుధ పోరాటాలు కూడా జరిగాయి. గత సంవత్సరం మావోయిస్టులు పార్లమెంటులోకి ప్రవేశించిన దగ్గర నుంచి మదేశీయులు కూడా ఆందోళనను ఉధృతం చేశారు. మావోయిస్టులు ఒక వంక ఆయుధాలు త్యజించి ఐక్యరాజ్యసమితి శాంతి పరిరక్షక దళాలకు అప్పగిస్తుండగా మదేశీ ఆందోళనకారులు ఆయుధాలు చేబూని పెద్ద ఎత్తున హింసాకాండ ప్రారంభించారు. ఆ రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణల్లో పలువురు సాధారణ పౌరులు కూడా మరణించారు. సర్లాహి, సిరాహ, సప్తరి, మొరాంగ్ తదితర జిల్లాలు కొన్ని నెలల పాటు అగ్నిగుండంలా మారాయి కూడా. గృహదహనాలతో ఆ ప్రాంతాలన్నీ అట్టుడికాయి. ఎం.పి.ఆర్.ఎఫ్. ఆందోళనలను అణచి వేయడానికి సైన్యం, మావోయిస్టులు ప్రతిహింసకు పాల్పడ్డారు. ఆ జ్వాలలు తూర్పు, ఉత్తర ప్రాంతాలకు కూడా వ్యాపించి గత సంవత్సరం ద్వితీయార్థమంతా నేపాల్‌లో సంక్షోభ, ఉద్రిక్త పరిస్థితులేర్పడ్డాయి. కొండ ప్రాంతాల వారితో సమానంగా తమకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలనే మదేశీల డిమాండ్ ఈ ఎన్నికల్లో కొంత నెరవేరినా, 'స్వతంత్ర మహదేశ్' ఆందోళన ఇంకెన్ని మలుపులు తిరిగి ఎటువంటి అవాంఛనీయ పరిస్థితులు సృష్టిస్తుందో అనే ఆందోళన కలిగిస్తోంది.

రెండు నియోజకవర్గాల నుంచి (కీర్తిపూర్, రోల్పా) ఎన్నికైన ప్రచండ భవిష్యత్తులో ఎలా వ్యవహరించనున్నారనే విషయం ఆయన మాటల ద్వారా ఇప్పటికే స్పష్టమైంది. 'నేపాల్ ఇక నా చేతుల్లో ఉంది. మా ఆశయం నెరవేరింది. రాచరికాన్నే కాదు, రాజుని కూడా వ్యవస్థ లోంచి తరిమివేస్తాం. ఆయన కూడా ఇక అందరిలాంటి సాధారణ పౌరుడే. ఉంటే ఉండవచ్చు, లేదా నేపాల్ విడిచి వెళ్లవచ్చు' అని ప్రచండ తన మనసులోని మాట బైటపెట్టారు. గత సంవత్సరం మావోయిస్టులు తాత్కాలిక పార్లమెంట్‌లోకి ప్రతినిధులుగా ప్రవేశించినపుడు ప్రచండ అనుసరించక పోవడం ఆయన పెద్దరికానికి అప్పట్లో మరింత గౌరవాన్ని తెచ్చిపెట్టింది. అధికారం కోసం ఆయన వెంపర్లాడటం లేదని అంతా అనుకున్నారు. కాని ఇటీవల ఆయన 'టోన్' కూడా కొంత మారింది. మావోయిస్టులు సంఖ్యాధిక పార్టీగా పార్లమెంట్‌లోకి ప్రవేశించడంతో, ఆయన స్వరంలో ఇప్పుడు మరింత మార్పు కనిపిస్తోంది. 'భవిష్యత్ దేశ అధ్యక్షుడు'గా తనకు తానుగా ప్రకటించుకున్న ప్రచండ ఇప్పుడు తానే ప్రధాని కానున్నట్లు (ఇది రాసే సమయానికి) చెబుతున్నారు. గతంలోని తాత్కాలిక రాజ్యాంగం 'అధ్యక్షుడు' హోదా ఎవరికి ఇవ్వని కారణంగా ప్రచండకు కూడా ఆ అవకాశం లేకపోవడంతో ప్రస్తుతానికి 'ప్రధాని' పదవితో సంతృప్తి పడదామని ఆయన భావిస్తున్నట్లు కనిపిస్తోంది. కాని కొత్త రాజ్యాంగం రూపొందించే సమయంలో ప్రచండ తన కలను నెరవేర్చుకోవచ్చు. అధ్యక్ష స్థానాన్ని కల్పించి దానిపై తొలిసారి ఆయనే అధిష్ఠించవచ్చు. వారిది సంఖ్యాధిక్య పార్టీ గనుక, కొత్త చట్టాలు రూపొందించడంలో ఎటువంటి ఇబ్బందులు రాకపోవచ్చు. అయితే

రాత అనేది సామూహిక విజ్ఞానం లిఖితరూపంలో పోగుచెయ్యడానికి, గుర్తుంచుకోవలసిన విషయాలను ప్రజల్లో వ్యాప్తి చెయ్యడానికి పనికొచ్చిన సాధనమంటున్నారు **కొడవటిగంటి రోహిణీప్రసాద్**

అక్షరాస్యత

అక్షరం అంటే నశించనిది అని అర్థం. ఒకసారి ఏదైనా రాసి ఉంచితే అది శాశ్వతంగా నిలిచిపోతుందని ప్రాచీనులు భావించారు. రాతి మీద చెక్కినవైతే నిజంగా శిలాక్షరాలే. ఈ రోజుల్లో రాయడం, చదవడం అవసరమా, కాదా అనే ప్రశ్నే తలెత్తదు. ప్రస్తుతం మన జీవితాలు గడిచే పద్ధతిని బట్టి అక్షరాస్యత ఎంతో సహజమైనదిగా అనిపించడంలో ఆశ్చర్యం లేదు. ఒకప్పటి సమాజం ఇలా ఉండేది కాదు. తమ అవసరాలను బట్టి మనుషులు సృష్టించుకున్న 'అసహజమైన' వ్యవస్థల్లో లిపి కూడా ఒక అంశం. తొలినాటి లిపులు ప్రపంచంలో కొన్ని ప్రదేశాల్లో మాత్రమే ఆవిర్భవించాయి.

ఆధునిక యుగంలో నిరక్షరాస్యత వెనకబాటుతనానికి ముఖ్య లక్షణం. 'చదువురాని మొద్దు' ఎందుకూ కొరగానట్టే. అయితే అక్షరాలూ, లిపులూ అన్నీ ఎప్పుడో ఒకప్పుడు ప్రాథమిక స్థాయిలో మొదలైన కొత్త పద్ధతులే. వ్యవసాయం, తొలి గ్రామాల్లో స్థిర జీవితం వగైరాలన్నీ మొదలైన తరవాత జనాభా పెరగడంతోబాటుగా వారి అవసరాలు కూడా పెరగసాగాయి. పరస్పర సంభాషణకు పనికొచ్చిన భాషలు నోటిమాటలుగా మొదలై, చాలా శతాబ్దాల పాటు సామాన్య ప్రజల మధ్య మౌఖిక స్థాయిలోనే కొనసాగాయి. శబ్దాలనూ, అవి సూచిస్తున్న సమాచారాన్నీ ఏదో ఒక రూపంలో నమోదు చెయ్యవలసిన అవసరం కొంతకాలం తరవాత గాని తలెత్తలేదు. ఎందుకంటే మననం చేసుకున్న విషయాలను గుర్తుంచుకోవటానికి మంచి జ్ఞాపకశక్తి ఉండాలి. అది అందరికీ సాధ్యం కాదు. ఒకరు రాసిపెట్టిన సంగతులను ఇతరులు ఎంతకాలం తరవాతనైనా చదివి అర్థం చేసుకోవచ్చు. ఎన్నో తరాలుగా ఒకే చోట, ఒకే రకమైన జీవితాలు గడపసాగిన మానవజాతికి ఇలా లిఖిత రూపంలో భద్రపరచిన సమాచారం విలువైనదిగా పరిణమించింది. ఈ సంగతులను సులభశైలిలో వివరిస్తూ సుమారు యాభై ఏళ్ల క్రితం తిరుమల రామచంద్ర గారు 'మన లిపి పుట్టుపూర్వోత్తరాలు' అనే అద్భుతమైన పుస్తకం రాశారు.

ఎటొచ్చీ సమాచార వ్యాప్తికి అక్షరాలే ఉపయోగించక్కర్లేదు. అక్షరాలనూ, లిపినీ ఉపయోగించకుండానే రంగుదారాలూ, పూసలూ, ఈకలూ మొదలైన వాటితో ఆదిమ తెగలు దూరప్రాంతాలకు సందేశాలు పంపుకునేవారు. దూరానున్న వారికి వినిపించే విధంగా డప్పుల మోతలూ, కనిపించే విధంగా గాలిలోకి ఎత్తుగా లేచే పొగలూ మొదలైనవి కూడా ఉపయోగించేవారు. ఆ తరవాత రాళ్ల మీదా, ఇతర వస్తువుల మీదా బొమ్మలు చెక్కడం మొదలయింది.

గుర్తుంచుకోవలసిన సమాచారాన్ని రాసిపెట్టుకోవలసిన అవసరం బహుశా వ్యవసాయం కారణంగానే తొలిసారిగా కలిగి ఉంటుంది. పంట వివరాలనో, నాట్లకూ, కోతలకూ తగిన సమయాలనో నమోదు చెయ్యడానికి ప్రాథమిక రూపంలో భవిష్యత్తులో పనికొచ్చే విధంగా సంకేతాలను ఏర్పాటు చేసుకుని ఉంటారు. ప్రపంచంలో అక్కడక్కడా రకరకాల లిపులు ఏర్పడ్డాయి. మెసపొటేమియా, ఈజిప్ట్, సింధు నదీ ప్రాంతం, చైనా, మధ్య అమెరికా మొదలైన ప్రాంతాల్లో వేటికవిగా అక్షర సముదాయాలు పుట్టుకొచ్చాయి. అప్పట్లో రోజువారి జీవితంలో కొంతమందికి అతి పరిమితంగానైనా రాయడం, చదవడం తప్పనిసరి అయి ఉండాలి.

మత సంబంధం కలిగిన తంతులకు కూడా లిపులు ఉపయోగపడి ఉంటాయి. సంఘంలో అతి కొద్దిమందికి మాత్రమే ఇటువంటివి రాయడం, చదవడం వచ్చి ఉండేవి కనుక చదువుకు ప్రతి

అదే సమయంలో వారు అత్యంత జాగ్రత్తతో వ్యవహరించవలసిన అవసరం కూడా ఉంది. అనూహ్యంగా, ఆశ్చర్యంగా ప్రజాస్వామ్య పద్ధతిలో తమకు లభించిన విజయాన్ని వారు సద్వినియోగ పరచుకొనడానికి, దేశాన్ని పురోభివృద్ధి చెందించడానికి వినియోగించుకోవాలే గాని గత చరిత్రకు ప్రతిబింబంగా మాత్రం మలచుకోకూడదు. 'మావోయిస్టులకు కొన్ని సిద్ధాంతాలు, తదనుగుణమైన కార్యాచరణ కూడా ఉన్నాయి. మంచి చెడ్డలను బేరీజు వేసుకోగలిగిన సామర్థ్యం కూడా ఉంది. అందుకే – ఇప్పుడు మరింత జాగ్రత్తగా వ్యవహరించవలసిన బాధ్యత వారిపై ఉందనిపిస్తుంది. రెండేళ్ల క్రితం ఏడు పార్టీల కూటమితో కలసి శాంతి ఒప్పందాలపై సంతకాలు చేసినప్పుడే 'కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ నేపాల్' (మావోయిస్టు) విధానమేమిటో ప్రపంచానికి వెల్లడైంది. సాయుధ తిరుగుబాటు కంటే ప్రజాఉద్యమం ద్వారా ఎటువంటి కరడు గట్టిన రాచరిక వ్యవస్థనైనా చరిత్రలోంచి తొలగించ వచ్చనే నిజాన్ని ప్రపంచానికి వారు నిరూపించారు. ఆ బాటలోనే ఇక ముందుకూడా వారు కదలవలసి ఉంది. నేపాల్‌ను 'ఫెడరల్ రిపబ్లిక్'గా మార్చుతున్న వారి కృషిని ప్రపంచం ఇప్పుడు మెచ్చుకుంటోంది. అదే ఆదర్శప్రాయమైన పంథాలో వారు పయనిస్తే భవిష్యత్తులో కూడా వారు ప్రశంసలు అందుకుంటూనే ఉంటారు. ◆

సంస్కృతిలోనూ చాలా ప్రత్యేకత ఉండేది. అక్షరజ్ఞానానికి ప్రతీకలైన అధిష్ఠాన దేవతలుండేవారు. హిందువులకు సరస్వతీదేవిలాగానే ప్రాచీన మెసపొటేమియాలో మొదట ఎన్‌లిల్, తరవాత నబూ అనే దేవతలూ, ప్రాచీన ఈజిప్ట్‌లో ధ్వుతీ, అమెరికాలోని మాయా నాగరికతలో ఇట్జమ్నా మొదలైన దేవతలు ఆరాధించబడ్డారు. ప్రాచీన ఈజిప్ట్‌లో అక్షరాస్యత పూజారి వర్గానికి పరిమితమై ఉండేది. భగవంతుడికీ, పాలకవర్గాలకూ సమీపంలో ఉండిన 'వ్రాయసకాడు' సంఘంలో పరపతి కలిగి ఉండేవాడు. రాతపని చేసేవాడికి తక్కిన బరువు బాధ్యతలేవీ ఉండవనీ, అటువంటివారికి నిత్యమూ రాజుగారింటి భోజనం లభిస్తుందనీ, మంచి జీవితం, ఆరోగ్యం, సిరిసంపదలూ ఉంటాయనీ అభిప్రాయం ఉండేది. పూజలూ, తంతుల విశేషాలనూ, రాచవంశాల చరిత్రనే కాక కాలాన్ననుసరించి రుతువుల్లోనూ, వానలు, వరదల్లోనూ కలిగే మార్పులనూ, వ్యవసాయానికి సంబంధించిన వివరాలనూ ఈ పూజారివర్గం నమోదు చేసి తమ 'విద్యాధిక్యత'ను పామరుల ఎదుట చాటుకుంటూ ఉండేది. తక్కినవారెవరికీ సామాన్యంగా చదువుతో పని పడేది కాదు. వారంతా ఈ పూజారులను అతీతశక్తులు కలవారని అనుకునేవారు.

రాత అనేది సామూహిక విజ్ఞానం. లిఖితరూపంలో పోగు చెయ్యడానికీ, గుర్తుంచుకోవలసిన విషయాలను ప్రజల్లో వ్యాప్తి చెయ్యడానికి పనికొచ్చిన సాధనం. ప్రపంచంలోని గొప్ప నాగరికతలెన్నో లిపులను జ్ఞాన వ్యాప్తికై సమర్థవంతంగా ఉపయోగించుకోగలిగాయి. చరిత్ర వివరాలనూ, సామాజిక చట్ట సంబంధిత నిబంధనలనూ, వైజ్ఞానిక, సాంకేతిక విషయాలనూ, యుద్ధ తంత్రాలనూ, లిపిబద్ధం చేసి, తరవాత తరాలకు అందించిన అక్షరాస్య సమాజాలు అంతులేని పురోగతిని సాధించాయి. దీనివల్ల లిపి ఆవిర్భావం అనేది నాగరికతకు ప్రతీకగా అనుకుంటాం కాని అది నిజం కాదు. దక్షిణ అమెరికాలోని ఆండీస్ పర్వత ప్రాంతాల్లో విలసిల్లిన గొప్ప నాగరికతల్లో అక్షరాస్యత మచ్చుకైనా ఉండేది కాదు. అలాగే ఎంతో ప్రగతినీ, ఔన్నత్యాన్నీ సాధించిన రోమన్ సామ్రాజ్యం చివరకు హూణులవంటి బర్బరుల వల్ల నాశనమైపోయింది. ఇలాంటివి కొన్ని తప్ప తక్కిన సందర్భాల్లో నాగరికులు అనాగరికుల్ని ఓడించి లొంగదీసుకోవటానికి తమ వద్దనున్న ఇతర సాధనాలతో బాటు విద్యాధిక్యతను కూడా ఉపయోగించుకున్నారు.

రాసే ప్రక్రియ మొదలయాక శబ్దాలకూ, వాటిని సూచించే సంకేతాలకూ నిర్దిష్టమైన సంబంధం ఏర్పడటానికి రకరకాల పద్ధతులు ఉపయోగపడ్డాయి. అలాగే లేఖన సామగ్రి తయారు కావటానికి కొంత సాంకేతిక ప్రగతి అవసరమైంది. ఎన్నో శతాబ్దాలుగా నోటి మాటలకే పరిమితమై ఉండిన భాషలన్నిటికీ, లిపులూ, నిబంధనలూ, ఆ తరవాత వ్యాకరణ నియమాలూ రూపొందాయి. ఒకరు రాసిపెట్టిన విషయాలను తక్కినవారు చదివి అర్థం చేసుకునేందుకు వీలుగా భాషలకు రూపురేఖలు ఏర్పడ్డాయి.

అంతమాత్రన ప్రతి భాషకూ ఒక లిపి తయారయిందని కాదు. మన దేశంలో తుళు, కొంకణీ మొదలైన మాండలిక భాషల్లాగే ప్రపంచంలోని కొన్ని మాండలికాలకు లిపి ఉండదు. ఈ భాషలు ఒక్కొక్క ప్రాంతానికే పరిమితమైనప్పటికీ ఇవి మాట్లాడేవారి సంఖ్య అంత తక్కువేమీ కాదు. వాటిలో ఉత్తమ సాహిత్యం కూడా తయారవుతుంది. కాని ఏవో చారిత్రక కారణాల వల్ల వాటికి లిపులు ఏర్పడలేదు. గతంతో పోలిస్తే ప్రపంచంలో వేలాదిగా ఉండిన మాండలిక భాషలన్నీ అతిత్వరగా అంతరించి పోతున్నాయని భాషావేత్తలు ఆవేదన చెందుతున్నారు. వీటితో బాటు అరుదైన సాంస్కృతిక సమాచారం కూడా మరుగున పడిపోతోంది.

ప్రాంతీయ భాషా భేదాలే కాక దేశభాషలుకూడా ప్రపంచీకరణ కారణంగా అంతరించిపోయే ప్రమాదం కనబడుతోంది. కంప్యూటర్ల వెల్లువలో ఎన్నో భాషలకు ప్రాచుర్యం తగ్గుతోంది. తెలుగువంటి భాషలను చదివేవారూ, రాసేవారూ క్రమంగా తగ్గిపోతున్నారు. ఎప్పటికప్పుడు సరఫరా అవుతున్న సమాచారాన్ని తమ మాతృభాషలో చదివి, నేర్చుకునే అవకాశాలు తగ్గుతున్నాయి. అందరికీ అర్థమయే సాంకేతిక పరిభాష తయారు కావటంలేదు. ఇవన్నీ భాషకూ, సంస్కృతికీ సంబంధించిన పరిమితులు.

అలాగే ఒక్కొక్క భాషలోని ఉచ్చారణ ననుసరించి అక్షరాలు రూపొందడం జరుగుతుంది. ఉదాహరణకు తమిళంలో క చ ట త ప లు తప్ప భారతీయ భాషలన్నిటిలోనూ సామాన్యంగా ఉండే తక్కిన అక్షరాలు లేకపోవడంతో 'కాంతి' అన్న పదానికీ, 'గాంధీ' అన్న పదానికి రాతలో తేడా కనబడదు. అలాగే సంస్కృతం, హిందీ, మరాఠీ మొదలైన లిపుల్లో దక్షిణ భాషల్లోఉన్నట్టుగా ఎ,ఒ అనే అక్షరాలూ, గుణింతాలూ ఉండవు. మరొకవంక కొన్ని ఇంగ్లిష్ పదాలను తెలుగులో రాయాలంటే యాక్టర్, బ్యాంక్, థ్యాంక్స్ అని వికృతంగా రాయవలసి వస్తుంది.

గతంతో పోలిస్తే నేటి సమాజం సమాచార సాధనాల మీదనే పూర్తిగా ఆధారపడుతోంది. నాగరికతలో భాగాలైన భాషలూ, లిపులూ అన్నీ ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా ఒకదానితో ఒకటి పోటీపడే పరిస్థితి ఏర్పడుతోంది. తమతమ భాషల, లిపి, సాహిత్యాల ఆవిర్భావాన్ని గుర్తించి, అర్థం చేసుకున్న జాతులు తమ గుర్తింపునూ, ఆత్మగౌరవాన్నీ మరింత బాగా కాపాడుకోగలవు.

లిపిని సృష్టించడం సులువైన పని కాదు. నాగరికతలోని తక్కిన అంశాల్లాగే ఇది కూడా మెసపొటేమియాలో సుమేరియన్ నాగరికతలో మొదట తలెత్తినట్టుగా తెలియవస్తోంది. స్థిరజీవితం మొదలుపెట్టిన నాలుగైదు వేల ఏళ్ల తరవాత మానవ సమాజంలో క్రమంగా ఎన్నో మార్పులు కలిగాయి. మనోభావాలను ప్రకటించటానికీ, తంతులూ వగైరాలను నిర్వహించటానికీ బొమ్మలు గీయడం ఎప్పటినుంచో కొనసాగుతున్నప్పటికీ ఈనాడు మనం అభివర్ణించే సమాచార యుగం (ఇన్‌ఫర్మేషన్ ఏజ్) వంటిది మొదలవడానికి చాలాకాలం పట్టింది. మారుతున్న పరిస్థితుల్లో రాత అనేది తమకు పనికొస్తుందనీ, రాసే నిపుణులను పోషించే అవసరం ఉందనీ అప్పటివారికి అనిపించి ఉండాలి. ఇటువంటి పరిస్థితులు మన దేశంలోనూ, క్రీట్ ఇథియోపియా మొదలైన ప్రాంతాల్లోనూ కూడా ఏర్పడ్డాయి కాని లిపి అనేది ముందుగా సుమేరియన్ నాగరికతలోనూ, మెక్సికోలోనూ స్వతంత్ర రీతుల్లో తయారైందని పరిశోధకుల ఉద్దేశం.

నాగరికతలోని ఇతర విషయాలలాగే ఒకచోట తయారైన లిపి త్వరలోనే పొరుగు ప్రాంతాలకు వ్యాపించడంతో తక్కినవారికి ఎక్కడికక్కడ మళ్లీ లిపులను సృష్టించుకోవలసిన అగత్యం లేకుండా పోయింది. వివిధ ప్రదేశాల్లో ఈ అనుకరణ మక్కీకి మక్కీ పద్ధతిలోనూ, ఇతరుల స్ఫూర్తితో

తమకు అనువైన పద్ధతిలోనూ కూడా జరిగిన సందర్భాలున్నాయి. ఆధునిక యుగంలో టర్కీలోనూ, న్యూగినీ, అమెరికా వగైరాల ఆదిమ తెగల భాషలకు ఇంగ్లిష్ (రోమన్) లిపిని వాడడం జరిగింది. అలాగే రష్యాలోని కొన్ని తెగలు రష్యన్ (సిరిలిక్) లిపిని అనుసరించాయి. కొత్త లిపులని తయారు చేసుకోకుండా ప్రాచుర్యంలో ఉన్న అక్షరాలను వాడుకునే ఈ విధానం మక్కీకి మక్కీ పద్ధతి. ఇటువంటి అనుసరణలూ, అనుకరణలూ గతంలోనూ జరిగాయి. తొమ్మిదో శతాబ్దంలో గ్రీక్, హీబ్రూ లిపులను కొద్దిగా మార్చి రష్యన్ అక్షరాలను రూపొందించారు. అంతకు ముందు నాలుగో శతాబ్దంలో ఇంగ్లిష్‌తో సహా అనేక లిపులకు ఆధారమైన జర్మన్ అక్షరమాలను బిషప్ ఉల్ఫిలాస్ అనే వ్యక్తి ఎక్కువగా గ్రీక్ అక్షరాలనూ, కొన్ని రోమన్ అక్షరాలనూ కలిపి తయారు చేశాడు. క్రీ.పూ. 1400 ప్రాంతాల క్రీట్‌లోని మినోవా నాగరికత తొలి గ్రీక్ అక్షరాలకు ఆధారం అయింది.

ప్రాచీన లిపులలో అప్పటివారు ఏం రాసేవారు? సుమేరియన్ వగైరా లిపుల్లో రాసినవన్నీ అసంపూర్తిగా, అస్తవ్యస్తంగా, చదవడానికి జటిలంగా ఉండేవి. మొదట్లో నమోదు చేసిన సమాచారమంతా టెలిగ్రాఫ్ భాషలాగా పేర్లకూ, అంకెలకూ, కొలతలకూ, లెక్కలకూ, కొన్ని విశేషణాలకూ మాత్రమే పరిమితమై ఉండేది. ఎంతో అవసరమనిపించిన విషయాలను మాత్రమే ఇలా కష్టపడి రాసేవారు. ఎందుకంటే నోటితో ఉచ్చరించే శబ్దాలన్నిటికీ ప్రతీకలైన అక్షరాలు తయారవడానికి ఎన్నో శతాబ్దాలు పట్టింది. ఒకవంక సమాజ జీవితంలో పరిణామాలు జరుగుతూ ఉంటే, మనుషుల మధ్య జరిగే వ్యవహారాలూ, వ్యాపారాలూ జటిలం అవుతూ వచ్చాయి. ఎందరో వ్యక్తులకు సంబంధించిన ఎన్నో విషయాలను లిఖితరూపంలో నమోదు చేస్తున్నప్పుడు అపోహలకూ, అపార్థాలకూ అవకాశాలు లేకుండా చూసుకోవలసి వచ్చింది. ఈ రోజుల్లో అవసరాలని బట్టి కొత్తరకాల కంప్యూటర్ భాషలు తయారవుతున్నట్టే ప్రాచీన యుగాల్లో నాగరికత పెరుగుతున్న కొద్దీ ఈ రకమైన ఒత్తిడివల్ల లిపులు మెరుగుపడక తప్పలేదు. మొదట్లో మత, న్యాయ, చట్టపరమైన వ్యవహారాలకు మాత్రమే పనికొచ్చిన అక్షరజ్ఞానమంతా దేవాలయాల్లోనూ, రాజప్రాసాదాల్లోనూ పనిచేసే చాలా కొద్దిమందికి మాత్రమే ఉండేది. క్రీ.పూ. 3000 ప్రాంతంలో మొదలైన సుమేరియన్ లిపిని చదివితే అదంతా రాచ, దేవాలయ వ్యవస్థలకు సంబంధించిన అధికారుల రచనలుగా దర్శనమిస్తాయి. ప్రాచీన ఈజిప్ట్, క్రీట్, గ్రీస్, చైనా, ఉత్తర అమెరికా నాగరికతలన్నిటిలోనూ ఇదే కనిపిస్తుంది.

తొలి లిఖిత సాహిత్యానికి ప్రజాస్వామిక లక్షణాలేవీ ఉండేవి కావు. వృత్తిపరంగా రాయ, చదవ నేర్చినవారు ఒక్కొక్క చోటా 30, 40కి మించి ఉండేవారు కాదు. సమాజంలో శ్రమవిభజన మొదలవడంతో అదనపు ఆహారోత్పత్తిని సాధించడం వీలైంది. కాయకష్టం చేసే వర్గం వేరవడంతో తిని, కూర్చోగలిగిన మరొక వర్గం ఏర్పడింది. ఇందులో కొందరు రకరకాల ప్రత్యేక వృత్తుల్లో నైపుణ్యం సంపాదించుకోగలిగారు. వాటిలో అక్షరాస్యత ఒకటి. వర్గాల మధ్య అంతరాలు ఏర్పడుతున్న కొద్దీ రాయడమనే నైపుణ్యానికి స్పష్టమైన వర్గ స్వభావం రూపొందసాగింది. ఏం రాయాలో, ఎందుకు రాయాలో తెలిశాక రాసే విధానం దానికి తగినట్టుగానే తయారైంది. రచనా పద్ధతి కూడా అందరికీ అర్థం కావలసిన అవసరం ఉండేది కాదు. అచ్చంగా పాలకవర్గాలకే పరిమితమైన ఆనాటి అక్షరజ్ఞానమంతా వారి వర్గ ప్రయోజనాలు కాపాడటానికీ, అలగాజనాన్ని పన్నులూ మొదలైన వాటితో అణిచి ఉంచడానికీ ఉపయోగపడింది. పూజారులకూ, రాచవంశాలకూ ఎన్నో దైవిక శక్తులున్నట్టుగా ప్రజలను భ్రమ పెట్టటానికి పురాణాలు పనికొచ్చాయి. అక్షరాస్యత పెరిగిన వేల సంవత్సరాల తరవాత కూడా మత గ్రంథాల్లోనూ, పురాణాల్లో ఏముందో చదివి తెలుసుకోలేని పామరులకు విస్సన్న చెప్పిందే వేదమనేది మనకు తెలిసిందే. అందుచేత తొలి యుగాల్లో లిఖిత సమాచారాన్ని స్వప్రయోజనాలకు ఎలా వినియోగించుకునేవారో మనం సులువుగా ఊహించుకోవచ్చు.

అక్షరాస్యత కొద్దిమందికే పరిమితం కావడంతో ఏదైనా నాగరికత అంతరించినప్పుడల్లా విలువైన అక్షరజ్ఞానం మరుగున పడిపోతూ ఉండేది. సింధునది లోయలో అద్భుతమైన నగర నిర్మాణ వ్యవస్థతో వర్ధిల్లిన నాగరికత ఆర్యభాషీయుల సంపర్కంతో క్రమేపీ నశించినట్టుగా పరిశోధకులు చెపుతారు. అక్కడి అవశేషాల్లో ముద్రికలమీద కనిపిస్తున్న లిపికీ, ఆ తరవాతి వేదకాలపు భాషకూ ఎటువంటి సంబంధమూ కనబడదు. క్రీ.పూ. 1200 ప్రాంతంలో అతి ప్రాచీన గ్రీక్ నాగరికత కుప్పకూలిన తరవాత వారి లిపి కూడా అంతరించిపోయింది. మళ్లీ నిరక్షరాస్యతే మిగిలింది. ఆ తరవాత మరొక 400 ఏళ్లకు అదే ప్రాంతంలో మరొక గ్రీక్ నాగరికత తలెత్తడం, తమకు అనువైన పద్ధతిలో వారు మెరుగైన అక్షరమాలను రూపొందించుకోవడం జరిగాయి. గతంతో పోలిస్తే వారి జీవనశైలిలోనూ, జీవితావసరాల్లోనూ కలిగిన మార్పుల దృష్ట్యా కొత్త పద్ధతిలో రాసే విధానం మరింత నిర్దుష్టంగా తయారైంది. అంతేకాదు, మారుతున్న ప్రజల జీవితావసరాలకు అనుగుణంగా రాసే విషయాల్లో కూడా మార్పు కలిగింది. నిజమైన సాహిత్యానికి నాంది ఇదే.

ఇప్పటికీ చదువురాని 'వేలిముద్ర' ప్రజలను దెబ్బతీసే సామాజిక వ్యవస్థ పటిష్టంగానే ఉంది. రాతకోతలూ, పట్టాలూ, దస్తావేజులూ ఉపయోగించి భూములను కాజెయ్యడం వగైరాలన్నీ కొందరు నిరక్షరాస్యులుగా ఉండిపోవడం చేతనే కొనసాగుతున్నాయి. ◆

వచ్చే సంచికలలో...

- **ఫోకస్ - జూన్ 2008 : మండుతున్న నిత్యావసర వస్తువుల ధరలు**
- **ఫోకస్ - జూలై 2008 : ప్రత్యేక ఆర్థిక మండలాలు**
- **రాసినది చదవడం - కొడవటిగంటి రోహిణీప్రసాద్**
- **బలహీనపడుతున్న ప్రజాపంపిణీ వ్యవస్థ - రేండ్ల రాజేశం**

మహిళా సంఘాల అధ్యయనం చేయకుండా మహిళా ఉద్యమ చరిత్రను సరిగ్గా నిర్మించలేమనీ, దాని స్వభావాన్ని అంచనా వేయలేమనీ అంటున్నారు **ఎస్. మహబూబ్ బాషా**

వలసాంధ్రలో స్త్రీల సంఘాలు : వివాదాస్పద 'శ్రీ విద్యార్థిని సమాజ' కథ

(... గత సంచిక తరువాయి)

కాకినాడ విద్యార్థినీ సమాజ స్థాపన, ముఖ్యంగా పునరుద్ధరణ తర్వాత స్త్రీ సమాజాలకు ఒక నిర్దిష్టరూపం కలగడం ప్రారంభమైందని చెప్పవచ్చు. స్పష్టమైన లక్ష్యాలతో, నిర్దిష్టమైన కార్యాచరణ ప్రణాళికతో, ప్రణాళికకు కార్యరూపం ఇవ్వడానికి తగినంతమంది ఆఫీస్ బేరర్స్ తో వారి మధ్య క్రమమైన శ్రమవిభజనతో సమాజం పని చేసిందని మనమింతకు ముందే చూశాం. ఈ సమాజ ప్రారంభంతోనే స్త్రీ సమాజాలు సభలు, సమావేశాలకు మాత్రమే పరిమితం కాకుండా పత్రిక నడపడం, పాఠశాల నిర్వహించడం లాంటి బహువిధమైన (బహుళ) కార్యాక్రమాలకు శ్రీకారం చుట్టాయి. 'శారదా నికేతనం' స్థాపన నాటికి (1922) స్త్రీ సంఘాలు ఇంకొంచెం బలం పుంజుకొని వితంతు వివాహాలు జరపడం లాంటి సంఘ సంస్కరణ కార్యకలాపాల్లో క్రియాశీలకంగా పాల్గొనడం జరిగింది. 'ఆంధ్ర మహిళా సభ' ఏర్పాటుతో మహిళా సంఘాలకు బృహదావతారమొచ్చింది. విద్యాశాఖ, లలిత కళల శాఖ, పారిశ్రామిక శాఖ, సాహిత్య శాఖ, వాగ్వివాద శాఖ మొదలగు శాఖలుగా విడగొట్టబడి అద్భుతమైన పని విభజనతో స్త్రీ సమాజాలు పనిచేయడం ప్రారంభించాయి. ఈ విధంగా సమాజాలు వెల్-స్ట్రక్చర్డ్ సమాజాలుగా మారినాయి. పశ్చిమగోదావరి జిల్లా మహిళా సంఘం లాంటి సంఘాలు వివిధ ప్రదేశాల్లో శాఖలను కలిగి ఉండడమే కాకుండా స్త్రీల దైనందిన సమస్యల పరిష్కారం కోసం ఆందోళనా కార్యక్రమాలు చేపట్టగలిగేంతగా ఎదిగాయి. 'ఆంధ్రమహిళాసభ' ఏర్పాటుతో యావత్ వలసాంధ్ర స్త్రీలు ఒకే వేదిక మీద గుమికూడడం ప్రారంభించారు. ఆల్ ఇండియా వుమెన్స్ కాన్ఫరెన్స్ రాష్ట్ర శాఖను ('ఆంధ్ర రాష్ట్ర మహిళా మహాసభ) ఏర్పాటు చేయడం ద్వారా జాతీయ మహిళోద్యమంలో వలసాంధ్ర స్త్రీలు పాలుపంచుకోవడం ప్రారంభించారు. ఈ రాష్ట్ర స్థాయి సంఘాల సదస్సులు వలసాంధ్రంతంటా జరుగుతుండడంతో సోదరీతత్వ భావ పరిమళం వలసాంధ్రలో వ్యాపించింది.

అనేకమైన స్త్రీల సమస్యలతో పాటు, పలు జాతీయ, అంతర్జాతీయ విషయాలు స్త్రీల సంఘాల్లో చర్చించబడేవి. ప్రారంభంలో ఈ సంఘాలన్నీ స్త్రీ విద్యాభివృద్ధిపై అధిక దృష్టిని కేంద్రీకరించాయి. నాటి సమాజంలో స్త్రీల స్థితి కడుదీనంగా, హీనంగా ఉందనీ, కానీ ప్రాచీన కాలంలో ఉత్కృష్టంగా ఉండిందనీ, మధ్యయుగంలో 'దుర్మార్గమైన ముస్లిం పాలన' కారణంగా దిగజారిందనీ, స్త్రీలలో విద్యావ్యాప్తి ద్వారా మాత్రమే ప్రాచీనౌన్నత్యాన్ని పొందగలరనీ చర్చించేవారు. (భారతదేశం అధోగతికి చేరడానికి 'ముస్లిం పాలన' కారణమనే భావజాలం నాడు విస్తృతంగా / విశృఖలంగా చలామణీలో ఉండేది. ఈ భావజాలం నాటి మహిళల ఉపన్యాసాల్లోనూ, రచనల్లోనూ అలవోకగా దొర్లుతుండేది. ఆ నరేటివ్ 'ప్రాచీన కాలంలో జాజ్జ్వల్యమానంగా ఉండిన స్త్రీల స్థితి మధ్యయుగంలో 'ముస్లింల పాలన' కారణంగా అంధకార బంధురమైంది...' ఇలా సాగుతూ పోయేది. ఈ మతతత్వ భావజాలాన్ని పురుషులతో పాటు స్త్రీలు కూడా పంచుకున్నారు. పురుష సంస్కర్తల్లాగే స్త్రీలు కూడా 'బ్రిటిష్ పాలన వలని మేలులు' గురించి అనర్గళంగా ఉపన్యసించేవారు; ధారాళంగా రాసేవారు. కొంతమంది ఇంకొంచెం ముందుకెళ్లి తారాస్థాయినందిన బ్రిటిషాభిమానంతో రాముడు, కృష్ణుడు, ధర్మరాజు మొదలైన వారి పాలనకన్నా బ్రిటిష్ పాలనే మిన్న అని కుండబద్దలు కొట్టినట్టు చెప్పారు!) స్త్రీ విద్యతోపాటుగా పాతివ్రత్యం, మహిళలతో ఐక్యత ఆవశ్యకత, మహిళా సంఘాలు, బాలికా పాఠశాలలు ఏర్పరచాల్సిన అవసరం గురించి చర్చించేవారు. క్రమంగా 'బాలవివాహముల వలని కలిగెడు నష్టములు', వితంతు సమస్య చర్చించబడ్డాయి. వితంతు సమస్యను చర్చించడానికి ప్రారంభ మహిళా సంఘాలు తీవ్రంగా సంకోచించేవి. వితంతు పునర్వివాహాల గూర్చి మాట్లాడేవి కాదు. ఎంతసేపూ వింతువుల పాతివ్రత్యాన్ని ఎలా పరిరక్షించాలి, తుచ్ఛమైన సంసార వాంఛలనుండి (లైంగిక వాంఛలు) వాళ్ల మనస్సును ఎలా డైవర్ట్ చేసి, వైరాగ్య భావాన్ని కల్గించాలి, వాళ్లను విద్యావంతులుగా తీర్చిదిద్ది బాలికా పాఠ్యశాలల్లో ఉపాధ్యాయునిలుగా ఎలా నియమించాలి... ఇలా చర్చసాగేది. పునర్వివాహితలను గూర్చిన గడబిడే విద్యార్థినీ సమాజ వివాదాస్పదమై చీలికకు కారణమైందన్న విషయాన్ని చూసే ఉన్నాం మనం. వివిధ స్త్రీలు వైయక్తికంగా వితంతు పునర్వివాహాలను కోరుతూ వ్యాసాలు రాసినప్పటికీ ఒక సంఘంగా, ఏ ప్రారంభ సంఘమూ వితంతూద్వాహాలకు సమర్థననిచ్చిన దాఖలాలు (ఇంతవరకు లభిస్తున్న ఆధారాలను బట్టి) లేవు. ఇలా అంటున్నామంటే ఈ సంఘాలు వితంతూద్వాహాలను వ్యతిరేకించాయని కాదు అర్థం.

ఈ విషయానికి సంబంధించి మౌనం పాటించాయి. ఈ మౌనం వ్యూహాత్మకమైన మౌనం కావచ్చు. పులుగుర్త లక్ష్మీనరసమాంబ కదు దీర్ఘంగా మొత్తుకున్నట్లుగా పునర్వివాహితులకు సామాజికామోదం లేకపోవడం, స్త్రీ సమాజాల గూర్చి విస్తృతంగా ఉండిన పలు అపోహలు కారణం కావచ్చు. అందుకే కాకినాడలో జరిగిన రెండవ 'ఆంధ్రమహిళా మహాసభ'లో చర్చింపదగినవి ప్రకటించిన వివిధ విషయాల్లో వితంతువులను గూర్చి ప్రస్తావిస్తూ 'వితంతు సోదరీమణుల వలన సంఘమునకు గలుగవలసిన యుపకారములు' అని వితంతువులను ఎలా 'ఉపయోగించుకోవాలి' అన్నదాని మీదనే దృష్టిసారించారు కాని వాళ్లకు పునర్వివాహం ఎలా చేయాలి అనే వైపు దృష్టి సారించలేదు. ఇక పులుగుర్త లక్ష్మీనరసమాంబ లాంటి వాళ్లు వితంతువులకు బ్రహ్మచర్యమనే టానిక్కును ప్రిస్క్రైబ్ చేశారనీ, పునర్వివాహితలను కులటలన్నారనీ, హిందూ స్త్రీల పాతివ్రత్య ధర్మానికి మాయని మచ్చగా, తీవ్ర కళంకంగా పరిగణించారనీ మనం ముందే చూసినాం. కానీ విద్యార్థినీ సమాజం అభ్యుదయవాదుల చేతుల్లో కొచ్చినాక ఈ పరిస్థితి మారింది; వితంతు పునర్వివాహాలను జరపకపోయినా విద్యార్థినీ సమాజం (మలిదశలో) వాటిని ప్రోత్సహించింది. క్రమంగా 'శారదా నికేతనము' లాంటి సమాజాలు వితంతు పునర్వివాహాన్ని తన కార్యక్రమాల్లో భాగంగా చేసుకోవడమే కాక 30 వితంతు వివాహాలను జరిపింది. 'ఆంధ్రమహిళా మహాసభ', 'రాష్ట్ర మహిళా సభ'ల సమావేశాల్లో వితంతూద్వాహాలకు అనుకూలంగా, కొద్దిమంది నుండి వ్యతిరేకత ఉన్నా కూడా, తీర్మానాలు ప్రవేశపెట్టబడి పాసయ్యేవి.

1920లల్లోనూ, తర్వాతా మునుపటి అంశాలు చర్చల్లో కొనసాగుతూ పోగా స్త్రీ స్వాతంత్ర్యం, ప్రేమ వివాహాలు, విడాకులు, వారసత్వం హక్కులు, రాజకీయ హక్కులు, జాతీయోద్యమంలో మహిళలు పోషించాల్సిన పాత్ర, ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర ఆవశ్యకత, అధిక సంఖ్యలో బాలికా పాఠశాలలనేర్పాటు చేయాల్సిన అవసరం, స్త్రీల ఉన్నత విద్య, స్త్రీల కోసం ప్రత్యేక ఉన్నత విద్యాసంస్థల ఏర్పాటు ఆవశ్యకత, స్త్రీల యూనివర్సిటీ ఆవశ్యకత, స్త్రీలు వైద్య విద్యనభ్యసించాల్సిన ఆవశ్యకత, ఓటు హక్కు, నిమ్న జాత్యుద్ధరణము, హిందూ – ముస్లిం ఐక్యత మొదలైన అనేక అంశాలు చర్చించబడేవి. రాష్ట్ర మహిళా సమావేశాల్లో వీటిని గూర్చి వాడివేడి చర్చలు జరిగేవి. గుమ్మడిదల దుర్గాబాయమ్మ నాయకత్వంలోని 'ఆంధ్ర మహిళా సభ'లో తెలుగు, హిందీ వాగ్వివాద సభలు ఉండేవి. ఈ క్లబ్‌ల ద్వారా స్త్రీలు అనేక అంశాలపై, ముఖ్యంగా స్త్రీల హక్కులను గూర్చి చర్చించేవారు. 1920ల నుంచీ మహిళా సంఘాల్లో ప్రవేశపెట్టబడిన తీర్మానాలను పరిశీలిస్తే స్త్రీలలో పౌరహక్కులు, రాజకీయ హక్కులకు సంబంధించిన చైతన్యం తారాస్థాయిలో ఉండిందన్న వాస్తవం సుస్పష్టమౌతుంది.

ప్రారంభంలో స్త్రీల సంఘాల్లో రాజకీయాంశాలకు సంబంధించిన చర్చ అస్సలుండేది కాదు. చర్చంతా స్త్రీల సమస్యల చుట్టే ఉండేది. 'జాతీయోద్యమం'గా పిలువబడుతున్న వలసవాద వ్యతిరేకోద్యమం ప్రారంభమయ్యాక 'శారదానికేతనం' లాంటి సంఘాలు అందులో చురుక్కుగా పాల్గొనసాగారంభించాయి. ఖద్దరు, హరిజనోద్ధరణ, 'నిర్మాణాత్మక కార్యక్రమాలు' 'జాతీయోద్యమానికి' స్త్రీల తోడ్పాటు లాంటి అంశాలు స్త్రీల చర్చల్లో భాగమైనప్పటికీ అవి ప్రాధాన్యతాంశాలు ఎంత మాత్రమూ కావు. 'జాతీయోద్యమా'నికి ఈ సంఘాలు స్పందించినప్పటికీ తమ 'సొంత' సమస్యలు ఆ గాలిలో కొట్టుకొని పోకుండా కాపాడుకున్నాయి. ఒక్కముక్కలో చెప్పాలంటే పురుషులకు అతి ప్రధానమైపోయిన 'జాతీయోద్యమ' అంశాలకు మహిళా సంఘాలు రెండవ ప్రాధాన్యతను మాత్రమే ఇచ్చాయి. స్త్రీల సమస్యలే వాటి ప్రాధాన్యతాంశం ఇంకా ఎక్కువగా చెప్పాలంటే, 'జాతీయోద్యమ' అంశాలు స్త్రీ సంఘాలకు అప్రధానాంశాలు; సంఘ సంస్కరణే ప్రధానాంశం. హిస్టారికల్ సర్కిల్స్‌లో జాతీయోద్యమం ముందుకు రావడంతో సంఘ సంస్కరణ వెనక్కి తగ్గిపోయిందనే ఒక బలమైన వాదముంది. ఈ వాదన సరియైనదే! కానీ పురుషపుంగవులకు సంబంధించినంతవరకు మాత్రవే. వివిధ స్త్రీ సంఘాల కార్యకలాపాలనూ, స్త్రీల పత్రికల్లో చర్చితాంశాలనూ గమనిస్తే పై వాదన 'పురుష కేంద్ర వాదన' అని తేలిపోతుంది; సంఘ సంస్కరణను స్త్రీలు కొనసాగించారన్న విషయం స్పష్టమౌతుంది. స్త్రీలతో పాటుగా వివిధ కుల సంఘాలు కూడా (తమ–తమ కులాల సంస్కరణ) సంఘ సంస్కరణకే ప్రాధాన్యతనిచ్చాయి. *ఇట్ ఈజ్ క్లియర్లీ ఎవిడెంట్ ఫ్రం ది అక్టవిటీస్ ఆఫ్ ది వేరియస్ వుమెన్స్ ఆర్గనైజేషన్స్ దట్ ది ఇష్యూస్ ఆఫ్ ది ఫ్రీడం మూవ్‌మెంట్ వర్ సబార్డినేటెడ్ టు వుమెన్స్ ఇష్యూస్, ఆర్ ఇన్ అదర్ వర్డ్స్, వుమెన్స్ ఇష్యూస్ టుక్ ప్రిసిడెన్స్ ఓవర్ ది ఇష్యూస్ ఆఫ్ ది 'నేషనల్ మూవ్‌మెంట్'.* స్త్రీల సంఘాలు స్త్రీల సమస్యల గూర్చి ఎంత ఒబ్సెసివ్‌గా ఇన్వాల్వ్ అయి ఉండేవంటే 'జాతీయోద్యమం' పట్ల అవి ప్రదర్శించిన నిర్లక్ష్య వైఖరి కనుపర్తి వరలక్ష్మమ్మ మొదలైన 'జాతీయవాద' స్త్రీలకు కోపమూ, బాధా తెప్పించింది. 1932లో గుంటూరులో జరిగిన ఐదవ ఆంధ్రరాష్ట్ర మహిళా సభ ప్రొసీడింగ్స్‌ను సమీక్షిస్తూ దాని అజెండా ఆఫ్ డిస్కషన్స్‌లో రాజకీయాంశాలను చేర్చకపోవడంతో తీవ్ర లోపముంది. *ఆల్సో షీ వాజ్ పేయిన్డ్ ఎట్ ది రిలక్టెన్స్ ఆఫ్ వుమెన్ టు ఎక్స్‌ప్రెస్ ఎని గ్రాటిట్యూడ్ టువర్డ్స్ గాంధీ అండ్ సరోజిని దేవీ, ప్రామినెంట్ 'నేషనల్' లీడర్స్ ఆఫ్ ది ఫ్రిడమ్ స్ట్రగుల్.* ఇదంతా స్త్రీల సంఘాలు 'జాతీయోద్యమం' పట్ల ఎక్కువ ఉత్సాహాన్ని చూపించలేదన్న విషయాన్ని రూఢి చేస్తుంది. కానీ ప్రత్యేకాంధ్ర రాష్ట్ర ఉద్యమం పట్ల మాత్రం సంఘాలు ఉత్సాహాన్ని చూపించాయి.

స్త్రీ సంఘాలు స్త్రీల ఆలోచనలను గణనీయంగా ప్రభావితం చేసినాయి; కొద్దిమంది స్త్రీల జీవితాలలో ట్రాన్స్‌ఫర్మెటివ్ పాత్రను పోషించాయి. ఇంటి నాలుగు గోడలకే పరిమితమైన వివిధ నేపథ్యాలకు చెందిన స్త్రీలు ఒకచోట చేరి వివిధ విషయాలు చర్చించుకోవడానికీ, తమ అనుభవాలు పంచుకోవడానికీ, పరిమితమే అయినప్పటికీ, ఒక పబ్లిక్ స్పేస్‌ను సృష్టించాయి. ప్రారంభంలో స్త్రీల నుండే వ్యతిరేకత ఏర్పడినప్పటికీ పరిస్థితి మారనారంభించి అనేకులు సమావేశాలకు హాజరవడం జరిగింది. 'ఆంధ్ర మహిళా సభ'ల ప్రారంభంతో ముందు పరిమితంగా ఉండిన పబ్లిక్ స్పేస్ బాగా విస్తృతి చెందింది. వలసాంధ్ర లోని వివిధ ప్రాంతాల్లో జరిగిన రాష్ట్రస్థాయి మహిళా సమావేశాలకు దూర–దూర ప్రాంతాలనుండి అప్పుడప్పుడు ఒంటరిగా ప్రయాణించడం, రెండు, మూడు రోజులు ఇళ్లకు దూరంగా ఉండడం ఇవన్నీ స్త్రీలకు కొత్త అనుభవాలు; కొత్త ప్రదేశాలు, కొత్తవారు, కొత్త ఆలోచనలు, ఉపన్యాసాలు వినడం, తామూ ఉపన్యసించడం, చర్చల్లో పాల్గొనడం,

అభిప్రాయాలు వ్యక్తం చేయడం.... ఇలాంటివన్నీ వారిలోని అనేక సంకోచాలను పటాపంచలు చేసి ఆత్మవిశ్వాసాన్ని కలిగించాయి.

ముందు బిడియం – బిడియంగా ఉన్న స్త్రీలు గొప్ప ప్రజా వక్తలుగా రూపాంతరం చెందడం కూడా మహిళా సభల పుణ్యమే. ప్రారంభంలో ఆత్మన్యూనతా భావంతో తాము రాసిన ఉపన్యాసాలను 'చదువుచుండిన' స్త్రీలు (తాము అల్పజ్ఞులనీ, అజ్ఞానులనీ, అబలలమనీ తమ ఉపన్యాసంలో ఏవైనా తప్పులుంటే మన్నించాలనీ... ఇలా అతి వినయంతో విన్నవించుకునేవారు ముందు). క్రమంగా ధారాళమైన ఉపన్యాసాలివ్వడం ప్రారంభించారు. 'అల్పజ్ఞులం', 'అజ్ఞానులం', 'తప్పులుంటే మన్నించండి' లాంటి న్యూనతతో కూడిన వ్యక్తీకరణలు పోయి ఆత్మవిశ్వాసం తొణకిసలాడేలా ఉపన్యసించేవారు; స్వరంలో గాంభీర్యం ఉట్టిపడేది. స్త్రీలు అద్భుతమైన ప్రజా వక్తలుగా రూపాంతరం చెందిన తీరును కనుపర్తి వరలక్ష్మమ్మ అక్షరాలలో ఛాయాచిత్రీకరించారు. ఆమె ప్రకారం ప్రారంభంలో ఏదేనీ తీర్మానం పై మాట్లాడడానికి ఒకరిద్దరు స్త్రీలను ఒప్పించేటప్పటికి తలప్రాణం తోకకొచ్చేది. కానీ పరిస్థితులు మారి ఒకే తీర్మానం పై మాట్లాడడానికి పది నుండి ఇరవైమంది సిద్ధమవుతున్నారు. సమయాభావం గూర్చి మాట్లాడితే కోపగించు కుంటున్నారు. వేదికాభయం (స్టేజ్ ఫీయర్) అస్సలు లేదు. స్త్రీలలో ఉపన్యసించాలన్న కోరిక బలంగా పెరుగుతోంది. ఈ సమాజాలు స్త్రీలకు ఆర్గనైజేషనల్ స్కిల్స్‌లో కూడా శిక్షణనిచ్చాయి. సభలు, సమావేశాలు ఏర్పాటు చేయడం, తీర్మానాలు పాస్ చేయడం, వాటిని ప్రభుత్వాలకు పంపడం, సంతకాల సేకరణ, ధర్నాలూ, ఆందోళనలూ చేయడం ఇలాంటి చర్యల వలన స్త్రీలలో నాయకత్వ లక్షణాలేర్పడి, అభివృద్ధి చెందడానికి మహిళా సమాజాల శిక్షణ బాగా ఉపయోగపడింది. 'స్వాతంత్ర్యానంతరం' భారతదేశంలో మొదటి రెండు దశకాల్లో నాయకత్వ పాత్రలను పోషించిన స్త్రీలు చాలామంది ఇలాంటి మహిళా సమాజాల్లో శిక్షణ పొందినవారే! ఈ విధంగా సమాజాలు మహిళల్ని ఫ్యూచర్ లీడర్‌షిప్ రోల్స్ నిర్వర్తించడానికి తయారు చేశాయి.

గాంధీ రూపొందించిన వివిధ 'వంటింటి కుందేళ్ళైన' స్త్రీలను ప్రజా ఆవరణలోకి తీసుకొచ్చాయన్న డామినెంట్ వాదనొకటుంది; స్త్రీలు ఇళ్ళ నుండి బయటికి రావడానికి సంబంధించి గాంధీకీ, 'జాతీయోద్య' మానికీ ఓవర్ క్రెడిట్ ఇస్తుంది ఈ వాదన. వాదన చాలావరకు సరియైందే కానీ శ్రద్ధగా గమనించాల్సిన విషయమేమిటంటే గాంధీగారు స్త్రీలను బయటికి లాక్కొచ్చేనాటికన్నా చాలా ముందే స్త్రీలు ఇళ్ళ బైటికొచ్చినారు. పెద్ద ఎత్తున సభలూ, సమావేశాల్లో అంటే జనావరణలో ఆపరేట్ చేయడం మొదలుపెట్టారు. ఈ విధంగా 'ముందుగానే' బయటికొచ్చిన అనుభవంతో స్త్రీలు 'స్వాతంత్ర్యోదమం'లో పాల్గొన్నారు. గాంధీగారి కార్యక్రమాలు 'ముందుగానే', అయితే పరిమితంగా ఉన్న స్త్రీల జనావరణను విస్తృతం చేశాయి. "ఎక్స్‌టెండడ్ ఫ్యామిలి" భావన దీనికి లెజిటిమసిని చేకూర్చింది.

దాదాపు ప్రతి స్త్రీ సంఘమూ కష్టాలనూ, కడగండ్లనూ ధైర్యంగా ఎదుర్కొంటూ నిలదొక్కుకోగలిగింది. ఆర్థిక – ఇబ్బందులతో, మానవ వనరుల లేమితో (ప్రారంభదశలో, తర్వాతి కాలంలో బోలెడంత స్త్రీ శక్తి వనరు లభించింది) సతమతమయ్యాయి. ఆర్థికంగా ఆదుకోండని దీనంగా వేడుకున్నాయి. స్త్రీలు చందాలేసుకొని సమాజాలను నడిపారు. విపరీతమైన ఆర్థిక ఇబ్బందులనెదుర్కున్నా కూడా స్త్రీలు పట్టుదలతో వ్యవహరించి సమాజాలు మూల పడకుండా జాగ్రత్తగా కాపాడుకున్నారు. తమ భవిష్యత్తు నిర్మాణ సాధనలైన ఈ మహిళా సంఘాలనే సౌధాలు పడిపోకుండా స్త్రీలు జాగ్రత్తగా, పట్టుదలతో, దీక్షతో పట్టుకున్నారు. సమాజం నుండి వ్యతిరేకత ఎదురౌతున్నా, సమాజాలు నడిపేవారి మీద ఆర్థోడాక్స్ ఎలిమెంట్స్ మోపిన అభాండాలకు వెరవకుండా మహిళలు ముందుకు నడిచారు; (సంఘటితమవుతున్న మహిళల మీద అభాండాలు వేయడమనేది అపట్నించి ఇప్పటిదాకా 'పరంపర'గా కొనసాగుతూ వస్తోంది. వెక్కిరింతల సంగతి సరేసరి; 'గుండమ్మ కథ'లో లేచింది మహిళా లోకం.....' వెక్కిరింత; దానికి పేరడీగా 'లేచింది మహిళాలోకం... పాలుకాచింది కాఫీ కోసం .... "మహా వెక్కిరింత) సమాజాలను నడిపారు. అప్పట్లో పలుమంది పురుషులు విద్యావంతులు సహా, కుహనా సంస్కర్తలు సరేసరి, తమ స్త్రీలు ఈ సమాజాలకెళ్ళకుండా బహు జాగ్రత్తలు తీసుకునేవారు; ఇలాంటి వారిని 'వివేకవతి' అనే ఇంకో స్త్రీల పత్రిక గేలిచేసింది.

ఇలా చెప్పుకుంటూ పోతున్నామంటే సమాజాలన్నీ మహిళోద్యమం లో చక్కగా పనిచేశాయని కాదు; అలంకారప్రాయమై కేవలం మధ్యతరగతి స్త్రీల కాలక్షేప కేంద్రాలుగా మారిన సమాజాలు కొన్ని ఉండినాయి. ఇలాంటి సమాజాల్ని 'లేడీస్ క్లబ్బు' అనే బుల్లి నాటిక లో కనుపర్తి వరలక్ష్మమ్మ గేలి చేసి తమ కాలక్షేప కార్యక్రమ మార్గాన్ని సరిచేసుకొని మహిళా సమస్యలపై పోరాడమని హితబోధ చేసింది.

వలసాంధ్ర స్త్రీ సమాజాలు మధ్యతరగతి, పై మధ్య తరగతులకు, అగ్రవర్ణాలకూ, ముఖ్యంగా బ్రాహ్మణకులానికి చెందిన స్త్రీల సమాజాలు; 'చాతుర్వర్ణ్యములలోని కుల స్త్రీల'కు చెందిన సమాజాలు. ప్రముఖమైన 'విద్యార్థినీ సమాజం' లాంటి సమాజాలు కూడా బహిరంగంగా కులవివక్షను కనపర్చడమనేది మనం ముందే గమనించి ఉన్నాం. పులుగుర్త లక్ష్మీనరసమాంబ లాంటివారు క్రైస్తవులు, ముస్లింలు ఆంధ్రులే కారని తేల్చిపడేసిన సంగతి కూడా చూశాం. క్రైస్తవ స్త్రీల, ముస్లిం స్త్రీల దృష్టినుండి చూస్తే ఇవి అచ్చమైన హిందూ స్త్రీ సమాజాలు. 'మాల మాదిగలు మొదలగు నీచ జాతుల'కు చెందిన స్త్రీల దృష్టి నుంచి చూస్తే ఇవి కులదురహంకార అగ్రవర్ణ స్త్రీ సమాజాలు. ఛాందసవాద పురుష దురహంకార సూకరాల దృష్టితో చూస్తే 'భర్తలను తిరస్కరించేటటువంటి' 'బరితెగించిన' స్త్రీల సంఘాలు.

సమాజాల సాఫల్యాల దగ్గరికొస్తే, రెండు మూడు సంఘాలను మినహాయించి, ఒక్కొటొక్కటిగా చూసి ఈ సమాజమెంత విజయాన్ని చ్చింది మహిళోద్యమానికి అని ప్రశ్నించుకుంటే నిరాశే మిగులుతుంది. ఉన్న సందర్భం దృష్ట్యా అలా ప్రశ్నించడం చారిత్రక దృష్టి అనిపించుకోదు. సమాజాలనన్నింటినీ కలుపుకొని కలెక్టివ్‌గా చూసినప్పుడు డిఫరెన్స్ తప్పకుండా కనిపిస్తుంది. ఈ సమాజాల ప్రధాన విజయం స్త్రీలను ఇంటి నాలుగు గోడల్నించి బయటకు తేవడం, సంఘటితపర్చడం, చైతన్యీకరించడం, వెరసి బలమైన సోదరీతత్వ భావాల్ని కలిగించి 'స్వాతంత్ర్యానంతర' భారతంలో పుంజుకున్న మహిళోద్యమానికి పటిష్ఠమైన పునాదులు వేయడం, ఉదయం దిశగా స్త్రీలను మలచడం. పురుషదురహంకార సమాజమనే రాతినేలను వలసాంధ్ర స్త్రీలు వదులు చేయగా నేటి స్త్రీవాదులు చదును చేసి పదును పెడుతున్నారు. ◆

(అయిపోయింది)

అధికారాన్ని ఆస్తులు పోగుచేసుకోవడానికి వాడుకోవడం ఒకవైపు జరుగుతుంటే ఆ సంపదను విచ్చలవిడి అలవాట్లకు, విశృంఖల సంబంధాలకు వినియోగించడం దాన్ని అనుసరించే విలువగా చలామణి అవుతున్నది. విలువల పతనం లోతు, విస్తృతి అర్థం కాని స్థితిలో మనం జీవిస్తున్నాం. అప్పుడప్పుడు బాధితులు తమ ఆక్రందనలను బయటకు చెప్పినప్పుడు మాత్రమే ఈ దురాగతాలు బయటపడుతున్నాయి. ఒరిస్సా శాసనసభలో అసిస్టెంట్ మార్షల్‌గా పనిచేస్తున్న గాయత్రి పాండా అనే మహిళ తనపై శాసనసభ స్పీకర్ మహేశ్వర్ మహంతి లైంగిక వేధింపులకు పాల్పడ్డారని తెలిపారు. తదనంతర పరిణామాలలో స్పీకర్ రాజీనామా చేయగా వాటితో సంబంధం ఉన్న సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి దెబాశీష్ నాయక్‌ను ముఖ్యమంత్రి తన మంత్రివర్గం నుంచి తొలగించారు.

ప్రధాన న్యాయమూర్తి కె.జి. బాలకృష్ణన్ ఆధ్వర్యంలోని ఇద్దరు జడ్జీల బెంచ్ ఛత్తీస్‌గఢ్‌లోని సల్వాజుడూంపై తమ అసంతృప్తిని వెలిబుచ్చారు. నందిని సుందర్, రాంచందర్ గుహ, ఇ.ఎ.ఎస్. శర్మలు సల్వాజుడూంకు వ్యతిరేకంగా వేసిన పిటిషన్ పై సుప్రీం కోర్టు స్పందిస్తూ ప్రైవేట్ వ్యక్తులకు ఆయుధాలు ఇవ్వడం సరియైంది కాదని, స్వయంగా ప్రభుత్వం ఈ నేర ప్రవృత్తిని ప్రోత్సహించడం ఏమిటని ప్రశ్నించింది. ఈ పిటిషనర్ల తరపున హాజరైన న్యాయవాదులు ఎ.ఆర్. దేశాయి, టి.ఆర్. అంధ్యార్జునలు మాట్లాడుతూ ఇప్పటికే నలభై ఏడు వేల మంది గిరిజనులు పోలీసు క్యాంపుల్లో తమ ఇష్టాలకు వ్యతిరేకంగా జీవిస్తున్నారని, చాలా మంది అమాయకులు సల్వాజుడూం జరిపిన కాల్పుల్లో చనిపోయారని తెలిపారు.

ఒరిస్సాలోని జగత్‌సింగ్‌పూర్ జిల్లాలో రాబోతున్న పోస్కో ఇండియా ఉక్కు కర్మాగారానికి వ్యతిరేకంగా బాలిటుతా వద్ద ఏప్రిల్ 1న జరిగిన ర్యాలిలో ప్రజలు వందలాదిగా పాల్గొన్నారు. సంప్రదాయక ఆయుధాలు ధరించి స్థానికులు, సానుభూతిపరులు ఈ ర్యాలిలో పాల్గొన్నారు. గత ఏడాది నవంబర్ 29న పోస్కో వ్యతిరేక సంగ్రామ సమితి కార్యకర్తలపై పోస్కో అనుకూలురు దాడి చేశారు. ఈ ఉక్కు కర్మాగారం వల్ల అక్కడి ప్రజలు భూమిని, బతుకుదెరువును కోల్పోతారని సమితి అధ్యక్షులు అభయ్ సాహు విమర్శించారు. భూమి తవ్వే కార్యక్రమాన్ని పోస్కో ఇండియా ఏప్రిల్ 1న చేపట్టడంతో అదే రోజున దానికి వ్యతిరేకంగా ఈ నిరసన కార్యక్రమాన్ని సంగ్రామ సమతి చేపట్టింది.

కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి రఘువంశ్ ప్రసాద్ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని దేశంలోని 604 జిల్లాల్లో ఏప్రిల్ 1 నుంచి అమలు చేస్తున్నట్లు ప్రకటించారు. దీనికి గాను 2008-09 బడ్జెట్‌లో రు. 16,000 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. అయితే గత ఏడాది గుర్తించిన వారిలో పది శాతం మంది మాత్రమే వంద రోజుల పనిలో పాల్గొన్నారని తెలిపారు. రాష్ట్రాలవారీగా చూస్తే రాజస్థాన్‌లో 23 శాతం, మధ్యప్రదేశ్‌లో 13 శాతం, ఉత్తర్‌ప్రదేశ్‌లో 7 శాతం, ఆంధ్రప్రదేశ్, చత్తీస్‌గడ్‌లలో 6 శాతం మంది ఈ పథకం వల్ల లబ్దిపొందారని తెలిపారు. అవినీతి, నిధుల మళ్లింపు జరగకుండా చర్యలు చేపడుతున్నట్లు మంత్రి తెలిపారు.

ఓట్లు ఎలా వస్తాయి, వేటిని వివాదం చేయవచ్చు అని అంచనాలు వేసి అధ్యయనాలు చేసి మరీ వివాదాలు రేపగలరు మన రాజకీయ నాయకులు. కర్ణాటకకు శాసనసభ ఎన్నికలు సమీపించిన దరిమిలా ఒక్కసారిగా హొగినేకల్ మంచినీళ్ల ప్రాజెక్ట్ వివాదమయి కూర్చుంది. వాస్తవానికి 1998లో కర్ణాటక, తమిళనాడు ప్రభుత్వాలు ఉమ్మడిగా అంగీకారానికి వచ్చి అమలు జరుపుతున్నవే ఈ మంచినీళ్ల ప్రాజెక్టులు. కావేరీ నీళ్లు బెంగుళూరుకు, హొగినేకల్ నీళ్లు తమిళనాడుకు అనే అవగాహన తోనే ఈ మంచినీళ్ల పథకాలు రూపొందాయి. అయితే రెండువైపులా రాజకీయ నాయకులు, సినిమా ఆర్టిస్టులు ఎవరి ధోరణిలో వారు వారి ప్రయోజనాల కోసం నిలుచున్నారు. కర్ణాటక ఎన్నికల దృష్ట్యా, కరుణానిధి ఉపసంహరణ వ్యాఖ్యలతో తాత్కాలికంగా ఈ గొడవ సద్దుమణిగింది.

గోద్రా తదనంతర పరిణామాలలో భాగంగా జరిగిన పద్నాలుగు కేసుల పునఃపరిశీలనకు మార్చ్ 25న సుప్రీంకోర్టు ఆదేశించింది. అరిజిత్ పసాయత్, పి. సదాశివం, ఆఫ్తాబ్ ఆలంలతో కూడిన ధర్మాసనం అయిదుగురు సభ్యుల స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీంను మరోసారి దర్యాప్తుకై ఆదేశించింది. ఈ టీంలో గుజరాత్ ఐ.పి.ఎస్. అధికార్లు గీతాజోహ్రీ, శివానంద్ ఝూ, ఆశీష్ భాటియాలతో పాటు మాజీ సి.బి.ఐ. డైరెక్టర్ ఆర్.కె. రాఘవన్, ఉత్తర్ ప్రదేశ్ మాజీ పోలీస్ అధికారి సి.బి. సాత్‌పతిలను నియమించింది. గుల్బర్గ్, ఓడే, సర్దార్‌పూర్ ఊచకోతలు, నరోడా గాంవ్, నరోడా పాటియా, బరన్‌పుర, మాఖీపీర్, తర్‌సాలి, పందర్వాడ, రాఘోపుర హత్యలు ఈ దర్యాప్తులో పరిశీలించాల్సిన వాటిలో కొన్ని కేసులు.

ఏప్రిల్ 9న గోర్ఖా జనముక్తి మోర్చా ఆధ్వర్యంలో జరిగిన ప్రదర్శన హింసాత్మకంగా మారింది. పశ్చిమ బెంగాల్‌లోని డార్జిలింగ్ జిల్లాల్లో సిలిగురి వద్ద గోర్ఖాల్యాండ్ కోసం ఆందోళనకారులు ప్రదర్శన చేపట్టారు. సిలిగురి, సిలిగురితో ఆనుకుని ఉన్న పర్వత ప్రాంతాన్ని కలుపుకొని గోర్ఖాల్యాండ్ రాష్ట్రంగా ప్రకటించాలని వారు ఉద్యమిస్తున్నారు.

ఇండియన్ ఎక్స్‌ప్రెస్ సీనియర్ జర్నలిస్ట్ శివానీ భట్నాగర్ తూర్పు ఢిల్లీలోని తన అపార్ట్‌మెంట్‌లో 1999 జనవరి 23న దారుణ హత్యకు గురయ్యారు. ఐ.పి.ఎస్. అధికారి ఆర్.కె. శర్మ శివానీతో ఉన్న తన సాన్నిహిత్యం బయటపడుతుందని కిరాయి హంతకుడు ప్రదీప్‌శర్మ, ప్రాపర్టీ డీలర్లు శ్రీభగవాన్, సత్య ప్రకాష్‌ల సహకారంతో శివానీని హత్య చేయించాడు. ఈ మేరకు ఢిల్లీ అడిషనల్ సెషన్స్‌కోర్ట్ మార్చ్ 24న వీరికి జీవితఖైదు విధిస్తూ తీర్పునిచ్చింది. ◆

చైనాలో జరగనున్న ఒలింపిక్స్ నేపథ్యంలో, టిబెట్ ప్రాంతంలో జరుగుతున్న అల్లర్లు కొత్త పరిణామాలకి దారితీస్తున్నాయి. దలైలామా అనుచరులు టిబెట్ ప్రాంతంలో చైనా ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రదర్శనలు, నిరసన కార్యక్రమాలు సాగించిన సందర్భంగా చైనా ప్రభుత్వం వాటిని అణిచివేసింది. అదే సమయంలో, ఇతర దేశాల్లో నడుస్తున్న ఒలింపిక్ టార్చ్ రిలేని, టిబెట్ మద్దతుదారులు తీవ్రంగా అడ్డుకొన్నారు. చైనా టిబెట్ వాసుల మానవహక్కులని కాలరాస్తోందని, అటువంటి చైనాకి ఒలింపిక్స్ జరిపే హక్కులేదని వీరి వాదన. ముఖ్యంగా పాశ్చాత్య దేశాల్లో టార్చ్ రిలేని అడ్డుకోవడమనేది పెద్ద ఎత్తున జరిగింది. ప్రపంచంలోని అన్ని దేశాల ప్రజల మానవహక్కులని రకరకాలుగా అణిచివేస్తున్న పాశ్చాత్య దేశాలు ఒలింపిక్స్ జరపగా లేనిది, కేవలం చైనాకి మాత్రమే ఈ హక్కు ఎందుకు లేదో తెలియదు. అంతేకాక, ఇరాక్‌లో, ఆఫ్ఘనిస్తాన్‌లో అమెరికా, బ్రిటిష్ ప్రభుత్వాలు చేస్తున్న మానవ హక్కుల ఉల్లంఘనలని నిరసించని, ప్రతిఘటించని పాశ్చాత్యదేశాల ప్రజలు, టిబెటన్ల హక్కుల గురించి మాత్రమే ఎందుకు మాట్లాడుతున్నారో అర్థం కాని విషయం.

జింబాబ్వేలో జరిగిన ఎన్నికలలో అధ్యక్షుడు రాబర్ట్ ముగాబేకి చెందిన పార్టీ జాను-పిఎఫ్ పార్లమెంట్‌లో మెజారిటీని కోల్పోయింది. ప్రతిపక్ష పార్టీ ఐన 'మూవ్‌మెంట్ ఫర్ డెమొక్రటిక్ ఛేంజ్'కి 105 సీట్లు రాగా, జాను-పిఎఫ్‌కి 93 సీట్లు వచ్చాయి. ఐతే, అధ్యక్ష పదవిని కూడా ముగాబే కోల్పోయారని, ప్రతిపక్ష నాయకుడు స్వాంగిరాయ్‌కి 50.3 శాతం ఓట్లు వచ్చాయని, ముగాబేకి 43.8 శాతం ఓట్లు వచ్చాయని ప్రతిపక్షాల వాదన. జింబాబ్వే ఎలక్షన్ కమిషన్ ఇప్పటికి కూడా అధ్యక్ష పదివికి జరిగిన ఎన్నికల ఫలితాలు ప్రకటించలేదు.

అమెరికా మద్దతుతో ప్రజలని రెచ్చగొట్టి, రష్యా వైపు మొగ్గు చూపుతున్న ప్రభుత్వాలని గద్దె దింపి, అమెరికాకి సానుకూలమైన ప్రభుత్వాలని ఏర్పాటు చేసిన జార్జియా అధ్యక్షుడు సాకాష్‌విలి, ఉక్రెయిన్ అధ్యక్షుడు యుష్‌చెన్కో తమ దేశాలని నాటో కూటమిలో భాగాలుగా చేయడానికి చేసిన ప్రయత్నం రష్యా తీవ్ర అభ్యంతరాలు తెలపడంతో బెడిసికొట్టింది. ఈ ప్రయత్నం సఫలమైతే అమెరికా ఈ రెండు దేశాల ద్వారా రష్యాకి పక్కలో బల్లెంలాగా మారి ఉండేది. ఈ ప్రయత్నాన్ని విఫలం చేయడం ద్వారా రష్యా అధ్యక్షుడు పుతిన్ విదేశాంగ విధానంలో ఘనవిజయాన్ని సాధించారు.

నేపాల్‌లో జరిగిన ఎన్నికలలో మావోయిస్టులు అత్యధిక సీట్లు సంపాదించారు. ఇతర పార్టీలైన నేపాల్ కాంగ్రెస్, నేపాల్ కమ్యూనిస్ట్ పార్టీలు మావోయిస్టుల కన్నా చాలా తక్కువ సీట్లని గెలుచుకొన్నాయి. ఎన్నికల ముందు నేపాల్‌లోని మీడియా ప్రతినిధుల, అంతర్జాతీయ మీడియా ప్రతినిధుల, అనేక దేశాల ప్రభుత్వాల అంచనాలన్నీ ఎన్నికల ఫలితాలు తలకిందులు చేసాయి. షరా మామూలుగా నేపాల్ కాంగ్రెస్, కమ్యూనిస్ట్ పార్టీలు మెజారిటీని సంపాదిస్తాయని, మావోయిస్టులకి అతి తక్కువ సీట్లు వస్తాయని, గెలవడానికి మావోయిస్టులు హింసకి పాల్పడతారని, మదేశీ పార్టీలు చాలా బలాన్ని పుంజుకుంటాయని రకరకాల ఊహాగానాలతో నడిచిన ఎన్నికల పర్వం ముగిసి, అన్ని ఊహాగానాలని తలకిందులు చేసింది. మావోయిస్టులు గెలవడం ఏ మాత్రం మింగుడు పడని అమెరికా ప్రభుత్వం కూడా ఎన్నికల ఫలితాలని తప్పనిసరిగా ఆమోదించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రజల కనీస అవసరాలు తీరడానికి, ప్రజారాజ్యం సాధించడానికి మావోయిస్టులు చేసిన విప్లవం పట్ల ప్రజాభిప్రాయం ఏమిటో ఈ ఎన్నికల ఫలితాలు నిర్ద్వందంగా తెలుపుతున్నాయి.

ఇటలీలో మరొకసారి ఎన్నికలు జరిగాయి. కేవలం ఇరవై నెలల్లోనే ఇంతకుముందరి వామపక్ష ప్రభుత్వం పడిపోవడంతో ఇటలీలో ఎన్నికలు అనివార్యమయ్యాయి. ఈ ఎన్నికలలో తిరిగి సిల్వియో బెర్లుస్కోని ఇటలీ అధ్యక్షుడిగా గెలిచారు. ఇంతకు ముందు రెండుసార్లు ఇటలీని పాలించిన బెర్లుస్కోని మితవాది కావడమే కాకుండా, చాలా అవినీతిపరుడని, ఆర్థిక, విదేశాంగ విధానాల్లో అమెరికాకి చాలా దగ్గరగా ఉంటాడని, ఆడవాళ్ళు, మైనారిటీల పట్ల చిన్నచూపు గలవాడని పేరు. ఇటలీలో ఆర్థిక పరిస్థితులు అంతంత మాత్రంగా ఉండటం, నిరుద్యోగం పెరిగిపోవడం వంటి కారణాలని చూపించి, వలసవచ్చిన వాళ్లని భూతాలుగా చూపించి బెర్లుస్కోని గెలిచారు.

ఇరాక్‌లో షియా, సున్నీ మిలీషియాలకి – అమెరికా, ఇరాక్ సేనలకి మధ్య మరొకసారి యుద్ధం ఆరంభమైంది. ఇరాక్‌ని అమెరికా ఆక్రమించి ఐదు సంవత్సరాలు పూర్తి కాగా, ఇంకా ఇరాకీ ప్రజల కనీస అవసరాలు తీర్చి, భద్రత కలిగించే స్థితిలో ఇరాక్ ప్రభుత్వం లేదు. బాగ్దాద్‌లో, బకూబాలో, రమాడీలో, మొసుల్‌లో కారు బాంబుల దాడిలో కనీసం వందమందికి పైగా మరణించారు. ఎన్నో వందల మంది గాయపడ్డారు. మొక్తాదా-అల్-సాదర్ మరిషియా, షియాలు, అధికంగా ఉండే ప్రదేశాల్లోనూ, అల్-ఖాయిదా, ఇతర సున్నీ మిలీషియాలు సున్నీలు అధికంగా ఉండే ప్రదేశాల్లోనూ అమెరికా, ఇరాక్ సేనల మీద, ఒకరి మీద ఒకరు చేసుకునే ఈ దాడుల్లో ఇరాకీ ప్రజలు వేలల్లో ప్రాణాలు కోల్పోతున్నారు.

స్పెయిన్ ఎన్నికలలో మరొకసారి గెలిచిన ప్రధానమంత్రి జాపటీరో, 17 మంది ఉన్న కెబినెట్‌లో తొమ్మిదిమంది స్త్రీలకి స్థానం ఇచ్చారు. రక్షణ మంత్రిత్వ శాఖ స్త్రీలకి ఇవ్వడం చాలా అరుదైన విషయం. జాపటీరో కేబినెట్‌లో రక్షణ శాఖ, గృహనిర్మాణశాఖ, విజ్ఞానశాస్త్ర శాఖ, ఇంకో ఇతర శాఖలకి స్త్రీలు మినిస్టర్లు కాగా, డిప్యూటి ప్రధానమంత్రి కూడా స్త్రీ కావడం గమనార్హం. బహుశా ఇంకే దేశంలో కూడా స్త్రీలకి కేబినెట్ పోస్టుల్లో దాదాపు యాభై శాతం దక్కడమనేది లేదేమో. ◆

అసహజ మరణాల సూచి

సంకలనం : రాంకి, వై. రామచంద్రం

మరణం ఎప్పుడయినా విషాద సూచకమే. మృతుల బంధువులకూ, మిత్రులకూ విచారకరమే కాని అందులోనూ మరణించిన మనిషి నిండు జీవితం గడిపి వయోభారంతోనే మరణిస్తే దాన్ని సహజ మరణంగా అంగీకరించి ఊరట పడవచ్చు. ఆ సహజ మరణపు వయోపరిమితి దేశ కాల పరిస్థితులను బట్టి, జీవన ప్రమాణాలను బట్టి అరవైల నుంచి తొంబైల దాకా ఉండవచ్చు. కాని మన సమాజంలో సాధారణ ఆయు ప్రమాణం 63 సంవత్సరాలు అయినప్పటికీ ఎంతోమంది పుట్టుకలోనే మరణిస్తున్నారు. సగటు ఆయు ప్రమాణంలో సగం కూడా అనుభవించక ముందే మరణిస్తున్నారు. ఈ మరణం అనేక రూపాలలో సంభవిస్తోంది. ఆకలి, అనారోగ్యం, మానసిక ఆందోళనలు, సామాజిక అసమానతలు, వరకట్న మరణాలు, నిర్లక్ష్యం, అంటరాని తనం, వ్యవసాయం, చేనేత వంటి రంగాల్లోని సంక్షోభాలు, పారిశ్రామిక అశాంతి, జీవనోపాధి లేమి అసహజ మరణాలకు లెక్కలేనన్ని కారణాలున్నాయి. మన పక్కనె మనతోనే ఉండే మనుషులు అర్థాంతరంగా అసహజంగా అకాలంగా అదృశ్యమైనపోతున్నారు. ఇటువంటి అసహజ మరణాలు ఇటీవలి కాలంలో విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఇవి సామాజిక సంక్షోభానికి, సమాజం దిగజారుడుకు ఒక చిహ్నం. మన రాష్ట్రంలో సాలీనా ఈ రకంగా చనిపోతున్న వారి సంఖ్య వేలల్లోనే ఉంటుందని అంచనా. నిజానికి అసహజ మరణాలన్నీ అసహజ మరణాలుగా నమోదు కావడం లేదు గనుక ఈ సంఖ్య వాస్తవంలో ఒక భాగం మాత్రమే కావచ్చు. పత్రికలలో అచ్చయిన ఇటువంటి ఘటనలన్నిటినీ ఒక్కచోట నమోదు చేయాలని భావిస్తున్నాం. ఈ శీర్షిక ప్రతి నెల ఉంటుంది. అయితే రాష్ట్రంలో ప్రతి గ్రామంలో జరుగుతున్న సంఘటనలన్నీ ఇక్కడ రిపోర్ట్ కాకపోవచ్చు. కొన్నయినా మనల్ని ఆలోచింపజేస్తే, మనం మనచుట్టూ ఉన్న మనుషులకోసం ఇంకాస్త బాధ్యతగానూ, జాగ్రత్తగానూ వ్యవహరిస్తూ మొత్తంగా పరిష్కారాలవైపు వెళ్లడానికి ఏమయినా తోడ్పడితే, ఈ శీర్షిక విజయవంతమైనట్లే. (21 మార్చ్ 2008 నుండి 21 ఏప్రిల్ 2008 వరకు)

జిల్లా	ఆత్మహత్యలు			హత్యలు				గుర్తు తెలియని	ఆకలి	ప్రమాదాలు			చికిత్స అందక, అనారోగ్యం	పోలీసు కాల్పుల్లో		పోలీసులు, సైన్యం	మిస్సింగ్/ లాకప్ మరణాలు	ప్రకృతి వైపరీత్యాలు
	వ్యవసాయ రంగం	చేనేత రంగం	ఇతరాలు	ఫ్యాక్షన్	కులం	మతం	తగాదాలు			పనిచేసే స్థలంలో	రహదారి	ఇతరాలు		ఉద్యమ కారులు	ఇతరులు			
హైదరాబాద్	-	-	46	-	-	-	12	22	-	-	35	46	3	-	-	-	13	-
రంగారెడ్డి	4	-	29	-	-	-	10	9	-	7	28	25	2	-	-	-	12	-
మహబూబ్‌నగర్	6	-	34	5	-	-	4	9	1	2	42	29	4	-	-	-	2	-
ఆదిలాబాద్	7	-	53	-	-	-	5	5	-	5	29	28	10	-	-	-	2	12
వరంగల్																		
కరీంనగర్	9	-	72	-	-	-	5	8	4	10	34	42	1	-	-	-	-	12
మెదక్	11	-	-	-	-	-	-	3	4	4	32	-	-	-	-	-	-	-
శ్రీకాకుళం	2	-	9	-	-	-	12	-	-	-	23	11	-	-	-	-	-	-
విజయనగరం	3	-	3	1	-	-	-	6	-	34	13	10	-	-	-	-	-	-
తూర్పు గోదావరి	2	-	21	-	-	-	12	8	-	4	59	33	10	-	-	-	-	-
కృష్ణా	8	-	18	-	-	-	4	-	-	3	21	26	2	-	-	-	7	-
గుంటూరు	14	-	5	1	-	-	12	3	-	5	41	15	5	-	-	-	-	6
ప్రకాశం	3	-	19	4	-	-	16	4	-	4	21	20	2	-	-	-	3	-
చిత్తూరు	-	-	15	-	-	-	4	4	-	13	35	21	8	-	-	-	-	-
*ఇతర జిల్లాలు	2	-	-	-	-	-	1	-	-	-	34	13	1	2	-	-	-	-
మొత్తం	71	-	324	11	-	-	97	81	9	91	447	319	48	2	-	-	39	30

ఈ శీర్షికకు సహకారం అందిస్తున్న వారు : హైదరాబాద్ – డి. విజయభాస్కర్; ఆదిలాబాద్ – శ్రీమన్నారాయణ మూర్తి; శ్రీకాకుళం – జి. సుధీర్; మహబూబ్‌నగర్ – ఏసురత్నం; చిత్తూరు – పలమనేరు బాలాజి; వరంగల్ – కె. శ్యాంరావు; తూర్పు గోదావరి – మహమ్మద్ ఇబ్రహీమ్ సాహెబ్; కృష్ణా – బి. రమేష్‌బాబు; విజయనగరం – డి. సుధాకర్; రంగారెడ్డి – వి. శంకరయ్య; మెదక్ – పి. రాజు; ప్రకాశం – ఎన్. రవికుమార్; కరీంనగర్ – ఎల్. సంతోష్; గుంటూరు – బి. అంజమ్మ

* ఇతర జిల్లాల పాక్షిక సమాచారం

RNI Regn.No.APTEL/2003/11482 Published 01/05/2008 PRINTED BOOK

పిల్లలు పుట్టని దంపతుల్లారా ! విసిగి వేసారిపోయారా ?!

మీకోక ఆశాకిరణం !

డా॥ రమా సంతాన సాఫల్య కేంద్రం !!


• హైదరాబాద్ • విశాఖపట్నం • రాజమండ్రి • విజయవాడ • గుంటూరు

ఇక్కడ అన్ని అధునిక శాస్త్రీయ పరీక్షలూ, **IVF-ET** (టెస్ట్‌ట్యూబ్ బేబి) **GIFT, ZIFT, ICSI,** డయోడ్ లేజర్‌తో అసిస్టెడ్ హాచింగ్, సెమెన్ డొనేషన్, ఎగ్‌డొనేషన్, సరోగేట్ మదర్ లాంటి సౌకర్యాలు అన్నీ 1991 నుండి మీ సేవలో అందుబాటులో ఉన్నాయి.

పిల్లలు పుట్టక పోవటానికి కారణాలు అనేకం! అవేంటో తెలుసుకోనే పరీక్షలన్నీ , తెలుసుకొని శాస్త్రీయమైన ట్రీట్‌మెంట్ మీకు అందించటానికి ప్రపంచస్థాయి వైద్య నిపుణులూ ఉన్నారు ఇక్కడ. **IVF-ET, ICSI-ET, Diode Laser, Semen Donation / Freezing, Egg Donation, Surrogate Mother** లాంటి అన్ని సౌకర్యాలూ కూడా ఉన్నాయి. అందువల్ల ఎటువంటి సమస్యలు ఉన్నవారికైనా తగిన వైద్య సహాయం అందుతుంది. స్పెర్మ్ కౌంట్ అతితక్కువగా ఉన్నా, అసలు లేకున్నా, టెస్టిస్ లోపలి స్పెర్మ్ కణాలను బయటకు తీసి నేరుగా **ICSI** ద్వారా అండంలోకి పంపి పిండోత్పత్తి జరపవచ్చు! భర్త విదేశాల్లో ఉద్యోగులైతే , వారు ఇండియా వచ్చినప్పుడు సెమెన్ కలెక్ట్ చేసి, నింపాదిగా నెలనెలా గర్భం కోసం ప్రయత్నించవచ్చు!

స్వంతంగా అండోత్పత్తిలేని స్త్రీలకు డోనార్ ఎగ్ ద్వారా గర్భధారణకు; ఇదివరకు **IVF** ఫెయిల్ అయినవారికీ, 35 సం॥ తరువాత **IVF** ప్రయత్నించేవారికీ, పాలిసిస్టిస్ ఓవరీస్ ఉన్న వారికీ **Diode Laser Assisted Hatching** పద్ధతిలో గర్భధారణకే; గర్భసంచి లేనివారికీ, ఉన్నా గర్భధారణకి వీలుకాని వారికీ సరోగేట్ మదర్ ద్వారా సంతాన ప్రాప్తికై కృషి చేయవచ్చు ! వెంటనే వచ్చి, మీ సందేహాలు తీర్చుకొని సంతానప్రాప్తికై శాస్త్రీయప్రయత్నం చేయండి ! మా హాస్పిటల్ 365 రోజులూ తెరిచి ఉంటుంది.

కృషితో నాస్తి దుర్భిక్షం ! ప్రయత్నే ఫలీ !



సూచనలు : ➧ ఒక సంవత్సర కాలం కావాలనుకున్నా సంతానం కలుగని దంపతులు వెంటనే సంప్రదించడం ఉత్తమం. ➧ వచ్చే ముందు 5 రోజులు భార్యా భర్తలు దూరంగా ఉండాలి. ➧ ఒకటి, రెండు సార్లు గర్భస్రావం జరిగిన వాళ్లు మళ్లీ గర్భధారణ కోసం ఆగకుండా తప్పనిసరిగా ముందుగానే రావాలి. ➧ వివాహం జరిగాక కూడా ఋతుక్రమం సరిగాలేని వాళ్లు తక్షణం సంప్రదించాలి. లేకపోతే తీరని నష్టం జరగవచ్చు. ➧ తమ పాత రిపోర్టులన్నీ తెచ్చుకోవాలి. ➧ బయటి నుండి వచ్చే వారికి గదులు లభిస్తాయి.

ఈ నెలా, ప్రతి నెలా మా నిపుణుల ప్రాంతీయ కేంద్రాల కార్యక్రమం

డా॥ పాపోలు రమాదేవి గారు

విశాఖపట్నం	:	1వ తేదీలో	మ॥ 3 గం.	-	రా॥ 8 గం. వరకు
	:	2వ తేదీలో	ఉ॥ 9 గం.	-	మ॥ 3 గం. వరకు
రాజమండ్రి	:	3వ తేదీలో	ఉ॥10 గం.	-	రా॥ 7 గం. వరకు
విజయవాడ	:	4వ తేదీలో	ఉ॥10 గం.	-	రా॥ 7 గం. వరకు
గుంటూరు	:	5వ తేదీలో	ఉ॥ 9 గం.	-	సా॥ 6 గం. వరకు

Dy. Director డా॥ విజయలక్ష్మి గారు

విశాఖపట్నం	:	15వ తేదీలో	మ॥ 3 గం.	-	రా॥ 8 గం. వరకు
	:	16వ తేదీలో	ఉ॥ 9 గం.	-	మ॥ 3 గం. వరకు
రాజమండ్రి	:	17వ తేదీలో	ఉ॥10 గం.	-	రా॥ 7 గం. వరకు
విజయవాడ	:	18వ తేదీలో	ఉ॥10 గం.	-	రా॥ 7 గం. వరకు
గుంటూరు	:	19వ తేదీలో	ఉ॥ 9 గం.	-	సా॥ 6 గం. వరకు

డా॥ రమా సంతాన సాఫల్య కేంద్రం

చందన బ్రదర్స్ ఎదురుగా, అమీర్‌పేట, హైదరాబాద్. ఫోన్లు : (040) 2840 1255, 2840 2294

E-mail : ramafertility@yahoo.com ; www.fertilityindia.com

ఫోన్‌లో ఉచిత కన్సల్టేషన్ : 9989223341

విశాఖపట్నం	ఫోను	:	(0891) 2597360
విజయవాడ	ఫోన్లు	:	(0866)6630582, 2485874, 9989223324
రాజమండ్రి	ఫోన్లు	:	(0883) 2476693, 2443968
గుంటూరు	ఫోన్లు	:	(0863)2261206, 2264110

Edited, printed, published and owned by N. Venugopal Rao, Printed at Charitha Impressions, 1-9-1126/B, Azamabad, Hyderabad - 500 020 and Published at 3-6-394, Mythri Residency, Street No. 3, Himayatnagar, Hyderabad 500 029. Editor : N. Venugopal Rao